

'అభివృద్ధి ఎంత ముఖ్యమో...
సంక్షేమమూ అంతే ముఖ్యం'

సత్యమేవ జయతే

# సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 16
సంచిక: 123

సోమవారం 24-7-2023

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

సాక్షి ఫ్యామిలీ
కరీంనగర్
సోమవారం ॥ 24-7-2023
II

# సన్నిధి



గురువాణి

# అందం.. అంటే!!!

ప్రపంచ ప్రఖ్యాత ఆంగ్లకవి జాన్ కీట్స్ ఒక మాటన్నారు...''ఎ థింగ్ ఆఫ్ బ్యూటీ ఈజ్ ఎ జాయ్ ఫరెవర్''– అని. ఒక అందమైన వస్తువు ఎప్పటికీ సంతోషకారకమే. అందమైన వస్తువు అంటే ... నాకు ఏది అందంగా కనపడుతుందో, మీకు అది అందంగా కనపడకపోవచ్చు. నాకు అందంగా కనిపించింది దేశకాలాలతో సంబంధం లేకుండా అది నాకు శాంతి కారణమయి ఉంటుంది.

అసలు లోకంలో ఏ పనిచేసినా దేని కోసం చేస్తాం? శాంతి కోసమే. ఏది శాంతిని ఇవ్వగలదో అదే అందం. ఏది మనసుకు అశాంతి ఇవ్వడం ప్రారంభించిందో అది అందవిహీనం. భగవద్గీతలో గీతాచార్యుడు ఒకమాటంటాడు – ''తత్తదేవా గచ్ఛత్వమ్ మమ తేజోంశ సంభవమ్''.. అని. అటువంటి గొప్ప అందం ఎక్కడయినా ఉంటే .. అది భగవంతుని తేజస్సు అవుతుంది.

నేను ఒకప్పుడు నైమిశారణ్యానికి వెళ్ళాను. అక్కడ గోమతీ నదీతీరంలో ఒక పెద్ద వటవృక్షాన్ని చూసాను. ఎంత పెద్దదంటే.. దాని కొమ్మలు, ఆకులు, ఊడలు తగలకుండా దాని చుట్టూ తిరగడానికి 15–20 నిమిషాలు పడుతుంది. ఎన్ని కొమ్మలు, ఎన్ని ఊడలు, పైన పక్షులు, పక్షి గూళ్ళు.. అలా చూస్తుండిపోయాను. ఇప్పటికి పదేళ్ళు పైగానే అయిపోయి ఉంటుంది. అయినా ఇప్పటికీ అది జ్ఞాపకానికి వస్తే.. దాని సౌందర్యం, దాని పరిమాణం వెంటనే మనసులో మెదిలి అప్పటివరకు నాలో ఉన్న ఉద్వేగం కానీ ఇతరత్రా చికాకులు, విసుగు, అశాంతి అన్నీ మటుమాయమైపోతాయి.



బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

ఒకసారి ఒక కోనేరులో సహస్రదళ కమలాన్ని చూసాను. వెయ్యిరేకుల పద్మం. అక్కడున్నవాళ్ళు దాన్ని కోసి తెస్తే ... నా రెండు చేతులా నిండుగా అది తాజాగా కనిపించడమే కాదు... దగ్గరనుంచి చూస్తే.. ఎన్ని రెక్కల దొంతర్లు, ఎన్నెన్ని రంగులు, ఎంత చక్కటి అమరిక, మధ్యలో ఉన్న దుద్దు, ముఖానికి దగ్గరగా తీసుకుంటే ఎంత చల్లదనం.. అలా దానిని ఆస్వాదిస్తూ ఉండిపోయాను. కొంతసమయం తరువాత అది వాడిపోతుంది, మట్టిలో కలిసిపోతుంది... కానీ నా జ్ఞాపకాల్లో అది వాడలేదు, నశించలేదు, నా స్మృతిపథంలో దానికి బురద లేదు, మొగ్గలేదు, వందలాది రేకులతో, చిత్రవిచిత్ర వర్ణాలతో నా చేతిలో బాగా విప్పారి, నాకు చల్లదనాన్నిచ్చి... అలా నా మనసులో ముద్రితమైన ఆ పూవు మాత్రం నా చివరి శ్వాస వరకు, నేనెప్పుడు గుర్తుకు తెచ్చుకున్నా మొదటిసారి చూసినప్పుడు ఎంత అనుభూతి చెందానో, అంతే అనుభూతిని పొందుతూనే ఉంటాను. అలా గుర్తుకొచ్చినప్పుడు ఆ అందం నాకు సంతోషాన్నిస్తుంది, శాంతినిస్తుంది. అంటే దానికి దేశకాలాలతో సంబంధం లేదు. 'బీజస్వాంతరివాంకురోజగదివం ప్రాంగే నిర్వికల్పం పునః మాయాకల్పిత దేశ కాలకకలగా వైచిత్రచిత్రీకృతం' అంటారు శంకరులు. అలా అది ఎప్పటికీ నాలోనే ఉండిపోతుంది. ఒకవేళ మళ్ళీ వెళ్ళినా అక్కడ అది ఉండవచ్చు, ఉండకపోవచ్చు. కానీ మొదటిసారి చూసి అనుభూతి చెందిన అందం నా స్వంతం. అదెప్పటికీ నాతోనే ఉండి... నాకు సంతోషాన్ని, శాంతిని, ఉపశమనాన్ని కలిగిస్తూనే ఉంటుంది. అంటే ఏది నీకు శాంతికారకమో, సంతోషకారకమో అదే నిజమైన అందం.

# రూపం లేని ఇంధనం ఆశ

ఆశ మనిషిని కదిలించి నడిపించే రూపం లేని ఇంధనం; ఆశ మనిషిని ఎప్పటికప్పుడు బతికిస్తూ ఉండే ఆకృతి లేని మూలకం. ఆశలేకపోతే మనిషికి మనుగడే ఉండదు. మనుగడకు మనుగడ ఉండాలంటే మనిషికి ఆశ ఉండాలి. మనిషి పొందుతున్న ప్రతిదానికీ ఆశపడడమే కీలకం. మనిషి గమ్యానికీ ఆశ ఆరంభం. మనిషికి ఆశ అంతం అవడం ఉండకూడదు. ఆశ అన్నది అంతం అవడం అంటే మనిషి అంతం అవడం తప్పితే మరొకటి కాకూడదు. మనిషి క్రియాశీలకం అవడానికి ఆశే ప్రేరణ. ఆశవల్లే మొత్తం ప్రపంచం క్రియాశీలకం ఔతోంది.

'ఆశ అనేది మనుషులకు ఉన్న శృంఖలాల్లో అత్యంత ఆశ్చర్యకరమైంది. దానికి బద్ధులైనవాళ్ళు పరుగులు పెడతూ ఉంటారు; ఆ శృంఖలాల నుంచి విముక్తులైనవాళ్ళు చతికిలబడిపోతూ ఉంటారు' అని హితోపదేశం తెలియజెబుతోంది. ఆశ ఉన్న మనిషి పరుగెడుతూ ఉంటాడు; ఆశలేని మనిషి చతికిలబడిపోతాడు; చచ్చుబడిపోతాడు.

ఆశను కలిగించే మాటలు నీకు శక్తిని ఇస్తాయి' అని జపనీస్ కవి–బౌద్ధతాత్త్వికుడు దైసకు ఇకెద ఒక కవితలో అంటారు. ఈ దైసకు ఇకేదకు ప్రపంచవ్యాప్తంగా ఉన్న వేర్వేరు విశ్వవిద్యాలయాల నుంచి 300కు పైగా డాక్టరేట్స్ వచ్చాయి! 2వ ప్రపంచ యుద్ధంలో అమెరికా అణుబాంబు దాడికి ఆయన మినహా కుటుంబం మొత్తం బలి అయిపోయింది. అ పరిస్థితి నుంచి ఆయన ఆశతో, ఆశ ఇచ్చిన శక్తితో విశ్వ – విశ్వవిద్యాలయాల నుంచి 300కు పైగా డాక్టరేట్స్ అందుకున్న మహోన్నతుడిగా ఎదిగారు. శక్తి, మహాశక్తి ఆశ మనిషిని ముందుకు, మునుముందుకు నడిపిస్తూ ఉంటుంది; మహోన్నతుణ్ణి చేస్తూ ఉంటుంది.

ఆశ వేరు దురాశ వేరు. మనిషికి ఆశపడడంపై అవగాహన ఉండాలి. ఏ వ్యక్తి ఐనా తనను తాను చూసుకోకుండా లేదా తనను తాను తెలుసుకోకుండా ఆశపడుతూ ఉండడం తప్పు. ఆశ అనేదే లేకపోతే మనుగడ జరగదు. కానీ దురాశ వల్ల మనుగడ తిన్నగా ఉండదు, సాగదు.

ఆశ వికటిస్తే దురాశ ఔతుంది; వికృతమైన మనస్తత్వానికి దురాశ ఒక అభివ్యక్తి. ప్రపంచాన్ని తన గుప్పెట్లో పెట్టుకోవాలి అన్న హిట్లర్ దురాశ పెనువినాశనానికి కారణమై చివరికి అతడి అంతానికీ కారణం ఐంది. నెపోలియన్ కూడా ప్రపంచాన్ని జయించేయాలన్న దురాశతో యుద్ధాలు చేసుకుంటూ వెళ్లి చివరికి బ్రిటిష్ వాళ్ల చేతికి చిక్కి చెరసాలపాలై ఆపై అనాథై మరణించాడు. 'దురాశ దుఃఖానికి చేటు' అని ఎప్పుడో చెప్పబడ్డ మాట ఇప్పటికీ, ఎప్పటికీ సరైందే; ఎప్పటికప్పుడు అది మనకు దిశానిర్దేశం చేసేదే. మనం ఎప్పుడూ దురాశకు అతీతంగానే ఉండాలి.

ఆశ ఫలించని వేళల్లో మనిషిని నిరాశ చుట్టుకుంటుంది. నిరాశకు లోనుకాని మనిషి ఉండడం ఉండదు. నిరాశకు బలి ఐపోయినవాళ్లూ ఉన్నారు. నిరాశ అనే వ్రణం ఎవరినైనా సలుపుతుంది. నిరాశ కలిగినప్పుడు ఆ నిరాశకు చిత్తైపోకుండా ఉండాలంటే, నిరాశపై విజయం సాధించి రాణించాలంటే మనిషికి ఉండాల్సింది ఆశే. ఆశతోనే మనిషి నిరాశపై నెగ్గాలి. పుట్టిన ప్రతివ్యక్తికి పాలు తాగడం నుంచీ ఆశ మొదలు ఔతుంది. నిజానికి వ్యక్తికి పాలు తాగడంకన్నా ముందే ఆశ మొదలు ఔతుంది; ఆ ఆశవల్లే పాలుతాగడం మొదలు ఔతుంది; ఆశ మొదలు కాగా మనిషికి మనుగడ మొదలు ఔతుంది. మనిషి పోయేంత వరకూ మనిషిని వీడిపోకుండా ఉండాల్సింది ఆశ. వర్తమానం భవిష్యత్తును ఆవాహన చెయ్యాలంటే మనకు కావాల్సినవి ఆశ ఆపై సదాశ. ఆశ, సదాశలతో మనం అభ్యున్నతిని పొందాలి.

– రోచిష్మాన్


మంచిమాట



> ఆశ ప్రగతికి మూలం; దురాశ పతనానికి మూలం. ఈ విషయాన్ని మనిషి అవగతం చేసుకోవాలి. మనిషికి ఆశ ఉండాలి; తన ఆశకు తగినట్టు మనిషి తనను తాను సిద్ధం చేసుకోవాలి. ఆశ, సదాశల్ని ప్రయుక్తం చేసుకుని ప్రతిమనిషీ ప్రశస్తం అవాలి.

బౌద్ధవాణి

# ధర్మసాధన



ఒకసారి బుద్ధుడు తన భిక్షువులతో కలసి ఒక విశాలమైన పొలం లోంచి నడిచిపోతున్నాడు. ఆ పొలం అంతకుముందే తగలబడి ఉంది. పంటను తీశాక రైతులు చెత్తనంతా తగలబెట్టారు. కానీ... ఆ తర్వాత వర్షం పడింది. ఆ తగలబడిన మసి లోంచి పచ్చని గడ్డి పిలకలు నవనవలాడుతూ పైకి లేస్తున్నాయి.

బుద్ధుడు వాటి వంక చూస్తూ ముందుకు నడిచాడు. ఆ పొలం దాటి పెద్ద కాలువ కట్ట ఎక్కారు. ఆ కట్ట మీద మొదలు పైకి నరికిన పెద్ద తుమ్మచెట్టు మోడు కనిపించింది. ఆ తర్వాత రకరకాల చెట్ల మోడులు కనిపించాయి. వాటి మధ్య నరికేసిన తాటిచెట్లు మోడులూ కనిపించాయి.

బుద్ధుడూ, భిక్షువులూ ఆ మోళ్ళను గమనిస్తూనే ముందుకు నడిచి వెళ్ళారు. వారు కొంత దూరం పోయాక నదీ తీరంలో పెద్ద మర్రిచెట్టు కనిపించింది. అప్పటికే ఎండ ఎక్కుతూ ఉంది. కొంత సేపు సేద తీరడానికి ఆ చెట్టు కింద ఆగారు.

భిక్షువులు కొన్ని సందేహాలు అడిగారు. వాటికి సమాధానమిచ్చాడు. ఆ తరువాత ఆయన ప్రబోధం 'చిత్త మలినాలు' మీదికి మళ్ళింది. ఆ విషయం చెప్తూ స్వచ్ఛ జలం గురించి చెప్పాడు.

బుద్ధునికి నిత్య జీవితంలో తమకు అనుభవమయ్యే అంశాల్ని జోడించి, తేలికగా అర్థం అయ్యేలా చెప్పటం అలవాటు. దానితో అప్పటి వరకూ తాము నడచి వచ్చిన దారిలోని సంఘటనలు తీసుకున్నాడు.

''భిక్షువులారా! చూశారుగా! మనం నడచి వచ్చిన పొలాన్ని తగులబెట్టారు. అయినా ఆ తరువాత దానిలోని గడ్డి, తుంగ పరకలూ మొలకెత్తాయి. అలాగే... గట్టు మీది ఎన్నో చెట్లు మొదలంటూ నరికినా, మరలా పిలకలు వేశాయి. చివురులు తొడిగాయి. ఐతే ఒకే ఒక జాతి వృక్షాలు మాత్రం నరికివేశాక అవి ఎలాంటి చివురులు తొడగలేవు. అవి ఏమిటో గమనించారా?'' అని అడిగాడు.

ఒక భిక్షువు వినమ్రంగా 'భగవాన్! తాటిచెట్లు' అన్నాడు. బుద్ధుడు చిరుమందహాసంతో –

''అవును భిక్షూ! నీ పరిశీలన సరైనదే! మన మనస్సులో రాగద్వేషాలూ, కోరికలూ, మోహాలు అనే అకుశలాలు అన్నీ అలాగే నరికివేయబడాలి. అవి మరలా మొలకెత్తకూడదు. చివురులు తొడక్కూడదు. తాటిచెట్టును కొట్టి వేశాక, ఎలా చివురులు వేయదో, పిలకలు తొడగదో మన మనో క్షేత్రంలో అకుశలాల్ని, కోర్కెల్ని (తృష్ణల్ని) అలాగే తొలగించుకోవాలి. మొదలంటూ నరికిన తాటిచెట్టులా తృష్ణల్ని తెగతెంచుకోవాలి. అదే తృష్ణాక్షయం. అలాంటి చిత్తమే నిర్మల చిత్తం. స్వచ్ఛమైన నీటిలాంటి చిత్తం. మన ధర్మ సాధనంతా అలాంటి నిర్మల చిత్తం కోసమే!'' అన్నాడు.

ఆ గంభీర ధర్మోపదేశం వారి హృదయాల్ని తాకింది. వారి మనో ఫలకంపై మొదలు నరికిన తాటిచెట్టు ప్రత్యక్షం అయింది. అప్రయత్నంగా అందరూ కనురెప్పలు మెల్లగా మూశారు. ఏకాగ్రత లోకి జారుకున్నారు. ధ్యాన నిమగ్నులయ్యారు.

– డా. బొర్రా గోవర్ధన్

> **మనోశుద్ధి అంటే చిత్తశుద్ధి. చిత్తం ఈ మలినాల నుండి విముక్తి చెందడం. అలా విముక్తి చెందిన చిత్తంలో తిరిగి మరలా అమానవీయ విషయాలు మొలకెత్తవు. సమూలంగా నిర్మూలించబడతాయి.**

# సినిమా

# రీల్స్

## కుశలమా!




• సూర్య

సూర్య హీరోగా నటిస్తున్న ప్రతిష్ఠాత్మక చిత్రం 'కంగువ'. శివ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో బాలీవుడ్ బ్యూటీ దిశా పటానీ హీరోయిన్. స్టూడియో గ్రీన్, యూవీ క్రియేషన్స్‌పై కేఈ జ్ఞానవేల్ రాజా, వంశీ, ప్రమోద్ నిర్మిస్తున్నారు. ఆదివారం(జూలై 23) సూర్య పుట్టిన రోజు సందర్భంగా 'కంగువ' టీజర్‌ని విడుదల చేశారు మేకర్స్. 'కొండల కోనల్లో కోటి పులులు పట్టినోడు, ముక్కోటి చుక్కలెక్కి, దిక్కులెల్ల గెలిచినోడు, ఒక్కడే ఒక్క వీరుడురా.. వాడే కంగ' వంటి డైలాగులు టీజర్‌లో ఉన్నాయి. 'కుశలమా' అంటూ సూర్య చెప్పే డైలాగ్‌తో టీజర్ ముగుస్తుంది. ''చారిత్రక నేపథ్యంతో రూపొందుతోన్న చిత్రం 'కంగువ'. సూర్య కెరీర్‌లో భారీ బడ్జెట్‌తో ఈ మూవీ తెరకెక్కుతోంది. త్రీడీలో విజువల్ వండర్‌గా ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని ఇచ్చేందుకు టీమ్ శ్రమిస్తోంది. పాన్ వరల్డ్ మూవీగా పది భాషల్లో ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. సూర్య బర్త్ డే సందర్భంగా తెలుగు, ఇంగ్లీష్, హిందీ, తమిళ్, కన్నడ, మలయాళ భాషల్లో టీజర్‌ని రిలీజ్ చేశాం.. మరో నాలుగు భాషల్లో త్వరలోనే విడుదల చేస్తాం. వచ్చే ఏడాది వేసవిలో 'కంగువ' రిలీజ్ కానుంది'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: ఏజీ రాజా, కో ప్రొడ్యూసర్: నేహా జ్ఞానవేల్ రాజా.



• చిరంజీవి

## వినోదం ఎక్స్‌ట్రా



• 'ఎక్స్ ట్రా' లో నితిన్

నితిన్ హీరోగా వక్కంతం వంశీ దర్శకత్వంలో రూపొందుతున్న సినిమాకు 'ఎక్స్‌ట్రా' అనే టైటిల్ ఖరారు చేశారు. 'ఆర్డినరీ మేన్' అనేది ట్యాగ్‌లైన్. ఈ చిత్రంలో శ్రీలీల హీరోయిన్‌గా నటిస్తున్నారు. శ్రేష్ఠ్ మూవీస్, ఆదిత్యా మూవీస్ అండ్ ఎంటర్‌టైన్మెంట్స్, రుచిర ఎంటర్‌టైన్మెంట్స్ నిర్మిస్తున్న ఈ చిత్రం డిసెంబరు 23న విడుదల కానుంది. తాజాగా ఆదివారం ఈ సినిమా టైటిల్, ఫస్ట్‌లుక్, రిలీజ్ డేట్‌ను ప్రకటించారు మేకర్స్. ''కిక్' సినిమా తర్వాత ఆ రేంజ్‌లో క్యారెక్టర్ బేస్డ్ స్క్రిప్ట్‌తో 'ఎక్స్ ట్రా' సినిమా తెరకెక్కుతోంది. ఆడియన్స్‌కు రోలర్ కోస్టర్ లాంటి ఎక్స్‌పీరియన్స్ ఇస్తూనే, నవ్విస్తూ సర్‌ప్రైజ్‌లతో మెప్పిస్తుంది మా సినిమా'' అన్నారు వక్కంతం వంశీ. ఈ సినిమాకు సంగీతం: హారిస్ జైరాజ్.

## ట్రైలర్ రెడీ

చిరంజీవి టైటిల్ రోల్‌లో నటించిన తాజా చిత్రం 'భోళాశంకర్' ట్రైలర్ రిలీజ్‌కు ముహూర్తం ఖరారైంది. ఈ నెల 27న ట్రైలర్ విడుదలకానుంది. మెహర్ రమేష్ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో చిరంజీవి సరసన తమన్నా నటించగా, ఆయన చెల్లెలి పాత్రలో కీర్తీ సురేష్ నటించారు. అనిల్ సుంకర ఏకే ఎంటర్‌టైన్మెంట్స్ పతాకంపై రామబ్రహ్మం సుంకర నిర్మించారు. ఈ సినిమా ఆగస్టు 11న థియేటర్స్‌లో రిలీజ్ కానున్న సంగతి తెలిసిందే. కాగా 'భోళాశంకర్' ట్రైలర్‌ను ఈ నెల 27న(గురువారం) విడుదల చేయనున్నట్లు చిత్ర యూనిట్ ఆదివారం అధికారికంగా ప్రకటించి, చిరంజీవి లుక్‌ని రిలీజ్ చేసింది. చేతిలో కత్తి పట్టుకుని సీరియస్ లుక్‌లో నడిచి వస్తున్నారు చిరంజీవి. ఈ సినిమాలో సుశాంత్, రఘుబాబు, మురళీ శర్మ, రవిశంకర్, 'వెన్నెల' కిషోర్, తులసి కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి సంగీతం: మహతి స్వర సాగర్, కెమెరా: డడ్లీ, లైన్ ప్రొడక్షన్: మెహర్ మూవీస్.

## వరుణ్‌కు జోడీగా...



• మీనాక్షీ చౌదరి

హీరోయిన్ మీనాక్షీ చౌదరి మంచి ఫామ్‌లో ఉన్నారు. వరుస సినిమాలకు సైన్ చేస్తూ కెరీర్‌లో దూసు కెళుతున్నారీ బ్యూటీ. ఇప్పటికే మహేశ్‌బాబు 'గుంటూరు కారం' చిత్రంలో ఓ హీరోయిన్‌గా, విశ్వక్‌సేన్ ('వీఎస్10') చిత్రంలో హీరోయిన్‌గా నటిస్తున్న ఈ బ్యూటీని తాజాగా మరో అవకాశం వరించిందని ఫిల్మ్‌నగర్ సమాచారం. వరుణ్ తేజ్ హీరోగా 'పలాస' ఫేమ్ కరుణ కుమార్ దర్శకత్వంలో ఓ సినిమా రూపొందనున్న సంగతి తెలిసిందే. మోహన్ చెరుకూరి (సీవీఎం), డా.విజయేందర్ రెడ్డి తీగల నిర్మించనున్న ఈ సినిమా ఈ నెల 27న ప్రారంభం కానుంది. 1960 నేపథ్యంలో సాగే ఈ చిత్రంలో వరుణ్ సరసన నటించే చాన్స్ మీనాక్షీ చౌదరికి దక్కిందన్నది ఫిల్మ్‌నగర్ లేటెస్ట్ టాక్. మరి.. వరుణ్, మీనాక్షీలు ఈ సినిమా కోసం జోడీ కడతారా? వేచి చూడాలి.

## వృషభ షురూ



• మోహన్‌లాల్

మోహన్‌లాల్ ప్రధాన పాత్రలో, రోషన్ లీడ్ రోల్‌లో నటిస్తున్న ద్విభాషా చిత్రం (తెలుగు, మలయాళం) 'వృషభ'. నందకిశోర్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో శ్రీకాంత్, రాగిణి ద్వివేది, జహ్రా ఎస్ ఖాన్, షానయ కపూర్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. అభిషేక్ వ్యాస్, ఏక్తా కపూర్, విశాల్‌గుర్నాని, జూహీ పరేఖ్ మెహతా, శ్యామ్ సుందర్, శోభాకపూర్, వరుణ్ మాథుర్ నిర్మిస్తున్న ఈ సినిమా షూటింగ్ ప్రారంభమైంది. ముహూర్తపు సన్నివేశానికి నటి ఊహ క్లాప్ కొట్టారు. మోహన్‌లాల్, రోషన్ పాల్గొనగా కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారట నందకిశోర్. తండ్రీకొడుకుల అనుబంధం నేపథ్యంలో ఈ సినిమా ఉంటుందని తెలిసింది. తెలుగు, మలయాళంతో పాటు తమిళం, కన్నడం, హిందీ భాషల్లోనూ ఈ చిత్రం విడుదల కానుంది.

## ఫుల్ ఎంటర్‌టైనర్



• విశ్వక్ సేన్

విశ్వక్ సేన్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'వీఎస్10'(వర్కింగ్ టైటిల్). రవితేజ ముళ్లపూడి దర్శకత్వం వహిస్తున్న ఈ మూవీలో మీనాక్షీ చౌదరి కథానాయిక. ఎస్ఆర్‌టీ ఎంటర్‌టైన్‌మెంట్స్‌పై రామ్ తాళ్లూరి నిర్మిస్తున్నారు. ఆగస్ట్ 6 ఉదయం 11:11 గంటలకు ఈ సినిమా టైటిల్‌ను ఒక గ్లింప్స్ ద్వారా ప్రకటించనున్నట్లు మేకర్స్ అనౌన్స్ చేశారు. ఈ మేరకు విడుదల చేసిన పోస్టర్‌లో విశ్వక్ సేన్ ఇంటెన్స్ లుక్‌లో కనిపించారు. ''ఫుల్ ఎంటర్‌టైనర్ చిత్రం 'వీఎస్10'. ఈ మూవీ కోసం విశ్వక్ స్టైలిష్‌గా మేకోవర్ అయ్యారు. త్వరలో మా సినిమా రెండవ షెడ్యూల్ ప్రారంభం కానుంది'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: జేక్స్ బిజోయ్, కెమెరా: మనోజ్ కాటసాని, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్స్: 'సత్యం' రాజేష్, విద్యాసాగర్ జె.

## అలాంటి ఆదరణ ఎక్కడా దొరకదు

– రెబ్బా మోనికాజాన్



''సామజవరగమన' సినిమా సక్సెస్ టూర్‌కు ఆంధ్రప్రదేశ్, తెలంగాణలకు వెళ్లాం. నాకు తెలుగు భాష రాకపోయినా అక్కడి ప్రజలు నా పట్ల ఎంతో ప్రేమ, ఆప్యాయతను చూపించారు.. అలాంటి ఆదరణ ఎక్కడా దొరకదు. అందుకే నేను తెలుగు ప్రజలకు దగ్గరగా ఉండాలనుకుంటున్నాను'' అని రెబ్బా మోనికాజాన్ అన్నారు. శ్రీవిష్ణు, రెబ్బా మోనికాజాన్ జంటగా రామ్ అబ్బరాజు దర్శకత్వం వహించిన చిత్రం 'సామజవరగమన'. అనిల్ సుంకర సమర్పణలో రాజేష్ దండా నిర్మించిన ఈ మూవీ జూన్ 29న విడుదలైంది. ఈ చిత్రం ద్వారా టాలీవుడ్‌కి పరిచయమైన రెబ్బా మోనికాజాన్ ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ–''నేను మలయాళీ అయినా బెంగళూరులో పెరిగాను. చదువు పూర్తయ్యాక కొన్ని యాడ్స్ చేశాను. మలయాళంలో కొన్ని సినిమాలు చేశాను. దక్షిణాదిలో నేను ఇతర చిత్రాల్లో నటించినా 'సామజవరగమన' నాకు మంచి గుర్తింపు తీసుకొచ్చింది.. అందుకే నేను చాలా లక్కీ అనుకుంటున్నాను. తెలుగులో కొన్ని కథలు వింటున్నాను. నా తర్వాతి సినిమాకి తెలుగు నేర్చుకొని డబ్బింగ్ చెబుతాను'' అన్నారు.


## మిస్టీరియస్ డ్రామా



• నేహా దేశ్‌పాండే , శివ కోన

అభిలాష్, రమ్య, ప్రాచీ ఠాకూర్, శివకోన, ప్రభాకర్, నేహా దేశ్‌పాండే ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'రాజుగారి కోడిపులావ్'. కుటుంబ కథా 'వి' చిత్రం అనేది ట్యాగ్‌లైన్. శివ కోన దర్శకత్వంలో అనిల్ మోదుగ, శివకోన నిర్మించిన ఈ సినిమాను ఆగస్టు 4న విడుదల చేస్తున్నట్లు చిత్రయూనిట్ ప్రకటించింది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో చిత్రయూనిట్ నిర్వహించిన విలేకర్ల సమావేశంలో అభిలాష్ మాట్లాడుతూ– ''రాజుగారి కోడిపులావ్' రొటీన్ సినిమా కాదు.. కొత్తగా మిస్టీరియస్‌గా ఉంటుంది'' అన్నారు. ''మా సినిమా ప్రేక్షకులకు నచ్చుతుంది'' అన్నారు శివ. నటీనటులు కునాల్, నేహాదేశ్ పాండే, రమ్య, ప్రాచీ ఠాకూర్ మాట్లాడారు.

## పవర్‌ఫుల్ పోలీస్



• సుమన్ బాబు

సీహెచ్‌వీ సుమన్ బాబు హీరోగా నటిస్తూ, దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'గిద్దలూరు పోలీస్‌స్టేషన్'. శ్రీ సుమన్ వెంకటాద్రి ప్రొడక్షన్స్‌పై ఈ మూవీ రూపొందుతోంది. సుమన్ బాబు మాట్లాడుతూ– ''చట్టం ఎవరి చుట్టం కాదు. కర్తవ్యమే ప్రాణం అని నిరూపించిన ఒక పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్ కథే 'గిద్దలూరు పోలీస్‌స్టేషన్'. అందరూ ఆలోచించే కథ, కథనం ఉంటుంది. ఆగస్టు 15న మా సినిమా ఫస్ట్ గ్లింప్స్ రిలీజ్ చేస్తాం. డిసెంబరులో సినిమా రిలీజ్ చేస్తాం'' అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: ప్రమోద్ పులిగిల్ల, కెమెరా: గణేష్, లైన్ ప్రొడ్యూసర్: అబ్దుల్ రెహమాన్.


'ఎన్ని కరువులనైనా ఎదుర్కోగలగాలి. దీని కోసం ఆర్థికంగా ఎదగాలి'

సత్యమేవ జయతే

# సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 123

సోమవారం 24-7-2023

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL




**ఎదురులేని సాత్విక్-చిరాగ్**

కొరియా ఓపెన్ టోర్నీలో టైటిల్ సొంతం. ఈ ఏడాది నాలుగో టైటిల్ కైవసం -10లో



**విపత్తుల నుంచి రక్షణ ఉందా?**

వానాకాలంలో కలిగే నష్టాలు.. బీమా పథకాలతో ఎన్నో ప్రయోజనాలు.. -11లో



**అధిక వర్షాలతో పత్తికి విపత్తు**

వారం క్రితం వరకు వర్షాల్లేక మొలక రాని పత్తి.. తీరా మొలకెత్తిన తరువాత ఎడతెరిపి లేని వానలతో దెబ్బతింటోంది.

వివరాలు 5లో ▸



**త్వరలో 'ఎఫ్ఎం' స్టేషన్ల వేలం**

దేశవ్యాప్తంగా 808 ఎఫ్ఎం రేడియో స్టేషన్ల ఏర్పాటుకు ఈ-వేలం నిర్వహించనున్నట్లు కేంద్ర మంత్రి అనురాగ్ ఠాకూర్ చెప్పారు.

వివరాలు 6లో ▸



**ట్విట్టర్ పిట్టకు వీడ్కోలు!**

నీలి రంగు ట్విట్టర్ పిట్ట ఇకపై కనిపించదు. ఎలాన్ మస్క్.. దీన్ని త్వరలో 'ఎక్స్' యాప్‌గా రీబ్రాండ్ చేయనున్నట్లు తెలుస్తోంది.

వివరాలు 6లో ▸



**పాక్ ఆపద్ధర్మ ప్రధానిగా ఇషాఖ్**

పాకిస్తాన్ ఆపద్ధర్మ ప్రధానిగా ఆర్థిక మంత్రి ఇషాఖ్ దార్ పేరు తెరపైకి వచ్చింది. వచ్చే వారం నిర్ణయం తీసుకోనున్నట్లు తెలిసింది.

వివరాలు 6లో ▸

## న్యూస్‌రీల్

**'సన్నాల ఎగుమతి నిషేధం'తో రాష్ట్ర రైతులకు దెబ్బ**



విదేశాలకు బాస్మతీయేతర తెల్ల బియ్యం ఎగుమతులను నిషేధిస్తూ కేంద్రం తీసుకున్న నిర్ణయంతో విదేశాల్లో డిమాండ్ ఉన్న బియ్యం రకాలు పండించే రాష్ట్ర రైతులు ఆందోళన చెందుతున్నారు.

- వివరాలు 3లో▶

**బీఆర్ఎస్, బీజేపీలకు కార్మికలోకం బుద్ధి చెప్పాలి**



రాష్ట్రంలోని ఫ్యూడల్, కేంద్రంలోని కేపిటలిస్టు ప్రభుత్వాల కుట్రలో కార్మికులు పడొద్దని కాంగ్రెస్ నేత మల్లు భట్టివిక్రమార్క అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు బుద్ధి చెప్పేందుకు కార్మికలోకం సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

- వివరాలు 2లో▶

**తొమ్మిదేళ్లుగా తెలంగాణ ఆత్మగౌరవం కోల్పోతోంది**



తెలంగాణ అన్నివర్గాల భాగస్వామ్యంతో ఏర్పడిందని, కానీ, తొమ్మిదేళ్లుగా ప్రజలు అనేకవిధాలుగా మోసపోతూ, ఆత్మగౌరవం కోల్పోయారని బీజేపీ రాష్ట్ర ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్ అన్నారు.

- వివరాలు 5లో▶

# వీఆర్ఏ వ్యవస్థ రద్దు

## మరో కీలక నిర్ణయం తీసుకున్న సీఎం కేసీఆర్



- వారంతా రెవెన్యూ శాఖలోనే క్రమబద్ధీకరణ
- ఆ తర్వాత ఇతర శాఖల్లో సర్దుబాటు
- విద్యార్హతల ఆధారంగా 20,555 మందికి పోస్టింగ్‌లు
- ఉన్నత చదువులు చదివినవారికి ప్రమోషన్లకు అనుగుణమైన పోస్టులు
- 61 ఏళ్లు నిండిన/ చనిపోయిన వీఆర్ఏల వారసులకు కారుణ్య నియామకాలు.. ఉన్నత స్థాయి సమీక్షలో నిర్ణయం
- సోమవారమే ఉత్తర్వులు ఇవ్వాలని సీఎం ఆదేశం

సాక్షి, హైదరాబాద్: నీరటి, మస్కూరు, లష్కర్ వంటి కాలం చెల్లిన పేర్లతో పిలవబడుతూ భూస్వామ్య వ్యవస్థకు చిహ్నాలుగా మిగిలిన గ్రామ రెవెన్యూ సహాయకుల (వీఆర్ఏ) వ్యవస్థను శాశ్వతంగా రద్దు చేస్తున్నట్టు ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు ప్రకటించారు. రాష్ట్రవ్యాప్తంగా వీఆర్ఏలుగా పనిచేస్తున్న సిబ్బందిని రెవెన్యూ శాఖలో సూపర్ న్యూమరరీ పోస్టుల్లో క్రమబద్ధీకరిస్తామన్నారు. తర్వాత మంత్రివర్గ ఉప సంఘం సిఫార్సుల మేరకు వీఆర్ఏలను అర్హతల ఆధారంగా పురపాలక, మిషన్ భగీరథ, నీటిపారుదల తదితర శాఖల్లో సర్దుబాటు చేస్తామని తెలిపారు. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను సోమవారమే జారీ చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారిని ఆదేశించారు. వీఆర్ఏల క్రమబద్ధీకరణ అంశంపై ఆదివారం సచివాలయంలో నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్షలో సీఎం కేసీఆర్ ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్టు సీఎం కార్యాలయం ప్రకటించింది.

**వీఆర్ఏ వృత్తికి ప్రాధాన్యత తగ్గింది**

సమీక్ష సందర్భంగా.. సామాజిక పరిణామ క్రమంలో మార్పులకు అనుగుణంగా, ప్రజల అవసరాలను అనుసరించి పాలకులు నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని సీఎం కేసీఆర్ పేర్కొన్నారు. కాలానుగుణంగా కనుమరుగవుతున్న వృత్తుల్లో పనిచేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులకు ప్రత్యామ్నాయ ఉద్యోగ భద్రత కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలదేనని.. ఈ క్రమంలోనే వీఆర్ఏ వ్యవస్థను రద్దు చేస్తున్నామని స్పష్టం చేశారు. ''వ్యవసాయం అభివృద్ధి చెంది సాగునీటి విధానం

మిగతా 2వ పేజీలో ▶

> **మానవీయ కోణంలో నిర్ణయం**
>
> కాలానుగుణంగా కనుమరుగవుతున్న వృత్తుల్లో పనిచేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులకు ప్రత్యామ్నాయ ఉద్యోగ భద్రత కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలదే.. ఈ క్రమంలోనే వీఆర్ఏ వ్యవస్థను రద్దు చేస్తున్నాం. వీఆర్ఏలను రెవెన్యూ శాఖలోనే క్రమబద్ధీకరించి.. తర్వాత వివిధ శాఖల్లో సర్దుబాటు చేస్తాం. అట్టడుగు స్థాయి నుంచి త్యాగాలు, శ్రమతో సమాజ శ్రేయస్సు కోసం పని చేస్తున్న వారిపట్ల మా ప్రభుత్వం మానవీయ కోణంలో నిర్ణయాలు తీసుకుంటుంది.
>
> - సీఎం కేసీఆర్ -



హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ అలోక్ అరాధేతో ప్రమాణం చేయిస్తున్న గవర్నర్ తమిళిసై. చిత్రంలో సీఎం కేసీఆర్ తదితరులు

# రాగద్వేషాలకు అతీతంగా తీర్పులిస్తా..

## హైకోర్టు సీజేగా జస్టిస్ అలోక్ అరాధే ప్రమాణ స్వీకారం

- ప్రమాణం చేయించిన గవర్నర్ తమిళిసై.. పాల్గొన్న సీఎం కేసీఆర్, న్యాయమూర్తులు, మంత్రులు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ హైకోర్టు నూతన ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ అలోక్ అరాధే ప్రమాణం స్వీకారం చేశారు. రాగద్వేషాలకు అతీతంగా నీతి, నిజాయితీతో విధులు నిర్వర్తిస్తూ తీర్పులు వెలువరిస్తానని ప్రమాణం చేశారు. ఆదివారం రాజ్‌భవన్‌లో ఆయనతో గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ ప్రమాణం చేయించారు. అనంతరం గవర్నర్ తమిళిసై, సీఎం కేసీఆర్ ఆయనకు పుష్పగుచ్ఛాలు ఇచ్చి అభినందనలు తెలిపారు. సీఎస్ శాంతికుమారి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించగా, జస్టిస్ అలోక్ నియామకంపై రాష్ట్రపతి జారీ చేసిన వారెంట్‌ను హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ సుజన చదివి వినిపించారు. ఆ వారెంట్‌ను జస్టిస్ అలోక్‌కు గవర్నర్ అందజేశారు. తర్వాత తెలంగాణ హైకోర్టు 6వ ప్రధాన న్యాయమూర్తిగా ఆయన దైవసాక్షిగా ప్రమాణం చేశారు. ఈ కార్యక్రమంలో జస్టిస్ అలోక్ కుటుంబసభ్యులు, హైకోర్టు న్యాయమూర్తులు, మంత్రులు, ఎమ్మెల్యేలు, అడ్వొకేట్ జనరల్ బీఎస్ ప్రసాద్, బార్ కౌన్సిల్ చైర్మన్ నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**27 మంది న్యాయమూర్తులు**

హైకోర్టులో ప్రస్తుతం సీజేతో కలిపి న్యాయమూర్తుల సంఖ్య 27కు చేరింది. ఏపీ నుంచి బదిలీపై వచ్చిన జస్టిస్ కన్నెగంటి లలిత కర్ణాటక హైకోర్టుకు బదిలీ అయిన విషయం తెలిసిందే. అలాగే ఛత్తీస్‌గఢ్‌కు చెందిన న్యాయమూర్తి జస్టిస్ సామ్ కోషీ తెలంగాణ హైకోర్టుకు బదిలీపై రానున్నారు. ఒకరు రావడం.. ఒకరు వెళ్లడం.. జరిగినా సంఖ్య మాత్రం 27గానే ఉంటుంది. ఇక కొత్తగా కొలీజియం సిఫారసులకు రాష్ట్రపతి ఆమోదం తెలిపితే ఈ సంఖ్య పెరిగే అవకాశం ఉంది.

# మైనార్టీలకూ 'లక్ష'ణమైన పథకం

- తిరిగి చెల్లించనవసరం లేకుండా రూ.లక్ష ఆర్థిక సాయం
- పథకానికి సర్కారు పచ్చజెండా
- తెలంగాణ మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా అమలు



ఒమర్ జలీల్

సాక్షి, హైదరాబాద్: మైనార్టీల ఆర్థిక స్వావలంబనకు రాష్ట్ర ప్రభుత్వం 'లక్ష'ణమైన పథకాన్ని ప్రకటించింది. స్వయం ఉపాధి పొందుతున్న, ఉపాధికి ఆర్థిక సాయం కోసం ఎదురుచూస్తున్న వారికి రూ.లక్ష ఆర్థిక సాయం పథకం ఒకింత ఊతమివ్వనుంది. ఈ పథకం కింద దరఖాస్తు చేసుకున్న వారి అర్హతలను నిర్ధారించి సాయం అందించనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఈమేరకు మైనార్టీ సంక్షేమ శాఖ కార్యదర్శి సయ్యద్ ఒమర్ జలీల్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ పథకం కింద క్షేత్రస్థాయి నుంచి దరఖాస్తులు స్వీకరించాలని, నిబంధనలకు అనుగుణంగా అర్హతలను నిర్ధారించాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు.

**ఆ నిబంధనలే అమలు:** ప్రభుత్వం గత నెలలో

మిగతా 3వ పేజీలో ▶



మణిపూర్ రాజధాని ఇంఫాల్‌లోని పునరావాస శిబిరంలో మొయితీ తెగ పిల్లలు

## మిజోరాం నుంచి మొయితీల వలసబాట

కల్లోల మణిపూర్‌లో తెగల మధ్య రాజుకున్న మంటలు ఆరడం లేదు. బాధితులు ప్రాణ భయంతో రాష్ట్రం విడిచి వెళ్లిపోతున్నారు. ఇద్దరు గిరిజన మహిళలను దిగంబరంగా ఊరేగించిన ఘటన బయటపడిన తర్వాత మొయితీ తెగ ప్రజల్లో భయాందోళన మరింత పెరిగిపోయింది. మాజీ మిలిటెంట్ గ్రూప్ నుంచి బెదిరింపులు రావడంతో ఇప్పటికే మిజోరాంలో ఉంటున్న మణిపూర్ మొయితీల్లో ప్రాణభయం మొదలైంది. దీంతో 41 మంది శనివారం రాత్రి మిజోరాం నుంచి అస్సాంలోని సిల్చార్‌కు చేరుకున్నారు. -6లో



## ఏం చేస్తారో?

- విద్యాసంస్థలకు సెలవులు పొడిగించేనా!
- దోస్త్, ఎంసెట్‌ల కౌన్సెలింగ్ వాయిదాకు విద్యార్థుల డిమాండ్. వర్షాలతో నెట్ పనిచేయడం లేదని ఫిర్యాదులు
- ఉన్నతాధికారుల తర్జనభర్జన

సాక్షి, హైదరాబాద్: విద్యాసంస్థలు సోమవారం నుంచి పునః ప్రారంభమవుతాయా? వర్షాలు ఇంకా పడుతున్న నేపథ్యంలో సెలవులు పొడిగిస్తారా? ఏ నిర్ణయమూ తీసుకోలేక అధికారులు తర్జనభర్జన పడుతున్నారు. భారీవర్షాల నేపథ్యంలో గురు, శుక్ర, శనివారం వరకు విద్యాసంస్థలకు సెలవులు ప్రకటించిన విషయం విదితమే. ప్రస్తుత పరిస్థితులను సమీక్షించాలన్న ప్రభుత్వ ఆదేశాల మేరకు విద్యాశాఖ ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో సమాచారం సేకరిస్తున్నారు. కొన్ని జిల్లాల అధికారులు ఈ సమయంలో స్కూళ్లు తెరవడం మంచిది కాదంటున్నారు. చాలాచోట్ల ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతికూల పరిస్థితులున్నాయని, తరగతి పైకప్పులు కురుస్తున్నాయని, వర్షపునీరు గదుల్లో ఉందని ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చారు. కొన్నిచోట్ల

మిగతా 3వ పేజీలో ▶



# డిక్లరేషన్లు.. బస్సు యాత్ర.. సభలు



రాజకీయ వ్యవహారాల కమిటీ సమావేశంలో ఠాక్రేతో రేవంత్ రెడ్డి, భట్టి

## టీపీసీసీ రాజకీయ వ్యవహారాల కమిటీ భేటీలో త్రిముఖ వ్యూహంపై చర్చ

- బస్సు యాత్ర తేదీలు, రూట్ ఖరారుపై సబ్ కమిటీ
- కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఏమేం చేస్తుందన్న దానిపై విస్తృత ప్రచారం
- బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, మహిళా డిక్లరేషన్ల కోసం మరో సబ్ కమిటీ
- 30న కొల్లాపూర్‌లో ప్రియాంక సభ.. ఆగస్టు 15న ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల గర్జన
- మిషన్-2023 పేరుతో ప్రజెంటేషన్ ఇచ్చిన సునీల్ కనుగోలు

సాక్షి, హైదరాబాద్

మరికొన్ని నెలల్లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలకు సన్నద్ధమయ్యేందుకు కాంగ్రెస్ పార్టీ త్రిముఖ వ్యూహాన్ని రూపొందిస్తోంది. వివిధ వర్గాల వారీగా హామీలతో డిక్లరేషన్ల ప్రకటన.. బస్సు యాత్ర ద్వారా కాంగ్రెస్ నేతల్లో ఐక్యతను చాటడం.. సభలు, సమావేశాల ద్వారా పార్టీని ప్రజల్లోకి తీసుకెళ్లడం లక్ష్యంగా కార్యక్రమాలను సిద్ధం చేస్తోంది. దీనికి సంబంధించి ఆదివారం కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావ్ ఠాక్రే అధ్యక్షతన గాంధీభవన్‌లో టీపీసీసీ రాజకీయ వ్యవహారాల కమిటీ (పీఏసీ) సమావేశంలో విస్తృతంగా చర్చ జరిగింది. ఈ సందర్భంగా నేతలు పలు కీలక

మిగతా 3వ పేజీలో ▶

ఇదండీ జగత్



పక్క పార్టీలో కూడా అదే పరిస్థితి.. నో ప్రాబ్లమ్!

# వివేకా హత్య కుటుంబ ఆస్తి కోసమే

## సీబీఐ డైరెక్టర్ ప్రవీణ్ సూద్‌కు ఎంపీ అవినాశ్‌రెడ్డి లేఖ

### నర్రెడ్డి కుటుంబానిదే కుట్ర

- రెండో భార్యకు ఆస్తి రాసి నోటరీ వీలునామా రాసిన వివేకా
- ఆయన్ని హత్య చేసి ఆ వీలునామాను అపహరించారు
- అనంతరం సునీత పేరిట ఆస్తుల బదిలీ
- ఈ కోణాలను ఉద్దేశపూర్వకంగా పట్టించుకోని సీబీఐ
- దురుద్దేశంతో వ్యవహరించిన దర్యాప్తు అధికారి రాంసింగ్
- అప్రూవర్ దస్తగిరి వాంగ్మూలం పూర్తిగా కట్టుకథ.. బెంగళూరు భూవివాదం లేనే లేదు
- గుర్తు తెలియని వేలి ముద్రలపై సీబీఐ మౌనం ఎందుకు?
- ఇప్పటికైనా సమగ్రంగా దర్యాప్తు చేయాలి

సాక్షి, అమరావతి: మాజీ ఎంపీ వైఎస్ వివేకానందరెడ్డి హత్యకు కుటుంబ ఆస్తి వివాదాలే ప్రధాన కారణమని కడప ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి సీబీఐకి తెలిపారు. కుటుంబ వారసత్వ ఆస్తి కోసమే వివేకా అల్లుడు నర్రెడ్డి రాజశేఖరరెడ్డి, ఆయన కుటుంబ సభ్యులు ఈ హత్య చేయించారని ఆధారాలతో సహా వివరించారు. వివేకా తన రెండో భార్య షమీమ్, ఆమె కుమారుడి పేరిట రాసిన నోటరీ వీలునామాను నిందితులు నర్రెడ్డి కుటుంబానికి అందచేశారని తెలిపారు. షమీమ్‌కు వాటా ఇవ్వకుండా వివేకా ఆస్తి మొత్తాన్ని సునీత తన పేరిట మ్యుటేషన్ చేసుకున్న విషయాన్ని గుర్తు చేశారు. గతంలో దర్యాప్తు అధికారిగా ఉన్న రాంసింగ్ దురుద్దేశపూరితంగా ఈ అంశాలపై దర్యాప్తు చేయకుండా పక్కదారి పట్టించారన్నారు. అధికారికంగా బాధ్యతలు స్వీకరించటానికి మూడున్నర



నెలల ముందు నుంచే రాంసింగ్ దర్యాప్తు చేపట్టడం, సాక్షులు చెప్పినదానికి భిన్నంగా వాంగ్మూలాలను నమోదు చేయడాన్ని ప్రస్తావించారు. ఈమేరకు ఎంపీ అవినాశ్‌రెడ్డి సీబీఐ డైరెక్టర్ ప్రవీణ్ సూద్‌కు సవివరంగా రాసిన లేఖ తాజాగా వెలుగులోకి వచ్చింది. వివేకా రెండో వివాహంతో ఆ కుటుంబంలో తలెత్తిన ఆస్తి వివాదాలు, అనంతర పరిణామాలను లేఖలో వివరించారు. హత్యలో పాల్గొన్న దస్తగిరిని అప్రూవర్‌గా మార్చి ఇప్పించిన వాంగ్మూలం పూర్తిగా అసత్యాల పుట్ట అని స్పష్టం చేశారు. వివేకా బాత్‌రూమ్‌లో లభ్యమైన గుర్తు తెలియని వేలి ముద్రలు ఎవరివి? అనే విషయాన్ని సీబీఐ పట్టించుకోకపోవడాన్ని ఎంపీ అవినాశ్ లేఖలో ప్రస్తావించారు. కడప ఎంపీ టికెట్‌పై ఎలాంటి సందిగ్ధత లేదని స్పష్టం చేస్తూ హత్యకు ముందు రోజు వరకు ఎంపీగా తన గెలుపు కోసం వివేకా ప్రచారం చేశారని గుర్తు చేశారు. రాంసింగ్ ఉద్దేశపూర్వకంగా విస్మరించిన అంశాలను పునఃసమీక్షించి ఐపీసీ 457, 460, 394, 398, 302 సెక్షన్ల కింద సమగ్రంగా దర్యాప్తు చేయాలని కోరారు. వివేకా హత్య కేసు దర్యాప్తును జూన్ 30లోగా పూర్తి చేయాలని న్యాయస్థానం

మిగతా 2వ పేజీలో ▶

# జలమండలి ఉద్యోగులకు 30% పీఆర్సీ

## సీఎం కేసీఆర్ నిర్ణయం



సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ సీవరేజీ బోర్డు (జలమండలి)లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు 30 శాతం వేతన సవరణ అమలు చేస్తూ ముఖ్యమంత్రి కే.చంద్రశేఖర్‌రావు నిర్ణయం తీసుకున్నారు. తద్వారా దాదాపు నాలుగు వేల మంది వాటర్ బోర్డు ఉద్యోగులకు లబ్ధి చేకూరనున్నది. మెట్రో వాటర్‌వర్క్స్ యూనియన్ అధ్యక్షుడు జి.రాంబాబుయాదవ్, ఇతర నేతలు సీఎం కేసీఆర్‌ను ప్రగతిభవన్‌లో కలిసి ధన్యవాదాలు తెలిపారు.

## క్లుప్తంగా...

### ఏనుగు నర్సింహారెడ్డికి సినారె సాహితీ పురస్కారం ప్రదానం



సుల్తాన్‌బజార్ (హైదరాబాద్): మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ డాక్టర్ ఏనుగు నర్సింహారెడ్డికి సి.నారాయణరెడ్డి సాహితీ పురస్కారాన్ని తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ ఉపాధ్యక్షుడు, సారస్వత పరిషత్ అధ్యక్షుడు ఎల్లూరి శివారెడ్డి అందజేశారు. జ్ఞానపీఠ పురస్కారగ్రహీత డాక్టర్ సి.నారాయణ రెడ్డి 92వ జయంతి సందర్భంగా ఆదివారం సాయంత్రం బొగ్గులకుంటలోని తెలంగాణ సారస్వత పరిషత్‌లో ఈ సాహితీ పురస్కార ప్రదాన కార్యక్రమం నిర్వహించారు. అవార్డు ప్రదానం అనంతరం సినారె గానలహరి పేరుతో కె.స్వరూప ఆలపించిన గజల్స్ శ్రోతలను అలరించాయి. కార్యక్రమానికి తెలంగాణ సాహిత్య అకాడమీ పూర్వ అధ్యక్షుడు నందిని సిద్దారెడ్డి, రసమయి అధ్యక్షుడు ఎం.కె.రాము, సిలికాన్ ఆంధ్రా విశ్వవిద్యాలయం తెలుగుశాఖ అధ్యక్షురాలు సి.మృణాళిని తదితరులు హాజరయ్యారు.

### రామస్వామికి 'యునెస్కో' అవార్డు



నర్సంపేట: పర్యావరణ వారోత్సవాల సందర్భంగా దేశవ్యాప్తంగా యునెస్కో ఐదుగురికి పర్యావరణ ప్రేమికుల అవార్డులను ప్రకటించింది. వరంగల్ జిల్లా నర్సంపేటకు చెందిన 'వనప్రేమి'అవార్డు గ్రహీత గోకా రామస్వామికి యునెస్కో రెండో అవార్డు ప్రకటించినట్లు యునెస్కో సెక్రటరీ జనరల్ యోగేష్ కులశ్రేష్ఠ ఆదివారం తెలిపారు. కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు వేల మొక్కల నాటే కార్యక్రమంలో గోకా రామస్వామి పాల్గొన్నారు. ఇందులో భాగంగా రామస్వామి సైతం ఎంపికయ్యారు. ఈ అవార్డును త్వరలో జరుగనున్న యునెస్కో సమావేశంలో అందజేస్తారు.

### ఓయూ దూరవిద్య కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం పీజీ కోర్సులకు సెమిస్టర్ పరీక్షలు

**ఉస్మానియా యూనివర్సిటీ:** వివిధ డిగ్రీ, పీజీ, పీజీ డిప్లొమా దూరవిద్య కోర్సుల్లో 2023–24 ఏడాది ప్రవేశాలకు ఉస్మానియా విశ్వవిద్యాలయంలోని జి.రామిరెడ్డి దూరవిద్య కేంద్రం దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. ఈ నెల 20 నుంచి ప్రారంభమైన ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ గడువు ఆగస్టు 31తో ముగియనున్నట్లు ఓయూ దూరవిద్య డైరెక్టర్ ప్రొఫెసర్.జీబీ.రెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ ఏడాది నుంచి ఎంఏ, ఎంకాం, ఎమ్మెస్సీ కోర్సులతో పాటు పీజీ డిప్లొమా కోర్సులకు సెమిస్టర్ విధానాన్ని ప్రవేశపెడుతున్నట్లు తెలిపారు.

### ఆగస్టులో పీజీ ప్రవేశ పరీక్షల ఫలితాలు

**ఉస్మానియా యూనివర్సిటీ:** రాష్ట్రవ్యాప్తంగా జూన్ 30 నుంచి జూలై 10 వరకు జరిగిన వివిధ పీజీ కోర్సుల ప్రవేశ పరీక్షల (టీఎస్‌సీపీగేట్-2023) ఫలితాలను ఆగస్టు మొదటి వారంలో విడుదల చేయనున్నట్లు కన్వీనర్ ప్రొ.పాండురంగారెడ్డి తెలిపారు. ఇటీవల విడుదల చేసి ప్రాథమిక కీలో అభ్యంతరాలను ఈ నెల 24 వరకు ఆన్‌లైన్ ద్వారా తెలియజేయాలని సూచించారు. ఈ విద్యా సంవత్సరం నుంచి ప్రవేశ పెట్టనున్న ఎమ్మెస్సీ డేటా సైన్స్ కోర్సులలో ప్రవేశానికి త్వరలో నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు వెల్లడించారు.



### కరిగి, విరిగిన 'బేబీ' అగ్ని పర్వతం

అదో కొత్త అగ్ని పర్వతం.. రెండు వారాల కిందే పుట్టింది.. ఇంతలోనే అంతెత్తున పెరిగింది.. లోపలి నుంచి ఉబికివచ్చిన లావా వేడికి అంచులు కరిగి, విరిగి పడింది. లావాను బాంబుల్లా ఎగజల్లింది. ఐస్‌ల్యాండ్‌లోని రేక్జానెస్ ద్వీపకల్పం ప్రాంతంలోని 'బేజీ' అగ్నిపర్వతం విశేషమిది. అగ్నిపర్వతాలకు నిలయమైన రేక్జానెస్ ప్రాంతంలో గత నెల రోజుల్లో ఏకంగా ఏడు వేల భూప్రకంపనలు వచ్చాయి. రెండు వారాల కింద ఓ చోట అకస్మాత్తుగా సుమారు రెండున్నర కిలోమీటర్ల పొడవున భూమిలో పగుళ్లు వచ్చాయి. అందులో ఓ చోట లావా వెలువడటం మొదలై, మెల్లగా అగ్ని పర్వతంలా ఏర్పడింది. ప్రస్తుతం 'బేబీ వల్కనో'గా పిలుస్తున్న ఈ అగ్నిపర్వతం.. రెండు రోజుల కింద తీవ్రస్థాయిలో లావా వెలువరించడం మొదలుపెట్టింది. అది తీవ్ర స్థాయికి చేరి ఓ పక్క విరిగి.. లావా నదిలా ప్రవహిస్తోంది. దీనికి సంబంధించిన వీడియోను ఐస్‌ల్యాండ్ యూనివర్సిటీ వల్కనాలజీ అండ్ నేచురల్ హజార్డ్స్ పరిశోధకుల బృందం విడుదల చేసింది.



ఆదివారం రాజ్‌భవన్‌లో హైకోర్టు సీజేగా ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం గవర్నర్ తమిళి సై, సీఎం కేసీఆర్‌తో ముచ్చటిస్తున్న జస్టిస్ అలోక్ అరాధే

# వీఆర్‌ఏ వ్యవస్థ రద్దు



సీఎం కేసీఆర్‌కు పుష్పగుచ్ఛం ఇచ్చి కృతజ్ఞతలు చెప్తున్న వీఆర్‌ఏ జేఏసీ నేతలు. చిత్రంలో ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఉన్నతాధికారులు శాంతికుమారి, నవీన్ మిత్తల్ తదితరులు

▶ మొదటి పేజీ తరువాయి

అమల్లోకి వచ్చినకాలంలో గ్రామాల్లో నీటి వ్యవస్థను సక్రమంగా నిర్వహించడం, గ్రామ రెవెన్యూ, ఇతర విభాగాల అవసరాల కోసం ఏర్పాటైన గ్రామ సహాయకుల వ్యవస్థ తర్వాత వీఆర్‌ఏలుగా రూపాంతరం చెందింది. సామాజిక సేవ చేస్తున్న వీఆర్‌ఏల త్యాగపూరిత సేవ గొప్పది. నేటి మారిన పరిస్థితుల్లో వీఆర్‌ఏ వృత్తికి ప్రాధాన్యత తగ్గింది. ఈ నేపథ్యంలో వారిని రెవెన్యూ శాఖలో క్రమబద్ధీకరించి ప్రభుత్వ ఉద్యోగులుగా తీసుకుంటున్నాం..'' అని సీఎం కేసీఆర్ తెలిపారు. అట్టడుగు స్థాయి నుంచి త్యాగాలు, శ్రమతో సమాజ శ్రేయస్సు కోసం పనిచేస్తున్న వారిపట్ల తమ ప్రభుత్వం మానవీయ కోణంలో ఆలోచించి, నిర్ణయాలు తీసుకుంటుందన్నారు. పలుమార్లు ఎవరూ అడగకుండానే ఉద్యోగ వర్గాలకు జీతాలు పెంచి వారి సంక్షేమానికి పాటుపడ్డామని వివరించారు.

**విద్యార్హతల ఆధారంగా పోస్టులు**

రాష్ట్రంలో 20,555 మంది వీఆర్‌ఏలు పనిచేస్తున్నారని.. వారిలో నిరక్షరాస్యులతోపాటు ఏడో తరగతి, పదో తరగతి, ఇంటర్, డిగ్రీ ఆపై ఉన్నత చదువులు చదివినవారూ ఉన్నారని సీఎం కేసీఆర్ గుర్తుచేశారు. ఈ క్రమంలో వారి విద్యార్హతను బట్టి ప్రభుత్వం ఉద్యోగ కేటగిరీలను నిర్ధారిస్తుందని.. నిబంధనలకు అనుగుణంగా ఆయా శాఖల్లో భర్తీ చేస్తామని తెలిపారు. ఉన్నత చదువులు చదివి ప్రమోషన్లకు అర్హులైన వారిని అందుకు అనుగుణమైన పోస్టుల్లో నియమిస్తామన్నారు. ఇందుకు సంబంధించిన విధివిధానాలను వెంటనే ఖరారు చేయాలని రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్‌ను ఆదేశించారు.

**కారుణ్య నియామకాలు కూడా..**

61 ఏళ్ల వయసుపైబడిన వీఆర్‌ఏల వారసులకు కారుణ్య నియామకం కింద ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని సీఎం కేసీఆర్ నిర్ణయించారు. దీనితో పాటు 61 ఏళ్లలోపు వయసు ఉండి 2014 జూన్ 2న తర్వాత ఏదైనా కారణంతో మరణించిన వీఆర్‌ఏల వారసులకు కూడా ప్రభుత్వ ఉద్యోగం ఇస్తామని ప్రకటించారు. చనిపోయిన వీఆర్‌ఏల వారసులు, వారి విద్యార్హతల వివరాలను త్వరగా సేకరించాలని అధికారులకు, వీఆర్‌ఏల జేఏసీ నేతలకు సూచించారు. వారిని అర్హతలు, ప్రభుత్వ నిబంధనల మేరకు వివిధ శాఖల్లో సర్దుబాటు చేయాలని అధికారులను ఆదేశించారు.

**వివక్ష నుంచి విముక్తినిచ్చారు: వీఆర్‌ఏ జేఏసీ**

మస్కూరు వంటి పేర్లతో తరతరాలుగా ఎదుర్కొన్న సామాజిక వివక్ష నుంచి విముక్తి కల్పించి ప్రభుత్వ ఉద్యోగులుగా క్రమబద్ధీకరించడం ద్వారా సీఎం కేసీఆర్ వీఆర్‌ఏల ఆత్మగౌరవాన్ని నిలబెట్టారని వీఆర్‌ఏ జేఏసీ నేతలు హర్షం వ్యక్తం చేశారు.

## అధికారంలోకి రాగానే పాలమూరు ఎత్తిపోతల పూర్తిచేస్తాం

### టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి



గాంధీభవన్ వద్ద మాట్లాడుతున్న రేవంత్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి రాగానే పాలమూరు ఎత్తిపోతల పథకం పూర్తి చేస్తామని, రాబోయే వందరోజుల్లో కార్యకర్తలు కష్టపడి పనిచేయాలని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి కోరారు. గద్వాల జెడ్పీ చైర్‌పర్సన్ సరిత తిరుపతయ్య, బండ్ల చంద్రశేఖర్‌రెడ్డిల సమక్షంలో పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పెద్ద సంఖ్యలో బీఆర్‌ఎస్, బీజేపీల నుంచి ఆదివారం గాంధీభవన్‌లో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ గద్వాల జిల్లా బంగ్లాలో బందీ అయ్యిందని, ఆ జిల్లా ప్రజలను బంగ్లాల ముందు బానిసలుగా మార్చారని ఆరోపించారు. జిల్లాలో కొందరు బీఆర్‌ఎస్, బీజేపీలోకి వెళ్లినంత మాత్రాన ఏమీ కాదన్నారు. గద్వాలకు చెందిన బడుగు,బలహీన వర్గాలు ఎప్పుడూ కాంగ్రెస్ వైపే ఉన్నారని వ్యాఖ్యానించారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా బిడ్డ అయిన తనకు టీపీసీసీ అధ్యక్ష పదవితో సోనియాగాంధీ గౌరవం ఇచ్చారని, అందుకు ప్రతిగా పాలమూరుజిల్లాలో 14కు 14 స్థానాలు కాంగ్రెస్ పార్టీ గెలుపొందేలా కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు మల్లురవి తదితరులు పాల్గొన్నారు.

**జీఓ 111పై నివేదిక సమర్పణ**

జీఓ 111పై అధ్యయనం చేసేందుకుగాను రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఏర్పాటు చేసిన కమిటీ రూపొందించిన నివేదికను రేవంత్‌రెడ్డికి అందజేశారు. కమిటీ చైర్మన్ ఎం.కోదండరెడ్డి నేతృత్వంలో సభ్యులు అన్వేశ్‌రెడ్డి, జగదీశ్వర్‌రావు ఈ నివేదిక తయారు చేశారు.

## వేగంగా.. వెరీ సింపుల్‌గా..

### ఆస్తుల రిజిస్ట్రేషన్ సులభతరం చేస్తున్న ఏపీ

సాక్షి, అమరావతి: ఏపీలో ఇకపై ఆస్తుల రిజిస్ట్రేషన్లు కూడా ఆన్‌లైన్‌లోనే చేసుకోవచ్చు. ఏపీ ప్రభుత్వం కంప్యూటర్ ఎయిడెడ్ అడ్మినిస్ట్రేషన్ ఆఫ్ రిజిస్ట్రేషన్ డిపార్టుమెంట్ (కార్డ్)ను ఆధునీకరించి కార్డ్ 2.0కు రూపకల్పన చేస్తోంది. 'కార్డ్ ప్రైమ్'పేరుతో ప్రత్యేక సాఫ్ట్‌వేర్ రూపొందిస్తోంది. దీని ద్వారా స్టాంపు పేపర్లు, సంతకాలతో పనిలేకుండా రిజిస్ట్రేషన్లు చేసుకోవచ్చు. డాక్యుమెంట్‌ను ఎవరికివారే ఆన్‌లైన్‌లో తయారు చేసుకుని, ఆన్‌లైన్‌లోనే చలానా (స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజు) కట్టి, ఒక టైం స్లాట్‌ను (అపాయింట్‌మెంట్) బుక్ చేసుకుని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం, లేదా గ్రామ, వార్డు సచివాలయానికి వెళితే అక్కడ వెంటనే రిజిస్ట్రేషన్ పూర్తి చేసే విధానం త్వరలో అందుబాటులోకి రానుంది. కేవలం బయోమెట్రిక్ ద్వారా వేలిముద్ర వేయడానికి 5 నుంచి 10 నిమిషాలు ఉంటే సరిపోతుందని అధికారులు చెబుతున్నారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం బయట జరిగే పనిని సులభంగా ఆన్‌లైన్‌లో చేసుకోవచ్చు.

## బీఆర్‌ఎస్, బీజేపీలకు కార్మికలోకం బుద్ధి చెప్పాలి

### కార్మిక, ఉద్యోగ కాంగ్రెస్ సమావేశంలో సీఎల్పీ నేత భట్టి



సమావేశంలో భట్టి విక్రమార్కతో ఉదిత్ రాజ్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని ఫ్యూడల్, కేంద్రంలోని కేపిటలిస్టు ప్రభుత్వాల కుట్రలో కార్మికులు పడొద్దని కాంగ్రెస్ శాసనసభాపక్షం(సీఎల్పీ) నేత మల్లు భట్టివిక్రమార్క అన్నారు. హక్కులను నిర్వీర్యం చేస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు బుద్ధి చెప్పేందుకు కార్మికలోకం సిద్ధం కావాలని కోరారు. ఆదివారం ఇక్కడి గాంధీభవన్‌లో అసంఘటిత కార్మిక, ఉద్యోగ కాంగ్రెస్ (కేకేసీ) రాష్ట్ర చైర్మన్ సమీర్ కౌశల్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిన రూ.10 వేల కోట్ల సెస్ నిధులను కార్మికుల కోసం ఖర్చు చేయకుండా బీఆర్‌ఎస్ ప్రభుత్వం పక్కదారి పట్టించిందని, ఔట్‌సోర్సింగ్ విధానంలో కార్మికుల శ్రమదోపిడీకి పాల్పడుతోందని ఆరోపించారు. ఈ ప్రభుత్వానికి కార్మికులు గుణపాఠం చెప్పాలని భట్టి కోరారు. త్వరలో రాబోయే కాంగ్రెస్ ప్రభుత్వంలో కార్మికుల సంక్షేమమే ఎజెండాగా పని చేస్తామని హామీ ఇచ్చారు. సమావేశం వేదికపైకి తమను ఆహ్వానించలేదంటూ ఐఎన్‌టీయూసీ నేతలు ఆందోళనకు దిగారు. వీరికి సర్దిచెప్పి సమావేశాన్ని కొనసాగించారు. కార్యక్రమంలో ఏఐసీసీ కార్యదర్శి మన్సూర్ అలీఖాన్, కేకేసీ చైర్మన్ డాక్టర్ ఉదిత్‌రాజ్, టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్లు మహేశ్ కుమార్‌గౌడ్, అంజన్‌కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు. సమావేశం అనంతరం రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి ఠాక్రేను కార్మికనేతలు కలిసి వినతిపత్రం అందజేశారు.

## పొన్నంకే ఎందుకు అన్యాయం?

- కొందరు నేతలు కుట్ర చేస్తున్నారు
- గాంధీభవన్‌లో మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ అనుచరుల ఆందోళన
- మంచి హోదా ఇస్తామని ఠాక్రే హామీ



నిరసనకు దిగిన పొన్నం అనుచరులు

సాక్షి, హైదరాబాద్: మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్‌కు కాంగ్రెస్ పార్టీకి సంబంధించిన ఏ కమిటీలోనూ స్థానం కల్పించకుండా అవమానపరుస్తున్నారంటూ ఆయన అనుచరులు ఆదివారం గాంధీభవన్‌లో ఆందోళనకు దిగారు. ఎన్‌ఎస్‌యూఐ నుంచి పార్టీకి సేవ చేస్తూ తెలంగాణ ఉద్యమంలో కీలకంగా పాల్గొన్న ప్రభాకర్‌కే ఎందుకు అన్యాయం చేస్తున్నారని నిలదీశారు. పదవులు రాకుండా జిల్లాకు చెందిన కొందరు సీనియర్ నేతలు, రాష్ట్ర స్థాయిలో మరికొందరు అడ్డుకుంటున్నారని ఆరోపించారు. ఇటీవల ఏఐసీసీ నియమించిన ప్రదేశ్ ఎన్నికల కమిటీ (పీఈసీ)లో పొన్నంకు స్థానం కల్పించనందుకు నిరసనగా గాంధీభవన్‌కు వచ్చిన ఆయన అనుచరులు రాజకీయ వ్యవహారాల కమిటీ (పీఏసీ) సమావేశానికి హాజరయ్యేందుకు వచ్చిన నేతలను కూడా అడ్డుకునే యత్నం చేశారు.

**అవసరమైతే తన పదవి ఇస్తానన్న కోమటిరెడ్డి**

సరిగ్గా అదే సమయంలో గాంధీభవన్‌కు వచ్చిన భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వారితో మాట్లాడి సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవసరమైతే తన స్థానంలో పొన్నం పేరు చేర్చాలని పార్టీని కోరుతానని చెప్పారు. సీనియర్ నేత జానారెడ్డి స్పందిస్తూ పార్టీ వదిలి వెళ్లిపోయిన మహేశ్వర్‌రెడ్డి స్థానంలో పొన్నంకు అవకాశం కల్పించాలని సూచించారు. మధుయాష్కీ గౌడ్ మాట్లాడుతూ త్వరలోనే పొన్నంకు చైర్మన్ పదవి వస్తుందన్నారు.

**పీఏసీ సభ్యులు ఎక్కువయ్యారు.. అందుకే: ఠాక్రే**

రాష్ట్ర కాంగ్రెస్ ఇన్‌చార్జి మాణిక్‌రావ్ ఠాక్రే మాట్లాడుతూ పొన్నం విషయంలో ఆందోళన అవసరం లేదని, త్వరలోనే ఆయనకు మంచి హోదా కల్పిస్తామని, పీఏసీ సభ్యులు ఎక్కువ కావడంతోనే ఆయనకు అవకాశం కల్పించలేకపోయామన్నారు.

## కాచిగూడ-నిజామాబాద్ మధ్య పలు రైళ్ల రద్దు

సాక్షి, హైదరాబాద్: ఈ నెల 24 నుంచి 30 తేదీ వరకు కాచిగూడ-నిజామాబాద్ మధ్య నడిచే ప్యాసింజర్ రైళ్లను రద్దు చేయనున్నట్లు దక్షిణమధ్య రైల్వే సీపీఆర్వో సీహెచ్.రాకేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. రైల్వేట్రాక్ పైన మౌలిక సదుపాయాల అభివృద్ధి దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. అలాగే నిజామాబాద్-నాందేడ్ మధ్య నడిచే రైళ్లు కూడా రద్దు కానున్నట్లు వెల్లడించారు.

# వివేకా హత్య కుటుంబ ఆస్తి కోసమే

▶ మొదటి పేజీ తరువాయి

సీబీఐకి గడువు నిర్దేశించింది. అంటే అప్పటిలోగా సీబీఐ తుది చార్జిషీట్ దాఖలు చేయాల్సి ఉంది. ఈ నేపథ్యంలో జూన్ 19న సీబీఐ డైరెక్టర్ ప్రవీణ్ సూద్‌కు ఎంపీ అవినాశ్‌రెడ్డి ఈ లేఖను రాశారు. సీబీఐ నమోదు చేసి న్యాయస్థానానికి సమర్పించిన సాక్షుల వాంగ్మూలాలు, అంతకు ముందు ఛార్జ్ షీట్ల లో పేర్కొన్న అంశాలను విశ్లేషించిన అనంతరం తాను సహేతుకంగా ఈ సందేహాలు, అభ్యంతరాలను వ్యక్తం చేస్తున్నట్లు పేర్కొన్నారు. సీబీఐ గత గత ఛార్జ్ షీట్ల లో విస్మరించిన కీలక అంశాలను పునసమీక్షించి సమగ్రంగా దర్యాప్తు చేసి న్యాయం చేయలని కోరారు. ఎంపీ అవినాశ్‌రెడ్డి లేఖలో ప్రస్తావించిన ప్రధానాంశాలు సంక్షిప్తంగా...



రెండో భార్య షమీమ్, కుమారుడు షెహన్‌షాతో వివేకానందరెడ్డి (ఫైల్)

### నర్రెడ్డి కుటుంబానిదే ఆ కుట్ర



నర్రెడ్డి రాజశేఖరరెడ్డి

కుటుంబ వారసత్వ ఆస్తి కోసమే వివేకాను హత్య చేశారు. ఆ హత్య వెనుక వివేకా అల్లుడు నర్రెడ్డి రాజశేఖరరెడ్డి, ఇతర నర్రెడ్డి కుటుంబ సభ్యులున్నారు. ఎందుకంటే తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న వివేకా తన రెండో భార్య షమీమ్, ఆమె కుమారుడు షెహన్‌షాకు ఆర్థికంగా ప్రయోజనం చేకూర్చలేకపోయారు. తన కుమారుడి చదువు, భవిష్యత్ కోసం తన ఆస్తిలో కొంత వాటా రాసివ్వాలనుకున్నారు. కుటుంబ ఉమ్మడి ఆస్తిలో తన పేరిట ఉన్న 25 శాతం వాటాను షమీమ్, ఆమె కుమారుడి పేరిట ఆయన నోటరైజ్ వీలునామా రాసినట్లు తెలిసింది. దీన్ని ఆయన మొదటి భార్య, కుమార్తె, అల్లుడు తీవ్రంగా వ్యతిరేకించారు. ఈ నేపథ్యంలో వివేకా హత్య జరిగింది. వివేకా కుమార్తె సునీత, అల్లుడు, చిన్న బావమరిది నర్రెడ్డి రాజశేఖరరెడ్డి, పెద్ద బావమరిది నర్రెడ్డి శివప్రకాశ్‌రెడ్డిలతో ఎర్ర గంగిరెడ్డికి సన్నిహిత సంబంధాలున్నాయి. ఆయన ద్వారానే వారు వివేకా హత్యకు పన్నాగం పన్ని ఉంటారు. తమ కుటుంబ సభ్యులతో అక్రమ సంబంధం పెట్టుకున్నారని వివేకాపై ఆగ్రహంతో ఉన్న సునీల్ యాదవ్, గజ్జల ఉమాశంకర్‌రెడ్డిల సహకారంతో ఎర్ర గంగిరెడ్డి ఈ హత్యకు పథకం వేశాడు. డబ్బు ఆశ చూపించి దస్తగిరిని కూడా పాత్రధారిని చేశారు. వివేకా హత్య తరువాత ఆ ఇంట్లో కొన్ని పత్రాల కోసం ఎర్ర గంగిరెడ్డి, ఇతర నిందితులు గాలించారు. హత్యలో పాలు పంచుకున్న దస్తగిరితో పాటు వాచ్‌మెన్ రంగయ్య కూడా తన వాంగ్మూలంలో ఇదే విషయాన్ని చెప్పారు. బెంగళూరు భూవివాదం లేదని ఎర్ర గంగిరెడ్డికి తెలుసు కాబట్టి వారు వెతికింది వివేకా రాసిన నోటరీ వీలునామా గురించే అని స్పష్టమవుతోంది. నోటరీ వీలునామాను ఎర్ర గంగిరెడ్డి వివేకా కుమార్తె, అల్లుడికి ఇచ్చి ఉంటారు. అంటే కుటుంబ ఆస్తి కోసమే వివేకాను హత్య చేశారు. వివేకా హత్య తరువాత ఆ కుటుంబ ఆస్తి మొత్తాన్ని సునీత తన పేరిట మ్యుటేషన్ ద్వారా మార్పించుకోవడం గమనార్హం. షమీమ్‌కు ఎలాంటి ఆస్తి దక్కలేదు. ఆస్తి కోసమే వివేకాను ఆయన అల్లుడు నర్రెడ్డి రాజశేఖరరెడ్డి హత్య చేయించారని ఈ కేసులో నిందితుడు సునీల్ యాదవ్‌కు సమీప బంధువైన భరత్ యాదవ్ తన వాంగ్మూలంలో చెప్పాడు. తాము చెప్పినట్లు సీబీఐకి అవాస్తవాలు చెప్పకుంటే ఈ కేసులో ఇరికిస్తామని వివేకా పీఏ కృష్ణారెడ్డిని సునీత బెదిరించారు. ఈ వాస్తవాలన్నీ వివేకా హత్య వెనుక నర్రెడ్డి రాజశేఖరరెడ్డి, ఆయన కుటుంబ సభ్యులే ఉన్నట్లు స్పష్టం చేస్తున్నాయి. సీబీఐ ఈ కోణంలో అసలు దర్యాప్తు చేయలేదు.

### ఆ తరువాత మాట మార్చిన సునీత



నర్రెడ్డి సునీత

కడప ఎంపీ టికెట్ కోసమే వివేకాను హత్య చేశారని రాంసింగ్ చార్జ్‌షీట్‌లో పేర్కొన్న అంశాలు పూర్తిగా అవాస్తవం. అప్పటికే సిట్టింగ్ ఎంపీగా ఉన్న నన్నే (అవినాష్‌రెడ్డి) 2019 ఎన్నికల్లోనూ అభ్యర్థిగా పార్టీ ఖరారు చేసింది. నా గెలుపు కోసం పార్టీ ఎన్నికల ఇన్‌చార్జ్‌గా వివేకానందరెడ్డి ఉన్నారు. ఆయన చనిపోయే ముందు రోజు వరకూ నా గెలుపు కోసం కృషి చేశారు. మైదుకూరు నియోజకవర్గంలో పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి రఘురామిరెడ్డితో కలసి ప్రచారం కూడా చేశారు. సీబీఐ ఈ విషయాలపై ఏమాత్రం దృష్టి సారించలేదు. కనీసం రఘురామిరెడ్డినిగానీ పార్టీ నేతలను గానీ సంప్రదించలేదు. వివేకా హత్య తరువాత తొలుత సునీత కూడా మీడియాకు ఇదే విషయాలను చెప్పారు. తన తండ్రి చివరి వరకు అవినాశ్‌రెడ్డి గెలుపు కోసం పని చేశారని వెల్లడించారు. 2019 అక్టోబరు తరువాత ఆమె మాట మార్చి నాపై, మా పార్టీపై అసత్య ఆరోపణలు చేస్తున్నారు.

### బెంగళూరు భూవివాదం కట్టుకథే



దస్తగిరి

దస్తగిరిని అప్రూవర్‌గా మార్చి రాంసింగ్ ఇప్పించిన వాంగ్మూలంలోని అంశాలు పూర్తి అవాస్తవమని సీబీఐ దర్యాప్తులోనే వెల్లడైంది. బెంగళూరులోని ఓ భూవివాదానికి సంబంధించి డబ్బుల కోసం వివేకానందరెడ్డిని హత్య చేయాలని, తనకు వైఎస్ భాస్కర్‌రెడ్డి సహకారం ఉందని ఎర్ర గంగిరెడ్డి చెప్పినట్టు దస్తగిరి వాంగ్మూలం ఇచ్చాడు. బెంగళూరు భూవివాదానికి సంబంధించి పది మందిని సీబీఐ విచారించింది. ఆ భూమికి సంబంధించిన పత్రాలు నకిలీవని తేలడంతో వాటిని బెంగళూరుకు చెందిన వై.వెంకట ప్రసాద్‌కు అప్పటికే అప్పగించేసినట్టు వెల్లడైంది. అంటే వివేకానందరెడ్డి హత్యకు చాలా నెలల ముందే బెంగళూరు భూవివాదం సమసిపోయింది. దస్తగిరి వాంగ్మూలం పూర్తిగా అవాస్తవమని స్పష్టమైంది. ఆ వాంగ్మూలం ఆధారంగా రాంసింగ్ దర్యాప్తు చేయడం దురుద్దేశపూరితమే.

### చెక్ పవర్ రద్దుతో ఆర్థిక ఇబ్బందులు..



సునీల్‌యాదవ్

కుటుంబ సభ్యులు తన చెక్ పవర్ రద్దు చేయడంతో వివేకా తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. విపరీతంగా మద్యానికి బానిసయ్యారు. మోసగాడైన సునీల్ యాదవ్ చెప్పిన వజ్రాల కథను విశ్వసించారు. వాటిని విక్రయించి డబ్బులు ఇప్పించాలని సునీల్ యాదవ్ కోరడంతో తన వాహనాన్ని ఇవ్వడంతోపాటు అతడితో కలసి పలు ప్రాంతాలు తిరిగారు. తరువాత సునీల్ యాదవ్ చెప్పినదంతా కట్టుకథేనని ఎర్ర గంగిరెడ్డి గ్రహించాడు. అప్పటి నుంచి సునీల్ యాదవ్, గజ్జల ఉమాశంకర్‌రెడ్డి వివేకా ఇంటికి రావడం మానేశారు. వారిద్దరి కుటుంబాల్లో మహిళలతో వివేకాకు వివాహేతర సంబంధాలు కూడా ఉన్నాయి. దీంతో వారిద్దరూ ఆయనపై తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. వివేకాపై దాడి చేసిన తరువాత ఆయన మర్మాంగంపై సునీల్ యాదవ్ కాలితో తన్ని తీవ్రంగా దూషించారు.

### ఆ వేలిముద్రలు ఎవరివి?

వివేకా హత్య జరిగిన ప్రదేశాన్ని కడప పోలీసుల క్లూస్ టీమ్ పరిశీలించి బాత్రూమ్ గోడలు, తలుపు వెనుక ఉన్న వేలిముద్రలను సేకరించింది. ఆ వేలిముద్రల్లో కొన్ని నలుగురు నిందితుల వేలిముద్రలతో సరిపోలేదు. అంటే హత్య జరిగిన రోజు రాత్రి ఆ నలుగురు నిందితులే కాకుండా ఆ ఇంట్లో మరెవరో ఉన్నట్లు స్పష్టమవుతోంది. సీబీఐ అప్రూవర్‌గా మార్చిన దస్తగిరి ఆ వ్యక్తి పేరును వెల్లడించలేదు. ఆ వేలి ముద్రలు ఎవరివి? అనే కోణంలో సీబీఐ దర్యాప్తు చేయలేదు. ఎవరినో రక్షించేందుకే ఆ వేలి ముద్రలను ఉద్దేశపూర్వకంగా విస్మరిస్తోందని స్పష్టమవుతోంది. ఆ వేలి ముద్రలు ఎవరివన్న కోణంలో దర్యాప్తు చేస్తే ఈ హత్య వెనుక అసలు కుట్ర బయటపడుతుంది.


### పక్కదారి పట్టించిన రాంసింగ్

రాంసింగ్ దర్యాప్తు అధికారిగా 2021 నవంబరు 9వ తేదీన అధికారికంగా బాధ్యతలు స్వీకరించగా అప్పటికి మూడున్నర నెలల ముందే సీఆర్‌పీసీ నిబంధనలకు విరుద్ధంగా దర్యాప్తు చేపట్టారు. సెప్టెంబరు రెండో తేదీనే వివేకా అల్లుడు నర్రెడ్డి రాజశేఖరరెడ్డి వద్ద వాంగ్మూలం తీసుకున్నారు. నాతోపాటు నా తండ్రి వైఎస్ భాస్కర్‌రెడ్డి, డి.శివశంకర్‌రెడ్డికి వ్యతిరేకంగా ఉద్దేశపూర్వకంగానే సాక్షుల పేరిట వాంగ్మూలాలు నమోదు చేశారు. సాక్షులు చెప్పని విషయాలను కూడా చెప్పినట్టుగా వాంగ్మూలాలు నమోదు చేసి తన కింది అధికారులతో వాటిపై సంతకాలు చేయించారు. సీఐ శంకరయ్య, అభిషేక్‌రెడ్డి చెప్పని విషయాలను చెప్పినట్లుగా రాంసింగ్ ఏకపక్షంగా వాంగ్మూలాలను నమోదు చేశారు. దీన్ని వ్యతిరేకిస్తూ శంకరయ్య కడప ఎస్పీకి ఫిర్యాదు కూడా చేశారు. తాను చెప్పినట్లు అబద్ధాలు చెప్పాలని ఉదయకుమార్‌రెడ్డిని రాంసింగ్ చిత్రహింసలకు గురి చేయడంతో ఎస్పీకి ఫిర్యాదు చేశారు. 2021 నవంబర్ 9వరకు రాంసింగ్ దర్యాప్తు కొనసాగించి రెండు చార్జ్‌షీట్లు దాఖలు చేశారు. వివేకా రెండో వివాహం అంశాన్ని ఉద్దేశపూర్వకంగానే విస్మరించారు.



## టీఆర్టీ నోటిఫికేషన్ కోసం 48 గంటల దీక్ష చేస్తా

### పాఠశాలల నిర్వహణలో ఏపీ సీఎం జగన్‌ను చూసి కేసీఆర్ నేర్చుకోవాలి: కోమటిరెడ్డి



కోమటిరెడ్డిని ఆదివారం ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందిస్తున్న టీఆర్టీ అభ్యర్థులు

సాక్షి, హైదరాబాద్: కోచింగులు తీసుకుని ఉపాధ్యాయ ఉద్యోగ నోటిఫికేషన్ల కోసం ఎదురు చూస్తున్న టీచర్స్ రిక్రూట్‌మెంట్ టెస్ట్ (టీఆర్టీ) అభ్యర్థుల పక్షాన ముందుండి పోరాడుతానని, టీఆర్టీ నోటిఫికేషన్ కోసం ఇందిరాపార్కు వద్ద 48 గంటల దీక్ష చేస్తానని భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వెల్లడించారు. ఈ నాలుగు నెలల్లో కేసీఆర్ నోటిఫికేషన్ ఇవ్వకపోతే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నెలరోజుల్లోనే నోటిఫికేషన్ ఇప్పిస్తానని, ఒకవేళ ఇప్పించలేకపోతే తెలంగాణ కోసం రాజీనామా చేసినట్టు టీఆర్టీ అభ్యర్థుల కోసం తన పదవికి రాజీనామా చేస్తానని హామీ ఇచ్చారు. ఆదివారం హైదరాబాద్‌లోని కోమటిరెడ్డి నివాసంలో పలువురు టీఆర్టీ అభ్యర్థులు ఆయన్ను కలిసి తమ ఆవేదనను వెలిబుచ్చారు. సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కోమటిరెడ్డి మాట్లాడుతూ ఈ అంశంపై ఇప్పటికే సీఎం కేసీఆర్‌కు లేఖ రాశానని, ప్రభుత్వ స్కూళ్లలో వేలాది టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నా ప్రభుత్వం భర్తీ చేయడం లేదన్నారు. పాఠశాలల నిర్వహణ విషయంలో ఏపీ సీఎం జగన్‌ను చూసి కేసీఆర్ నేర్చుకోవాలని అన్న కోమటిరెడ్డి త్వరలో రాష్ట్రంలో రాబోయే కాంగ్రెస్ ప్రభుత్వం విద్యకే ప్రథమ ప్రాధాన్యత ఇస్తుందని భరోసా ఇచ్చారు. ఆందోళనలకు ప్రభుత్వం దిగిరాకపోతే ప్రగతిభవన్ ముట్టడికి పిలుపునిద్దామని ఆయన వ్యాఖ్యానించారు.

## క్లుప్తంగా...

### టికెట్ల కేటాయింపులో ప్రాధాన్యం ఇవ్వండి

**కాంగ్రెస్ పార్టీకి తెలంగాణ ఉద్యమకారుల వినతి**



సాక్షి, హైదరాబాద్: వచ్చే అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల దృష్ట్యా కాంగ్రెస్ పార్టీలోని తెలంగాణ ఉద్యమకారులు అప్రమత్తమయ్యారు. ఉద్యమంలో క్రియాశీలక పాత్ర పోషించిన ఉద్యమకారులకు టికెట్లు కేటాయించాలని కోరుతున్నారు. కాంగ్రెస్ పార్టీ పక్షాన ప్రాధాన్యత కల్పించాలని అధిష్టానానికి విన్నవించేందుకు సన్నద్ధమవుతున్నారు. ఈ మేరకు కార్యాచరణ రూపొందించుకునేందుకు మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్, డాక్టర్ చెరుకు సుధాకర్, అద్దంకి దయాకర్, బెల్లయ్య నాయక్‌తో పాటు పలువురు నేతలు ఆదివారం హైదరాబాద్‌లో సమావేశమయ్యారు. 2014 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఉద్యమకారులకు తగిన ప్రాధాన్యమిచ్చి టికెట్లు కేటాయించిందని, అదే తరహాలో 2023లో కూడా కేటాయించాలని వారు కోరారు. సమావేశంలో భాగంగా ఉద్యమకారుల పక్షాన రాష్ట్ర స్థాయి కమిటీని ఏర్పాటు చేశారు. ఈ మేరకు త్వరలోనే ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను కలిసి వినతిపత్రం అందజేయాలని నిర్ణయించారు.

### మణిపూర్ దుర్మార్గులను నడిరోడ్డుపై ఉరితీయాలి

**మోదీ దిష్టిబొమ్మను దగ్ధం చేసిన యూత్ కాంగ్రెస్**

సాక్షి, హైదరాబాద్: మణిపూర్‌లో నగ్నంగా నడిచింది దేహం కాదని, భారతదేశమని రాష్ట్ర యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శివసేనారెడ్డి వ్యాఖ్యానించారు. ఈ దురాగతానికి పాల్పడిన దుర్మార్గులను నడిరోడ్డుపై ఉరితీయాలని డిమాండ్ చేశారు. మణిపూర్ ఘటనకు నిరసనగా ఆదివారం యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో గాంధీ భవన్ ఎదుట మోదీ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా శివసేనారెడ్డి మాట్లాడుతూ, ప్రధాని మోదీ మైనింగ్‌కు అనుకూలమైన మణిపూర్ గిరిజన ప్రాంతాలను అదానీకి కట్టబెట్టే కుట్రలో భాగంగానే గొడవలను ప్రోత్సహిస్తున్నారని విమర్శించారు.

**జిల్లా అధ్యక్షులతో భేటీ**

అంతకుముందు యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులతో టీపీసీసీ ఉపాధ్యక్షుడు, యూత్ కాంగ్రెస్ ఇన్‌చార్జి ఎంఆర్‌జీ వినోద్‌రెడ్డి, శివసేనారెడ్డి గాంధీభవన్‌లో సమావేశమయ్యారు. నిరుద్యోగ యాత్ర నిర్వహణపై చర్చించడంతోపాటు ఈనెల 26న జాతీయ యూత్‌కాంగ్రెస్ ఆధ్వర్యంలో జరగనున్న 'బెహతర్ భారత్ కీ బునియాద్' కార్యక్రమానికి తెలంగాణ నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరయ్యేలా చూడాలని నిర్ణయించారు.

### సిట్టింగ్ అభ్యర్థులతో ఎన్నికల బరిలో నిలవాలి

**ట్విట్టర్‌లో సీఎం కేసీఆర్‌కు వైఎస్సార్‌టీపీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల సవాల్**



సాక్షి, హైదరాబాద్: దమ్ముంటే సిట్టింగులకు సీట్లు ఇచ్చి ఎన్నికల బరిలో నిలవాలని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావుకు వైఎస్సార్ టీపీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల సవాల్ విసిరారు. ఈ ఎన్నికల్లో ఎమ్మెల్యేలు గెలిచినప్పుడే కేసీఆర్ పాలనకు రెఫరెండమన్నారు. ఎన్నికలొచ్చేసరికి సొంత పార్టీ ఎమ్మెల్యేలపై జనం గుర్రుగా ఉన్నారని తెలుసుకున్న దొరగారు.. ఇప్పుడు ఉలిక్కిపడుతున్నారని ఆదివారం ట్విట్టర్‌లో ట్వీట్ చేశారు. సిట్టింగులకే సీట్లు అని సీఎం కేసీఆర్ మేకపోతు గాంభీర్యాన్ని ప్రదర్శిస్తున్నారని ఆమె ఎద్దేవా చేశారు.

### బెల్ట్‌షాపులు రద్దు చేస్తాం

**ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్**



కరీంనగర్: రాష్ట్రంలో బీఎస్పీ అధికారంలోకి వచ్చిన వెంటనే బెల్ట్ షాపులను పూర్తిగా రద్దు చేస్తామని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్ హామీనిచ్చారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో ఆదివారం జరిగిన బహుజన మహిళా సదస్సుకు హాజరై ప్రసంగించారు. కేసీఆర్ పాలనలో రాష్ట్రంలో బెల్ట్ షాపులు విచ్చలవిడిగా ఏర్పడటంతో మహిళలపై లైంగిక దాడులు పెరుగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. గోదావరి, మానేరు నదుల పరీవాహక ప్రాంతాల్లో ఇసుక క్వారీలన్నీ ఆధిపత్య వర్గాలకే దక్కుతున్నాయని ఆరోపించారు. మణిపూర్‌లో దారుణ ఘటనపై ప్రధాని మోదీ మౌనంగా ఉన్నారని విమర్శించారు. అంతకుముందు అంబేడ్కర్ విగ్రహం నుంచి ర్యాలీ నిర్వహించారు.

### మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన విధించాలి: జాగో

సాక్షి, హైదరాబాద్: మణిపూర్ రాష్ట్రంలో శాంతి భద్రతలు గాడి తప్పాయని, నెలల తరబడి ఆందోళనలు జరుగుతున్నా అక్కడి ప్రభుత్వం ఏమాత్రం స్పందించకపోవడం దారుణమని జాగో తెలంగాణ వేదిక ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆ రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించాలని కోరింది. ఈ మేరకు జాగో తెలంగాణ వేదిక ఆదివారం ఒక ప్రకటన విడుదల చేసింది. ఒక వర్గాన్ని అక్కడి బీజేపీ ప్రభుత్వం ప్రేరేపించడంతోనే మారణహోమం జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేసింది. నాలుగు నెలలుగా జరిగిన అన్ని హింసాత్మక సంఘటనలపై సుప్రీంకోర్టు ఆధ్వర్యంలో విచారణ జరిపించాలని, పక్షపాత స్థానిక యంత్రాంగాన్ని పాలన నుంచి తప్పించాలని డిమాండ్ చేసింది.

## 'సన్నాల ఎగుమతి నిషేధం'తో

# రాష్ట్ర రైతులకు దెబ్బ



**బాస్మతీయేతర తెల్ల బియ్యం ఎగుమతులపై కేంద్రం నిషేధంతో ఆందోళనలో రైతులు**

- ఇప్పటివరకు రాష్ట్రంలో పండే సన్నాలకు విదేశాల్లో డిమాండ్
- క్వింటాల్‌కు రూ. 2,500 నుంచి రూ. 3 వేలకు విక్రయిస్తున్న అన్నదాతలు
- రైతుల నుంచి నేరుగా ధాన్యం కొని మిల్లింగ్ చేసి ఏజెన్సీల ద్వారా విదేశాలకు పంపుతున్న మిల్లర్లు
- కేంద్రం చర్యతో డిమాండ్‌లేని సాధారణ రకాల వరి సాగు వైపు మరలాల్సిన పరిస్థితి

సాక్షి, హైదరాబాద్: రానున్న పండుగల సీజన్‌లో దేశీయంగా బియ్యం ధరలను అదుపులో ఉంచడంతోపాటు భవిష్యత్తులో ఆహార కొరత లేకుండా చూసేందుకు కేంద్రం విదేశాలకు బాస్మతీయేతర తెల్ల బియ్యం ఎగుమతులను నిషేధిస్తూ నిర్ణయం తీసుకోవడం తెలంగాణ రైతాంగానికి అశనిపాతంగా మారనుంది. కేంద్రం చర్యతో విదేశాల్లో డిమాండ్ ఉన్న సాగు రకాలైన జైశ్రీరాం, హెచ్ఎంటీ, బీపీటీ, ఆర్ఎన్ఆర్, తెలంగాణ సోనా బియ్యం వంగడాలు పండించే తెలంగాణ రైతులు ఆందోళన చెందుతున్నారు. ఏటా రెండు సీజన్‌లలో సాగయ్యే సన్నాలను స్థానిక వినియోగంతోపాటు విదేశీ ఎగుమతుల కోసమే అధికంగా పండిస్తున్న రైతులు అధిక ధరలను పొందుతు న్నా రు. క్వింటాల్ సన్న ధాన్యాన్ని రూ. 2,500 నుంచి రూ. 3,000 మధ్య విక్రయిస్తూ లాభపడుతున్నారు. కానీ ప్రస్తుతం ఈ రైతులు కూడా ఈ వానాకాలం పంట నుంచే దొడ్డు బియ్యం వైపు మరలే అవకాశాలు ఉన్నట్లు వ్యవసాయ నిపుణులు అంచనా వేస్తున్నారు.

**ఎగుమతి సుంకం విధించినా పెరిగిన ఎగుమతులు...**

బియ్యం ఎగుమతులను కట్టడి చేసే ఉద్దేశంతో కేంద్రం గతేడాది 20 శాతం ఎక్సైజ్ డ్యూటీ విధించింది. కానీ సుంకం విధించినా ఎగుమతులు ఆగకపోగా సుమారు 35 శాతం అధికంగా విదేశాలకు బియ్యం తరలి వెళ్లింది. అదే సమయంలో దేశంలో బియ్యం ధరలు ఒక్క ఏడాదిలోనే 11.5 శాతం మేర పెరిగాయి. అలాగే దేశంలో ఏటా 12 కోట్ల మెట్రిక్ టన్నుల బియ్యం ఉత్పత్తి అవుతుండగా గతేడాది నుంచి అది 11 కోట్ల మెట్రిక్ టన్నులకు తగ్గింది. దీంతో కేంద్రం భవిష్యత్తు దేశీయ అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఈ నిర్ణయం తీసుకొందని రైతు సంఘం నాయకుడు సారంపల్లి మల్లారెడ్డి తెలిపారు. దేశంలో 24 కోట్ల మెట్రిక్ టన్నుల బియ్యం పండించే పరిస్థితులు ఉన్నప్పటికీ సరైన ప్రణాళిక లేకనే ఈ పరిస్థితి ఏర్పడిందని ఆయన 'సాక్షి'తో అన్నారు.

**దేశీయ అవసరాలు, విదేశీ ఎగుమతులకే 40 శాతం**


ప్రభుత్వ లెక్కల ప్రకారం రాష్ట్రంలో గత కొన్నేళ్లుగా ఏటా 2 కోట్ల మెట్రిక్ టన్నులకుపైగా ధాన్యం దిగుబడి వస్తోంది. ఇందులో కోటీ 40 లక్షల మెట్రిక్ టన్నుల వరకు దొడ్డు ధాన్యం పండిస్తున్న రైతులు... దాన్ని కొనుగోలు కేంద్రాల ద్వారా విక్రయిస్తున్నారు. మిగతా సుమారు 60 లక్షల మెట్రిక్ టన్ను ల సన్న ధాన్యాన్ని (అంటే 40 శాతం పంటను) రైతులు స్వీ య అవసరాలతోపాటు స్థానిక, దేశీయ, విదేశీ విక్రయాల కోసం పండిస్తున్నట్లు ఓ మిల్లర్ల సంఘం నాయకుడు విశ్లేషించారు. 60 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం నుంచి వచ్చే సుమారు 36 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యంలో 20 లక్షల మెట్రిక్ టన్నులను స్థానిక, దేశీయ అవసరాలకు వినియోగి స్తున్న మిల్లర్లు... మరో 16 లక్షల మెట్రిక్ టన్నులను వివిధ ఏజెన్సీల ద్వారా విదేశాలకు పంపుతున్నారు. నల్లగొండ, నిజామాబాద్, ఖమ్మం, మహబూబ్‌నగర్, పెద్దపల్లి తదితర జిల్లాల్లోని సన్నబియ్యాన్ని ఎగుమతులకు వినియోగిస్తున్నారు.

**ఆ రకాలను మినహాయించాలి..**

బాస్మతీయేతర ముడి బియ్యం ఎగుమతిపై నిషేధం తెలంగాణ రైతుల ప్రయోజనాలకు విరుద్ధం. జైశ్రీరాం, ఆర్ఎన్ఆర్, హెచ్ఎంటీ మొదలైన రకాలు దేశంతోపాటు విదేశాల్లోనూ ఎక్కువ మంది ఇష్టపడే వరి రకాలు. తెలంగాణలోనే పండే ఈ రకాలు ఎకరాకు బాస్మతి కంటే తక్కువ దిగుబడి ఇస్తాయి. అలాంటి శ్రేష్టమైన రకానికి లాభ దాయకమైన ధరలను పొందకపోతే రైతులు డిమాండ్‌లేని సాధారణ రకాలను సాగు చేస్తారు. బాస్మతి తర హాలోనే తెలంగాణలోని సూపర్ ఫైన్ రకాలను నిషేధం నుంచి మినహాయించాలి.

–తూడి దేవేందర్‌రెడ్డి, దక్షిణ భారత మిల్లర్ల సంఘం నాయకుడు

**బియ్యం సేకరణలో రాష్ట్రానికి కేంద్రం సహకరించట్లేదు..**



ప్రస్తుతం దేశానికే అన్నం పెట్టే స్థాయిలో తెలంగాణ ఉంది. కేంద్రం రాష్ట్రానికి సహకరిస్తే ప్రపంచానికి కూడా అవ సరమైన బియ్యాన్ని అందిస్తాం. ఇప్పటికే ఏటా 3 కోట్ల ట న్నుల ధాన్యాన్ని పండిస్తున్న రైతులు వచ్చే రెండేళ్లలో మరో కోటి టన్నులు అదనంగా పండించబోతున్నా రు. అసలు యా సంగిలో దేశంలో అత్యధికంగా వరి సాగవుతున్న రాష్ట్రం తెలంగాణనే. ఇతర రాష్ట్రాల్లో వరి పంట తగ్గడడం వల్లనే కేంద్రం ఎగుమ తులపై నిషేధం విధించింది. తెలంగాణలో ఉత్పత్తి అయిన బియ్యాన్ని సేకరించే విషయంలో కేంద్రం సహకరించడం లేదు. ఆంక్షలను పక్కనపెట్టి ప్రస్తుతం మిల్లులు, గోదాముల్లో ఉన్న ధాన్యం, బియ్యాన్ని ముందుగా ఎఫ్‌సీఐ సేకరించాలి.

– పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్

# డిక్లరేషన్లు.. బస్సు యాత్ర.. సభలు

▶ మొదటి పేజీ తరువాయి



సమావేశంలో మాట్లాడుతున్న రేవంత్‌రెడ్డి. చిత్రంలో మాణిక్‌రావ్ ఠాక్రే, కోమటిరెడ్డి, జానారెడ్డి, పొన్నాల, వీహెచ్, భట్టి, మధుయాష్కి, షబ్బీర్ అలీ, జీవన్‌రెడ్డి, అంజన్ కుమార్

నిర్ణయాలు తీసుకున్నారు. బీఆర్ఎస్ వైఫల్యాలను, బీజేపీ–బీఆర్ఎస్ మధ్య స్నేహాన్ని ప్రజాక్షేత్రంలో ఎండగట్టడంతోపాటు.. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఏయే వర్గాలకు ఎలా లబ్ధి చేకూరుస్తుందన్న దానిపై విస్తృత ప్రచారం కల్పించాలని తీర్మానించారు. దీనిపై ప్రత్యేకంగా కార్యాచరణ రూపొందించాలని, కర్ణాటక తరహాలో ఎన్నికలకు వెళ్లాలని నిర్ణయించారు. ఇక మణిపూర్‌లో జరిగిన దారుణ ఘటనలను ఖండిస్తూ.. ఆ రాష్ట్ర ప్రభుత్వాన్ని సస్పెండ్ చేయాలన్న డిమాండ్‌తో తీర్మానం చేశారు.

**ఆగస్టు 15 నుంచి బస్సు యాత్ర!**

ఈ సమావేశంలో రాష్ట్రవ్యాప్త బస్సుయాత్రపై కాంగ్రెస్ నేతలు చర్చించారు. వీలున్నంత త్వరగా బస్సు యాత్ర చేపట్టాలని, ఆగస్టు 15 నుంచి మొదలుపెడితే బాగుంటుందని ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సూచించారు. మరికొందరు నేతలూ తమ అభిప్రాయాలను వెల్లడించారు. దీనితో బస్సు యాత్రను ఎప్పుడు మొదలుపెట్టాలి, ఎక్కడి నుంచి ఎక్కడి వరకు, ఎవరెవరి ఆధ్వర్యంలో చేపట్టాలన్న దానిపై చర్చించి, నిర్ణయం తీసుకునేందుకు సబ్ కమిటీ ఏర్పాటు చేయాలని భేటీలో నిర్ణయించారు. సబ్ కమిటీ గతంలో జరిగిన బస్సు యాత్రలపై అధ్యయనం చేసి ప్రతిపాదనలు, సూచనలు చేయాలని.. ఆ తర్వాత రూట్‌మ్యాప్ ఖరారు చేద్దామని తీర్మానించారు.

**డిక్లరేషన్లపైనా సబ్ కమిటీ**

రాష్ట్రంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, మహిళల కోసం డిక్లరేషన్లను ప్రకటించేందుకు నిపుణులు, మేధావులు, పార్టీ నేతలతో ఓ కమిటీ వేయాలని కాంగ్రెస్ పీఏసీ నిర్ణయించింది. రెండు రోజుల్లో ఈ కమిటీని ఏర్పాటు చేయాలని, పార్టీ అధికారంలోకి వస్తే ఆయా వర్గాల కోసం ఏం చేస్తామన్న దానిపై ఈ కమిటీ సూచనలు చేయాలని నిర్ణయించారు.

**ప్రియాంకా గాంధీతో సభ**

మాజీ మంత్రి జూపల్లితోపాటు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన పలువురు ఇతర పార్టీల నేతలు కాంగ్రెస్‌లో చేరేందుకు ఈ నెల 30న కొల్లాపూర్‌లో భారీ బహిరంగ సభ నిర్వహించాలని.. ఆ సభకు ప్రియాంకా గాంధీని ముఖ్య అతిథిగా ఆహ్వానించాలని భేటీలో నిర్ణయం తీసుకున్నారు. దీనిపై ఇప్పటికే ఏఐసీసీ అనుమతి కూడా లభించినందున సభ ఏర్పాట్లపైనా చర్చించారు. అనంతరం ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల గర్జన పేరుతో ఆగస్టు 15న బహిరంగ సభ నిర్వహించాలని నిర్ణయించారు. దానికి ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను ఆహ్వానించాలని.. ఆ వేదికపైనే ఆయా వర్గాలకు కాంగ్రెస్ పార్టీ ఏం చేస్తుందన్న డిక్లరేషన్లు ప్రకటించాలని తీర్మానించారు. ఈ సమావేశంలో పీసీసీ అధ్యక్షుడు ఎ.రేవంత్‌రెడ్డి, సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క, ఎంపీలు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సీనియర్ నేతలు పొన్నాల లక్ష్మయ్య, వీహెచ్, మధుయాష్కీ, షబ్బీర్‌అలీ, దామోదర రాజనర్సింహ, జీవన్‌రెడ్డి, అంజన్‌కుమార్, జానారెడ్డి, రేణుకాచౌదరి, సంపత్‌కుమార్, శ్రీధర్‌బాబు, జగ్గారెడ్డి, మహేశ్‌కుమార్‌గౌడ్, బలరాం నాయక్, చిన్నారెడ్డి, పార్టీ వ్యూహకర్త సునీల్ కనుగోలు తదితరులు పాల్గొన్నారు.

**85 చోట్ల బలంగా.. ఎక్కడెక్కడ ఎలా?**

పీఏసీ భేటీలో రాష్ట్ర కాంగ్రెస్ వ్యూహకర్త సునీల్ కనుగోలు 'మిషన్–2023' పేరుతో సుదీర్ఘంగా ఓ ప్రజెంటేషన్ ఇచ్చారు. చాలా నియోజకవర్గాల్లో పార్టీ బలంగా ఉన్నప్పటికీ, కొన్నిచోట్ల అనివార్య బలహీనతలు పార్టీని వెంటాడుతున్నాయని స్పష్టం చేశారు. లోక్‌సభ నియోజకవర్గాలు, వాటి పరిధిలోని అసెంబ్లీ స్థానాల ప్రాతిపదికన పార్టీ పరిస్థితిని వివరించారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. రాష్ట్రంలో 12 లోక్‌సభ నియోజకవర్గాల పరిధిలో ఉన్న 85 అసెంబ్లీ స్థానాల్లో కాంగ్రెస్ పరిస్థితి బాగానే ఉందని.. కానీ హైదరాబాద్, సికింద్రాబాద్, మల్కాజిగిరి, ఆదిలాబాద్, నిజామాబాద్ లోక్‌సభ స్థానాల్లో చాలాచోట్ల కనీస పోటీ ఇచ్చే స్థితిలో కూడా పార్టీ లేదని పేర్కొన్నారు. ఈ నియోజకవర్గాలకోసం ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని సూచించారు. పార్టీ తరఫున ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన పలు అంశాలను ఆయన సూచించగా.. వాటిపై ప్రచార కమిటీలో చర్చించి తగిన నిర్ణయం తీసుకోవాలని పీఏసీ భేటీ నిర్ణయించింది. ఇక భేటీలో మాజీ ఎంపీ రేణుకా చౌదరి మాట్లాడుతూ.. దశాబ్దాలుగా పార్టీలో పనిచేస్తున్న నేతలకు తగిన గుర్తింపు ఇవ్వడం లేదని, పార్టీ నేతలతో మర్యాదగా నడుచుకోవాల్సిన కొందరు కనీసం తమ ఫోన్లు ఎత్తడం లేదని పేర్కొన్నట్టు తెలిసింది. మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య మాట్లాడుతూ.. పార్టీ పక్షాన ప్రజలకు హామీలివ్వడంతోపాటు గత తొమ్మిదేళ్లలో బీఆర్ఎస్ చేసిన అన్యాయాలను ప్రజలకు వివరించేందుకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించినట్టు సమాచారం. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. రానున్న 100రోజుల పాటు పార్టీ కేడర్ పూర్తిగా ప్రజల్లోనే ఉండేలా కార్యాచరణ రూపొందించాలని, ప్రతి లోక్‌సభ నియోజకవర్గంలో రెండు అసెంబ్లీ సీట్లను బీసీలకు ఇచ్చేలా ప్లాన్ చేయాలని సూచించినట్టు తెలిసింది. వీరితో పాటు ఇతర నేతలు ప్రస్తావించిన పలు అంశాలపైనా పీఏసీ సమావేశంలో చర్చించారు.

**బీఆర్ఎస్ వైఫల్యాలను ఎండగడతాం: మధుయాష్కీ, షబ్బీర్‌అలీ**

పీఏసీ సమావేశం అనంతరం ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ, పీఏసీ కన్వీనర్ షబ్బీర్‌అలీ మీడియాతో మాట్లాడారు. సమావేశంలో తీసుకున్న పలు నిర్ణయాలను వెల్లడించారు. తొమ్మిదేళ్లుగా బీఆర్ఎస్ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, బడుగు, బలహీన వర్గాలకు అన్యాయం చేస్తోందని ఆరోపించారు. తాము అధికారంలోకి వచ్చాక ఆయా వర్గాలకు న్యాయం చేస్తామని చెప్పారు. చేయూత పేరుతో తాము ప్రకటించిన రూ.4వేల పింఛన్ హామీ ఇప్పుడే ప్రభావం చూపిస్తోందని.. తమ హామీని చూసి రాష్ట్ర ప్రభుత్వం వికలాంగులకు రూ.4,016 పింఛన్‌ను అమల్లోకి తెచ్చిందని చెప్పారు. ఇక షబ్బీర్‌అలీ మాట్లాడుతూ.. ఇతర పార్టీల నేతల చేరికలపై పార్టీలో భిన్నాభిప్రాయాలు ఉంటాయని, వాటిపై పార్టీలో అంతర్గతంగా మాట్లాడుకుని పరిష్కరించుకుంటామని చెప్పారు.

# పొత్తుల కోసం వెంపర్లాడం

- బీఆర్ఎస్‌తో చర్చలు జరగలేదు
- తెలంగాణలో 5 సీట్లపై ప్రత్యేక దృష్టి
- మునుగోడులో సీపీఐ వల్లే బీఆర్ఎస్ గెలిచింది: చాడ



హుస్నాబాద్: బీఆర్ఎస్ పార్టీతో పొత్తులపై ముఖాముఖి చర్చలు జరగలేదని, పొత్తులకోసం వెంపర్లాడబోమని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి స్పష్టం చేశారు. ఏ పార్టీతో పొత్తు ఉన్నా.. లేకున్నా వచ్చే ఎన్నికల్లో సీపీఐ ఒంటరిగా పోటీ చేస్తుందని ఆయ న తెలిపారు. ఆదివారం ఆయన సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో విలేకరులతో మాట్లాడుతూ మునుగోడులో సీపీఐ వల్లే బీఆర్ఎస్ అభ్యర్థి గెలిచారన్నారు. సీఎం కేసీఆర్ ఆనాడు తమను పిలి చి పొత్తుపెట్టుకున్నారని, వ చ్చే ఎన్నికల్లోనూ ఆయన పిలిస్తేనే పొత్తులపై చర్చిస్తామని చెప్పారు. బీఆర్ఎస్‌తో తమ స్నేహబంధం ముగియలేదన్నారు. రాష్ట్రంలో సీపీఐ, సీపీఎం కలిసే పయనిస్తాయని తేల్చిచెప్పారు. తెలంగాణలో 15 సీట్లలో సీపీఐ బలంగా ఉందని, 5 సీట్లపై ప్రత్యేక దృష్టి పెట్టామని తెలిపారు. కొత్తగూడెం, వైరా, పెద్దపల్లి, మునుగోడు, హుస్నాబాద్ నియోజకవర్గాల్లో తప్పకుండా పోటీ చేస్తామని వెల్లడించారు.

**ఆర్టీసీ డిపోల ఎదుట రౌండ్ టేబుల్ సమావేశాలు**

ఆర్టీసీ కార్మికులకు ఇచ్చిన హామీలను నేరవేర్చాలని ఈనెల 26 నుంచి 30వ తేదీ వరకు డిపోల ఎదుట తమ పార్టీ ఆధ్వర్యంలో సేవ్ ఆర్టీసీ నినాదంతో రాష్ట్రవ్యాప్తంగా రౌండ్‌టేబుల్ సమావేశాలు నిర్వహించనున్నట్లు చాడ వెంకటరెడ్డి తెలిపారు. ఈ సమావేశాలకు అన్ని పార్టీలు, ప్రజా సంఘాలను ఆహ్వానిస్తామన్నారు. మునుగోడు ఉప ఎన్నిక సమయంలో ఆర్టీసీ కార్మికులకు వేతనాలు పెంచుతామని మంత్రులు హరీశ్‌రావు, కేటీఆర్ హామీ ఇచ్చారని, కానీ ఇంత వరకు ఇచ్చిన హామీని నేరవేర్చలేదని చాడ విమర్శించారు. వచ్చే నెల 7న ప్రజాసమస్యలపై కలెక్టరేట్ల ముట్టడి కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. బీసీ, దళితబంధు లబ్ధిదారుల ఎంపిక బాధ్యత ఎమ్మెల్యేలకు ఇవ్వడం సరికాదన్నారు. గ్రామసభల ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కాగా, మణిపూర్ సంఘటనపై ఈనెల 25న దేశవ్యాప్తంగా సీపీఐ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు చాడ తెలిపారు.

# ఏం చేస్తారో?

▶ మొదటి పేజీ తరువాయి

పైకప్పుల నుంచి పెచ్చులు ఊడిపడుతున్నాయని, తరగతిలో విద్యార్థులు ఉంటే ప్రమాదమని ఎంఈఓలు కూడా డీఈఓలకు చెప్పారు. కొన్ని పాఠశాలల ప్రాంగణంలో వరద నీరు ఇంకా నిల్వ ఉందని, విద్యార్థులు పరుగెడితే జారిపడే ప్రమాదం ఉందంటున్నారు. కొన్ని స్కూళ్లలో గోడల్లో చెమ్మ ఉందని, ఫలితంగా విద్యుత్ బోర్డుల్లోంచి గోడలకు కరెంట్ వచ్చే ప్రమాదం ఉంటుందని చెప్పారు. ఏ ఒక్క విద్యార్థికి సమస్య తలెత్తినా ప్రభుత్వం ఇబ్బందుల్లో పడుతుందని ఉన్నతాధికారులు భావిస్తున్నారు. సెలవు రోజుల్లో కూడా ప్రైవేట్ స్కూళ్లు మాత్రం గుట్టుచప్పుడు కాకుండా తరగతులు నిర్వహించాయని చెబుతున్నారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పుస్తకాల పంపిణీలో ఆలస్యమైందని, దీంతో బోధన కుంటుపడిందని, ఇంకా సెలవులు పొడిగించడం సరికాదని కొంతమంది టీచర్లు అంటున్నారు. ప్రమాదంగా ఉండే స్కూళ్లను గుర్తించి, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తే నష్టమేంటని ప్రశ్నిస్తున్నారు.

**సాంకేతిక సమస్యలెన్నో....**

వర్షాల కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం, నెట్‌వర్క్ కనెక్షన్‌లో ఇబ్బందులు తలె త్తున్నాయి. దీంతో దోస్త్, ఇంజనీరింగ్ సీట్లకు సంబంధించి సెల్ఫ్ రిపోర్టింగ్‌కు అవాంతరా లు ఎదురవుతున్నాయి. ఎంసెట్ రెండోవిడత కౌన్సెలింగ్ ఈ నెల 24వ తేదీ నుంచి ప్రారంభం కావాలి. మొదటి విడత కౌన్సెలింగ్‌లో సీట్లు పొందిన విద్యార్థులు సెల్ఫ్ రిపోర్టింగ్ చేసే గడువు ఆదివారంతో ముగిసింది. అయితే చాలామంది విద్యార్థులు రిపోర్ట్ చేయలేకపోయారని అధికారులు చెబుతున్నారు. ఈ కారణంగా రెండోవిడత కౌన్సెలింగ్ వాయిదా వేయాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. సెల్ఫ్ రిపోర్టింగ్ గడువూ పొడిగించాలని కోరుతున్నాయి. డిగ్రీ కళాశాల ప్రవేశాలకు సంబంధించి దోస్త్‌కు సెల్ఫ్ రిపోర్టింగ్ తేదీ ఈ నెల 26తో ముగుస్తుంది. జిల్లా, మండల కేంద్రాలకు వెళ్లి నెట్‌లోనో, లేదా కాలేజీకి నేరుగా వెళ్లి రిపోర్టు చేసేందుకు అనేక సమస్యలున్నాయని విద్యార్థులు చెబుతున్నారు. వర్షాల వల్ల రవాణా వ్యవస్థ దెబ్బతిన్నదని, వేరే ప్రాంతాలకు వెళ్లడం కష్టమవుతోందని అంటున్నారు. ఈ కారణంగా దోస్త్ రిపోర్టింగ్ గడువు పొడిగించే యోచనపై అధికారులూ ఏ నిర్ణయం తీసుకోలేకపోతున్నారు.



# ..'లక్ష'ణమైన పథకం

▶ మొదటి పేజీ తరువాయి

వెనుకబడిన తరగతుల్లోని కులవృత్తిదారులకు రూ.లక్ష ఆర్థిక సాయం పథకాన్ని ప్రవేశపెట్టింది. లబ్ధిదారుల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించింది. వీటిని క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు కొన్ని నిబంధనలు విధించింది. దరఖాస్తులను పరిశీలించి అర్హతలను నిర్ధారించి లబ్ధిదారులకు రూ.లక్ష చెక్కులు ఇస్తోంది. మైనార్టీలకు ఆర్థిక సాయం పథకానికి సైతం ఇవే నిబంధనలు వర్తిస్తాయని ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది.

- ఓబీఎంఎంఎస్ పోర్టల్ ద్వారా దరఖాస్తులను స్వీకరిస్తారు. 2022–23 సంవత్సరంలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను ఈ పథకం కింద పరిశీలిస్తారు. వీటినే 2023–24 ఆర్థిక సాయం కింద మార్పు చేసి అర్హతల మేరకు స్టేట్ మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా సాయమందిస్తారు.
- క్రిస్టియన్లకు సంబంధించి తెలంగాణ స్టేట్ క్రిస్టియన్ మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా దరఖాస్తులను స్వీకరించి అర్హతలను నిర్ధారిస్తారు.
- ఒక కుటుంబం నుంచి ఒక దరఖాస్తుకు మాత్రమే ఆర్థిక సాయాన్ని అందిస్తారు. దరఖాస్తుదారుల వయసు 2023 జూన్ 2 నాటికి 21 ఏళ్ల నుంచి 55 సంవత్సరాల మధ్య ఉండాలి.
- జిల్లాస్థాయి పర్యవేక్షణ కమిటీస్థాయిలోనే అర్హుల ఎంపిక జరుగుతుంది. ఈ కమిటీకి జిల్లా కలెక్టర్ చైర్మన్‌గా ఉంటారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనుమతితో కలెక్టర్ జాబితాను ఖరారు చేస్తారు. అర్హుల జాబితాను టీఎస్ఎంఎఫ్‌సీ వెబ్‌సైట్‌లో ప్రదర్శిస్తారు.

**మైనార్టీల సంక్షేమమే మా లక్ష్యం: సీఎం కేసీఆర్**

రాష్ట్రంలోని మైనార్టీల సంక్షేమమే తమ ప్రభుత్వ లక్ష్యమని సీఎం కేసీఆర్ ఉద్ఘాటించారు. బీసీలకు అందిస్తున్న తరహాలోనే మైనారిటీలకూ రూ.లక్ష ఆర్థిక సాయాన్ని పూర్తి సబ్సిడీతో ఇవ్వనున్నట్లు చెప్పారు. మైనారిటీల ఆర్థిక స్వావలంబన దిశగా మరో చారిత్రక ఘట్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆవిష్కరించిందన్నారు. కులమతాలకు అతీతంగా పేదరికాన్ని పారద్రోలాలనే దార్శనికతతో ప్రభుత్వం పనిచేస్తోందని, ఇందులో భాగంగా ఇప్పటికే అన్ని వర్గాల పేదలకు ప్రభుత్వం తోడ్పాటు అందిస్తోందని పేర్కొన్నారు. విద్య, ఉపాధి సహా పలు రంగాల్లో ఇప్పటికే వివిధ పథకాలను అమలు చేస్తూ మైనార్టీల్లోని వెనుకబాటును తొలగించేందుకు కృషి చేస్తోందన్నారు. రాష్ట్రంలో గంగా జమునా తహజీబ్‌ను కాపాడే ప్రక్రియ కొనసాగుతూనే ఉంటుందని స్పష్టం చేశారు. అర్హులైన క్రిస్టియన్లకు క్రిస్టియన్ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా, ముస్లిం, సిక్కు, బుద్ధిస్ట్, జైన్, పార్శీ మతాలకు, మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా రూ.లక్షను ప్రభుత్వం అందిస్తోందని సీఎం చెప్పారు.

## ధర్మదర్శనం క్యూ నుంచే రూ.150 టికెట్ భక్తులు కూడా..

- యాదాద్రి అధికారుల తీరుతో భక్తుల ఆగ్రహం



యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో ధర్మదర్శనం క్యూలైన్ సమీపం నుంచి రూ.150 టిక్కెట్ దర్శనాలకు భక్తులను పంపనున్నారు. ఇప్పటివరకు కొండపైన ఉత్తర రాజగోపురం నుంచి, తూర్పు రాజగోపుర ప్రధాన ద్వారం నుంచి రూ.150 వీఐపీ టిక్కెట్ దర్శనాలకు భక్తులకు అనుమతించే వారు. కానీ ఇప్పుడు ధర్మదర్శనం క్యూలైన్ సమీపం నుంచే రూ.150 టిక్కెట్ దర్శనాలకు భక్తులను పంపనున్నారు. క్యూకాంప్లెక్స్ నుంచి తూర్పు రాజగోపురం ముందు ఉన్న స్వర్ణ క్యూలైన్లలో ఏర్పాటు చేసిన ప్రత్యేక మార్గంలో ఈ రూ.150 టిక్కెట్ భక్తులను తీసుకువచ్చి కల్యాణ మండపం ముందు నూతనంగా ఏర్పాటు చేసిన క్యూలైన్‌లోకి అనుమతిస్తారు. అక్కడి నుంచి తిరిగి మళ్లీ బంగారు క్యూలైన్‌లోకి భక్తులను పంపి అష్టభుజి ప్రాకార మండపం, తూర్పు రాజగోపురం ద్వారం గుండా భక్తులను ప్రధానాలయంలోకి తీసుకెళ్తారు. ఇదిలా ఉండగా, ధర్మదర్శనంతో పాటు రూ.150 టిక్కెట్ కొనుగోలు చేసే భక్తులను ఒకే మార్గంలో పంపడం పట్ల భక్తుల నుంచి విమర్శలు వస్తున్నాయి. అధికారులు ఆదివారం ప్రయోగాత్మకంగా ఈ విధానం పాటించడంతో క్యూలైన్లలో వృద్ధులు, చిన్నారులు ఇబ్బందులు పడ్డారు. ఉత్తర రాజగోపురం, అష్టభుజి ప్రాకార మండపంలో నుంచి రూ.150 టిక్కెట్ కొనుగోలు చేసిన భక్తులను పంపించాలని భక్తులు అధికారులను కోరుతున్నారు.

**యాదాద్రిలో భక్తుల రద్దీ**

యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో భక్తుల రద్దీ నెలకొంది. ధర్మదర్శనానికి రెండు గంటలు, వీఐపీ దర్శనానికి సుమారు 30 నిమిషాల సమయం పట్టినట్లు భక్తులు తెలిపారు.

## అనుమానం పెనుభూతమై..

- భార్యను హతమార్చిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు



పార్వతి(ఫైల్)

ఖమ్మంఅర్బన్: భార్యపై అనుమానం పెంచుకున్న ఓ వ్యక్తి చివరికి ఆమెను కడతేర్చాడు. ఖమ్మం నగరంలోని జయనగర్ కాలనీలో ఈ ఘటన జరిగింది. ఖమ్మం అర్బన్ సీఐ శ్రీహరి కథనం ప్రకారం.. రఘునాథపాలెం మండలం గణేశ్వరం గ్రామానికి చెందిన భూక్యా సీతారాములుకు రఘునాథపాలేనికి చెందిన భూక్యా పార్వతి (43)తో 22 ఏళ్ల క్రితం వివాహమైంది. సీతారాములు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నాడు. వీరికి ఇద్దరు మగ పిల్లలు కాగా, హైదరాబాద్, విశాఖపట్నంలో చదువుకుంటున్నారు. కొంతకాలంగా పార్వతిపై అనుమానంతో సీతారాములు తరచూ వేధిస్తుండేవాడు. ఇది తట్టుకోలేని పార్వతి పోలీసులను ఆశ్రయించడంతో పాటు విడాకులు ఇప్పించాలని స్థానికులను కోరింది. దీంతో స్థానిక పెద్దలు సీతారాములును పిలిపించి మాట్లాడినప్పుడల్లా ఇకపై బాగా చూసుకుంటానని చెప్పి భార్యను తీసుకెళుతూ ఉండేవాడు. మూడు నెలల క్రితం కూడా ఇద్దరి మధ్య ఘర్షణ జరగ్గా, సీతారాములు భార్యను హతమార్చేందుకు యత్నించాడు. దీంతో పార్వతి తప్పించుకుని పుట్టింటికి వెళ్లింది. ఇటీవలే తోటి ఉద్యోగులను తీసుకెళ్లి మాయమాటలు చెప్పి పెద్ద మనుషుల సమక్షంలో పార్వతిని ఒప్పించి తిరిగి ఇంటికి తీసుకొచ్చాడు. కాగా, గత మూడు రోజులుగా భార్యాభర్తల మధ్య మళ్లీ గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో శనివారం రాత్రి 11 గంటల సమయంలో భార్యను హత్యచేసిన సీతారాములు ఇంటి నుంచి బైక్‌పై పరారయ్యాడు. మృతురాలి సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.



నేను ఆలోచించడానికి ప్రయత్నిస్తున్నాను.
నన్ను వాస్తవాలతో గందరగోళానికి గురిచేయొద్దు.
– ప్లేటో



సాక్షి

సోమవారం, 24 జూలై 2023

# బతుకు పండుగ

లోకంలో దుఃఖం మాత్రమే ఉందా? లేదు, సంతోషం కూడా ఉంది. శత్రుత్వపు చేదు మాత్రమే ఉందా? లేదు, ఆపదలో ఆదుకునే స్నేహమాధుర్యమూ ఉంది. సమరమే కాదు, శాంతీ; సంఘర్షణే కాదు, సామరస్యమూ; భయబీభత్సాలే కాదు; కరుణారౌద్రాలూ ఉన్నాయి. ఒక్కోసారి ప్రళయ తాండవంతో భయపెట్టే ప్రకృతిలోనే, సేదదీర్చే అందాలూ, ఆహ్లాదాలూ ఉన్నాయి. కానీ ఎంత సేపూ పెద్ద పెద్ద కష్టాలనే ఊహించుకుంటూ చిన్న చిన్న సంతోషాలను విస్మరిస్తాం. జీవితాన్ని ముళ్ళకంపగా భావించుకుంటూ పక్కనే ఉన్న మల్లెపొదల గుబాళింపును గమనించలేకపోతాం. జీవించడం కోసం చేసే ప్రయత్నంలో మనసారా జీవించడాన్ని మరచిపోతాం.

మన పక్కనే ఉన్న మంచినీ, మానవత్వాన్నీ గుర్తించడంలో ఎలా విఫలమవుతామో ఒక చక్కని కథలో రావిశాస్త్రి చిత్రిస్తాడు. ఆ కథలో ఇద్దరు మిత్రులుంటారు. ఒకతను ఎప్పుడూ ఏదో కష్టంలో చిక్కుకుని కుంగిపోతూ ఉంటాడు; నిరాశానిస్పృహలకు ప్రతిరూపంగా మారి జీవితంపై విరక్తుడవుతుంటాడు. రెండో వ్యక్తి ప్రతిసారీ అతనికి చేయందించి సమస్య నుంచి గట్టెక్కిస్తూ ఉంటాడు. అలా అతను తేరుకున్న ఓ రోజున తన ఖర్చుతో సినిమాకు తీసుకెడతాడు. ఆ సినిమాలోని ప్రతినాయకుడు నాయికానాయకులను పెడుతున్న ముప్పుతిప్పలు చూసి, లోకంలో ఎక్కడా మంచితనం, మానవత్వమే లేవంటూ అతను భారంగా నిట్టూర్చుతాడు. పక్కనే ఉన్న మిత్రుడు అతని వైపు ఒకసారి వింతగా చూసి మనసులోనే నవ్వుకుంటాడు.

ఇప్పుడు కొంత మారి ఉండచ్చు కానీ, నిన్నమొన్నటివరకు పెళ్లి అనగానే కట్నాలు, కయ్యాలు, అలకలు, మాటపట్టింపులు, మనస్పర్ధలే గుర్తుకొచ్చేవి. గుండె బరువెక్కించే ఇలాంటి అలవాటు పడిన చిత్రణకు భిన్నంగా అడుగడుగునా ఆహ్లాదం నింపేలా ఎవరైనా పెళ్లి కథను నడిపిస్తే అది మండువేసవిలో హఠాత్తుగా వీచిన మలయానిలంలా అలరిస్తుంది. 'వసుంధర' రాసిన 'పెళ్ళిచేసి చూడు' అనే నవల అలాంటి ఓ అరుదైన ఆశ్చర్యం. అందులో ముగ్గురు అన్నదమ్ములు, వారి భార్యలు ఆడబడచు పెళ్లిని తలకెత్తుకుంటారు. అన్ని విషయాలూ కలసి చర్చించుకుంటారు, సమష్టిగా నిర్ణయాలు తీసుకుంటారు, సమానంగా బరువు బాధ్యతలు పంచుకుంటారు, సంఘటితంగా అడుగులు వేస్తారు. మగపెళ్ళివారి నుంచి సాధారణంగా ఎదురయ్యే సమస్యలే వస్తాయి. జయప్రదంగా పెళ్లి చేయడం ఒక్కటే లక్ష్యంగా వాటిని తెలివిగా, ఓర్పుగా పరిష్కరించుకుంటారు. ఎలాంటి క్లిష్టపరిస్థితిలోనూ ఆందోళనకు లోనుకారు; ఒకరిపై ఒకరు లోక్తులు విసురుకుంటూ, ఒకరి నొకరు ఆటపట్టించుకుంటూ పరిసరాలను సంతోషభరితం చేసుకుంటారు. కల్యాణాన్నే కాదు, కల్యాణం చేయించిన తీరునూ కమనీయం చేస్తారు.

ఈ 'పెళ్ళిచేసిచూడు' నమూనా పెళ్లికే కాదు; తమలో తమకున్న అన్ని విభేదాలనూ పక్కన పెట్టి పదిమందీ ఉమ్మడిగా నిర్వర్తించాల్సిన ఏ బాధ్యతకైనా వర్తిస్తుంది. ఉదాహరణకు, దేశాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేయడమన్న ఉమ్మడి లక్ష్యం దిశగా విజయవంతంగా నడిపించడంలో అధికారపక్షానికీ, ప్రతిపక్షాలకూ కూడా చక్కని ఒరవడి అవుతుంది.

గొప్ప తాత్విక గాంభీర్యమూ, బహిరంతర్ఘర్షణా, జీవితం గురించిన చిక్కు ప్రశ్నలూ, ఒడుదొడుకులూ ఉన్న రచనల్లోనూ, బరువైన పాత్రల సరసనే, వాతావరణాన్ని తేలిక చేసి ఉల్లాసపరిచే పాత్రలూ కనిపిస్తూ ఉంటాయి. అవి జీవితం తాలూకు అన్ని పార్శ్వాలనూ స్పృశించే రచయిత దృష్టివైశాల్యాన్ని పట్టి చూపుతాయి. బుచ్చిబాబు 'చివరికి మిగిలేది' నవలలోని జగన్నాథం అలాంటి పాత్ర. సమస్యలకు అతీతంగా, దేనిమీదా ఎలాంటి ఫిర్యాదూ లేకుండా, సరదాగా, స్నేహంగా, హాస్యంగా ప్రవర్తించే జగన్నాథం చిన్నపాత్రే అయినా నాయకుడు దయానిధితో సమానంగా గుర్తుండిపోతాడు. గమనించే చూపే ఉండాలి కానీ, అలాంటి వ్యక్తులు మన నిజజీవితంలోనూ మన చుట్టుపక్కల తారసపడుతూనే ఉంటారు. తను రచయితా, గొప్ప చదువరీ కాకపోయినా ప్రతి సాహిత్యసమావేశంలోనూ, రచయితల గోష్ఠుల్లోనూ విలక్షణమైన వాక్చాతుర్యంతో తన ఉనికిని ప్రముఖంగా చాటుకునే సంకు పాపారావు అనే రావిశాస్త్రి మిత్రుని గురించి వైజాగ్‌లోనూ, బయటా కూడా సాహితీ ప్రముఖులు ఇప్పటికీ కథలు కథలుగా చెప్పుకుంటారు.

తమ ఉజ్జ్వల వ్యక్తిత్వంతో శత్రుమిత్రుల తేడా లేకుండా అందరి మధ్యా సమానంగా తళుకులీనే పాత్రలూ ఆ యా విశిష్ట రచనల్లో కనిపిస్తాయి. అమెరికా అంతర్యుద్ధం నేపథ్యంగా మార్గరెట్ మిచెల్ రచించిన 'గాన్ విత్ ద విండ్' నవలలోని మెలనీ పాత్ర అలాంటిది. చాలా అర్భకంగా, అమాయకంగా ఉండే మెలనీ, ప్రేమించడమే తప్ప ద్వేషించడం తెలియని తన ఉదాత్త వ్యక్తిత్వంతో ఆ నవలలోని ఇతర ప్రధాన స్త్రీ, పురుషపాత్రలను మించి ఎంతో ఎత్తుకు ఎదిగిపోతుంది. అభద్రత, అల్లకల్లోలం, ఉద్రిక్తత, స్థానభ్రంశం, లేమి నిండిన ఆ యుద్ధ వాతావరణం వజ్రం లాంటి ఆమె వ్యక్తిత్వానికి మరింత సానపట్టి కొత్త కాంతుల్ని ఆవిష్కరింపజేస్తుంది. యుద్ధం వరకే శత్రుత్వమని చెప్పి స్వపక్షంతో ఒంటరి పోరాటం చేసి, శత్రు సైనికుల సమాధుల వద్ద కూడా మెలనీ పుష్ప గుచ్ఛాలు ఉంచి వస్తుంది.

ఇలాంటి పాత్రలూ, వ్యక్తులూ ప్రపంచాన్ని మరింత ఆశావహంగానూ, వాసయోగ్యంగానూ రూపిస్తారు. బతుక్కి ఓ అర్థాన్ని, పరమార్థాన్ని సంతరిస్తారు. ప్రేమనూ, స్నేహాన్నీ ఇచ్చిపుచ్చుకుని జీవితాన్ని ఉత్సవభరితం చేసుకోడానికి స్ఫూర్తినిస్తారు. మిట్టపల్లాల చీకటిదారిలో దీపస్తంభాలవుతారు.

# కనీస స్పందన కరవైందా?

కామెంట్



కరణ్ థాపర్

**మణిపురలో మహిళలను నగ్నంగా ఊరేగించి, తర్వాత వారిపై అత్యాచారం జరిపిన ఘటన తాలూకు వీడియో దేశాన్ని దిగ్భ్రాంతికి లోనుచేసింది. దశాబ్దం క్రితం జరిగిన భయంకరమైన ఘటన 'నిర్భయ' లాగా ఇదీ మన అంతరాత్మలోకి చొచ్చుకుపోయింది. మే 4న జరిగినట్టు చెబుతున్న ఈ ఘోరమైన ఘటన తాలూకు వీడియో రెండు నెలల తర్వాత బయటికి రావడం ఒకటైతే, ఆ ఘటన పట్ల ప్రభుత్వం, అధికారులు, పోలీసుల స్పందన ఆందోళన కలిగిస్తోంది. దాన్ని కనీస స్పందన అని కూడా అనలేం. అది మిన్నకుండటమా? పట్టించుకోకపోవడమా? బాధ్యతారాహిత్యమా? వారి వివరణలను బట్టి చూసినా ఎన్నో ప్రశ్నలు తలెత్తుతాయి. ఇవి కూడా మనలో ఆందోళన రేకెత్తించేవే!**

మణిపురలో జరిగిన హింసాత్మక ఘటనలను ఏ విశేషణాలతోనూ వివరించడం సాధ్యం కాదు. అది ఏ వర్ణనకూ లొంగనిది. దశాబ్దం క్రితం జరిగిన మరో భయంకరమైన ఘటన 'నిర్భయ' లాగా ఇదీ మన అంతరాత్మలోకి చొచ్చుకుపోయింది. అయితే మే 4వ తేదీన జరిగిన అత్యాచారాలు గర్హనీయమైన ఒక సంఘటన మాత్రమే. రెండు వేర్వేరు వర్గాల నుంచి సేకరించిన సమాచారాన్ని బట్టి చూస్తే, కనీసం ఇంకో ఐదు ఇలాంటివి చోటు చేసుకున్నట్లు తెలుస్తోంది.

రానున్న రోజుల్లో మన దృష్టి మొత్తం ఆ ఘటనల తాలూకూ బాధాకరమైన వివరాల వైపు వెళుతుంది. నా భయం ఏమిటంటే... మణిపుర ఘోరాలు ఇంకా ఎన్నో మనం చూడాల్సి వస్తుందన్నది! అయితే ప్రస్తుతానికి మే 4వ తేదీ ఘటనలపై అధికారిక వివరణలు లేవనెత్తుతున్న ప్రశ్నలకే పరిమితమవుదాం. ఇవి కూడా మనలో ఆందోళన రేకెత్తించేవే!

బాధిత మహిళల్లో చిన్న వయసు మహిళ 'ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్' పత్రిక ప్రతినిధితో, ''దుండగుల గుంపు మా ఊరిపై దాడి చేస్తున్నప్పుడు పోలీసులు అక్కడే ఉన్నారు'' అని చెప్పింది. దీనర్థం మనల్ని రక్షించాల్సిన వాళ్లే అక్కడ నిలబడి మౌన ప్రేక్షకులయ్యారా? ''పోలీసులే మమ్మల్ని వారికి (దుండగులకు) అప్పగించారు'' అని కూడా ఆ అమ్మాయి వాపోయింది. అంటే, తక్కువ సంఖ్యలో ఉన్నా సరే, పోలీసులు బలహీనంగా చేతులెత్తేశారు అని అర్థమా? అరాచక శక్తుల దాడి నుంచి పోలీసులు మహిళలను రక్షించలేదు సరికదా, వారు వారి భద్రత, ప్రాణాల సంగతి మాత్రమే చూసుకున్నారు. మనం వారి నుంచి ఆశించేది అది కాదు కదా?

మహిళలను దుండగులకు అప్పగించిన తరువాతైనా పోలీసులు అదనపు బలగాలను ఎందుకు రప్పించలేదు? అలాంటి ఘటనలు జరిగినప్పుడు పోలీసుల తక్షణ తప్పనిసరి ప్రతిస్పందన ఇలాగే కదా ఉండాలి? ఇది కూడా జరగలేదు. పైగా ఆ బాధిత మహిళలు దగ్గరలోని ఆసుపత్రిని చేరేందుకు దాదాపు ఏడు కిలోమీటర్లు కాలినడకన వెళ్లాల్సి వచ్చింది! కనీసం ఇప్పుడైనా పోలీసులు తిరిగివచ్చి, ఆ మహిళలకు కాస్తంత చేయూతనివ్వాల్సింది కదా?

మే నాలుగున జరిగిన ఘటనలకు సంబంధించి తొలి జీరో ఎఫ్ఐఆర్ నమోదైంది ఆ నెల 18వ తేదీన. రెండోది జూన్ 21వ తేదీన.



కానీ దాడులకు పాల్పడిందెవరో తెలియని కారణంగా తాము ఏ చర్య కూడా తీసుకోలేకపోయామని పోలీసులు అంటున్నారు. నిజంగానా? తాము ఎవరికి ఆ మహిళలను అప్పగించామో కూడా గుర్తు పట్టలేకపోయారా? వారి ముఖాలు మరచిపోయారా? దుండగుల గుంపులో కొందరిని తాను గుర్తుపట్టగలనని బాధిత యువ మహిళ 'ఇండియన్ ఎక్స్‌ప్రెస్'కు తెలిపింది. అందులో తన సోదరుడి స్నేహితుడూ ఉన్నాడని పేర్కొంది. పోలీసులు చర్య తీసుకునేందుకు ఈ సమాచారమూ సరిపోలేదా? నిజమేమిటంటే... పోలీసులు ఆ బాధిత మహిళ వాఙ్మూలాన్ని ఇప్పటివరకూ రికార్డే చేయలేదు.

సరే... ఇదంతా జరిగిన తరువాత కనీసం ముఖ్యమంత్రి బీరేన్ సింగ్ అయినా తగిన చర్యలు తీసుకునే ప్రయత్నం చేశారా? వీడియో చూసిన వెంటనే తనకు తానుగా సూమోటో కేసుగా దీన్ని తీసుకున్నానని ఆయన చెప్పారు. ఎఫ్ఐఆర్ నమోదైన రెండు నెలలకు 'సూమోటో' కేసుగా తీసుకోవడం ఏమిటి?

మే నాలుగు నాటి ఘటనల గురించి తాను జూన్ 19న మణిపుర ప్రధాన కార్యదర్శి, డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్(డీజీపీ)లకు సమాచారం ఇచ్చానని జాతీయ మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ వెల్లడించారు. మరి, ముఖ్యమంత్రికి ఎవరూ చెప్పలేదా? ప్రధాన కార్యదర్శి, డీజీపీ ఎందుకు ఏ రకమైన చర్యా తీసుకోలేదు?

ఇంకో విషయం. దాడులకు పాల్పడిందెవరో గుర్తించలేని కారణంగా తాము రెండు నెలలుగా ఏ చర్యా తీసుకోలేకపోయామని అధికార వర్గాలు చెబుతున్నాయి. కానీ (వీడియో బయటికి వచ్చిన) కేవలం 24 గంటల్లోనే నలుగురిని అరెస్ట్ చేశారు. రెండు నెలలుగా సాధ్యం కానిది 24 గంటల్లో మెరుపువేగంతో ఎలా చేయగలిగారు? ఈ ప్రశ్నకూ సమాధానం కావాలి.

చివరగా... జాతీయ మహిళా కమిషన్ విషయానికి వద్దాం. జూన్ 12న నార్త్ అమెరికన్ మణిపుర ట్రైబల్ అసోసియేషన్, ఇద్దరు మణిపుర మహిళా కార్యకర్తలు రాసిన లేఖ ఒకటి కమిషన్‌కు చేరింది. ''మే నెల నాలుగవ తేదీన కాంగ్పోక్పీ జిల్లాలోని బి. ఫైనామ్ గ్రామానికి చెందిన ఇద్దరు మహిళలను వివస్త్రలను చేశారు. నగ్నంగా ఊరేగించారు. కొట్టడం మాత్రమే కాకుండా చుట్టుముట్టిన మైతేయ్ మూక బహిరంగంగా మానభంగానికి పాల్పడింది. రాష్ట్రానికి చెందిన పోలీసులు ప్రేక్షకుల్లా ఉండిపోయారు. ఇద్దరు బాధితులు చురాచాంద్‌పూర్ జిల్లా శరణార్థి శిబిరాల్లో ఉన్నారు'' అని ఆ ఘటనలకు సంబంధించి నిర్దుష్టంగా, వివరంగా తెలిపారు. అయినాసరే... జాతీయ మహిళ కమిషన్ ఛైర్‌పర్సన్ రేఖా శర్మ తాను ఎలాంటి చర్య తీసుకోలేకపోయానని చెబుతూ, అందుకు కారణం అది సాధారణ సమాచారం కావడమనీ, నిర్దిష్టంగా ఫలానా ఘటన గురించిన సమాచారం లేదనీ అన్నారు. మణిపురలోని పరిస్థితుల దృష్ట్యా కమిషన్ తన ప్రతినిధి బృందాన్ని అక్కడకు పంపలేకపోయిందని కూడా ఆమె చెప్పారు. అయినప్పటికీ కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ మణిపురను సందర్శించగలిగారు. సామాజిక కార్యకర్త అన్నీ రాజా వెళ్లగలిగారు. కానీ శౌర్యగల కమిషన్ మాత్రం వెళ్లలేకపోయింది!

అయితే రేఖా శర్మకు ఇవ్వాల్సిన క్రెడిట్ ఇద్దాం. ఆమె మణిపుర ప్రధాన కార్యదర్శి, డీజీపీలకు లేఖనైతే రాశారు. వాళ్లేం చేయలేదు. ఈమె కూడా పట్టించుకోలేదు. దీనర్థం తాను చేయాల్సిన పని కనీస మాత్రంగానే చేశారనా? అది కూడా సంశయాస్పదమా?

తమ కామెంట్లు తమపైకే తిరగబడే సందర్భం వస్తుందని ఊహించని కొందరు రాజకీయ నేతలు చేసిన వ్యాఖ్యతో ముగిస్తాను. 2017లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉండగా... ప్రధానమంత్రి ఓ ట్వీట్ చేస్తూ...''రాష్ట్రంలో శాంతిని కాపాడలేని వారికి మణిపురను పాలించే అర్హత లేదు'' అన్నారు. ఈ వ్యాఖ్యతో నాకు ఎలాంటి విభేదాలూ లేవు!

*వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్*

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

### వీధి వింత



చాలాకాలం తర్వాత నా మనుమలు ఇండియాకు వెళ్లొచ్చారు. వచ్చాక వాళ్ల స్నేహితులతో 'యజమానులు లేని కుక్కల' గురించి ఆశ్చర్యంగా చెబుతున్నారు.

– కౌశిక్ బసు, ఆర్థికవేత్త

### గమనార్హం



భారత్‌లోని దాదాపు ఏ ముస్లిం రాజు, నవాబు, లేదా వారి కుటుంబ సభ్యులు కూడా హజ్ యాత్రకు వెళ్లలేదనే విషయాన్ని చాలా కొద్దిమందే గమనిస్తారు. మరోవైపు ఆరోగ్యం, స్థోమత ఉన్న ప్రతి ముస్లింకు అది తప్పనిసరి.

– సాకిబ్ సలీమ్, హిస్టారియన్

### మీ దేశమే!



నా భార్య: ఒమన్ నుంచి వెళ్లిపోవడానికి ముందు 19 ఏళ్లుగా ఆ నంబర్ వాడుతున్నాను. నేను మళ్లీ అదే నంబర్ తీసుకోవచ్చా? ఒమన్‌టెల్ (టెలికమ్యూనికేషన్స్ కంపెనీ) మహిళ: మాషా అల్లా, 19 ఏళ్లు! సుస్వాగతం. ఇది మీ దేశం, మీ ఇల్లు. మీరు మీ నంబర్ మళ్లీ తీసుకోవచ్చు.

– రమేశ్ రాధాకృష్ణన్, ముంబయికర్ మల్లు

### చేస్తున్నదైనా నమ్మాలిగా!



కనీసం తమ ఔషధాలను నమ్మి, వాటినే తమ పేషెంట్లకు ఇచ్చే హోమియోపతి వైద్యుల పట్ల నాకు ఎంతో గౌరవం ఉంది. ఏ హోమియోపతి వైద్యుడు కూడా (కొందరు ఆయుర్వేద వైద్యుల్లా) తమ మార్గానికి భిన్నమైన మందుల్ని రాయగా నేను ఎప్పుడూ చూడలేదు. అందువల్లే వాళ్ల మౌలికత కొనసాగుతూ వస్తోంది.

– ధ్రువ్ చౌహాన్, హెల్త్ యాక్టివిస్ట్

### పడిపోతారు!



మీరు యువకులైతే, ఒక మధ్యవయస్కుడిని 90ల్లో ఏ పాటలు విన్నాడో అడగండి. దానిమీద అరగంట మాట్లాడనీయండి. ఆసక్తిగా వింటున్నట్టు నటించండి. 'ఓ, ఎంత బాగున్నాయో, కూల్' అని చెప్పండి. తర్వాత మీకు ఎలాంటి సాయం కావాలన్నా వాళ్లను అడగండి.

– డెరెక్ గ్రే, కాలమిస్ట్

### పాలు చాలు!



పాలు, పాల ఉత్పత్తులను వాడటం మానేశాను. రెండు వారాల తర్వాత నేను మరింత బాగున్నాను. కడుపు ఆరోగ్యం మెరుగుపడింది. త్రేన్పులు లేవు. కొవ్వు కరిగింది. డబ్బులు కూడా పొదుపయ్యాయి. ఇప్పుడు నేను చక్కెర లేని బ్లాక్ కాఫీ మాత్రమే తాగుతున్నాను.

– నిర్మల్ జ్యోతి, ఆర్మీ డాక్టర్

### ఫస్ట్ ఇంప్రెషన్



సైకియాట్రీ రెసిడెంట్స్ కోసం: మీ క్యాబిన్‌లోకి మొదటిసారి ఏ కొత్త పేషెంట్ వచ్చినా, పది సెకన్ల పాటు ఏమీ చేయొద్దు. మాట్లాడటం కూడా వద్దు. తనకు తానుగా అలవాటు పడేదాకా గమనించండి. ఇదొక్కటే, మీరు ఆ వ్యక్తి మీద ఎప్పటికైనా చేయగలిగే తాజా, అప్రయత్న పరిశీలన. తర్వాత జరిగేదంతా మీకు, వ్యవస్థకు ఇచ్చే ప్రతిస్పందన మాత్రమే!

– అనిరుధ్ కాలా, సైకియాట్రిస్ట్

# ఇగిరిపోని స్నేహపరిమళం



ఘంటశాల నిర్మల

మంచి మిత్రుడు శ్రీరమణ శాశ్వత నిష్క్రమణ దిగ్భ్రాంతినీ, ఎంతో బాధనూ కలిగించింది. 'మిత్రుడు' అనటం సరియేనా! ఎందుకంటే, ఇద్దరం ఒకేసారి ఉద్యోగాల్లో చేరినా... వయసులో, సాహిత్య పరిజ్ఞానంలో, రచనానుభవంలో, రచనల విస్తృతి – వైవిధ్యాలలో – పత్రికారంగాన అడుగుపెట్టక ముందే జర్నలిస్టు సమూహాలలో ప్రసిద్ధుడుగా వెలుగొందుతూండటంలో– ఇలా ఎన్నిటిలోనో అధికుడు అతను.

ఉపసంపాదకురాలిగా 1978లో నేను చేరినప్పుడే శ్రీరమణ, కడప నుంచి వచ్చిన రామకృష్ణారెడ్డి (పి. రామకృష్ణ) 'ఆంధ్రజ్యోతి'లో సహోద్యోగులయ్యారు. అవి చాలా మంచిరోజులు! ఉద్యోగమే వ్యసనమైన రోజులు. చిక్కులూ చింతలూ లేవని కాదు – సమస్యల్ని సమసింపజేసుకునే దీటుదనం, స్ఫూర్తి ఈ బృందంతో పనిచేస్తున్నప్పుడు నిత్యం వర్ధిల్లుతుండేవి. ఏ రోజుకారోజు ఒక వికసనంలా ఉండటంలో శ్రీరమణ ఛలోక్తులు, ఎక్కడెక్కడి ప్రముఖుల గురించిన హాస్యోదంతాలు పూయిస్తూండిన చిరునవ్వులు ఒక ఆహ్లాదకరమైన భాగం. మాబోటి ఔత్సాహికులకు ఏవైనా చిక్కులు – ఎదురైతే కాదు సుమా – ఎదురు కాబోతున్నాయన్నదీ తానే ముందుగా ఊహించి, తప్పించుకునే మెలకువలు నేర్పివుంచటం అతని వాత్సల్య మైత్రీ పరిమళం. కొత్తలో ఒకసారి ఓ ప్రసిద్ధ రచయిత, పైగా అప్పటి సంపాదకుడి ప్రియమిత్రుడు కథ రాసి ఇస్తే, నన్ను అభిప్రాయం చెప్పమని కోరిన సందర్భంలో, అత్యుత్సాహంతో తీక్షణంగా చదివేసి, ఏవో లోపాలు కనిపెట్టి, చెప్పాలని బయలుదేరాను; ఈ తమాషా అంతా గమనిస్తున్నారు కాబోలు – శ్రీరమణ నేనేమి సంకల్పం చేసుకున్నానో అడిగి, శాంతంగా విని, ఎంతమేరకు ఎలా సుతారంగా చెప్పాలో... అసలు ఏ అంశాలు చెప్పకపోతే నా అప్రెంటిస్ ఉద్యోగం 'అనక వేరే కారణాలతో' పోకుండా ఉంటుందో చెప్పీచెప్పనట్లు బోధించారు. అలా ఆరేళ్ళ సహోద్యోగం నల్లేరు నడకగా సాగేందుకు తాను ఏరేసిన పల్లేర్లు మరి కొన్ని ఉన్నాయి. బాపు రమణలు తనను వారి బృందంలో చేరమని ఆహ్వానించినప్పటికి సంస్థ తాలూకు మాసపత్రికను మేమిద్దరమే నిర్వహిస్తున్నాము; వెళ్ళిపోయే ముందు ఎన్నెన్నో అమూల్యమైన సలహాలు, సమాచారం, మెలకువలు, చిట్కాలు వివరించి నాకు గల ఆధార సూత్రాల్ని మరింత పటిష్ఠపరచారు.

'ఫెమినిజమ్' పేరు చెప్పి నన్ను వెక్కిరించినా, ''మీ 'మిథునం' అంతా వంటలేగా...'' అంటూ నేను తిరిగి వెటకరించినా – నవ్వులే దొర్లేవి మా మధ్య.

నివాళి



శ్రీరమణ (1952-2023)

చమత్కారాలు, వ్యంగ్యాలు, వెటకారాలూ అతని వేలికొసలనే! ఎవ్వరినీ నొప్పించని హాస్య నిర్మాణం తన సహజకళ. ఎవరి మీద జోక్ వేసినా ఆ ఎదుటి మనిషీ ఆనందించటమే! జరుక్ శాస్త్రికి అచ్చమైన వారసుడి వలె ఆయన రాసిన పేరడీలు అప్పటికీ, ఎప్పటికీ గొప్ప హిట్లు. 'రైలుబండిలో వైతాళికులు' మరపురాని నవ్వులపందిరి. ప్రసిద్ధుల ప్రేమలేఖలు పేరడీ మరో నిత్యం మెరిసే రవ్వ. మో (వేగుంట మోహన్ ప్రసాద్) శైలికి పేరడీ చేస్తూ, ఆయన ప్రేమలేఖ ఆ అందుకున్న ప్రేయసికి కించిత్తు కూడా అర్థంకాలేదన్న చమక్కు మో నీ మెప్పించింది; సాహితీ జగతికి దశాబ్దాలకు సరిపడ నవ్వులను ఇచ్చింది. అప్పట్లోనే రంగనాయకమ్మ విమల – బుచ్చిబాబు తరహా జంట పాత్రలతో శ్రీరమణ ఒక సున్నిత హాస్యభరితమైన నవలను సీరియల్‌గా అందించి అలరించారు. 'చిలకలపందిరి', 'టీ కప్పులో సూర్యుడు' తెలుగు పాఠకులకు తేనెల ఊటలు. కథల నిర్మాణంలోనూ శ్రీరమణ బాణీ, భాష, ఆ చెక్కడపు పనితనం – తన సంతకం లేకుండానే ఇట్టే గుర్తుపట్టిస్తాయి.

అయితే, అందరూ వేనోళ్ళ చెప్పి పరవశించే 'మిథునం'ను అలా ఉంచితే, ఆయన చివరి రచన (ఎరిగిన మేరకు) అద్భుతమైన నవలిక – 'నాలుగో ఎకరం'. ఒకప్పటి రమ్యమైన తన సొంత పల్లె జీవనం నేపథ్యంలో, ఛిద్రమవుతున్న సంస్కృతికి, చివికి చితికిపోతున్న వ్యావసాయిక రంగానికి వ్యథాభరిత దర్పణంగా ఆ రచనను తీర్చారు. బహుశః మూడేళ్ళ నాడు – మా ఇద్దరికీ మిత్రురాలు సోమరాజు సుశీల సంస్మరణ సభలో కలిసి ఎన్నో కబుర్లు పంచుకున్నాము. అప్పటికే తన శారీరక స్థితిని చూసి నివ్వెరపోయాను. అయితే ఇంత త్వరలో ఇటువంటి విషాద వార్తను – కనీసం చివరిగా చూసేందుకు వీలులేని దూర దేశాన చిక్కుపడి ఉన్న సమయాన – వినవలసివస్తుందని ఊహించలేదు.

'రంగులరాట్నం'లో తానే అన్నట్లు, 'జీవితంలో చెయ్యాల్సిన పనులు గిన్నెలో మిగిలిన కుంకుడుకాయల్లా ఉండిపోయాయి!' అవును నిజం శ్రీరమణగారూ – అటువంటి చేదైన పోలిక – మిమ్మల్ని చూడాలనీ, మాట్లాడాలనీ ఇటీవల ఎంతగా ఆశించినా యాంత్రికత రద్దీలో చూడనే లేకపోవటం! సాహిత్య ప్రపంచం, పాఠక సందోహం భావిస్తున్నది అక్షరాలా నిజం: నేడు మనం కోల్పోయిన మణిపూస – ఒక తరపు ఆరోగ్యకరమైన, ఆహ్లాదకరమైన, బాధ్యతాయుతమైన సృజనకు శ్రీరమణుడినే!

*వ్యాసకర్త రచయిత్రి, సీనియర్ జర్నలిస్ట్*

nirmalaghantasala@gmail.com

# ఇది అమానవీయ భారతం!

అభిప్రాయం



జూలూరు గౌరీశంకర్

అడవి పొదలు, పట్టణాలు, పల్లెలు, నడివీధులు అనే తేడా లేకుండా బిక్కుబిక్కుమంటూ మానాలను, ప్రాణాలను కాపాడుకోలేక మణిపుర ఆడపడుచులు తల్లడిల్లిన తీరును చూస్తే ఇది ఏమి రాజ్యంరా? మనమెక్కడున్నాం రా అనిపించడం లేదూ! ఆధిపత్యం అనే వికృత జంతువుకు అధికారం తోడైతే తోడేలుగా మారి బక్క ప్రాణాల్ని చంపేస్తుంది. చెరిచేస్తుంది. నాగరికుల ముసుగులో ఉన్న అనాగరిక ఆధిపత్య వర్గాలకు బడుగుల దేహాలు ఆహారమా? బడుగుల్ని నగ్నంగా ఇంకా ఊరేగిస్తున్న స్వాతంత్ర్యమా వర్ధిల్లు! ఎటువంటి స్వతంత్ర దేశంలో బతుకుతున్నాం మనం! అంబేడ్కర్ విగ్రహాలు కలత చెంది చూస్తున్నాయ్. గాంధీ విగ్రహాలు రోదిస్తున్నాయ్. ఏమి దేశం.. ఏమి నీతి.. ఏమి సంస్కారం?

వలువలొలిచిన బడుగు తల్లుల నగ్నదేహాల ఊరేగింపులేనా పాలనంటే? పాలనంటే ఎక్కువ తలల గుంపు పక్కన నిలిచేదా? పాలనంటే మెజార్టీ గుంపు ఓట్ల గంపగుత్తేనా? బలహీనుల పక్కన నిలవాల్సిన రాజదండాలు బలవంతుల పక్కలో కులుకుతున్నాయ్. నోరు లేనోళ్ళ పక్కన, మాట పెగలని మూగజీవాల పక్కన నిలవాల్సిన వారు ఆధిపత్య వర్గాల పంచన చేరితే ఎట్లా? గ్లోబలైజేషన్ కాలంలో కులమెక్కడ? మతమెక్కడ? ఆధిపత్య వర్గాల ఊసెక్కడ అని నీతిపాఠాలు చెప్పకండి. చెప్పేదొకటి చేసేదొకటి. అటు చూడండి... మణిపురను చూడండి. ఆ మంటల దగ్గర చలికాచుకుంటున్న ఆధిపత్యాల చేతుల్ని చూడండి. ఇదేందో... ఇదేం సంస్కృతో చూడండి. బడుగు జాతోళ్ళ, అణచివేతకు గురైన కులపోళ్ళ వలువలు ఒలిచి ఊరేగిస్తున్నారు కదా! వాళ్లంతా కోల్పోయిన శీలాల్ని ఆత్మగౌరవ జెండాలతో కప్పుకుంటున్నారు చూడండి. ఆత్మగౌరవం నుంచే కదా ధిక్కారం మొలకెత్తేది. ఊరేగించింది ఆ ఆడపడుచుల రెండు దేహాల్నే కాదు. ఈ దేశంలో పరంపరగా వస్తున్న సంస్కృతి, సంస్కారం, విలువల నగ్న స్వరూపాన్ని కూడా!

ఇది అత్యాధునిక నాగరిక కాలమని ఊకదంపుడు మాటలు చెప్పకండి. అటు చూడండి ఆ అమానుష వికృత ఆటలేంది? వాటిని పెంచి పోషిస్తున్న ఆధిపత్య రాజముద్రల పెత్తందారీతనమేంది? మనుషులకు మలం తినిపిస్తారా? మనుషులపై మూత్రం పోస్తారా? మానాలు దోచి ప్రాణాలు తీసి యథేచ్ఛగా తిరిగే హింసాత్మక




చిత్రమా ఈ దేశం? మానవత్వాన్ని ఆధిపత్యపు రంపపు కోతలకు గురిచేస్తారా? దేశమంటే ఎక్కువ తలలున్న మెజార్టీ గుంపా? గద్దెలపై అధికారం కోసం గద్దల ఫీట్లా? అయ్యో... తినే బువ్వలో మట్టిపోస్తిరి కదా! పేదసాదల అనుబంధాల గూళ్ళను కాల్చి, పిట్టల గుంపుల్ని చెదరగొట్టి నట్లు మానవత్వాన్ని బెదరగొడుతున్నారు కదరా? తక్కువ జాతోళ్ళని ముద్ర వేసి సర్వసత్తాక ప్రజాస్వామిక గణతంత్ర రాజ్యాన్ని అమానవీయ భారతంగా మార్చేస్తున్నారు కదరా! సాంకేతిక విప్లవాలు విరగ కాస్తున్న కాలంలో మనుషుల్ని మతం పేరున, కులం పేరున అట్టడుగు జాతని విభజించి పాలించే దుర్నీతి సంస్కృతా? ఎట్లాంటి దేశం, ఎట్లుండె దేశం! ఇంద్రధనుస్సులోని రంగుల్లాగా... విభిన్న జాతుల, మతాల, సంస్కృతులతో ఏకత్వపు మహాగీతం లాంటి ఈ దేశాన్ని అమానవీయ అశుద్ధ భారతంగా మార్చుతున్నారు కదరా!

అన్ని రంగులు కలగలిసిన అందం కదా మనం. మన దేశమంటే మానవీయ మహా సమ్మేళనం కదా! అధికార కుర్చీల కోసం మణిపురను మసి చేస్తారా? మానవత్వాన్ని తగులబెడతారా? కశ్మీర్‌ను కాల్పుల కేంద్రం చేస్తారా? ఆ తల్లులు గుండెలు పగిలేలా అరుస్తున్నారు వినబడడం లేదా? సిగ్గే సిగ్గుతో తలదించుకుంది కనపడటం లేదా? నోర్లు మూగబోయాయా? చూపు చీకటైందా? మణిపురలో హాహాకారాలు వినిపిస్తుంటే దేశం సుఖనిద్ర పోతోందా? అక్కడ వాళ్ళ కళ్ళు పీకేస్తుంటే మొకం తిప్పేసుకుంటారా? ఆ తల్లుల వలువలు ఒలిచి నగ్నంగా ఊరేగిస్తుంటే కళ్ళు మూసుకుంటారా? బలహీనుల ఆర్తనాదాలు వినకుండా చెవులు మూసుకుంటారా? మీరు మౌనంగా ఉంటే మణిపుర మంటలు రేపు మీ ఇంటి తలుపులూ తడ్తాయ్ జాగ్రత్త! ఉచ్చ నీచాలు మరచిన అమానవీయ సంస్కృతిని తరిమికొట్టే చైతన్యం రగలక తప్పదు. న్యాయదేవత కళ్ళగంతలు విప్పి కన్నీరు పెడుతోంది. గాంధీ విగ్రహం చేతికర్ర కదులుతోంది. అంబేడ్కర్ విగ్రహం ఎరుపెక్కుతోంది. ఆగ్రహ నదుల ఆనకట్టలు తెగుతున్నాయ్. ప్రళయాగ్ని పాటకట్టి పాడుతోంది.

'బహుజన హితాయ బహుజన సఖాయ'ను ధరిద్దాం రండి. గుడిసె తను కోల్పోయిన శీలాన్ని తాటి ఆకులతో కప్పుకుంటోంది చూడండి. మానవీయ మహారాజ్య నిర్మాణానికి పోటెత్తి కదులుదాం. మణిపుర మంటలు మరెక్కడా రాజుకోకుండా మానత్వ పూదండను అల్లుదాం రండి. గంగా జమునా తెహజీబ్ సంస్కృతిని దేశమంతా నాటేసుకుంటూ పోదాం పదండి!

*వ్యాసకర్త తెలంగాణ సాహిత్య అకాడమీ ఛైర్మన్*

గ్రహం అనుగ్రహం: శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు, అధిక శ్రావణ మాసం, **తిథి:** శు.షష్ఠి ఉ.9.12 వరకు, తదుపరి సప్తమి, **నక్షత్రం:** హస్త సా.6.44 వరకు, తదుపరి చిత్త, **వర్జ్యం:** రా.3.11 నుండి 4.53 వరకు, **దుర్ముహూర్తం:** ప.12.32 నుండి 1.23 వరకు, తదుపరి ప.3.04 నుండి 3.56 వరకు, **అమృతఘడియలు:** ప.12.17 నుండి 2.01 వరకు; **రాహుకాలం:** ఉ.7.30 నుండి 9.00 వరకు, **యమగండం:** ఉ.10.30 నుండి 12.00 వరకు, **సూర్యోదయం:** 5.39, **సూర్యాస్తమయం:** 6.32.

క్లుప్తంగా...

## చేపలే చేపలు..


చేపలను తీసుకెళ్తున్న జాలర్లు

మంథని: భారీవర్షాలతో పెద్దపల్లి జిల్లా మంథని మండలం సిరిపురం సమీపంలోని పార్వతీ బ్యారేజీకి భారీగా వరద వచ్చి చేరింది. దీంతో మూడురోజులపాటు గేట్లను ఎత్తి నీటిని దిగువకు వదిలిన అధికారులు.. వరద తగ్గుముఖం పట్టడంతో ఆదివారం మూసివేశారు. వరద ప్రవాహానికి చేపలు భారీగా కొట్టుకొచ్చాయి. సమాచారం అందుకున్న మంచిర్యాల, పెద్దపల్లి జిల్లాలోని మత్స్యకారులు, సమీప గ్రామాల ప్రజలు పెద్దఎత్తున బ్యారేజీ వద్దకు తరలివచ్చారు. ఒక్కొక్కరూ 50 కిలోల నుంచి క్వింటాల్ మేర చేపలను తీసుకెళ్లారు. మరికొందరు చేపలను కిలో రూ.80 నుంచి రూ.100 వరకు విక్రయించారు. బ్యారే జీ గేట్ల దిగువ భాగంలో ప్రమాదకర గుంతలు ఉన్నాయి. ఆ ప్రాంతంలో చేపలు పట్టడం ప్రమాదం. అయితే మత్స్యకారులు చేపలు పడుతున్నా.. నీటిపారుదల శాఖ అధికారులు మాత్రం పట్టించుకోకపోవడం గమనార్హం.

## డా.బీఎస్ రావుకు ఘన నివాళి

సాక్షి, హైదరాబాద్: శ్రీ చైతన్య విద్యాసంస్థల అధినేత డా.బీఎస్.రావు సంతాప సభలు ఆదివారం దేశవ్యాప్తంగా జరిగాయి. ఏపీలోని మంగళగిరిలోని డీజీపీ ఆఫీస్ దగ్గరలో ఉన్న సి.కె. కన్వెన్షన్‌లో పెద్ద కర్మ నిర్వహించారు. అన్ని చైతన్య కళాశాలల్లో ఘన నివాళులు అర్పించారు. ఆయన చేసిన సేవలను, వ్యక్తిత్వాన్ని, వారితో ఉన్న అనుబంధాన్ని తెలియజేస్తూ కన్నీటి పర్యంతమయ్యారు. వేలసంఖ్యలో బంధుమిత్రులు, ప్రముఖులు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొని ఆయనకి సంతాపం తెలిపారు. రికార్డ్ స్థాయిలో ఫలితాలు సృష్టించి తెలుగువారి కీర్తిపతాకను జాతీయ స్థాయిలో రెపరెపలాడించిన మహోన్నత వ్యక్తి, డా.బీఎస్.రావు అని కొనియాడారు.

## సర్వీసులో చేరిన తర్వాతే పదోన్నతులకు అర్హత

### నాయబ్ తహశీల్దార్ల విషయంలో స్పష్టతనిచ్చిన ప్రభుత్వం

సాక్షి, హైదరాబాద్: డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారా నాయబ్ తహశీల్దార్లుగా నియామకమైన వారు సర్వీసులో చేరిన తర్వాత తేదీ నుంచే పదోన్నతులకు అర్హత పొందుతారని, పాత ఏడాది ప్యానెళ్లలో వీరికి పదోన్నతులు కల్పించలేమని రాష్ట్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ మేరకు సీసీఎల్ఏ కార్యదర్శి బి.గోపి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. 2019–20 ఏడాదిలో నియామకమైన తమకు 30% ప్రత్యక్ష నియామక పదోన్నతుల కోటాలో 2016–17 ప్యానెల్‌లో తహశీల్దార్లుగా పదోన్నతులు పొందేలా అవకాశం కల్పించాలని, ప్రతి ఏటా తమ కోటాను లెక్కించాలని కొందరు డైరెక్ట్ రిక్రూట్‌లు కోర్టుకు వెళ్లిన అంశంపై ఈ మేరకు ప్రభుత్వం స్పష్టతనిచ్చింది.


కళ్యాణి చాళుక్యులు నిర్మించిన తోరణం

## కళ్యాణి చాళుక్యులు, కాకతీయులు తొలిచిన క్వారీ

సాక్షి, హైదరాబాద్: శ్రీశైలం పుణ్యక్షేత్రానికి వెళ్లే దారిలో ఉమామహేశ్వరం క్షేత్రం సమీపంలో అప్పట్లో అటు కళ్యాణి చాళుక్యులు, వారి తర్వాత సామ్రాజ్యాన్ని స్థాపించిన కాకతీయులు నిర్మించిన పలు కట్టడాలకు ఒకే క్వారీ నుంచి గ్రానైట్ రాళ్లను వినియోగించినట్టు స్పష్టమైంది. శ్రీశైలం దారిలోని నాగర్‌కర్నూలు జిల్లా మన్ననూరు ఘాట్‌రోడ్డు సమీపంలోని ప్రతాపరుద్రుని కోట ప్రాంతాన్ని ఆదివారం చరిత్ర పరిశోధకుడు డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి సందర్శించారు. ఇక్కడే శ్రీశైలం క్షేత్ర తొలి ద్వారంగా, శివపుర ద్వారంగా పేర్కొనే ద్వార తోరణం ఇప్పటికీ పదిలంగా ఉంది. దీన్ని కళ్యాణి చాళుక్యుల పాలన చివరి భాగంలో నిర్మించారని శివనాగిరెడ్డి చెప్పారు. ఆ తర్వాత ఆ పక్కనే కాకతీయ చక్రవర్తి మొదటి ప్రతాపరుద్రుడి హయాంలో కోట నిర్మించారన్నారు. ఈ రెండు నిర్మాణాలకు అక్కడి సమీపంలోని గుట్టను క్వారీగా చేసుకుని రాళ్లను తెచ్చినట్టు పేర్కొన్నారు. దాదాపు 870 ఏళ్ల క్రితం ఆ రాళ్లను తొలిచిన ఆనవాళ్లను గుర్తించామన్నారు.


ఆ తోరణానికి ఆవలివైపున్న గుట్ట భాగం. ఈ గుట్టనే తొలిచి అప్పట్లో తోరణం నిర్మించారు


సాంగ్వి గ్రామ శివారులో చెరువును తలపిస్తున్న పంట చేను

కౌఠలో సురక్షిత ప్రాంతాలకు వెళుతున్న ప్రజలు

# 'పెన్‌గంగ'పై అప్రమత్తం!

- డొల్లారలో పర్యటించిన ఎమ్మెల్యే జోగు రామన్న, కలెక్టర్ రాహుల్‌రాజ్

జైనథ్: ఆదిలాబాద్ జిల్లాలో పెన్‌గంగ ఉధృతి నేపథ్యంలో నదీ పరివాహక ప్రాంతమైన డొల్లార గ్రామ శివారు ప్రాంతాల్లో ఎమ్మెల్యే జోగు రామన్న, కలెక్టర్ రాహుల్‌రాజ్ ఆదివారం పర్యటించారు. ఉదయం డొల్లార చేరుకొని 44వ నంబర్ జాతీయ రహదారిపై బ్రిడ్జి వద్ద పెన్‌గంగ ఉధృతిని పరిశీలించారు. అనంతరం అధికారులతో మాట్లాడి పరిస్థితులపై ఆరా తీశారు. లోతట్టు ప్రాంత ప్రజలు, అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం కొరటా–చనాఖా బ్యారేజీ, హట్టిఘాట్ పంప్ హౌస్‌లను సందర్శించారు. అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు.

**సురక్షిత ప్రాంతాలకు ప్రజలు:** వరద ధాటికి మండలంలోని పలు గ్రామాల్లో వందల కుటుంబాలు రోడ్డున పడ్డాయి. ఇళ్లలో ఉన్న బియ్యం, పప్పు, ఇతర నిత్యావసర సరుకులు పూర్తిగా తడిసిపోవడంతో అవస్థలు పడుతున్నారు. కౌఠ గ్రామంలో నిత్యావసర సరుకులను థర్మాకోల్ పడవలపై తరలిస్తూ కనిపించారు. ప్రజలు ఇళ్లను వదిలి మూటముల్లె సర్దుకొని సురక్షిత ప్రాంతాలకు వెళ్లిపోయారు.

**చెరువులను తలపిస్తున్న పంట చేలు**

పెన్‌గంగ పరీవాహక ప్రాంతం చుట్టూ ఉన్న పంట చేలు బ్యాక్ వాటర్ ధాటికి పూర్తిగా మునిగిపోయాయి. ఆదివారం వర్షం కొంత తగ్గినప్పటికీ చేలలో వరద తొలగలేదు. పెండల్‌వాడ, సాంగ్వి, ఆనంద్‌పూర్, కరంజి, కూర, ఖాప్రి, లేకర్‌వాడ, మాండగాడ, పూసాయి తదితర గ్రామాల పంట చేలన్నీ చెరువులను తలపిస్తున్నాయి.


పెన్‌గంగా నది బ్యాక్ వాటర్ సాంగిడి గ్రామాన్ని చుట్టుముట్టడంతో ఆ గ్రామస్తులు బాహ్యప్రపంచంతో సంబంధాలు కోల్పోయారు. అత్యవసర పరిస్థితుల్లో గ్రామం నుంచి బయటకు రావాలంటే ఇలా నాటు పడవల ద్వారా ప్రమాదకరంగా ప్రయాణించాల్సి వస్తోంది.
– సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

# అధిక వర్షాలతో పత్తికి విపత్తు

- ఇటీవల విత్తనాలు చల్లినచోట నీట మునిగితే చేతికందడం కష్టమే
- అక్కడ మరోసారి వేసుకోవాల్సిందే
- మొలక వచ్చిన పత్తి, సోయా, కంది పంటల్లో నీటిని తోడేయాలి
- వ్యవసాయ శాస్త్రవేత్తల సూచన



సాక్షి, హైదరాబాద్: వారం క్రితం వరకు వర్షాలు లేక ఇబ్బందులు పడగా, ఇప్పుడు ఎడతెరిపి లేని వర్షాలతో పంటలను ఎలా కాపాడుకోవాలో రైతులు ఆందోళన చెందుతున్నారు. అనేక చోట్ల పత్తి పంటకు చేటు కలుగుతోంది. పత్తితోపాటు ఇతర ఆరుతడి పంటలైన సోయాబీన్, మొక్కజొన్న, కంది వంటి పంటలకు కూడా సమస్యలు తలెత్తుతున్నాయి. ఇటీవల విత్తనాలు చల్లినచోట అధిక వర్షాలతో మునిగిపోయి ఆయా విత్తనాలు కుళ్లిపోతున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. మొలక వచ్చినచోట కలుపు సమస్య, వేరుకుళ్లు, కాండం కుళ్లు తెగుళ్లు వస్తున్నాయి. వీటికి తోడు నిరంతర వర్షాల కారణంగా బ్యాక్టీరియా తెగుళ్లు కూడా వస్తున్నాయి. ఈ నేపథ్యంలో విత్తనాలు మొలకెత్తని చేలల్లో ఎక్కువ నీరు నిలిచిపోయే పరిస్థితి వస్తే పత్తి, సోయా, కంది వంటివి చేతికి రావనీ, వాటిని మరోసారి విత్తుకోవాల్సి ఉంటుందని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిశోధనా విభాగం మాజీ సంచాలకులు ప్రొఫెసర్ జగదీశ్వర్ అంటున్నారు.

**38 లక్షల ఎకరాల్లో పత్తి సాగు...**

రాష్ట్రంలో వానాకాలం సీజన్‌లో ఇప్పటివరకు 57.24 లక్షల ఎకరాల్లో పంటలు సాగయ్యాయి. ఈ సీజన్ సాధారణ సాగు విస్తీర్ణం 1.24 కోట్ల ఎకరాలు కాగా, 46.06 శాతం విస్తీర్ణంలో పంటలు సాగయ్యాయి. ఇటీవల వర్షాలు పుంజుకోవడంతో వ్యవసాయ పంటల సాగు ఊపు మీద ఉంది. కాగా, పత్తి సాధారణ సాగు విస్తీర్ణం 50.59 లక్షల ఎకరాలు కాగా, ఇప్పటివరకు 37.98 లక్షల ఎకరాల్లో (75.07%) సాగైంది. ఇక వరి సాధారణ సాగు విస్తీర్ణం 49.86 లక్షల ఎకరాలు కాగా, ఇప్పటివరకు 7.94 లక్షల ఎకరాల్లో నాట్లు పడ్డాయి. ఇక పప్పుధాన్యాల సాధారణ సాగు విస్తీర్ణం 9.43 లక్షల ఎకరాలు కాగా, ఇప్పటివరకు 4.04 లక్షల ఎకరాల్లో సాగయ్యాయి. సోయాబీన్ సాధారణ సాగు విస్తీర్ణం 4.13 లక్షల ఎకరాలు కాగా, ఇప్పటివరకు 4.05 లక్షల ఎకరాల్లో (98.21%) సాగైంది. ఇక మొక్కజొన్న సాధారణ సాగు విస్తీర్ణం 7.13 లక్షల ఎకరాలు కాగా, ఇప్పటివరకు 3 లక్షల ఎకరాల్లో సాగైంది. వర్షాలు ఎడతెరిపి లేకుండా కురుస్తుండటంతో ఆయా పంటలను కాపాడుకోవడం ఇప్పుడు రైతులకు కీలకమైన అంశంగా జగదీశ్వర్ చెబుతున్నారు.

**రైతులు ఏం చేయాలంటే?**

- ఆరుతడి పంటలైన పత్తి, కంది, పెసర, సోయాచిక్కుడు, మొక్కజొన్న పంటల్లో ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు తమ పొలాల్లో నిలిచిన మురుగునీరు పోయేందుకు కాల్వలు ఏర్పరచాలి.
- వర్షాలు ఆగిన వెంటనే తమ పొలాల్లో కలుపు ఏమాత్రం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. రైతులు పంటల వారీగా కలుపు మందులను ఎంచుకొని సరైన మోతాదులో పిచికారీ చేయాలి.
- సాధ్యమైనంతవరకు గుంటకతో కానీ, దంతెలతో గానీ కలుపు తీసివేయాలి.
- పత్తిలో అధిక వర్షాలకు వేరుకుళ్లు, కాండం కుళ్లు, కాయ కుళ్లు ఆశించేందుకు అవకాశం ఉంటుంది. కాబట్టి మొక్కల మొదళ్లను కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రాములు ఒక లీటర్ నీటికి కలుపుకొని లేదా కార్బండాజిమ్ ఒక గ్రాము ఒక లీటర్ నీటికి కలుపుకొని మొక్కల అడుగు భాగంలో పిచికారీ చేయాలి.
- ప్రస్తుతం భూమిలో తేమను ఆధారం చేసుకొని ఆరుతడి పంటల్లో పైపాటుగా ఎరువులను యూరియా 30 కేజీలు, పొటాష్ 15 నుంచి 20 కేజీలు కలుపుతీసిన తర్వాత మొక్కలకు బెత్తెడు దూరంలో మట్టిలో లోతుగా వేయాలి.
- మే జూన్‌లలో వేసిన పత్తిలో వర్షాలు ఆగిన వెంటనే పేనుబంక, పచ్చదోమ ఆశించేందుకు అవకాశం ఉంటుంది. దీనికోసం ఎస్ఫేట్ 1.5 గ్రాములు లీటర్ నీటికి కలుపుకొని పిచికారీ చేయాలి.
- వర్షాలకు వరిలో బ్యాక్టీరియా ఎండాకు తెగులు లేదా అగ్గితెగులు సోకేందుకు చాలా అనుకూల వాతావరణం ఉంది. దీంతో వర్షాలు ఆగిన వెంటనే ట్రైసైక్లోజెల్ 0.6 గ్రాములు లీటర్ నీటికి కలుపుకొని అగ్గి తెగులు నివారణకు చర్యలు చేపట్టాలి.
- ప్రస్తుతం బ్యాక్టీరియా తెగులు గమనించినట్లయితే తాత్కాలికంగా నత్రజని ఎరువులను వేయడం, వారం పది రోజుల వరకు ఆగి ముందస్తు చర్యగా కాపర్‌ఆక్సీక్లోరైడ్ 30 గ్రాములు, స్ట్రెప్టోమైసిన్ సల్ఫేట్ రెండు గ్రాములు పది లీటర్ల నీటికి కలుపుకొని ఎకరాకు 200 లీటర్ల ద్రావణాన్ని పిచికారీ చేయాలి.
- వరిలో ప్రస్తుతం వర్షాలను ఉపయోగించుకొని జూలై మాసాంతం వరకు స్వల్పకాలిక రకాలు (125 రోజులు) నారు పోసుకోవడానికి అనుకూలం. ఆ తర్వాత ఆగస్టు 15–20 తేదీల వరకు నాట్లు వేసుకున్నట్లయితే మంచి దిగుబడులు రావడానికి అవకాశం ఉంటుంది.
- ఒకవేళ మధ్యకాలిక రకాలు (135 రోజులు) లేదా స్వల్పకాలిక రకాలు కూడా నేరుగా దమ్ము చేసిన పొలంలో డ్రమ్ సీడర్ ద్వారా గానీ, వెదజల్లుకునే పద్ధతిలో గానీ వరిని విత్తుకున్నట్లయితే దాదాపుగా 15–20 రోజుల సమయం కలిసి వచ్చి మంచి దిగుబడులు రావడానికి అవకాశముంది.
- వెదజల్లే పద్ధతిలో విత్తుకునేప్పుడు నేల బాగా చదును చేసి ఉండాలి. ఆ తర్వాత వరి విత్తిన మూడు నుంచి ఐదు రోజుల లోపుల సిఫారసు చేసిన కలుపుమందులు తప్పనిసరిగా వాడాలి.

# కడెంకు సీడబ్ల్యూసీ బృందం రాక

- ఈనెల 27 నుంచి మూడురోజుల పాటు ప్రాజెక్టు పరిస్థితిపై అధ్యయనం

కడెం: కడెం ప్రాజెక్టు రక్షణపై సీడబ్ల్యూసీ (సెంట్రల్ వాటర్ కమిషన్) దృష్టి సారించింది. గతేడాది, ఈఏడాది ఎగువ నుంచి వరదనీరు వస్తున్న సమయంలో ప్రాజెక్టు గేట్లు తరచు మొరాయిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రాజెక్ట్ పరిస్థితిని అధ్యయనం చేసేందుకు, సీడబ్ల్యూసీ బృందం ఈనెల 27, 28, 29 తేదీల్లో వస్తున్నట్టు సమాచారం. కడెం ప్రాజెక్టు నిర్మాణం 65 ఏళ్ల క్రితం జరిగింది. ప్రస్తుతం డ్యాం సేఫ్టీ, వరద గేట్ల పనితీరు, ప్రాజెక్ట్ నీటినిల్వ సామర్థ్యం, ఔట్‌ఫ్లో కెపాసిటీ, ప్రాజెక్ట్ నిర్వహణ తదితరాలను బృందం పరిశీలిస్తుందని అధికారులు పేర్కొంటున్నారు. సీడబ్ల్యూసీ బృందం వస్తుందన్న సమాచార నేపథ్యంలో ఆదివారం నుంచి ప్రాజెక్టు వరద గేట్లు, ఇతర మరమ్మతులు చకచకా చేస్తున్నారు.

**అదనపు గేట్ల ఏర్పాటుపై...**

కడెం ప్రాజెక్ట్ నుంచి దిగువకు 3 లక్షల క్యూసెక్కుల నీటిని విడుదల చేసేలా డిజైన్ రూపొందించారు. అయితే గతేడాది 6 లక్షల క్యూసెక్కులకుపైగా ఇన్‌ఫ్లో రాగా, గేట్ల పైనుంచి వరద వెళ్లింది. దీంతో ఇన్‌ఫ్లో, ఔట్‌ఫ్లో సామర్థ్యం పెంచేలా కడెం ప్రాజెక్టు మొదటి గేటు పక్క నుంచి పాత జనరేటర్ గదివైపు ఐదు అదనపు గేట్లు ఏర్పాటు చేసే అవకాశాలపై అధ్యయనం చేయనున్నట్టు తెలిసింది. అదనపు గేట్ల ఏర్పాటు సాధ్యాసాధ్యాలపై సీడబ్ల్యూసీ ప్రభుత్వానికి నివేదిక ఇవ్వనున్నట్టు సమాచారం.

## తేనె తుట్టెల తొలగింపు

కడెం: తేనె తుట్టెల కారణంగా ప్రాజెక్ట్ 18 నంబరు వరద గేటు, కౌంటర్ వెయిట్ పనులు పూర్తి చేయక 3వ నంబరు గేటు ఎత్తడం లేదు. దీనిపై ఈనెల 23వ తేదీన సాక్షి మెయిన్ పేజీలో 'కడెం..జనం గుండెల్లో సైరన్'శీర్షికన కథనం ప్రచురించమైంది. దీనికి ప్రాజెక్టు అధికారులు స్పందించారు. వరద గేట్ల వద్ద ఉన్న తేనె తుట్టెలను తొలగించారు. మూడో నంబర్ వరద గేటు కౌంటర్ వెయిట్‌లో చిప్స్(కంకర రాయి) వేసి ఎత్తేందుకు సిద్ధం చేస్తున్నారు.




# ఎగువ గోదావరిలో తగ్గిన వరద

- ప్రాణహితలో మళ్లీ పెరిగిన ఉధృతి
- భద్రాచలం వద్ద తొలి ప్రమాద హెచ్చరిక ఉపసంహరణ

సాక్షి, హైదరాబాద్: గోదావరిలో వరద ప్రవాహం క్రమేణ తగ్గుతోంది. గోదావరి ప్రధాన పాయలో ఎగువన వర్షాలు తగ్గడంతో శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు వరద ప్రవాహం 26,296 క్యూసెక్కులకు తగ్గింది. జలాశయంలో నీటి నిల్వ 61.77 టీఎంసీలకు చేరింది. మరో 29 టీఎంసీలు చేరితే శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నిండిపోతుంది. శ్రీరాంసాగర్ దిగువన ఉన్న ఎల్లంపల్లి ప్రాజెక్టుకు సైతం వరద 27,401 క్యూసెక్కులకు తగ్గింది. నీటి నిల్వ గరిష్ట స్థాయికి చేరుకోవడంతో 20,390 క్యూసెక్కులను దిగువకు వదిలేస్తున్నారు. మరోవైపు ప్రాణహితకి స్వల్పంగా వరద పెరిగింది. గోదావరి ప్రధాన పాయ నుంచి వస్తున్న జలాలకు ప్రాణహిత ప్రవాహ ం తోడవుతుండటంతో కాళేశ్వరం ప్రాజెక్టులో అంతర్భాగమైన మేడిగడ్డ (లక్ష్మీ) బ్యారేజ్‌లోకి 5,33,970 క్యూసెక్కులు చేరుతుండగా.. అంతేస్థాయిలో దిగువకు వదిలేస్తున్నారు. వీటికి ఇంద్రా వతి జలాలు తోడవుతుండటంతో తుపాకుల గూ డెం వద్ద ఉన్న సమ్మక్క బ్యారేజ్‌లోకి 7,95,000 క్యూసెక్కులు చేరుతుండగా.. అంతేస్థాయిలో దిగు వకు వదిలేస్తున్నారు. ఆదివారం ఉదయం 11 గంటల ప్రాంతంలో భద్రాచలం వద్ద గోదావరిలో ప్రవాహం 9,55,828 క్యూసెక్కులకు పెరగడంతో నీటిమట్టం 43.5 అడుగులకు చేరింది. దీంతో తొలి ప్రమాద హెచ్చరికను జారీ చేశారు. అనంతరం వ రద క్రమంగా తగ్గడంతో రాత్రి 8 గంటల ప్రాంతంలో అక్కడ 42.4 అడుగులకు నీటిమట్టం తగ్గడంతో తొలి ప్రమాద హెచ్చరికను ఉపసంహరించుకున్నారు.

# తొమ్మిదేళ్లుగా తెలంగాణ | ఆత్మగౌరవం కోల్పోతోంది

### రేపటి తెలంగాణ ఆకాంక్షల వేదిక సదస్సులో బీజేపీ నేత ఈటల రాజేందర్

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ అన్నివర్గాల భాగస్వామ్యంతో ఏర్పడిందని, తొమ్మిదేళ్లుగా ప్రజలు మోసగించబడుతూ, ఆత్మగౌరవం కోల్పోయారని బీజేపీ రాష్ట్ర ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్ అన్నారు. ఆదివారం జలవిహార్‌లో రేపటి తెలంగాణ ఆకాంక్షల వేదిక అధ్యక్షతన జరిగిన మేధావుల సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈటల మాట్లాడుతూ కేసీఆర్ హయాంలో యూనివర్సిటీలను నిర్వీర్యం చేశారని, ప్రైవేట్ వర్సిటీలను ఏర్పాటు చేసి పేదలకు ఉన్నతవిద్య దూరం చేశారని చెప్పారు. ముప్పైమంది విద్యార్థులకు ఒక టీచర్ పేరుతో దాదాపుగా ఎనిమిదివేల స్కూళ్లను మూసివేశారని, పీహెచ్‌డీ చేసిన వారు రూ.5వేలకు పనిచేస్తున్నారని, ఈ పరిస్థితులను చూస్తే రాష్ట్రంలో విద్యావ్యవస్థ ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. దళితబంధు, బీసీలకు లక్ష రూపాయల సహాయం ఓట్ల కోసమేనని, కేసీఆర్‌కు కుర్చీ మీద ఉన్న ప్రేమ, ప్రజల మీద లేదని, పుట్టిన పిల్లలమీద రూ.1.25 లక్షల అప్పు చేసిపెట్టారని చెప్పారు. వచ్చే నెల 6న అన్నివర్గాల సమస్యలను పుస్తకం రూపంలో విడుదల చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ డీజీపీ కృష్ణప్రసాద్, జస్టిస్ నరసింహారెడ్డి, మాజీ ఐఏఎస్ అధికారులు రత్నప్రభ, తేజావత్ రామచంద్రుడు, మాజీ ఐపీఎస్ అధికారులు అరవింద్‌రావు, తెలంగాణ లెక్చరర్స్ ఫోరం ప్రతినిధి పేరాల శేఖర్‌రావు, తుర్క నరసింహ, అశ్వత్థామరెడ్డి, విఠల్, ప్రొఫెసర్ గాలి వినోద్ తదితరులు పాల్గొన్నారు.



# 'ఈ సమావేశాల్లోనే బీసీ బిల్లు పెట్టండి'

సాక్షి, హైదరాబాద్: ప్రస్తుత పార్లమెంటు సమావేశాల్లోనే బీసీ బిల్లును ప్రవేశపెట్టాలని తెలంగాణ రాష్ట్ర బీసీ సంఘం బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని కోరింది. ఈ మేరకు కిషన్‌రెడ్డిని ఆదివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేసింది. ఓబీసీల కోసం ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని, కేంద్రప్రభుత్వ నామినేటెడ్ పోస్టుల్లో 50% బీసీలకు రిజర్వేషన్లు ఇవ్వాలని, జాతీయ బీసీ కార్పొరేషన్ ఏర్పాటు చేసి రూ.500 కోట్ల నిధులు విడుదల చేయాలని కోరింది. అదేవిధంగా ప్రైవేటు సంస్థల్లో బీసీలకు ఉద్యోగ రిజర్వేషన్లు కల్పించాలని ఈ వినతిపత్రంలో కోరింది. కిషన్‌రెడ్డిని కలిసిన వారిలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎ.రాజేశ్వర్ యాదవ్, ప్రధాన కార్యదర్శి రవి కుమార్ తదితరులున్నారు.

# అనాథ పిల్లలకు అండగా

- 47వ పుట్టిన రోజున మంత్రి కేటీఆర్ వినూత్న నిర్ణయం

సాక్షి, హైదరాబాద్: ప్రతి ఏటా తన పుట్టినరోజు సందర్భంగా వినూత్న సామాజిక సేవా కార్యక్రమాలను చేపట్టే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీ రామారావు 47వ పుట్టినరోజు సందర్భంగా ఈ ఏడాది అర్థవంతంగా జరుపుకోవాలని అనుకుంటున్నట్లు వెల్లడించారు. మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో యూసుఫ్‌గూడాలో ఉన్న స్టేట్ హోమ్‌లోని అనాథ పిల్లలకు అండగా నిలవాలనుకుంటున్నట్లు ప్రకటించారు. గిఫ్ట్ ఏ స్మైల్ కార్యక్రమంలో భాగంగా 10, 12వ తరగతుల్లో ప్రతిభావంతులైన 47 మంది పిల్లలకు, ప్రొఫెషనల్ కోర్సుల నుంచి మరో 47 మంది పిల్లలకు వ్యక్తిగతంగా అండగా ఉంటానని ప్రతిజ్ఞ చేస్తున్నట్లు కేటీఆర్ పేర్కొన్నారు. ఈ విద్యార్థులందరికీ ఉచితంగా ల్యాప్ టాప్‌లు అందిస్తానని తెలిపారు.



వారి బంగారు భవిష్యత్తుకై బెస్ట్ ఇన్‌స్టిట్యూట్ ద్వారా రెండేండ్ల పాటు అత్యుత్తమ కోచింగ్ ఇప్పిస్తానని స్పష్టం చేశారు. కాగా, తన పుట్టినరోజు సందర్భంగా ఎవరికి తోచిన మార్గంలో వారు అనాథ పిల్లలకు సహాయం చేయాలని బీఆర్ఎస్ పార్టీ శ్రేణులను కోరుతున్నానని కేటీఆర్ తన ట్వీట్‌లో పేర్కొన్నారు.

**నేడు వెయ్యిమంది రక్తదానం**

మంత్రి కేటీఆర్ 47వ జన్మదినం సందర్భంగా సోమవారం ఖాజాగూడలోని దివ్యశ్రీ ఎన్ఎస్ఎల్ ఐటీ పార్క్‌లో సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. తెలంగాణ ఫెసిలిటీస్ మేనేజ్‌మెంట్ కౌన్సిల్ ఆధ్వర్యంలో ఐటి టవర్లలో పనిచేసే దాదాపు 1000 మంది టెక్కీలు రక్తదానం ఇవ్వనున్నారు.

# శ్రీశైలంకు కృష్ణమ్మ పరుగులు

- ప్రాజెక్టులోకి 22,573 క్యూసెక్కుల ప్రవాహం
- దిగువన కురుస్తున్న వర్షాలతో కృష్ణా, భీమాల నుంచి జూరాలకు వరద
- జూరాలలో విద్యుదుత్పత్తి చేస్తూ 37,930 క్యూసెక్కులు దిగువకు విడుదల
- స్థానికంగా కురిసిన వర్షాల ప్రభావం వల్ల సాగర్‌లోకి 2,015 క్యూసెక్కులు
- మూసీ నుంచి పులిచింతల ప్రాజెక్టులోకి 8,685 క్యూసెక్కుల ప్రవాహం
- కృష్ణా ప్రధాన పాయలో పెరిగిన వరద.. ఆల్మట్టిలోకి 1.07 లక్షల క్యూసెక్కులు

సాక్షి, హైదరాబాద్: శ్రీశైలం ప్రాజెక్టులోకి వరద ప్రవాహం ప్రారంభమైంది. జూరాల ప్రాజెక్టులో జలవిద్యుదుత్పత్తి చేస్తూ దిగువకు వదులుతున్న జలాల్లో ఆదివారం శ్రీశైలం ప్రాజెక్టులోకి 22,573 క్యూసెక్కులు చేరాయి. శ్రీశైలం ప్రాజెక్టు గరిష్ట నీటిమట్టం 885 అడుగులు.. పూర్తి నీటి నిల్వ 215.81 టీఎంసీలు. ప్రస్తుతం ప్రాజెక్టులో 808.90 అడుగుల్లో 33.67 టీఎంసీలు నిల్వ ఉన్నాయి.

కృష్ణా పరీవాహక ప్రాంతంలో నారాయణపూర్, ఉజ్జయిని డ్యామ్‌లకు దిగువన కురుస్తున్న వర్షాల ప్రభావం వల్ల కృష్ణా ప్రధాన పాయ, భీమాల నుంచి జూరాల ప్రాజెక్టులోకి 41,925 క్యూసెక్కులు చేరుతున్నాయి. ప్రాజెక్టులో నీటి నిల్వ గరిష్ట స్థాయికి చేరుకోవడంతో విద్యుదుత్పత్తి చేస్తూ 37,930 క్యూసెక్కులను దిగువకు వదులుతున్నారు. స్థానికంగా కురిసిన వర్షాల వల్ల నాగార్జున సాగర్‌లోకి 2,015 క్యూసెక్కులు చేరుతున్నాయి. ఇక రాష్ట్రంలో కురిసిన వర్షాల ప్రభావంతో మూసీ నుంచి పులిచింతల ప్రాజెక్టులోకి 8,685 క్యూసెక్కులు చేరుతుండటంతో నీటి నిల్వ 18.39 టీఎంసీలకు చేరుకుంది. పులిచింతలకు దిగువన మున్నేరు, వాగులు, వంకల ప్రవాహం వల్ల ప్రకాశం బ్యారేజ్‌లోకి 15,698 క్యూసెక్కులు చేరుతుండగా.. కృష్ణా డెల్టాకు 6,114 క్యూసెక్కులను వదులుతూ మిగులుగా ఉన్న 9,584 క్యూసెక్కులను అధికారులు కడలిలోకి వదిలేస్తున్నారు.

**ఆల్మట్టిలోకి పెరిగిన వరద**

పశ్చిమ కనుమల్లో విస్తారంగా వర్షాలు కురుస్తుండటంతో కృష్ణా ప్రధాన పాయలో ఎగువన వరద ఉధృతి పెరిగింది. ఆల్మట్టి డ్యామ్‌లోకి 1,07,769 క్యూసెక్కులు చేరుతుండటంతో నీటి నిల్వ 54.56 టీఎంసీలకు చేరుకుంది. ఆల్మట్టిలో విద్యుదుత్పత్తి చేస్తూ దిగువకు వదులుతున్న ఆరు వేల క్యూసెక్కులు నారాయణపూర్ డ్యామ్‌కు చేరుతున్నాయి. సోమవారం ఆల్మట్టిలోకి మరింతగా వరద పెరిగే అవకాశం ఉందని అధికారవర్గాలు అంచనా వేస్తున్నాయి.

**తుంగభద్రలోనూ పెరిగిన ప్రవాహం**

తుంగభద్ర డ్యామ్, తుంగ ఆనకట్ట దిగువన కురుస్తున్న వర్షాల ప్రభావం వల్ల తుంగభద్రలో వరద ఉధృతి కొంత పెరిగింది. తుంగభద్ర డ్యామ్‌లోకి 54,657 క్యూసెక్కులు చేరుతుండటంతో నీటి నిల్వ 21.36 టీఎంసీలకు చేరుకుంది.

**ఆదివారం సాయంత్రం 6 గంటలకు కృష్ణా బేసిన్‌లో ప్రధాన ప్రాజెక్టుల్లో నీటి నిల్వ, ప్రవాహాలు ఇలా..**

| ప్రాజెక్టు పేరు | గరిష్ట మట్టం (అడుగుల్లో) | గరిష్ట నిల్వ (టీఎంసీల్లో) | ప్రస్తుత మట్టం (అడుగుల్లో) | ప్రస్తుత నిల్వ (టీఎంసీల్లో) | ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో) | అవుట్‌ఫ్లో (క్యూసెక్కుల్లో) |
|---|---|---|---|---|---|---|
| ఆల్మట్టి | 1705 | 129.72 | 1685.73 | 54.56 | 1,07,769 | 6,671 |
| నారాయణపూర్ | 1615 | 37.64 | 1597.67 | 17.80 | 5,081 | 0 |
| ఉజ్జయిని | 1630 | 117.64 | 1603.61 | 49.52 | 17,544 | 147 |
| జూరాల | 1045 | 9.66 | 1043.54 | 8.75 | 41,925 | 37,930 |
| తుంగభద్ర | 1633 | 105.79 | 1599.86 | 21.36 | 54,657 | 125 |
| శ్రీశైలం | 885 | 215.81 | 808.99 | 33.7 | 22,573 | 0 |
| నాగార్జునసాగర్ | 590 | 312.05 | 516.8 | 143.51 | 2,015 | 8,207 |
| పులిచింతల | 175 | 45.77 | 153.13 | 18.39 | 8,685 | 200 |
| ప్రకాశం బ్యారేజ్ | 57.05 | 57.05 | 3.07 | 3.07 | 15,698 | 15,698 |

# 25న డబుల్ ఇళ్ల కోసం ధర్నా

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి
- ప్రజా సమస్యలపై వరుస ఆందోళనలు

కాచిగూడ/సాక్షి, హైదరాబాద్: పేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు నిర్మించి ఇవ్వకుండా బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి విమర్శించారు. ఆదివారం బర్కత్‌పురాలోని బీజేపీ నగర కార్యాలయంలో పార్టీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎస్.గౌతంరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నిరంకుశ కేసీఆర్‌ను గద్దె దించడం, అర్హులైన పేదలందరికీ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు సాధించడం కోసం ఈ నెల 25వ తేదీన హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద దీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పేదలకు తక్షణమే డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు పంపిణీ చేయనిపక్షంలో బీజేపీ పెద్దఎత్తున ఆందోళన చేస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ నేతలు మర్రి శశిధర్ రెడ్డి, గోలి మధుసూదన్‌రెడ్డి, శ్యామ్‌సుందర్ గౌడ్, నాగూరావు నామాజీ, కేశబోయిన శ్రీధర్, కార్పొరేటర్లు అమృత, కన్నె ఉమారమేశ్ యాదవ్, దీపిక తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా డబుల్ ఇళ్ల అంశంపైనే కిషన్‌రెడ్డి పార్టీ రాష్ట్ర కార్యాలయంలో హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల పార్టీ కోర్ కమిటీ సభ్యులతో కూడా సమావేశమయ్యారు. ఈనెల 25న ఇందిరాపార్కు వద్ద జరిగే ధర్నాకు ఒక్కో జిల్లానుంచి ఐదువేల మందికి తగ్గకుండా జనాన్ని తరలించాలని నిర్ణయించారు. జీహెచ్ఎంసీ పరిధిలోని లబ్ధిదారులకు రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో నిర్మించిన ఇళ్లను ఇవ్వాలనుకోడం సరికాదని, ముందుగా అక్కడి స్థానికులకే ఇళ్లు కేటాయించాలని, తర్వాతే ఇతర ప్రాంతవాసులకు ఇవ్వాలనే డిమాండ్‌ను తెరపైకి తీసుకురావాలని నిర్ణయించారు. ఇళ్ల సమస్యపై ఆందోళన తర్వాత రేషన్‌కార్డులు, పింఛన్ల మంజూరు వంటి అంశాలపై కూడా వరుస ఆందోళనలు నిర్వహించాలని నిర్ణయించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.


సమావేశంలో మాట్లాడుతున్న కిషన్‌రెడ్డి. చిత్రంలో మర్రి శశిధర్‌రెడ్డి తదితరులు

## క్లుప్తంగా...

### విమానంలో అమెరికా మహిళ మూత్ర విసర్జన

**న్యూయార్క్:** విమానంలో మూత్ర విసర్జన ఘటనలు నానాటికి ఎక్కువైపోతున్నాయి. విమానం సిబ్బంది రెండు గంటలుగా టాయిలెట్‌లోకి వెళ్లడానికి నిరాకరించడంతో విమానం ఫ్లోర్‌పైనే ఒక మహిళ మూత్ర విసర్జన చేసిన వీడియో సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. అమెరికాకు చెందిన స్పిరిట్ ఎయిర్‌లైన్స్‌లో ఈ ఘటన జరిగింది. విమాన సిబ్బంది తనని రెస్ట్ రూమ్ వాడనివ్వకుండా అడ్డుకోవడంతో వారితో వాదించిన ఆ మహిళ ఒక మూలగా వెళ్లి తన పని కానిచ్చింది. రెండు గంటలైనా తనకి టాయిలెట్‌లోకి వెళ్లడానికి అంగీకరించకపోవడంతో భరించలేక తాను ఈ పని చేశానని చెబుతోంది. తనపై కేసులు పెట్టుకుంటారో ఇంకేం చేస్తారో అంటూ ఆ మహిళ అంటున్న మాటల్ని సిబ్బంది రికార్డు చేశారు. అయితే ఈ ఘటనపై విమానయాన సంస్థ ఇప్పటివరకు స్పందించలేదు.

### టమాటాలు తినకండి
**యూపీ మంత్రి సలహా**

**లక్నో:** టమాటా ధరలు ఆకాశాన్నంటుతున్న నేపథ్యంలో ఉత్తరప్రదేశ్ మంత్రి ప్రతిభా శుక్లా జనాలకి ఒక ఉచిత సలహా పారేశారు. టమాటా ధరలు దిగి రావాలంటే అందరూ వాటిని తినడం మానేయాలన్నారు. ''మీరు టమాటాలు తినడం మానేస్తే ధరలు వాటంతటవే దిగి వస్తాయి. అసలు టమాటాలు కొనడం ఎందుకు ? మీ ఇళ్లల్లోనే పండించండి. టమాటాకి బదులుగా నిమ్మకాయని వంటల్లో వాడండి. ఎవరూ టమాటాలు కొనకపోతే, తినకపోతే ధరలు అవే తగ్గిపోతాయి'' అని సూచించారు. వీటిపై కాంగ్రెస్ మండిపడింది.

### చార్లీ చాప్లిన్ కూతురు జోసెఫిన్ కన్నుమూత

**లండన్:** దిగ్గజ నటుడు చార్లీ చాప్లిన్ కూతురు, నటి జోసెఫిన్ చాప్లిన్(74) ఈ నెల 13న పారిస్‌లో కన్నుమూశారు. కాంటెర్‌బరీ టేల్స్ వంటి చిత్రాల్లో ఆమె నటించారు. చార్లీ చాప్లిన్ నాలుగో భార్య, నోబెల్ బహుమతి విజేత వూనా ఓ నీల్‌కు పుట్టిన ఈమె.. చాప్లిన్ 11 మంది సంతానంలో ఒకరు. జోసెఫిన్ 1949లో అమెరికాలోని సాంటా మోనికాలో జన్మించారు.



# అంతిమ సంస్కారం

## రాజస్తాన్‌లో గెహ్లోత్ ప్రభుత్వం కొత్త చట్టం
### మృతదేహాలతో ధర్నాలు చేసే పెడ ధోరణులకు అడ్డుకట్ట




మనుషులు ఎలా బతికినా మరణానంతరం కాస్తయినా మర్యాద ఉండాలి. అంతిమ సంస్కారం గౌరవప్రదంగా సాగాలి. కానీ ఈ విషయంలోనూ కొన్నిచోట్ల పెడ ధోరణులు కనిపిస్తున్నాయి. తమ డిమాండ్ల సాధన కోసం మృతదేహాలతో కూర్చొని నిరసన ప్రదర్శనలకు దిగడం మనం చూస్తూనే ఉన్నాం. ఎంతోమంది విషయంలో ఈ అంతిమ యాత్ర సవ్యంగా జరగడం లేదు. రాజస్తాన్‌లో మృతదేహాలతో ధర్నాలు అధికంగా కనిపిస్తూ ఉంటాయి. ఈ రకమైన ట్రెండ్‌కు అడ్డుకట్ట వేయడానికి రాజస్తాన్‌లోని అశోక్ గెహ్లోత్ ప్రభుత్వం ఏకంగా ఒక చట్టాన్నే తీసుకొచ్చింది. ది రాజస్థాన్ ఆనర్ ఆఫ్ డెడ్ బాడీ బిల్లు, 2023'కు గత వారమే అసెంబ్లీ ఆమోద ముద్ర వేసింది.

**- సాక్షి, నేషనల్ డెస్క్**

**చట్టంలో ఉన్నదిదీ...!**
**మరణానంతరం హక్కులుంటాయ్!**

ఎవరైనా వ్యక్తి మరణించిన తర్వాత కూడా వారికి హక్కులుంటాయి. వారి అంతిమ సంస్కారం గౌరవప్రదంగా వారి వారి మతాచారాలు, సంప్రదాయాలకనుగుణంగా నిర్వహించాలి. వ్యక్తి ప్రాణం పోయిన తర్వాత వీలైనంత త్వరగా వారి అంత్యక్రియలు పూర్తి చేయాలి. చనిపోయిన వారి కుమారులు, కూతుళ్లు దూర ప్రాంతం నుంచి రావల్సి ఉంటే తప్ప వెంటనే అంత్యక్రియలు ముగించాలి. ఒక వేళ కుటుంబ సభ్యులు అలా అంత్యక్రియలు పూర్తి చేయకపోతే ప్రభుత్వ అధికారులే ఆ బాధ్యత తీసుకుంటారు.

**మృతదేహాలతో నిరసన కుదరదు**

ఈ చట్ట ప్రకారం మృతదేహాలతో కుటుంబ సభ్యులు నిరసన ప్రదర్శనలు చేయకూడదు. ఏదైనా కారణంగా వాళ్లు అలా నిరసనలకు దిగితే చర్యలు తీసుకునే అధికారం జిల్లా యంత్రాంగానికి ఉంటుంది. వెంటనే ఆ మృత దేహాన్ని స్వాధీనం చేసుకొని అధికారులు తామే అంతిమ సంస్కారం నిర్వహిస్తారు. అంతేకాదు బహిరంగ ప్రదేశాల్లో మృతదేహంతో నిరసనకు దిగినందుకుగాను ఆ కుటుంబసభ్యులకు ఏడాది వరకు జైలు శిక్ష లేదంటే జరిమానా, రెండూ కూడా విధించవచ్చు.

### ఎందుకీ చట్టం?

రాజస్తాన్‌లో మృతదేహాలతో నిరసనలకు దిగడం సర్వసాధారణంగా మారిపోయింది. ప్రాణాలు కోల్పోయి వారం రోజులు గడిచినా దహన సంస్కారాలు నిర్వహించకుండా ఉద్యోగం కోసమో, డబ్బుల కోసమో ఆస్పత్రులు, ఇతర ప్రభుత్వ కార్యాలయాల ఎదుట ధర్నాలకు దిగుతున్నారు. 2014–2018 మధ్య బీజేపీ హయాంలో ఇలాంటి ధర్నాలు 82 వరకు జరిగాయి. 30 వరకు కేసులు నమోదయ్యాయి. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత 2019–2023 మధ్య కాలంలో మృతదేహాలతో ధర్నా కేసులు 306కి పెరిగాయి. అందుకే ఈ చట్టాన్ని తీసుకువచ్చినట్టుగా రాజస్తాన్ శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి శాంతి ధారివాల్ చెప్పారు. మరోవైపు ప్రతిపక్ష బీజేపీ దీనిని వ్యతిరేకించింది. మృతదేహాలతో ధర్నాకు దిగారంటే వారిలో ఎంతటి ఆక్రోశం ఉందో అర్థం చేసుకోవాలే తప్ప వారి ఆగ్రహ ప్రదర్శనని అడ్డుకోవడం సరికాదని వ్యాఖ్యానించింది. రాజస్తాన్‌లో కాంగ్రెస్ సర్కార్‌కు ఇక ప్రజలే అంతిమ సంస్కారం నిర్వహిస్తారంటూ బీజేపీ నేతలు వ్యంగ్యాస్త్రాలు సంధిస్తున్నారు. అయితే ఈ తరహా ఒక చట్టాన్ని చేసిన తొలి రాష్ట్రంగా రాజస్తాన్ చరిత్ర పుటల్లో నిలిచిపోతుంది.

### ఆ మృతదేహాలు పదిలం

ప్రమాదాలు, ఘర్షణలు ఇతర విపత్కర పరిస్థితుల్లో ఎవరైనా మరణించి వారి మృత దేహాన్ని ఎవరూ క్లెయిమ్ చేసుకోని పక్షంలో ఆస్పత్రులు, జిల్లా యంత్రాంగం ఆ మృతదేహం కుళ్లిపోకుండా, దెబ్బ తినకుండా సకల జాగ్రత్తలతో ఫ్రీజర్‌లో భద్రపరచాలి.

### పెనాల్టీ

మృతదేహాల మర్యాదకి ఏ మాత్రం భంగం కలిగిందని భావించినా వివిధ రకాల నేరాలకు వివిధ రకాల శిక్షలూ ఉంటాయి. కుటుంబసభ్యులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకోవడానికి నిరాకరించడం, మృతదేహాలతో నిరసన ప్రదర్శనలకి దిగడం, అలాంటి ప్రదర్శనలకు అనుమతులివ్వడం వంటివి నేరాల కిందకే వస్తాయి. ఆ నేరాలకు ఆరు నెలలు, ఏడాది, రెండేళ్లు, అయిదేళ్లు ఇలా జైలు శిక్ష పడుతుంది

### డేటా బ్యాంకు

ఈ బిల్లులో అన్నింటికంటే ముఖ్యమైనది ఎవరూ గుర్తుపట్టని మృతదేహాల డేటా. ఎవరూ గుర్తు పట్టకుండా ఉన్న మృతదేహాలకు డీఎన్ఏ పరీక్షలు జరిపించి జన్యుపరమైన వారి డేటాను ప్రభుత్వం భద్రపరచాలి. అలా గుర్తు పట్టని శవాలకు శాస్త్రోక్తంగా అంతిమ సంస్కారాలు నిర్వహించినప్పటికీ వారి అస్తికలు, జన్యుపరమైన వివరాలను ఒక డేటా బ్యాంకు ఏర్పాటు చేసి భద్రపరుస్తారు. జిల్లాల వారీగా డిజిటల్ డేటా బ్యాంకుల్ని ఏర్పాటు చేసి అందులో మృతి చెందిన వారి వివరాలు ఉంచుతారు. పోలీసు స్టేషన్లలో వచ్చే మిస్సింగ్ కేసులతో ఆ డేటాను పోల్చడం ద్వారా కనిపించకుండా వెళ్లిన వారు ఏమయ్యారో అన్నదానిపై ఒక క్లారిటీ వస్తుంది. ఇక ఈ డేటాను అధికారులెవరైనా బయటపెడితే మూడేళ్ల నుంచి పదేళ్ల వరకు జైలు శిక్ష పడుతుంది.

## ట్విట్టర్ పక్షులకు వీడ్కోలు చెప్పేస్తా
### 'ఎక్స్' యాప్‌గా రీబ్రాండ్ చేస్తా: ఎలాన్ మస్క్

**న్యూయార్క్:** ట్విట్టర్.. ఈ సోషల్ మీడియా వేదిక గురించి తెలియని నెటిజన్లు ఉండరు. నీలి రంగు ట్విట్టర్ పిట్ట అందరికీ సుపరిచితమే. ఈ పిట్ట ఇకపై కనిపించదు. ఈ విషయాన్ని ట్విట్టర్ యజమాని, బిలియనీర్ ఎలాన్ మస్క్ స్వయంగా ప్రకటించారు. తమ యాప్ లోగోను మార్చనున్నట్టు ఆదివారం వెల్లడించారు. ట్విట్టర్‌ను రీబ్రాండ్ చేయనున్నట్టు తెలియజేశారు. చైనాకు చెందిన వియ్‌చాట్ తరహాలో అన్నింటికీ పనికొచ్చే 'ఎక్స్' యాప్‌ను రూపొందించాలని ఆయన కొంత కాలంగా యోచిస్తున్నారు. ఇది కేవలం సోషల్ మీడియా వేదికగానే కాకుండా ఆన్‌లైన్ చెల్లింపులకు, ఆహారాన్ని ఆర్డర్ చేయడానికి పనికొస్తుంది. చాలా రకాల సేవలు అందించేలా ఎక్స్ యాప్‌ను తీర్చిదిద్దాలని భావిస్తున్నారు. ఇందులో భాగంగానే ట్విట్టర్‌ను త్వరలో 'ఎక్స్' యాప్‌గా రీబ్రాండ్ చేయనున్నట్టు తెలుస్తోంది. 'త్వరలోనే మేం ట్విట్టర్ బ్రాండ్‌కు.. ఆ తర్వాత క్రమంగా నీలి రంగు ట్విట్టర్ పక్షులకు వీడ్కోలు పలుకనున్నాం' అని ఎలాన్ మస్క్ తాజాగా ట్వీట్ చేశారు. ఎక్స్ యాప్‌నకు కొత్త లోగోను సూచించాలని ఆయన కోరారు. ఎలాన్ మస్క్ గత ఏడాది ట్విట్టర్‌ను కొనుగోలు చేశారు. సంస్థలో పలు మార్పులకు శ్రీకారం చుట్టారు. ట్విట్టర్ బిజినెస్





పేరును ఎక్స్ కార్పొరేషన్‌గా మార్చారు. ట్విట్టర్ ఈ ఏడాది ఏప్రిల్‌లో ఎక్స్ కార్పొరేషన్‌లో చట్టబద్ధంగా విలీనమైంది.

## 808 ఎఫ్ఎం రేడియో స్టేషన్లకు త్వరలో ఈ వేలం

**న్యూఢిల్లీ:** దేశవ్యాప్తంగా 284 నగరాల్లో 808 ఎఫ్ఎం రేడియో స్టేషన్ల ఏర్పాటుకు ప్రభుత్వం త్వరలోనే ఈ వేలం నిర్వహించనుందని కేంద్ర సమాచార ప్రసార మంత్రి అనురాగ్ ఠాకూర్ వెల్లడించారు. ప్రస్తుతం దేశంలోని 26 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లోని 113 నగరాల్లో 388 ఎఫ్ఎం స్టేషన్లు నడుస్తున్నాయని చెప్పారు. కవరేజీ పెంచేందుకు గాను మారుమూల ప్రాంతాల్లోనూ రేడియో టవర్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. కమ్యూనిటీ రేడియోలు సహా రేడియో స్టేషన్లకు లైసెన్స్ జారీ ప్రక్రియను సులభతరం చేశామన్నారు. టయర్–2, 3 నగరాల్లోనూ విస్తరించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. ఆలిండియా రేడియో ఎఫ్ఎం ట్రాన్స్‌మిటర్ల ద్వారా దేశంలోని భౌగోళిక ప్రాంతాన్ని 59 శాతం నుంచి 66 శాతానికి, జనాభాలో 68 నుంచి 80 శాతం మందికి సేవలందించడమే లక్ష్యంగా పెట్టుకున్నామని వెల్లడించారు. మారుమూల, గిరిజన, వామపక్ష తీవ్రవాద ప్రాబల్య ప్రాంతాల్లోని వారికి ఉచితంగా 8 లక్షల డీడీ ఫ్రీ డిష్ సెట్ టాప్ బాక్సులను అందజేయనున్నామని తెలిపారు.

## పాక్ ఆపద్ధర్మ ప్రధానిగా ఇషాఖ్ దార్!



**ఇస్లామాబాద్:** పాకిస్తాన్ ఆపద్ధర్మ ప్రధానమంత్రిగా ఆర్థిక మంత్రి ఇషాఖ్ దార్ (73) పేరు తెరపైకి వచ్చింది. షెహబాజ్ షరీఫ్ ప్రభుత్వ పదవీ కాలం ఆగస్టు 14న ముగియనుంది. కానీ 8వ తేదీనే జాతీయ అసెంబ్లీని రద్దు చేయాలని ప్రధాని నిర్ణయించుకున్నట్లు పాక్ మీడియా ఆదివారం వెల్లడించింది. కొత్త ప్రభుత్వం ఏర్పాటయ్యేదాకా ఇషాఖ్ దార్‌ను ఆపద్ధర్మ ప్రధానమంత్రిగా కొనసాగిస్తారని తెలియజేసింది. ఆయన పేరును అధికార పాకిస్తాన్ ముస్లిం లీగ్–నవాజ్ పార్టీ ప్రతిపాదించింది. పాక్ ఇప్పుడు ఆర్థిక సంక్షోభంలో చిక్కుకుంది. అంతర్జాతీయ సంస్థల నుంచి అప్పుల కోసం, విదేశాల నుంచి పెట్టుబడుల కోసం ప్రయత్నిస్తోంది. రుణాలు, పెట్టుబడులతో ఆర్థికంగా కుదురుకోవడానికి చాలా సమయం పట్టనుంది. ఇప్పట్లో ఎన్నికలు నిర్వహించేందుకు షరీఫ్ ప్రభుత్వం ఇష్టపడడంలేదు. అందుకే ఆపద్ధర్మ ప్రభుత్వంతో నెట్టుకురావాలని భావిస్తోంది. పాకిస్తాన్ రాజ్యాంగం ప్రకారం.. జాతీయ అసెంబ్లీ పదవీ కాలం పూర్తయితే 60 రోజుల్లోగా ఎన్నికలు నిర్వహించాల్సి ఉంటుంది. కానీ, జాతీయ అసెంబ్లీని పదవీ కాలం ముగియకముందే రద్దు చేస్తే 90 రోజుల్లోగా ఎన్నికలు నిర్వహించవచ్చు. కొత్త ప్రభుత్వం కొలువుదీరే దాకా ఆపద్ధర్మ ప్రధానమంత్రి పరిపాలన సాగిస్తారు. ఆపద్ధర్మ ప్రధానిగా ఇషాఖ్ దార్ నియామకంపై పాకిస్తాన్ ప్రభుత్వం వచ్చేవారం తుది నిర్ణయం తీసుకోనున్నట్లు తెలిసింది.

## బోరు బావిని జయించాడు
### మృత్యుంజయుడిగా తిరిగొచ్చిన శుభమ్



**నలంద:** బిహార్‌లో నలంద జిల్లా కుల గ్రామంలో 40 అడుగుల లోతైన బోరుబావిలో పడిపోయిన మూడేళ్ల బాలుడు మృత్యుంజయుడై తిరిగి వచ్చాడు. ఇంటికి సమీపంలో ఆడుకుంటున్న శుభమ్ కుమార్ అనే బాలుడు తెరిచి ఉన్న బోరు బావిలో ప్రమాదవశాత్తూ పడిపోయాడు. ప్రమాదం విషయం తెలిసిన జాతీయ విపత్తు సహాయ బృందం రంగంలోకి దిగింది. దాదాపుగా అయిదు గంటల సేపు శ్రమ పడి శుభమ్‌ను కాపాడింది. బోరు బావిని తవ్విన ఒక రైతు అందులో నీళ్లు పడకపోవడంతో దానిని మూసేయకుండా అలాగే ఉంచేయడంతో ఈ ప్రమాదం జరిగింది. సహాయ కార్యక్రమాలు నిర్వహిస్తున్నప్పుడు బోరుబావిలో పడిన శుభమ్ సీసీటీవీ కెమెరాలకి చిక్కడం, రాళ్లు రప్పలు చిమ్మ చీకట్లో ఒంటరిగా ఏడుస్తున్న దృశ్యాలు చూసిన వారి గుండెలు పిండేశాయి. ఎన్‌డీఆర్ఎఫ్ సిబ్బంది ఎలాగైతేనేం బాలుడి ప్రాణాలు కాపాడి చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. బోరుబావిలో చిన్నారులు పడిపోతున్న ఘటనలు ఎన్ని జరుగుతున్నా వాటిని మూసి ఉంచకుండా నిర్లక్ష్యంగా వదిలివేసే వైఖరిపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

## ప్రియుడ్ని కలవాలని ఊరికే కరెంటు కట్!

**పాట్నా:** బిహార్‌లో పశ్చిమ చంపారన్ జిల్లా బెట్టియా గ్రామానికి చెందిన ప్రీతి అనే అమ్మాయి తన ప్రియుడ్ని కలుసుకోవడం కోసం ఏకంగా గ్రామానికే కరెంట్ కట్ చేయడం మొదలు పెట్టింది. పొరుగు గ్రామానికి చెందిన రాజ్‌కుమార్ అనే తన బాయ్ ఫ్రెండ్‌ని కలుసుకోవడానికి రాత్రయితే పవర్ కట్ చేయసాగింది. ఆ చిమ్మచీకట్లో ప్రియుడితో ప్రేమాయణం సాగించేది. వరసగా వారం రోజుల పాటు రాత్రయితే కరెంట్ పోతూ ఉండడంతో గ్రామస్తులకి అనుమానం వచ్చి మాటు వేసి చూడగా ప్రీతి నిర్వాకం బయటపడింది. వారిద్దరి ప్రేమాయణం సంగతేమో కానీ గ్రామంలో దొంగతనాలు కూడా పెరిగాయి. దీంతో గ్రామస్తులు కాపలా కాసి మరీ వారిద్దరిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఆ తర్వాత ఇరు గ్రామాల పెద్దలు వారికి గుళ్లో పెళ్లి చేశారు.

# మొయితీల వలసబాట

**మిజోరాం నుంచి అస్సాంకు..**
- మాజీ మిలిటెంట్ గ్రూప్ నుంచి మొయితీలకు బెదిరింపులు
- బాధితులకు పూర్తి రక్షణ కల్పిస్తున్నామన్న మిజోరం ప్రభుత్వం



**గువాహటి/కోల్‌కతా:** కల్లోల మణిపూర్‌లో తెగల మధ్య రాజుకున్న మంటలు ఆరడం లేదు. బాధితులు ప్రాణభయంతో రాష్ట్రం విడిచి వెళ్లిపోతున్నారు. సురక్షిత ప్రాంతాలను వెతుక్కుంటూ పొరుగు రాష్ట్రాలకు చేరుకుంటున్నారు. సొంత రాష్ట్రంలో పరిస్థితులు కుదుటపడేదాకా మరోచోట తలదాచుకోవడమే మేలని భావిస్తున్నారు. ఇద్దరు గిరిజన మహిళలను దిగంబరంగా ఊరేగించిన ఘటన బయటపడిన తర్వాత మొయితీ తెగ ప్రజల్లో భయాందోళన మరింత పెరిగిపోయింది. ఇప్పటికే మిజోరాంలో ఉంటున్న మణిపూర్ మొయితీల్లో ప్రాణ భయం మొదలైంది. మాజీ మిలిటెంట్ గ్రూప్ నుంచి బెదిరింపులు రావడమే ఇందుకు కారణం. 41 మంది మొయితీలు శనివారం రాత్రి మిజోరాం నుంచి అస్సాంలోని సిల్చార్‌కు చేరుకున్నారు. వారికి బిన్నాకండీ ఏరియాలోని లఖీపూర్ డెవలప్‌మెంట్ బ్లాక్ కార్యాలయ భవనంలో ఆశ్రయం కల్పించినట్లు పోలీసులు వెల్లడించారు. వీరంతా ఆర్థికంగా మెరుగైన స్థానంలో ఉన్న వారేనని, సొంత వాహనాల్లో అస్సాం దాకా వచ్చారని పేర్కొన్నారు. ఈ 41 మంది మొయితీల్లో కాలేజీ ప్రొఫెసర్లు, ప్రభుత్వ సీనియర్ అధికారులు కూడా ఉన్నారని తెలియజేశారు. మిజోరంలో ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాలేదని వారు చెప్పారని వివరించారు. అయినప్పటికీ అక్కడ రిస్క్ తీసుకోవడం ఇష్టంలేక అస్సాంకు వచ్చామంటూ తమతో పేర్కొన్నారని వెల్లడించారు. బాధితులకు పూర్తి రక్షణ కల్పిస్తున్నట్లు అస్సాం పోలీసులు ఉద్ఘాటించారు.

### వదంతులు నమ్మొద్దు: మిజోరాం ప్రభుత్వం

మణిపూర్‌లో మే 3వ తేదీ నుంచి ఘర్షణలు ఉధృతమయ్యాయి. ఇప్పటిదాకా వేలాది మంది మొయితీలతోపాటు గిరిజన తెగలైన కుకీలు, హమర్ ప్రజలు వలసబాట పట్టారు. వీరిలో చాలా మంది అస్సాంలో ఆశ్రయం పొందుతున్నారు. ఇదిలా ఉండగా, వెంటనే రాష్ట్రం విడిచి వెళ్లిపోవాలంటూ మిజోరంలో తలదాచుకుంటున్న మణిపూర్ మొయితీలకు మాజీ తీవ్రవాద గ్రూపు నుంచి బెదిరింపులు వచ్చినట్లు వార్తలు వెలువడ్డాయి. ఈ మాజీ మిలిటెంట్ గ్రూప్‌నకు కుకీ అనుకూల వర్గంగా పేరుంది. తమ రాష్ట్రంలో ఉంటున్న బాధితులకు పూర్తిస్థాయిలో రక్షణ కల్పిస్తున్నామని, వదంతులు నమ్మొద్దని మిజోరం ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది. బెదిరింపులు తట్టుకోలేక కొందరు మొయితీలు మిజోరం నుంచి సొంత రాష్ట్రం మణిపూర్‌కు వెళ్లిపోయినట్లు తెలిసింది. మణిపూర్‌లో మహిళలను నగ్నంగా ఊరేగించిన ఘటన మే 4న చోటుచేసుకుంది. మే 15న ఇంఫాల్‌లో 18 ఏళ్ల బాలికలపై గ్యాంగ్ రేప్ జరిగిందంటూ తృణమూల్ కాంగ్రెస్ పార్టీ ఆరోపించింది.

## గ్రీజ్ అంటిన చేతితో తాకాడని.. దళితుడి ఒంటికి మలం రాశాడు!

**చత్తర్‌పూర్:** అనుకోకుండా గ్రీజ్ పూసిన చేతితో తాకినందుకు ఓబీసీ కులానికి చెందిన ఓ వ్యక్తి తనకు మలం పూశాడంటూ మధ్యప్రదేశ్‌కు చెందిన ఓ దళితుడు ఆరోపించడం కలకలం రేపుతోంది. ఈ ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. దశరథ్ అహిర్వార్ అనే వ్యక్తి బికౌరా గ్రామంలో పంచాయతీ మురుగుకాల్వ నిర్మాణ పనులు చేస్తున్నాడు. సమీపంలోని చేతి పంపు వద్ద రామ్‌కృపాల్ పటేల్ స్నానం చేస్తున్నాడు. గ్రీజ్ అంటిన చేతితో తాకడంతో ఆగ్రహించిన పటేల్ చేతిలోని మగ్గుతో మలాన్ని తీసుకువచ్చి అహిర్వార్ ముఖం, తల సహా ఒంటిపై రాశాడు. కులం పేరుతో దూషించాడు. పంచాయతీ పెద్దలు అహిర్వార్‌కు రూ.600 జరిమానా కూడా విధించారు. బాధితుడు కేసు పెట్టడంతో పటేల్‌పై కేసు నమోదయ్యాయి. వారు సరదాగా వస్తువులు విసిరేసుకున్నారు. అది కాస్తా ఇలా వికటించినట్టు విచారణలో తేలిందని పోలీసులు చెప్పారు. కాగా, మధ్యప్రదేశ్‌లోని సిద్ధి జిల్లాలో గిరిజన యువకుడిపై ఒక వ్యక్తి మూత్రవిసర్జన చేసిన ఘటనపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తమైన విషయం తెలిసిందే.

## ఏఎస్ఐ సర్వేపై సుప్రీంకోర్టుకు జ్ఞానవాపి మసీదు కమిటీ

**న్యూఢిల్లీ:** యూపీలోని వారణాసిలో ఉన్న జ్ఞానవాపి మసీదు ఆవరణలో శాస్త్రీయ సర్వే చేపట్టాలన్న వారణాసి కోర్టు ఉత్తర్వులపై మసీదు నిర్వహణ కమిటీ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. తమ పిటిషన్‌పై సత్వరమే విచారణ చేపట్టాలని కోరింది. ఈ పిటిషన్ సోమవారం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ ముందుకు రానుంది. జ్ఞానవాపి మసీదుకు సంబంధించిన అన్ని ఉత్తర్వులపై వెంటనే స్టే ఇవ్వాలని మసీదు కమిటీ కోరుతోంది. ఇప్పటికే జూలై మొదటి వారంలోనే ఈ పిటిషన్ వేసింది. అయితే, విశ్వనాథుని ఆలయాన్ని అనుకుని ఉన్న జ్ఞానవాపి మసీదు ఆవరణలో సర్వే చేపట్టాలంటూ వారణాసి కోర్టు ఇచ్చిన ఆదేశాల నేపథ్యంలో మసీదు కమిటీ సత్వర విచారణ కోరుతోంది.

### ట్రంపెట్లోయ్... ట్రంపెట్లు...!



అల్‌ఫోర్న్.. ఇది స్విట్జర్లాండ్‌కు చెందిన జానపద సంగీత పరికరం. స్విట్జర్లాండ్‌లోని ట్రాకోయెట్ పర్వత పచ్చిక బయళ్లపై ఈ నెల 23న 22వ అంతర్జాతీయ అల్‌ఫోర్న్ ఉత్సవం జరిగింది. చివరి రోజున దేశవిదేశాల నుంచి 100 మంది వరకు అల్‌ఫోర్న్ కళాకారులు కలిసి ప్రదర్శన ఇచ్చారు.

## మళ్లీ యమున ఉగ్రరూపం

- ప్రమాద హెచ్చరికను మించిన ప్రవాహం
- ఢిల్లీకి మళ్లీ వరద ముప్పు

**న్యూఢిల్లీ:** ఢిల్లీలో యమునా నది మరోసారి ఉగ్రరూపం దాల్చింది. ఆదివారం ప్రమాదహెచ్చరికను దాటి ప్రవహిస్తోంది. ఎగువన హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్‌ల్లో భారీ వర్షాలు కురుస్తుండటంతో హరియాణాలోని హత్నికుండ్ రిజర్వాయర్ నిండుకుండలా మారింది. దీంతో 2 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఈ నెల 13న యమునలో వరద ప్రవాహం గరిష్ట స్థాయిలో 208.66 మీటర్లకు చేరింది. కొన్ని రోజులుగా ప్రమాద హెచ్చరిక 205.33 మీటర్లకు అటూ ఇటుగా ప్రవహిస్తోంది. ఆదివారం ఉదయం 205.96 మీటర్లుగా ఉన్న నీటి మట్టం సాయంత్రానికి 206.7 మీటర్లకు చేరుకుందని కేంద్ర జల సంఘం(సీడబ్ల్యూసీ) తెలిపింది. నీటి మట్టం మరింత పెరిగే ప్రమాదముందన్న హెచ్చరికల నేపథ్యంలో ఢిల్లీలోని లోతట్టు ప్రాంతాల్లో వారం రోజులుగా కొనసాగుతున్న సహాయ పునరావాస కార్యక్రమాలకు ఆటంకం ఏర్పడేలా కన్పిస్తోంది.



వరదబాధితులు సహాయక శిబిరాల్లోనే మరికొన్ని రోజులు గడపాల్సి ఉంటుందన్నారు. వజీరాబాద్ పంప్‌హౌస్‌ను వరద నీరు చుట్టుముట్టడం నగరంలోని 25% ప్రాంతంలో నాలుగైదు రోజులుగా నీటి సరఫరా నిలిచిపోయింది. మంగళవారం తర్వాత మాత్రమే నీటి సరఫరాను పునరుద్ధరించేందుకు అవకాశాలున్నాయని అధికారులు చెప్పారు. ఈ నెల 25వ తేదీ వరకు ఎగువన ఉన్న హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్‌ల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయన్న వాతావరణ విభాగం(ఐఎండీ) హెచ్చరికలతో ఢిల్లీ యంత్రాంగం అప్రమత్తమైంది.

## సీబీఎస్ఈ బోధన... ఇకపై తెలుగులో కూడా

**భువనేశ్వర్:** ఉన్న సీబీఎస్ఈ (సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్) స్కూళ్లలో విద్యార్థులు ఇకపై తెలుగుతో పాటు 22 భారతీయ భాషల్లో చదువుకోవచ్చు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఆదివారం ఈ మేరకు వెల్లడించారు. ప్రస్తుతం వాటిల్లో హిందీ, ఇంగ్లిష్ మీడియాల్లో మాత్రమే చదువుకునేందుకు వీలుంది. ఇకపై రాజ్యాంగంలోని ఎనిమిదో షెడ్యూల్‌లో గుర్తించిన తెలుగు, బెంగాలీ, కన్నడ, కొంకణి, మరాఠీ, పంజాబీ, సంస్కృతం, తమిళం, మైథిలి, డోగ్రీ వంటి 22 భాషల్లో తమకిష్టమైన వాటిలో చదువుకోవచ్చు. పరీక్షలు కూడా ఆయా భాషల్లోనే జరుగుతాయి.

### ఆజాద్, తిలక్‌కు మోదీ నివాళులు


**న్యూఢిల్లీ:** స్వాతంత్ర్య యోధులు చంద్రశేఖర్ ఆజాద్, బాలగంగాధర్ తిలక్ జయంతి సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆదివారం వారికి ఘనంగా నివాళులర్పించారు. వారి ధైర్య సాహసాలు ఎప్పటికీ స్ఫూర్తిగా నిలుస్తాయంటూ ట్వీట్ చేశారు. మాతృభూమికి విముక్తి కలిగించడానికి ఆజాద్, 'పూర్ణ స్వరాజ్' నినాదంతో తిలక్ తన జీవితాన్నే త్యాగం చేశారని పేర్కొన్నారు.



ఈ ఫొటోలోని వారి చేతుల్లో ఉన్నవి చిన్నారుల మృతదేహాలు. అఫ్గానిస్తాన్‌లోని మైదాన్ వర్ధాక్ ప్రావిన్స్ జల్‌రెజ్ జిల్లాలో శనివారం అర్ధరాత్రి సంభవించిన ఆకస్మిక వరదల్లో 30 మందికి పైగా మృతి చెందగా మరో 40 మంది కనిపించకుండాపోయారు. మృతుల్లో చిన్నారులు కూడా ఉన్నారు. మరో 600కు పైగా నివాసాలు పూర్తిగా, పాక్షికంగా దెబ్బతిన్నాయని, వందలాది ఎకరాల్లో పంటలు నేలకొరిగాయని తాలిబన్ ప్రభుత్వం తెలిపింది. వరదల కారణంగా రాజధాని కాబూల్–సెంట్రల్ బమియాన్ ప్రావిన్స్ రహదారిని మూసివేశారు.

సాక్షి
కరీంనగర్
సోమవారం । 24 । జూలై । 2023





## మిడ్‌మానేరుకు వరద

బోయినపల్లి: మిడ్‌మానేరులోకి వరద వచ్చి చేరుతోంది. ఆదివారం ఎల్‌ఎండీకి 1,530 క్యూసెక్కులు వెళ్తుండగా.. ప్రస్తుతం ప్రాజెక్టులో 15.38 టీఎంసీల మేర నీరు నిల్వ ఉంది.



## కంగ్రాట్స్.. సార్

కరీంనగర్‌అర్బన్: రెండేళ్లు పదవీకాలం పూర్తి చేసుకున్న కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్‌కు అధికారులు శుభాకాంక్షలు తెలిపారు. అదనపు కలెక్టర్ శ్యాం ప్రసాద్‌లాల్, ఆర్డీవో మహేశ్వర్, అధికారులు పుష్పగుచ్ఛం అందజేశారు.

గరిష్టం/కనిష్టం
29.0/25.0

## వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లాలో వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. ఈదురు గాలులు వేగంగా వీస్తాయి.

# ధాన్యం దాచుకుని..
# బియ్యం అమ్ముకుని

గతంలో రామడుగు మండలం కొక్కెరకుంటలో ఎస్‌ఆర్‌కే రైస్‌మిల్లుకు ధాన్యం కేటాయించారు. ఓసారి అధికారులు మిల్లులో రికార్డులు పరిశీలించారు. భౌతికంగా ధాన్యం నిల్వలను సరిచూశారు. 3,780క్వింటాళ్ల ధాన్యం లేకపోవడంతో నిర్ఘాంతపోవడం అధికారుల వంతయ్యింది.

ఈ నెల 11న టాస్క్‌ఫోర్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు హుజూరాబాద్‌లోని పలు రైస్‌మిల్లుల్లో తనిఖీలు చేశారు. సీఎంఆర్ ధాన్యం లెక్కలు తప్పుగా ఉండగా.. అసలు ధాన్యమే లేకపోవడం విడ్డూరం. రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ చైర్మన్ రవీందర్‌సింగ్ స్వయంగా రంగంలోకి దిగి నిల్వలు పరిశీలించగా మహాలక్ష్మి రైస్‌మిల్లులో సుమారు 4వేల క్వింటాళ్ల ధాన్యం తక్కువగా ఉందని గుర్తించారు. వరుణ్ ఇండస్ట్రీస్‌లో సీఎంఆర్ ధాన్యమే లేకపోగా మిల్లును సీజ్ చేశారు. లక్ష్మిగణపతి మిల్లులో 3817బస్తాలు తక్కువగా ఉండటాన్ని అధికారులు తీవ్రంగా పరిగణించారు.

ఈ నెల 15న సివిల్ సప్లై విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు హుజూరాబాద్ మండలం రాంపూర్‌లోని తిరుమల ఇండస్ట్రీస్ మిల్లును తనిఖీ చేశారు. ఇంతవరకు ఒక్క ఏసీకే బియ్యాన్ని కూడా పెట్టలేదని గుర్తించారు. 3,931 క్వింటాళ్ల ధాన్యం వ్యత్యాసం ఉందని తేల్చారు.

- జిల్లాలో మిల్లర్ల మాయాజాలం
- ప్రభుత్వం ఇచ్చిన ధాన్యం మాయం
- ఇతర రాష్ట్రాలకు తరలుతున్న బియ్యం
- రూ.కోట్ల సొమ్ములో ఎవరివాటా ఎంత?
- ఏటా జిల్లాలో సాగుతున్న అక్రమ దందా



ఇటీవల మిల్లులో తనిఖీ చేస్తున్న అధికారులు

కరీంనగర్ అర్బన్: సీఎంఆర్.. పెట్టుబడి లేని దందా. ప్రభుత్వ సొమ్ముతో మిల్లర్లు దర్జాగా రూ.కోట్లు దండుకుంటున్నారు. రేషన్‌బియ్యాన్ని సీఎంఆర్‌గా ఎఫ్‌సీఐకి అప్పగించిన ఘటనలు జిల్లాలో ఇప్పటికే వెలుగుచూడగా.. తాజాగా ప్రభుత్వమిచ్చిన ధాన్యాన్నే మాయం చేస్తున్నారు. హుజూరాబాద్‌లోని పలు మిల్లుల వ్యవహారం అనేక అనుమానాలకు తావిస్తోంది. ఇంత జరుగుతున్నా పౌరసరఫరాలశాఖ ఏం చేస్తోందన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. జిల్లావ్యాప్తంగా మిల్లులను పరిశీలిస్తే ఇలాంటివెన్నో వెలుగుచూస్తాయన్న వాదనలు వినవస్తున్నాయి.

**వేల క్వింటాళ్లు ఇతర రాష్ట్రాలకు..**

జిల్లాలో కరీంనగర్, మానకొండూరు, హుజూరాబాద్, తిమ్మాపూర్, జమ్మికుంట ప్రాంతాల్లో అధికంగా రైస్‌మిల్లులున్నాయి. ఏటా ధాన్యం కొనుగోలు తదుపరి మిల్లులకు కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) చేసి ఇవ్వడం పరిపాటి. కానీ జిల్లాలోని హెచ్చు మిల్లుల్లో అక్రమ దందా సాగుతోంది. తాజాగా హుజూరాబాద్ శివారు ప్రాంతాలతోపాటు రాంపూర్‌లో జరిగిన తనిఖీలో అక్రమాలు బహిర్గతమయ్యాయి. ప్రభుత్వమిచ్చిన ధాన్యాన్ని మిల్లింగ్ చేసి సదరు బియ్యాన్ని మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్‌కు తరలించారని తెలుస్తోంది. చట్టపరచర్యల నుంచి తప్పించుకునేందుకు భారీస్థాయిలో పైరవీలు చేస్తున్నట్లు సమాచారం. బియ్యం క్వింటాల్‌కు రూ.2,500కు లెక్కకట్టినా ఇప్పటివరకు వెలుగుచూసిన అక్రమాల విలువ రూ.5కోట్ల వరకు ఉంటుందని అంచనా.

**అధికారుల సహకారంతోనే..**

రైస్‌మిల్లులకు ధాన్యం కేటాయింపు తదుపరి ఎఫ్‌సీఐకి చేరేవరకు పౌరసరఫరాలశాఖ పర్యవేక్షణ తప్పనిసరి. సివిల్ సప్లయ్ ఇన్‌స్పెక్టర్(ఎఫ్ఐ), పౌరసరఫరాల నాయబ్ తహసీల్దార్లు వారిపరిధిలో నిరంతర నిఘా ఉంచాలి. కానీ సదరు అధికారుల పర్యవేక్షణ డొల్లతనం చెప్పకనే చెబుతోంది. మామూళ్లే పైచేయిగా మారాయన్న వాదనలు వినిపిస్తున్నాయి. విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు రంగంలోకి దిగేవరకు అక్రమాలు వెలుగుచూడలేదంటే ఆశాఖ పనితీరు అర్థమవుతోంది. గతంలో ఇలాంటి ఘటనలు వెలుగుచూడగా పూర్తిస్థాయి విచారణ లేకుండానే చేతులు దులుపుకున్నారన్న విమర్శలున్నాయి.

**ఆర్‌ఆర్ యాక్ట్ అంతేనా..**

2011-12 నుంచి 2014-16 ఏడాది వరకు ఉమ్మడి జిల్లాపరిధిలో 18మిల్లులు సీఎంఆర్ కింద ఇవ్వాల్సిన 90,407 క్వింటాళ్ల బియ్యాన్ని ఇవ్వలేదు. సదరు మిల్లులపై పౌరసరఫరాల శాఖ గతంలోనే కేసులు నమోదు చేయించింది. వివిధ రకాల కేసులు పెట్టగా రాజకీయ, ధన ప్రవాహంతో నామమాత్రంగా వ్యవహరించారని స్పష్టమవుతోంది. కేసులు నమోదై ఏళ్లు గడుస్తున్నా ఒక్క మిల్లరు బకాయి సీఎంఆర్ ఇవ్వకపోవడం పర్యవేక్షణ తీరుకు తార్కాణం.

### సీఎంఆర్ పెట్టుబడి లేని ఆదాయం

- ధాన్యం ఉత్పత్తిలో కరీంనగర్ పాత్ర కీలకం. జిల్లాలో 150కి పైగా రైస్‌మిల్లులుండగా ఐకేపీ, డీసీఎంఎస్, పీఏసీఎస్‌ల ద్వారా కొనుగోలు చేసిన ధాన్యం సీఎంఆర్ కింద మిల్లులకు పౌరసరఫరాలశాఖ కేటాయిస్తోంది.
- బాయిల్డ్ రైస్ అయితే క్వింటాల్‌కు 67కిలోలు, రారైస్‌కు 68కిలోలు తిరిగి మిల్లర్లు ఇవ్వాల్సి ఉంటుంది. ధాన్యాన్ని బియ్యంగా మార్చి ఇచ్చేందుకు రూ.35ను పౌరసరఫరాలశాఖ చెల్లిస్తోంది.
- 2021-22 వానాకాలం, యాసంగి సీజన్లలో కేటాయించిన సీఎంఆర్ ధాన్యంలో 18,907.967 మెట్రిక్ టన్నుల బియ్యం అప్పగించాల్సి ఉంది.
- 2022-23 వానాకాలం సీజన్‌లో 2,86,900.440 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించి మిల్లర్లకు అప్పగించారు. ఇందుకు 1,98,923.295 మెట్రిక్ టన్నులు తిరిగి ఇవ్వాల్సి ఉండగా కేవలం 48,314 మెట్రిక్ టన్నులు మాత్రమే అప్పగించారు.
- ఈ యాసంగి సీజన్‌లో 3,61,224.880 మెట్రిక్ టన్నుల ధాన్యం మిల్లులకు కేటాయించగా మరాడించిన బియ్యాన్ని 2,45,632.918 మెట్రిక్ టన్నుల బియ్యం తిరిగి ఇవ్వాలి. కానీ ఇప్పటివరకు కేవలం 13,050 మెట్రిక్ టన్నుల బియ్యం మాత్రమే ఇచ్చారు.
- కాగా హెచ్చు మిల్లర్లు సీఎంఆర్‌తో వ్యాపారం చేస్తున్నట్లు పౌరసరఫరాల విజిలెన్స్, స్పెషల్ టాస్క్‌ఫోర్స్ దాడుల్లో పలుమార్లు వెల్లడైంది. సదరు సమయాల్లో సంఘం నేతలు పలుకుబడి ఉపయోగించి పైఅధికారులను బుజ్జగించి నామమాత్రపు కేసులతో బయటపడ్డారు.

## న్యూస్‌రీల్

### స్వచ్ఛ సర్వేక్షణ్‌కు సహకరించండి



నీటి సంప్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ కర్ణన్

రామడుగు(చొప్పదండి): స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ (ఎస్ఎస్‌జీ)2023కు జిల్లా, మండల అధికారులు సమన్వయంతో పనిచేసి సహకరించాలని కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్ సూచించారు. ఆదివారం రామడుగు మండలం రాంచంద్రాపూర్, గోపాలరావుపేట గ్రామాల్లో యూనిసెఫ్ రాష్ట్ర ప్రతినిధులు వెంకటేశ్, కాశీనాథ్‌తో కలిసి పర్యటించారు. రాంచంద్రాపూర్ అంగన్‌వాడీ కేంద్రంలో యూనిసెఫ్ ఆధ్వర్యంలో జరిగిన టాయిలెట్ మరమ్మతు పనులు పరిశీలించి వెంటనే అక్కడ అంగన్‌వాడీ కేంద్రం నడిచేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. గోపాలరావుపేట గ్రామపంచాయతీ కార్యాలయం, పలు నివాస గృహాలను సందర్శించారు. మరుగుదొడ్ల వినియోగం, ఇంకుడుగుంతలు, పరిశుభ్రత తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. రామడుగులో నర్సరీ వద్ద డ్రాగన్ ఫ్రూట్స్ మొక్కల పెంపకం చూసి పంచాయతీ కార్యదర్శి రేవంత్‌రెడ్డిని ప్రశంసించారు. కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శ్రీలత, డీపీవో వీర బుచ్చయ్య, ఎంపీడీఓ భాస్కరరావు, తహసీల్దార్ రాజ్‌కుమార్, యూనిసెఫ్ సమన్వయకర్త కిషన్‌స్వామి, సర్పంచులు పంజాల ప్రమీల, చాడ ప్రసూన, అధికారులు పాల్గొన్నారు.

### గుండెనిండా అనుబంధాలతో వెళ్తున్నా..



మిత్రబృందంతో అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్

కరీంనగర్‌అర్బన్: గుండె నిండా అనుభూతులు నింపుకొని, అనుభవాలను మూటగట్టుకుని, అనుబంధాలు పెనవేసుకుని వెళ్తొస్తా..నంటూ అదనపు కలెక్టర్ జీవీ శ్యాంప్రసాద్‌లాల్ భావోద్వేగంతో అన్నారు. అదనపు కలెక్టర్‌గా పెద్దపల్లికి బదిలీ కాగా 'శ్యామ్‌తో సోపతి బతుకంతా తీపి తీపి' పేరున నగరంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో అతని మిత్రబృందం ఆత్మీయ వీడ్కోలు సమావేశం నిర్వహించింది. ఈ సందర్భంగా మిత్రులు మాట్లాడుతూ, ఉన్నత పదవిలో ఉన్నా స్నేహితులను మరువకుండా వివిధ కార్యక్రమాలు నిర్వహించడం మరువలేమని, శ్యామ్‌తో పరిచయంతో బతుకంతా తీపిగా మారిందని కొనియాడారు. అనంతరం అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, గమ్యం ఎంత ముఖ్యమో గమనం కూడా అంతే ప్రధానమని, తన ఉద్యోగ ప్రస్థానంలో కరీంనగర్ మజిలీ మరుపురాని బిజిలీగా మిగిలిపోతుందన్నారు. డీసీవో మనోజ్, కరీంనగర్ ఆర్డీవో మహేశ్వర్, అధికారులు, రచయితలు నంది శ్రీనివాస్, అన్నవరం దేవేందర్, కిరణ్‌కుమార్‌రెడ్డి, మనోహర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

### కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి




ప్రవీణ్‌కుమార్‌కు వినతిపత్రం ఇస్తున్న సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగులు

కరీంనగర్: 15 ఏళ్లుగా సమగ్ర శిక్షలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని గోపికృష్ణ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం నిర్వహించిన బహుజన మహిళా సదస్సు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరు కాగా, సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగులు ఆయనకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ, ప్రత్యేక తెలంగాణ నీళ్లు, నిధులు, నియామకాల కోసమే ఏర్పడిందని, కానీ ప్రస్తుతం రాష్ట్రం దొరల చేతిలో బందీగా మారిందన్నారు. కొత్త ఉద్యోగాలు ఇవ్వకపోగా కాంట్రాక్టు ఉద్యోగులను రాష్ట్రంలో రెగ్యులర్ చేస్తామని చెప్పి ఇప్పటికి చేయకపోవడం బాధాకరమన్నారు. మహిళా సిఆర్పీలకు వేతనంతో కూడిన 180 రోజుల ప్రసూతి సెలవులు కల్పించాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం అందజేయాలని డిమాండ్ చేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బెజ్జంకి ఆంజనేయులు, గుండా రాజిరెడ్డి, గాలిపెల్లి రవిచంద్ర, రమేశ్, సీఆర్పీలు మంగ, విద్య, ఉమాదేవి, స్వప్న, కవిత ఉన్నారు.

### నేడు రాజేశ్వర్‌రావు విగ్రహావిష్కరణ

- హాజరుకానున్న మంత్రులు హరీశ్‌రావు, గంగుల కమలాకర్



రాజేశ్వర్‌రావు (ఫైల్)

హుజూరాబాద్: ఆయన ఇంటి పేరు వొడితల అయినా సింగాపురం రాజేశ్వర్‌రావుగా బాహ్య ప్రపంచానికి సుపరిచితులు. గల్లీ నుంచి ఢిల్లీ వరకు రాజకీయాలు నడిపి హుజూరాబాద్ ప్రాంతాన్ని దేశ నలుమూలల పరిచయం చేసిన రాజ్యసభ మాజీ సభ్యుడు వొడితల (సింగాపురం) రాజేశ్వర్‌రావు విగ్రహాన్ని హుజూరాబాద్‌లో సోమవారం ఆవిష్కరించనున్నారు.

**విద్యా దాత**

- పేద ప్రజలకు సైతం ఇంజినీరింగ్ విద్యను అందుబాటులోకి తీసుకొచ్చారు రాజేశ్వర్‌రావు. స్వగ్రామం సింగపూర్‌లో ఇంజినీరింగ్ కళాశాల నెలకొల్పి ఎంతో మంది యువ ఇంజినీర్ల భవిష్యత్‌కు మార్గదర్శనం చేశారు. రాజకీయంగా గల్లీ నుంచి ఢిల్లీ వరకు ఏదగడమే కాదు, ఒకప్పుడు దేశ రాజకీయాలన్నీ ఆయన చుట్టే తిరిగేవి. అందుకే ఆయనను అన్ని వర్గాల ప్రజలు అజాతశత్రువుగా భావిస్తారు.

**రాజకీయ ప్రస్థానం**

- హుజూరాబాద్ మండలం సింగాపురం గ్రామ సర్పంచ్‌గా రాజకీయ ప్రస్థానం ప్రారంభించిన వొడితల రాజేశ్వర్‌రావు భీమదేవరపల్లి పంచాయతీ సమితి అధ్యక్షులుగా, హుజూరాబాద్ ఎమ్మెల్యేగా, శాసనమండలి సభ్యులుగా అంచలంచెలుగా ఎదిగారు. 1972లో హుజూరాబాద్ నియోజకవర్గానికి జరిగిన ఎన్నికల్లో రాజేశ్వర్‌రావు కాంగ్రెస్ అభ్యర్థిగా 'ఆవుదూడ' గుర్తుపై గెలిపొందారు. రాజకీయ జీవితం ప్రారంభించినప్పటినుంచి మాజీ, దివంగత ప్రధానమంత్రి పీవీ.నరసింహారావుకు అండగా నిలిచారు.

**హాజరుకానున్న మంత్రులు**

- నేడు హుజూరాబాద్ పట్టణంలోని సైదాపూర్ రోడ్‌లో ఏర్పాటు చేయనున్న వొడితల (సింగాపురం) రాజేశ్వర్‌రావు విగ్రహావిష్కరణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావుతో పాటు జిల్లా మంత్రి గంగుల కమలాకర్ హాజరుకానున్నారు. అలాగే ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్, ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి, మాజీ మంత్రి ఇనుగాల పెద్దిరెడ్డి కూడా హాజరవుతారు. కాగా నేటి విగ్రహావిష్కరణ కార్యక్రమం నేపథ్యంలో రాజేశ్వర్‌రావు అభిమానులు అధిక సంఖ్యలో హాజరుకానున్న క్రమంలో హుజూరాబాద్‌లో భారీ ఏర్పాట్లు పూర్తి చేశారు.

# రోడ్డుకు వదిలేశారు

- డ్రైనేజీల కనెక్టివిటీ మరిచిన అధికారులు
- రోడ్లు, ఇళ్లను ముంచెత్తుతున్న వరద

కరీంనగర్‌కార్పొరేషన్: బల్దియా అధికారుల నిర్లక్ష్యంతో నగరవాసులకు ఇక్కట్లు తప్పడంలేదు. వర్షాకాలం సీజన్‌లో చిన్న పనులతోనే పెద్ద ముప్పును తప్పించే అవకాశం ఉన్నా అధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదు. ముఖ్యంగా డ్రైనేజీల నిర్వహణ అధ్వానంగా ఉండడంతో ప్రజలకు కంటిమీద కునుకులేకుండా పోతోంది. ఎగువ ప్రాంతం నుంచి దిగువకు వరద, మురికి నీళ్లు ప్రవహిస్తుండగా, డ్రైనేజీలను అర్ధంతరంగా ముగించడంతో నీళ్లు రోడ్డెక్కుతున్నాయి. సమీపంలోని ఇళ్లలోకి చేరుతున్నాయి.

- నగరంలోని ప్రధాన డ్రైనేజీల కనెక్టివిటీలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తుండడంతో వర్షాకాలంలో ప్రజలకు ప్రమాదాలు పొంచి ఉన్నాయి.
- నగరంలోని 7వ డివిజన్ పరిధిలో ప్రధాన రహదారి వెంట ఉన్న డ్రైనేజీల్లో ఇలాంటి పరిస్థితే నెలకొంది. కమాన్ చౌరస్తా నుంచి రాజీవ్‌రహదారి బైపాస్‌కు వెళ్లే ప్రధాన రహదారి పక్కనుంచి డ్రైనేజీ ఉంది.
- ఓల్డ్‌పవర్‌హౌస్ నుంచి రాజీవ్‌రహదారి వైపు వెళ్లే డ్రైనేజీని సబ్‌స్టేషన్ సమీపంలో అర్ధంతరంగా వదిలేశారు. కొనసాగింపుగా డ్రైనేజీ ఉన్నా కనెక్టివిటీ వదిలేశారు.
- అలాగే రాజీవ్ రహదారికి (హెచ్‌కేఆర్ జంక్షన్) రెండ వైపులా డ్రైనేజీ కనెక్టివిటీ సరిగా లేకపోవడం, వాగులోకి వెళ్లేందుకు కొనసాగింపుగా డ్రైనేజీ లేక వరదనీళ్లు ఆ ప్రాంతాన్ని ముంచెత్తుతున్నాయి.
- రహదారికి అవతలివైపు డ్రైనేజీ లేక రోడ్డుకు ఇవతలి వైపు మురికినీళ్లు నిలిచిపోతున్నాయి. ఫలితంగా సమీపంలోని ఇళ్లలోకి మురికినీళ్లు రివర్స్‌లో వెళ్తున్నాయి.
- ఇటీవల కురిసిన వర్షాలతో డ్రైనేజీల్లో నేరుగా నీరు వెళ్లే అవకాశం లేకపోవడంతో రోడ్డెక్కాయి. ఇళ్లలోకి చేరాయి.
- తమ ఇళ్లను డ్రైనేజీ మురికినీళ్లు, వరద బురద ముంచెత్తుతుండటంతో తప్పనిసరి పరిస్థితుల్లో రాజీవ్‌రహదారి నుంచి మానేరు వాగు వైపు స్థానికులు కచ్చాకాలువ తీసి తాత్కాలికంగా నీరు వెళ్లేలా చేసుకున్నారు.
- నగరంలో ఇది చివరి భాగం కావడంతో ఎగువ ప్రాంతం నుంచి వచ్చే మురికి, వరదనీళ్లు ఇక్కడికే చేరుకుంటాయి.
- డ్రైనేజీ అర్ధంతరంగా వదిలేయడంతో ఇబ్బంది పడుతున్నామని, ఎన్నిసార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు చెబుతున్నారు.
- ఇప్పటికైనా నగరపాలకసంస్థ అధికారులు అర్ధంతరంగా వదిలేసిన డ్రైనేజీల కనెక్టివిటీ పూర్తిచేసి, ఇబ్బందులు లేకుండా చేయాలని వారు కోరుతున్నారు.



కమాన్ నుంచి రాజీవ్‌రహదారి రోడ్డులో అర్ధంతరంగా వదిలేసిన డ్రైనేజీ



రాజీవ్‌రహదారి పక్కన నిలిచిన మురికినీరు



తాత్కాలికంగా స్థానికులు ఏర్పాటు చేసుకున్న కచ్చాకాలువ

## తెలంగాణ ఉద్యమంలో కళాకారుల పాత్ర గొప్పది

- మంత్రి గంగుల కమలాకర్



మంత్రి గంగులను సన్మానిస్తున్న కళాకారులు

కరీంనగర్/విద్యానగర్: తెలంగాణ సాధనలో కవులు, కళాకారుల పాత్ర గొప్పదని, ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లిన ఘనత పాటదేనని బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. ఆదివారం కరీంనగర్‌లోని సీతారాంపూర్ పీఎం కన్వెన్షన్‌లో తెలంగాణ డ్యాన్స్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో డాన్స్ స్పోర్ట్స్ వర్క్‌షాప్ ప్రిపరేషన్ మీటింగ్ జరిగింది. ఈ కార్యక్రమంలో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అంతర్జాతీయ ఒలింపిక్ సంఘం డ్యాన్స్‌ను కళగా కాకుండా క్రీడగా గుర్తించిందని, డ్యాన్స్ స్పోర్ట్స్‌కు తెలంగాణ ప్రభుత్వం సైతం సంపూర్ణ మద్దతు ఇస్తుందన్నారు. కరీంనగర్‌లో డ్యాన్స్ అకాడమీ బిల్డింగ్‌ను నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చారు.డ్యాన్స్ అకాడమీ భవనానికి వారం రోజుల్లో భూమిపూజ నిర్వహించుకుందామని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. అనంతరం మంత్రిని కళాకారులు సన్మానించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్లా హరిశంకర్, ట్రస్మా అధ్యక్షుడు యాదగిరి శేఖర్‌రావు, తెలంగాణ డ్యాన్స్ స్పోర్ట్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కట్ట రమేష్, ప్రధాన కార్యదర్శి శ్రీరామోజు రామకృష్ణ, వంగల శ్రీధర్, కృపాధానం, తిప్పర్తి ప్రభు, లింగంపల్లి నాగరాజు, గసికంటి జనార్దన్‌రెడ్డి, మెతుకు హేమలత తదితరులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### 48 గంటల్లో 'పొన్నం'కు పార్టీ పదవి



గాంధీభవన్ వద్ద కాంగ్రెస్ జిల్లా నేతలు

కరీంనగర్‌టౌన్: విద్యార్థి దశ నుంచి కాంగ్రెస్‌లో కొనసాగుతున్న సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్‌కు పార్టీలో సముచితస్థానం కల్పించి పార్టీ శ్రేణులకు భరోసా ఇవ్వాలని కోరుతూ ఆదివారం తెలంగాణ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ మానిక్‌రావు ఠాక్రేకు, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఠాక్రే మాట్లాడుతూ, బీసీ సామాజిక వర్గానికి చెందిన తెలంగాణ ఉద్యమ నేత పొన్నం ప్రభాకర్‌ను కాంగ్రెస్ మరువలేదని, 48 గంటల్లో కార్యకర్తలు ఊహించిన దానికంటే పెద్ద పదవి ఆయనకు కేటాయించడం జరుగుతుందని హామీ ఇచ్చారు. పొన్నంకు కాంగ్రెస్ అధిష్ఠానం ఎప్పుడు అండగా ఉంటుందని భరోసా కల్పించారు. గాంధీ భవన్‌కు తరలి వెళ్లిన వారిలో కాంగ్రెస్ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ, రాజన్న సిరిసిల్ల అధ్యక్షుడు ఆది శ్రీనివాస్, అలిగిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి, మేడిపల్లి సత్యం, కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి, పత్తి కృష్ణారెడ్డి, రోహిత్‌రావు తదితరులు ఉన్నారు.

### మంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం



కరీంనగర్: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీ గురుకులాలు, కస్తూరిబా హాస్టళ్లలో మెస్ చార్జీలు పెంచడాన్ని హర్షిస్తూ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం తెలంగాణచౌక్‌లో బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొల్లం లింగమూర్తి మాట్లాడుతూ, మెస్ చార్జీలు పెంచడం ద్వారా విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందుతుందన్నారు. నాయకులు పెంట అజయ్, అశ్విన్, ఆంజనేయులు, సంతోష్, కోటేశ్వర్, శ్రీనివాస్, మధుబాబు, పల్లె నారాయణ, కిషన్, రవి, శ్రీకాంత్, అశోక్ పాల్గొన్నారు.

### డైట్ చార్జీలు పెంచడం హర్షణీయం

కరీంనగర్: సంక్షేమ హాస్టల్స్‌లో డైట్ చార్జీలు పెంచడం హర్షణీయమని బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఆది మల్లేశం అన్నారు. ఆదివారం సంఘ కార్యాలయంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ చిగుర్ల శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మాట్లాడారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణన్న ఉద్యమ పోరాటాల ఫలితం వల్లే సీఎం కేసీఆర్ విద్యార్థుల డైట్ చార్జీలను పెంచడం జరిగిందన్నారు. విద్యార్థులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలని కొన్నేళ్లుగా పోరాటం చేస్తుంటే ప్రభుత్వం ఇప్పటికి స్పందించిందని పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. సమావేశంలో నర్సింగోజు శ్రీనివాస్, నల్లగొని శ్రీనివాస్, లింగంపల్లి శ్రీనివాస్, అనుమాన నితిన్ పాల్గొన్నారు.

### పాత పెన్షన్ అమలు చేయాలి

కరీంనగర్: 2004 సెప్టెంబర్ 1కి ముందు ప్రభుత్వ ఉద్యోగానికి నోటిఫికేషన్ విడుదలై ఉద్యోగంలో చేరినవారికి పాత పెన్షన్ విధానం అమలు చేయాలని కోరుతూ ఉద్యోగ, ఉపాధ్యాయులు-2003 పాత పెన్షన్ పోరాట సాధక సమితి ఆధ్వర్యంలో ఆదివారం మంత్రి గంగుల కమలాకర్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ, వెంటనే ప్రభుత్వం చొరవ తీసుకుని తమ న్యాయమైన డిమాండ్‌ను నెరవేర్చాలని కోరారు. మంత్రి గంగుల స్పందిస్తూ ఈ విషయాన్ని కేబినెట్ సమావేశంలో, ఆర్థిక మంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం అయ్యేలా చూస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో నల్ల రాజేందర్‌రెడ్డి, రామ్‌కిరణ్, వీరేందర్‌రెడ్డి, ముకుందరెడ్డి, జైపాల్‌రెడ్డి, మాధవరెడ్డి, విష్ణు ప్రసాద్‌రావు, నరేష్, భవాని, స్వప్న, గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

# రెండో విడత 'తొలిమెట్టు'కు సన్నద్ధం

- రిసోర్స్‌పర్సన్లకు నేటి నుంచి శిక్షణ
- గతేడాది సక్సెస్‌తో కొనసాగింపు
- ఆగస్టు నుంచి అమలుకు చర్యలు



తొలిమెట్టుపై టీచర్లు ప్రదర్శించిన ఎగ్జిబిషన్‌లో డీఈవో జనార్దన్‌రావు తదితరులు (ఫైల్)

కరీంనగర్: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థుల్లో అభ్యసనా సామర్థ్యాన్ని పెంచేందుకు విద్యాశాఖ గతేడాది 'తొలిమెట్టు' కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా ప్రభుత్వం మౌలిక భాష, గణిత సామర్థ్యాల సాధనను (ఫౌండేషన్ లిటరసీ, న్యూమరసీ- ఎఫ్‌ఎల్ఎన్) తొలిమెట్టు పేరుతో జిల్లాలోని ఆయా ప్రాథమిక పాఠశాలల్లో అమలు చేసింది. ఈ విద్యా సంవత్సరం కూడా కొనసాగించేందుకు విద్యాశాఖ మంత్రి ఆదేశాలు జారీ చేశారు. ఈ క్రమంలో రాష్ట్రస్థాయి రిసోర్స్ పర్సన్లకు ఈనెల 13 నుంచి 15 వరకు నిర్వహించిన శిక్షణకు జిల్లా నుంచి 8 మంది హాజరయ్యారు. అలాగే ఉన్నత తరగతుల విద్యార్థుల్లోనూ కనీస సామర్థ్యాలు, భాష పరిజ్ఞానం కోసం లర్నింగ్ ఇంప్రూమెంట్ ప్రోగ్రాం (లిప్) కార్యక్రమానికి శ్రీకారం చుట్టనున్నారు. గతంలో లోటుపాట్లను సరిచేసుకొని ఆగస్టు నుంచి ఈ కార్యక్రమాన్ని అమలు చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతున్నట్లు విద్యాశాఖాధికారులు పేర్కొన్నారు.

**నేటి నుంచి జిల్లాస్థాయిలో శిక్షణ..**

జిల్లా విద్యాశాఖ పరిధిలో 651 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా, వీటిలో 38,478 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఇటీవల తొలిమెట్టు కార్యక్రమ నిర్వహణపై రాష్ట్రస్థాయి రిసోర్స్ పర్సన్లు హైదరాబాద్‌లో శిక్షణ పొందగా, సోమవారం నుంచి ఆగస్టు 1వరకు ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. వీరు జిల్లా స్థాయిలో సోమవారం నుంచి 26 వరకు ఆయా మండలాల నుంచి ఆరుగురు చొప్పున 96 మంది టీచర్లకు జిల్లా కేంద్రంలోని సెయింట్ అల్ఫోన్స్ స్కూల్లో శిక్షణ ఇస్తారు. ఈ శిక్షణ పొందిన రిసోర్స్‌పర్సన్లు మండల స్థాయిలో జిల్లా వ్యాప్తంగా ఆగస్టు1 వరకు ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వనున్నారు.

**పిల్లలకు వర్క్‌బుక్స్**

గతంలో వర్క్‌షీట్లు రాయడంలో ఇబ్బందులు తలెత్తగా, ఈసారి పిల్లలకు ప్రత్యేకంగా వర్క్‌బుక్స్ ఇవ్వనున్నారు. ఉపాధ్యాయుల బోధన పక్కగా చేపట్టేలా ప్రతి టీచర్‌కు హ్యాండ్ బుక్ అందిస్తారు. ఇందులో రూపొందించిన ప్రకారం బోధన చేపట్టాలి. పర్యవేక్షించేందుకు తెలంగాణ స్కూల్ ఎడ్యుకేషన్ పేరుతో యాప్‌ను తీసుకొచ్చారు. దీనిద్వారా ఉపాధ్యాయుడు మొదలు రాష్ట్రస్థాయి అధికారి వరకు వివరాలు పరిశీలించుకునే వీలుంటుంది.

**'లిప్'కు శ్రీకారం..**

ప్రాథమిక స్థాయిలో తొలిమెట్టు సక్సెస్ కావడంతో 6 నుంచి 9 తరగతుల విద్యార్థులకు 'ఉన్నతి అభ్యసన' కార్యక్రమాన్ని చేపట్టనున్నారు. లర్నింగ్ ఇంప్రూమెంట్ ప్రోగ్రాం(లిప్)కు శ్రీకారం చుట్టనున్నారు. ఈ కార్యక్రమాన్ని సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో చేపట్టనున్నారు. జిల్లాలోని ఉన్నత పాఠశాలల్లో రెగ్యులర్ తరగతులకు ఆటంకం కలగకుండా ఈ కార్యక్రమాన్ని అమలు చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు.

### పకడ్బందీగా అమలు చేస్తాం



రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ అధికారుల ఉత్తర్వులను పకడ్బందీగా అమలు చేస్తాం. రాష్ట్రస్థాయి రిసోర్స్ పర్సన్లకు ఇప్పటికే శిక్షణ పూర్తయింది. నేటి నుంచి జిల్లా వ్యాప్తంగా 16 మండలాల్లో ఉపాధ్యాయులకు వివిధ దశల్లో తొలిమెట్టుపై శిక్షణ ఉంటుంది.

– జనార్దన్‌రావు, డీఈవో

### ఈ ఏడాది కూడా..



ప్రాథమిక పాఠశాలల్లో గతేడాది తొలిమెట్టు కార్యక్రమం పకడ్బందీగా అమలు చేశాం. దీంతో విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలు పెరిగాయి. చతుర్విధ ప్రక్రియలతో పాటు ధారళంగా చదవడం, పదాలు రాయడంలో మెరుగుపడ్డారు. విద్యాశాఖ నియమించిన రాష్ట్ర, జిల్లా, మండల స్థాయి అధికారులు ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తారు.

– కర్ర అశోక్‌రెడ్డి, విద్యాశాఖ క్వాలిటీ కో–ఆర్డినేటర్

# ప్రజా సేవతోనే గుర్తింపు

- కలెక్టర్ ఆర్వీ కర్ణన్



బదిలీపై వెళ్లిన అధికారులతో కలెక్టర్ కర్ణన్

కరీంనగర్ అర్బన్: ప్రజా సేవే పరమావధిగా సాగాలని ప్రభుత్వ సేవలను సకాలంలో అందించినప్పుడే ప్రజల హృదయాల్లో నిలిచిపోతారని కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్ ఉన్నతాధికారులకు సూచించారు. జిల్లాలో ప్రభుత్వ పథకాల అమలు, పర్యవేక్షణలో నిరంతరం సేవలందించాలని కొనియాడారు. బదిలీపై వెళ్లిన అధికారులకు ఆదివారం కలెక్టరేట్‌లోని ఆడిటోరియంలో ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. బదిలీ అయిన అదనపు కలెక్టర్లు గరిమా అగర్వాల్, జీవీ శ్యాంప్రసాద్‌లాల్, పదోన్నతిపై వెళ్లిన సీహెచ్.ప్రియాంక, ఆర్డీవో ఆనంద్‌కుమార్‌ను ఘనంగా సన్మానించారు. విధి నిర్వహణను, కుటుంబ బాధ్యతలను విజయవంతం చేసి జిల్లా కలెక్టర్‌గా తన పని ఒత్తిడిని అర్థం చేసుకుని తన సతీమణి ప్రియాంక పూర్తిగా సహకరించారని అన్నారు. బదిలీ అయిన ఉన్నతాధికారులు జిల్లాతో తమ అనుబంధాన్ని వివరించారు. అధికారులు, సిబ్బంది సహకారం మరువలేమని పేర్కొన్నారు. ట్రైనీ కలెక్టర్ లెనిన్ వాత్సల్ టొప్పో, కరీంనగర్, హుజూరాబాద్ ఆర్డీవోలు మహేశ్వర్, హరిసింగ్, టీఎన్జీవోల సంఘం జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి, కార్యదర్శి సంగెం లక్ష్మణరావు, ట్రెసా జిల్లా అధ్యక్షుడు నల్ల వెంకట్‌రెడ్డి, కార్యదర్శి పెద్ది విజయ్‌కుమార్, జిల్లా అధికారుల సంఘం నేతలు వివిధ శాఖల జిల్లా అధికారులు వాసిరెడ్డి శ్రీధర్, కొమురయ్య, శ్రీలత, వీరబుచ్చయ్య, ఎంపీడీవోల సంఘం అధ్యక్షుడు దివ్యదర్శన్‌రావు, ఎంపీవోల అధ్యక్షుడు జగన్మోహన్ పాల్గొన్నారు.

# 'శ్రీచైతన్య' బీఎస్ రావుకు నివాళి



నివాళి అర్పిస్తున్న అతిథులు

కరీంనగర్: శ్రీచైతన్య విద్యాసంస్థల వ్యవస్థాపక చైర్మన్ బీఎస్ రావు ఈ నెల 13న మృతి చెందిన విషయం విదితమే. కరీంనగర్‌లోని తీగలగుట్టపల్లి రంగినేని గార్డెన్స్‌లో ఆదివారం ఆయన సంస్మరణ సభ నిర్వహించారు. కార్యక్రమానికి విద్యాసంస్థల డీజీఎం లక్ష్మణరావు, ట్రస్మా రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి శేఖర్‌రావు, పారమిత విద్యాసంస్థల చైర్మన్ ప్రసాదరావు, శ్రీచైతన్య విద్యాసంస్థల ఏజీఎం సదాశివ రెడ్డి, ఆర్‌వి రాజు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. డీజీఎం లక్ష్మణరావు మాట్లాడుతూ.. దేశ విద్యారంగంలో బీఎస్ రావు మకుటం లేని మహారాజు అని, తన క్రమశిక్షణ, అకుంఠిత దీక్షతో శ్రీ చైతన్య విద్యా సామ్రాజ్యాన్ని నిర్మించారని కొనియాడారు. ట్రస్మా రాష్ట్ర అధ్యక్షుడు మాట్లాడుతూ.. సామాన్య ప్రజలకు ఐఐటీ ఫలాలను అందించిన ఆదర్శమూర్తి అన్నారు. పారమిత విద్యాసంస్థల చైర్మన్ మాట్లాడుతూ.. బీఎస్ రావు లక్షలాది మంది ఇంజినీర్లను, వేలాది మంది డాక్టర్లు తయారు చేసిన విద్యా ప్రదాత అని పేర్కొన్నారు. కరీంనగర్ ఐపీఎల్ ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్ ఆచార్య, తిమ్మాపూర్ ప్రిన్సిపాల్ రవీందర్ రెడ్డి, కరీంనగర్, సిద్దిపేట, వరంగల్ జోన్ల ప్రిన్సిపాళ్లు, లెక్చరర్లు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

# బ్రాహ్మణులు ఐక్యంగా ముందుకెళ్లాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ కౌశిక్‌రెడ్డి

- మంథని ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు, ప్రభుత్వ విప్ కౌశిక్ రెడ్డి
- హుజూరాబాద్‌లో బ్రాహ్మణ శంఖారావం

హుజూరాబాద్: బ్రాహ్మణులు ఐక్యంగా ముందుకెళ్లాలని మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. హుజూరాబాద్ పట్టణంలోని ఓ గార్డెన్స్‌లో ఆదివారం బ్రాహ్మణ సంఘాల ఆధ్వర్యంలో బ్రాహ్మణ శంఖారావాన్ని రాష్ట్ర అర్చక సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ గంగు ఉపేందర్ శర్మ అధ్యక్షతన నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. హుజూరాబాద్ నియోజకవర్గ వ్యక్తి పీవీ నరసింహారావు దేశ ప్రధానమంత్రిగా పని చేశారన్నారు. 2004లో బ్రాహ్మణుల సంక్షేమం కోసం అప్పటి ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్ రెడ్డి ధూపదీప నైవేద్యం కింద రూ.2,500 ఇచ్చే కార్యక్రమాన్ని ప్రారంభించారని తెలిపారు. ప్రస్తుతం ఆలయాలకు సంబంధించిన భూములు అన్యాక్రాంతం అవుతున్నాయని ఆరోపించారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో బ్రాహ్మణుల అభివృద్ధి కోసం తీసుకోవాల్సిన చర్యలపై బ్రాహ్మణ సంఘం ప్రతినిధులతో త్వరలో చర్చించనున్నట్లు పేర్కొన్నారు. పీవీ నరసింహారావు తనయుడు పీవీ ప్రభాకర్ మాట్లాడుతూ.. బ్రాహ్మణుల సంక్షేమం కోసం ప్రవేశపెట్టిన పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రభుత్వ విప్ పాడి కౌశిక్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో 12,500 ఆలయాలకు ధూపదీప నైవేద్యం వర్తింపజేస్తూ నెలకు భృతిని రూ.6 వేలకు పెంచిన ఘటన సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. రానున్న ఎన్నికల్లో తనను గెలిపిస్తే ఇల్లందకుంటలోని రాములోరి గుడిని రూ.25 కోట్లతో అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. బ్రాహ్మణ సంఘం బాధ్యులు జగ్గయ్య, శ్రీనివాసాచార్యులు, సంపత్‌కుమార్, చిట్టంపల్లి ఉపేందర్‌రావు, వేముగంటి సురేఖ, రాహుల్ ఆచార్య, రవికుమార్, నాగరాజు, సంపత్‌కుమార్ తదితరులున్నారు.

### రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య



రఫీ (ఫైల్)

జమ్మికుంట(హుజూరాబాద్): ఒంటరితనం భరించలేక ఓ వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. రామగుండం రైల్వే హెడ్ కానిస్టేబుల్ తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం.. జమ్మికుంట మున్సిపల్ పరిధి కొత్తపల్లికి చెందిన మహమ్మద్ రఫీ(38) జమ్మికుంట పట్టణంలోని రైల్వేస్టేషన్‌లో సమోసాలు విక్రయిస్తూ, కూలి పని చేసుకునేవాడు. ఈ క్రమంలో తాగుడుకు బానిసయ్యాడు. భార్య సాజియా బేగంతో గొడవలు జరగడంతో ఆమె ఇద్దరు పిల్లలను తీసుకొని, మంచిర్యాల్‌లోని తల్లిగారింటికి వెళ్లిపోయింది. ఒంటరితనంతో మనస్తాపానికి గురైన రఫీ ఆదివారం రైలు కింద పడి, ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి సోదరుడు మహమూద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు రైల్వే హెడ్ కానిస్టేబుల్ పేర్కొన్నారు.

### ఉద్యోగం రాలేదని యువకుడి బలవన్మరణం



రమేశ్ మృతదేహం

శంకరపట్నం(మానకొండూర్): మండలం మెట్‌పల్లి గ్రామంలో ముంజ రమేశ్ (26) ఆత్మహత్య చేసుకున్నట్లు ఏఎస్సై సుధాకర్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. మెట్‌పల్లికి చెందిన ముంజ కనకయ్యకు భార్య, ముగ్గురు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు. కొడుకు రమేశ్ పీజీ వరకు చదువుకున్నాడు. తన ఉద్యోగం రావడం లేదని నిత్యం మనోవేదనకు గురవుతున్నాడు. ఈ క్రమంలో కొంత కాలంగా మనోవ్యాధితో బాధ పడుతున్నాడు. కుటుంబసభ్యులు హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స చేయించారు. తల్లిదండ్రులతో కలిసి వ్యవసాయ పనులు చేసేందుకు ఆదివారం పొలం వద్దకు వెళ్లాడు. తిరిగి ఇంటికి వచ్చి, ఉరేసుకున్నాడు. కాసేపటికి పశువులకు పచ్చిగడ్డి కోసుకొని, ఇంటికి వచ్చిన తండ్రి ఉరేసుకున్న కుమారుడిని చూసి, చుట్టుపక్కల వారిని పిలిచాడు. కొన ఊపిరితో ఉన్న అతన్ని ఆస్పత్రికి తరలిస్తుండగా మృతిచెందాడు. మృతుడి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై పేర్కొన్నారు.

# యువకుడి వైద్యానికి గ్రామస్తుల సాయం

- రూ.1.52 లక్షల చెక్కు అందజేత



సర్పంచ్ సతీశ్‌రెడ్డి చేతులమీదుగా చెక్కు అందిస్తున్న కానిస్టేబుల్ రాజు

మానకొండూర్: మండలంలోని గట్టుదుద్దెనపల్లికి చెందిన జన్నవరం నాగరాజు ఇటీవల బైక్‌పై వస్తూ ప్రమాదవశాత్తు కిందపడ్డాడు. ఈ ఘటనలో అతనికి తీవ్ర గాయాలై, కంటి చూపునకు ప్రమాదం ఏర్పడింది. వైద్యానికి ఆర్థికంగా ఇబ్బందులు పడుతుండగా ఇదే గ్రామానికి చెందిన కానిస్టేబుల్ పాంద్రాల రాజు విషయాన్ని గ్రామ వాట్సాప్ గ్రూప్‌లో పోస్టు చేశారు. దీనికి గ్రామస్తులు చాలామంది స్పందించి, తమకు తోచిన డబ్బులు ఇచ్చారు. గట్టుదుద్దెనపల్లికే చెందిన భరోసా స్వచ్ఛంద సంస్థ సభ్యులు ముందుకు వచ్చి, రూ.27 వేలు అందించారు. మొత్తం రూ.1.52 లక్షల విలువైన చెక్కును ఆదివారం నాగరాజు కుటుంబసభ్యులకు సర్పంచు సతీశ్‌రెడ్డి చేతులమీదుగా అందజేశారు. అనంతరం కానిస్టేబుల్ రాజు, భరోసా సంస్థ సభ్యుడు చిద్రాల రామ్మోహన్‌లను సర్పంచు సన్మానించారు. కార్యక్రమంలో పెంచాల రంగయ్య, పాంద్రాల కనకరాజేశం, ఆకుల బాపురావు, పాంద్రాల ఐలయ్య పాల్గొన్నారు.

# 'దొడ్డి కొమురయ్యపై సినిమా నిర్మిస్తాం'



డైరెక్టర్ సేనాపతిని సన్మానిస్తున్న నాయకులు

విద్యానగర్: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య జీవిత చరిత్రపై త్వరలో సినిమా నిర్మిస్తామని సినీ డైరెక్టర్ మహాలంక సేనాపతి తెలిపారు. ఆదివారం కరీంనగర్‌లోని నాయీబ్రాహ్మణ విద్యార్థి వసతి గృహంలో నిర్వహించిన సమావేశానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పీడిత ప్రజల కోసం పోరాటం చేసి, అసువులుబాసిన దొడ్డి కొమురయ్యపై నిర్మించే సినిమా కోసం అన్ని కుల సంఘాల నాయకులను కలుస్తామన్నారు. సినిమా పర్యవేక్షణ కోసం అన్ని కుల సంఘాల నాయకులతో ఒక కమిటీని ఎన్నుకున్నారు. బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు ఆది మల్లేశం, తెలంగాణ నాయీబ్రాహ్మణ ఐక్యవేదిక రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గుంజపడుగు హరిప్రసాద్, కురుమ సంఘం జిల్లా అధ్యక్షుడు మీస బీరయ్య, కర్రె పావని, కొయ్యడ సృజన్‌కుమార్, సింగిరాల వెంకటస్వామి, మేకల చంద్రశేఖర్, తొంటి రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

# అంగన్‌వాడీలను ఉద్యోగులుగా గుర్తించండి



మాట్లాడుతున్న మాధురి క్షీరసాగర్

కరీంనగర్: దేశంలో అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అన్ని శాఖల్లో వెట్టిచాకిరీ చేయిస్తూ శ్రమదోపిడీకి పాల్పడుతున్నాయని అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ అసోసియేషన్ జాతీయ కార్యదర్శి మాధురి క్షీరసాగర్ ఆరోపించారు. కరీంనగర్‌లోని రెవెన్యూ గార్డెన్స్‌లో రెండు రోజులుగా నిర్వహిస్తున్న అంగన్‌వాడీ అసోసియేషన్ రాష్ట్ర రెండో మహాసభల సందర్భంగా ఆదివారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై, మాట్లాడారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్న సుప్రీంకోర్టు తీర్పును అమలు చేయకపోవడం దురదృష్టకరమని పేర్కొన్నారు. ప్రభుత్వాలు బడ్జెట్‌లో మాతాశిశు సంక్షేమానికి నిధులు తగ్గిస్తున్నాయని, ఇది దేశ ప్రజల భవిష్యత్‌కు ప్రమాదమన్నారు. అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి, బేసిక్ పే చెల్లించాలని డిమాండ్‌చేశారు. గ్రాట్యుటీ రూ.10 లక్షలు, రిటైర్మెంట్ అనంతరం పెన్షన్ రూ.10 వేలు, హెల్త్ కార్డు, పీఎఫ్, గృహ నిర్మాణ పథకం అమలు చేయాలని కోరారు. మినీ అంగన్వాడీ కేంద్రాలను తక్షణమే ప్రధాన కేంద్రాలుగా ప్రమోట్ చేయాలని, ఆయాలకు వేతనం రూ.15 వేలు ఇవ్వాలన్నారు. ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాలరాజు మాట్లాడుతూ.. ఐసీడీఎస్‌ను ప్రైవేటుపరం చేయాలని చూస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు సాయీశ్వరి, ప్రేమ్‌పావని, సుమతమ్మ, నరాటి ప్రసాద్, బీవీ విజయలక్ష్మి, కరుణకుమారి, టేకుమల్ల సమ్మయ్య, పల్లా దేవేందర్‌రెడ్డి, సీహెచ్.సీతామహాలక్ష్మి, కె.సృజనకుమార్, కడారి రాములు, కటికరెడ్డి బుచ్చన్నయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# 38 ఏళ్లకు.. ఒక్కచోటకు



ఒక్కచోట చేరిన పూర్వ విద్యార్థులు

కరీంనగర్: కరీంనగర్ శ్రీరాజరాజేశ్వర డిగ్రీ నైట్ కళాశాలలో 1985లో బీఏ, బీకాం పూర్తి చేసినవారు పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించుకున్నారు. ఈ కార్యక్రమానికి ఆదివారం స్థానిక సప్తగిరి ఫంక్షన్ హాల్ వేదికైంది. దాదాపు 50 మంది 38 ఏళ్ల తర్వాత తమ చిన్ననాటి మిత్రులను చూసి, భావోద్వేగానికి గురయ్యారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. కుటుంబ క్షేమసమాచారం తెలుసుకున్నారు. చనిపోయిన తోటి విద్యార్థులు, అధ్యాపకుల ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం తరగతి గదిలో చేసిన చేసిన అల్లరిని గుర్తు చేసుకొని, సంతోషం వ్యక్తం చేశారు. ఒకరికొకరం సహకరించుకోవాలని, సమాజ సేవలో పాల్గొనాలని తీర్మానించారు. పిట్ల శ్రీనివాస్ కళాకారుల బృందం ఆలపించిన సినీ గీతాలు అలరించాయి. అందరూ కలిసి భోజనం చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు సందడి సందడిగా గడిపారు. ఈ ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటుకు కృషి చేసిన పూర్వ విద్యార్థులు తంగెడ అశోక్‌రావు, తెలంగాణ ప్రైవేట్ జూనియర్ కళాశాలల చైర్మన్, ఎస్‌వీజేసీ కరస్పాండెంట్ ఊట్కూరి మహేందర్‌రెడ్డిలను సన్మానించారు.




### జాతీయస్థాయి పోటీల్లో సత్తా చాటాలి



పోటీలను ప్రారంభిస్తున్న డీవైఎస్‌వో రాజవీరు

కరీంనగర్ స్పోర్ట్స్: జిల్లాకు చెందిన టేబుల్ టెన్నిస్ క్రీడాకారులు జాతీయ స్థాయి పోటీల్లో సత్తా చాటాలని డీవైఎస్‌వో కీర్తి రాజవీరు అన్నారు. కరీంనగర్‌లోని గణేశ్‌నగర్‌లో జీఎస్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉత్తర తెలంగాణ స్థాయి ఆహ్వానిత టేబుల్ టెన్నిస్ పోటీలను ఆదివారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై, ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మొదటిసారిగా కరీంనగర్‌లో నిర్వహిస్తున్న టేబుల్ టెన్నిస్ పోటీలకు క్రీడాకారుల నుంచి విశేష స్పందన రావడం ఆనందంగా ఉందన్నారు. ఇలాంటి పోటీలతో క్రీడాకారుల్లో ఉన్న ప్రతిభను వెలికితీయవచ్చని చెప్పారు. జిల్లా క్రీడాకారులను జాతీయస్థాయి క్రీడాకారులుగా తీర్చిదిద్దాలని అకాడమీ నిర్వాహకులకు సూచించారు. ఇల్లంతకుంట ఎంపీపీ రమణారెడ్డి మాట్లాడుతూ.. శారీరక, మానసికోల్లాసానికి క్రీడలు ఎంతగానో దోహదం చేస్తాయన్నారు. టోర్నీ స్పాన్సర్, రాఘవేంద్ర హాస్పిటల్స్ వైద్యుడు శరత్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. జిల్లాస్థాయి, రాష్ట్రస్థాయి పోటీలకు తనవంతుగా ఎప్పుడూ సహకారం అందిస్తానని పేర్కొన్నారు. వరంగల్, పెద్దపల్లి, జగిత్యాల, ఖమ్మం, నిజామాబాద్ తదితర ప్రాంతాల నుంచి సుమారు 350 మంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. టోర్నీ కో–ఆర్డినేటర్ మద్దెల వికాస్, డైరెక్టర్ గౌతంరెడ్డి, ఆర్గనైజర్ ఎస్.సురేందర్ సింగ్, కమిటీ సభ్యులు కంకటి అనూప్, ఆర్.నరేష్, టోర్నీ టెక్నికల్ టీం సత్యనారాయణ, శ్రీధర్, భూపేందర్ కౌర్, ఎం.సంతోష్, జి.హర్ష, మణి, రాకేశ్, అభిషేక్ తదితరులున్నారు.

### మహాధర్నాకు తరలిరండి



మాట్లాడుతున్న కృష్ణారెడ్డి

కరీంనగర్‌టౌన్: రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన పేదలకు డబుల్ బెడ్‌రూం ఇండ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేస్తూ బీజేపీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట తలపెట్టిన మహాధర్నాకు నిరుపేద ప్రజలు తరలిరావాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం కరీంనగర్‌లోని పార్లమెంట్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర శాఖ పిలుపుమేరకు అర్హులైన నిరుపేదలకు డబుల్ బెడ్‌రూంలు వెంటనే అందించాలని డిమాండ్‌చేస్తూ అన్ని జిల్లాల్లో ఆందోళన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. అందులో భాగంగా కలెక్టరేట్ వద్ద ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు మహాధర్నా నిర్వహిస్తామని పేర్కొన్నారు. కేసీఆర్ పాలనలో 9 ఏళ్లుగా నిరుపేదలు డబుల్ బెడ్‌రూం ఇండ్ల కోసం నిరీక్షిస్తున్నారన్నారని, అర్హులకు తగిన న్యాయం జరగాలనే ఉద్దేశంతో నిర్వహించే మహాధర్నకు జిల్లాలోని నిరుపేదలు స్వచ్ఛందంగా తరలిరావాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోమల్ల ఆంజనేయులు, కొరటాల శివరామకృష్ణ, మేకల ప్రభాకర్‌యాదవ్, రాజేంద్రప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శులు తాళ్లపల్లి శ్రీనివాస్‌గౌడ్, కళ్లెం వాసుదేవరెడ్డి, బత్తుల లక్ష్మీనారాయణ, బాస సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా మృత్యుంజయ హోమం





తీగలగుట్టపల్లిలోని మాతా మానిక్యేశ్వరీ ఆలయంలో ఆదివారం రాగంపేట ఆర్యవైశ్య సొసైటీ ఆధ్వర్యంలో లోక కల్యాణార్థం శ్రీలక్ష్మీ గణపతి మహా మృత్యుంజయ హోమం ఘనంగా నిర్వహించారు. 40మంది వేదపండితుల ఆధ్వర్యంలో జరిగిన హోమంలో 108 మంది ఆర్యవైశ్య దంపతులు పాల్గొన్నారు. రిత్వికులు తనుగుల చంద్రశేఖరశర్మ, గోవిందవరం భూశంకరశర్మల ఆధ్వర్యంలో ముందుగా శివకేశవులకు ఫల పంచామృతాలతో అభిషేకం చేశారు. అనంతరం మహా మృత్యుంజయ హోమాన్ని వైభవంగా నిర్వహించారు. పదేళ్లు నుంచి నిర్వహిస్తున్న పలు ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో భాగంగా మృత్యుంజయ హోమాన్ని నిర్వహించినట్లు రాగంపేట సొసైటీ అధ్యక్షుడు నలుమాచు మనోహర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సొసైటీ ప్రధాన కార్యదర్శి నలుమాచు సుదర్శనం, కార్యవర్గసభ్యులు నలుమాచు మహేశ్‌కుమార్, పాత నాగభూషణం, సత్యనారాయణ, ఆంజనేయులు, హరి, శ్రీనివాస్, రమేశ్, కృష్ణమూర్తి, వేణుగోపాల్, సరోజ తదితరులు పాల్గొన్నారు. కరీంనగర్‌రూరల్




## మణిపూర్ హింసాకాండకు నిరసన

మణిపూర్‌లో క్రైస్తవులపై జరుగుతున్న హింసాకాండకు నిరసనగా కరీంనగర్ క్రైస్తవ ఆలయాల సంఘాలు ఆదివారం నగరంలో ర్యాలీ నిర్వహించారు. కొవ్వొత్తులు వెలిగించి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వివిధ చర్చిల ఫాదర్లు, పాస్టర్లు, క్రిస్టియన్లు పాల్గొన్నారు.

- కరీంనగర్‌కల్చరల్

## క్లుప్తంగా

### భక్తి సంగీత విభావరి



విద్యానగర్(కరీంనగర్): కరీంనగర్ మండలం నగునూర్‌లోని శ్రీదుర్గాభవానీ ఆలయంలోని అమ్మవారి సన్నిధిలో ఆదివారం శ్రీనీలకంఠ భజన మండలి మహిళా విభాగం అధ్యక్షురాలు వడాల మాధవి ఆధ్వర్యంలో జరిగిన భక్తి సంగీత విభావరి శ్రోతలను, భక్తులను భక్తి సాగరంలో ఓలలాడించింది. అమ్మవారిపై భజన మండలి సభ్యులు పాడిన పాటలు అందరినీ అలరించాయి. ఈ సంగీత విభావరిలో భజన మండలి నిర్వాహకులు పంజాల శ్రీధర్‌గౌడ్, మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి కోండూరి పుష్పలత, గౌరవ అధ్యక్షులు గర్రెపల్లి ఆంజనేయులు, సభ్యులు శారద, పుష్ప, సంధ్య, రజిత, దేవిశెట్టి హన్మండ్లు, ఎజ్జ శ్రీనివాస్, కనుకరాజు, సదానందనం, కమలాకర్ తదితరులు పాడిన పాటలు, భజనలతో భక్తులు భక్తి పారవశ్యంలో తన్మయత్వం చెందారు.

### ఎంపీ పరామర్శ



అభిలాష్ చిత్రపటం వద్ద పుష్పాంజలి ఘటిస్తున్న ఎంపీ సంజయ్‌కుమార్

కొత్తపల్లి: కొత్తపల్లి మండలం చింతకుంట గ్రామానికి చెందిన బీజేపీ సీనియర్ నాయకుడు సంగెపు ఆనందాచారి కుమారుడు అభిలాష్ ఇటీవల మృతి చెందగా ఆదివారం ఆ కుటుంబాన్ని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్ పరామర్శించి ఓదార్చారు. అభిలాష్ చిత్రపటం వద్ద పుష్పాంజలి ఘటించి నివాళి అర్పించారు. బీజేపీ నాయకులు రతన్‌కుమార్, అనిల్‌కుమార్, ప్రశాంత్, పరుశురాం, రేణు, శ్రీనివాస్, మల్లారెడ్డి, రాజు, మల్లేషం, ప్రవీణ్, వెంకటేష్, రాజేశ్, మహేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్‌ఎస్‌లోకి వలసల జోరు



పార్టీ కండువాలు కప్పి బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న మంత్రి గంగుల కమలాకర్

- మంత్రి గంగుల కమలాకర్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో పలువురు చేరిక

కరీంనగర్: పేదల సంక్షేమం కోసం ప్రభుత్వం చేపట్టిన అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చూసి కాంగ్రెస్, బీజేపీ పార్టీల నాయకులు తమ కార్యకర్తలతో కలిసి మూకుమ్మడిగా బీఆర్‌ఎస్ పార్టీలోకి చేరుతున్నారని బీసీ సంక్షేమ పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. ఆదివారం మంత్రి మీ సేవా కార్యాలయంలో కరీంనగర్‌రూరల్ మండలం ఎలాబోతారంకు చెందిన యువకులు బీఆర్‌ఎస్‌లో చేరారు. పార్టీలో చేరిన వారికి మంత్రి కమలాకర్ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సీఎం కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణలో జరుగుతున్న అభివృద్ధిని చూసి రానున్న ఎన్నికల వరకు ప్రజలంతా ఒక్కటై మళ్లీ బీఆర్‌ఎస్‌కు ఏకపక్ష తీర్పు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రెడ్డ వేణి మధు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు శ్యాంసుందర్‌రెడ్డి, నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, సుంకిశాల సంపత్‌రావు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### బ్లెస్సీని అభినందించిన మంత్రి

విద్యానగర్(కరీంనగర్): రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన డాక్టర్ ప్రకృతి ప్రకాష్ కుమార్తె బ్లెస్సిని ఆదివారం కరీంనగర్‌లోని మీ సేవా కార్యాలయంలో మంత్రి గంగుల కమలాకర్ అభినందించి శాలువాతో సత్కరించారు. పచ్చదనాన్ని ప్రేమించే తన తండ్రిని స్ఫూర్తిగా తీసుకొని చెట్ల కింద రాలిన 65 వేల విత్తనాలను తానే ఏరి మట్టితో విత్తనబంతులు చేసి పుట్టిన రోజు సందర్భంగా తండ్రి సాయంతో అడవుల్లో వెదజల్లిందన్నారు. బ్లెస్సీ నాటే ప్రతి విత్తు భావితరాలకు భవిష్యత్తు అని కొనియాడారు, కార్యక్రమంలో సామాజిక కార్యకర్త గాలిపెల్లి రవికుమార్, హరీష్ తదితరులు పాల్గొన్నారు

### అభినందన

కరీంనగర్‌స్పోర్ట్స్: కేంద్రీయ విద్యాలయ సౌత్ రీజియన్ క్రీడా పోటీలు–2023లో కరీంనగర్ జిల్లా నుంచి స్కేటింగ్ విభాగంలో పాల్గొని రజత, కాంస్య పతకాలు గెలుచుకున్న తాటి విశృత్‌ను మంత్రి గంగుల కమలాకర్ ఆదివారం అభినందించారు. మరిన్ని పతకాలు గెలుచుకోవాలని సూచించారు.

# సర్వాయి పాపన్న విగ్రహం ఏర్పాటు చేయాలి



మంత్రి గంగులకు విన్నవిస్తున్న పాపన్న విగ్రహ నిర్మాణ కమిటీ బాధ్యులు

విద్యానగర్(కరీంనగర్): కరీంనగర్ మానేరు రివర్స్ ఫ్రంట్ ఐలాండ్‌లో సర్వాయి పాపన్న విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కోరుతూ సర్వాయి పాపన్న విగ్రహ నిర్మాణ కమిటీ బాధ్యులు ఆదివారం మంత్రి గంగుల కమలాకర్‌ను కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా మంత్రి స్పందిస్తూ కరీంనగర్ ప్రవేశ ద్వారా వద్ద ఉన్న పాపన్న విగ్రహాన్ని మానేరు పాత బ్రిడ్జిపైన నిర్మిస్తామని హామీ ఇచ్చారు. విశాలమైన పానవట్టం, గోలకొండ నమూనా కోట గోడల నిర్మాణాలపై పాపన్న విగ్రహాన్ని ఏర్పాటు చేసి చుట్టూ వాటర్ ఫౌంటేన్‌తో రాష్ట్రంలోనే అద్వితీయమైన పాపన్న ఐలాండ్ నిర్మిస్తామని అన్నారు. మంత్రిని కలిసిన వారిలో సర్వాయి పాపన్న విగ్రహ నిర్మాణ కమిటీ బాధ్యులు వీరగోని పెంటయ్య, కలర్ సత్తెన్న, గ్రంథాలయ సంస్థ చైర్మన్ పొన్నం అనిల్, కార్పొరేటర్ కోటగిరి భూమాగౌడ్, నాయకులు గుగ్గిల్ల శ్రీనివాస్, జక్కుల మల్లేశం, కట్ల సత్తయ్య, గౌడిసెల రమేశ్‌గౌడ్, మంద రమేశ్, పిల్లి శారద మహేశ్ తదితరులున్నారు.

# ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

కరీంనగర్: ఉపాధ్యాయుల, విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని తపస్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కట్ట రాజేశ్వర్, గన్నమనేని రంగారావు డిమాండ్ చేశారు. ఆదివారం కరీంనగర్‌లోని సంఘం కార్యాలయంలో ఉపాధ్యాయ ఉద్యమ జాగరణ కరపత్రాలను ఆవిష్కరించారు. ప్రభుత్వం వెంటనే పీఆర్‌సీ వేసి, ఐఆర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. తక్షణమే పదోన్నతులు, బదిలీలు చేపట్టాలని, పెండింగ్ బిల్స్ క్లియర్ చేయాలన్నారు. పాత పెన్షన్ పునరుద్ధరించి, కేజీబీవీ, మోడల్ స్కూళ్ల టీచర్ల సమస్యలు పరిష్కరించాలని కోరారు. సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర శాఖ పిలుపు మేరకు ఆగస్టు 5న కరీంనగర్ కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్నట్లు, 19న హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద రాష్ట్రస్థాయి ధర్నా చేపట్టనున్నట్లు వెల్లడించారు. తపస్ రాష్ట్ర బాధ్యులు అన్నమనేని తిరుపతిరావు, వీరమల్ల వెంకటరమణారావు, కటకం శ్రీనివాస్ జిల్లా బాధ్యులు అమృత రెడ్డి, సాయన్న, రాంప్రసాద్, శేఖర్, పద్మారెడ్డి, విజేందర్ రెడ్డి, అనిల్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# చంద్రశేఖర్ ఆజాద్ స్ఫూర్తితో పోరాడుదాం



నివాళి అర్పిస్తున్న డీవైఎఫ్‌ఐ నాయకులు

విద్యానగర్(కరీంనగర్): తెల్ల దొరల గుండెల్లో రైళ్లు పరుగెత్తించిన స్వాతంత్ర్య ఉద్యమ విప్లవ కిశోరం చంద్రశేఖర్ ఆజాద్ స్ఫూర్తితో సమస్య పరిష్కారానికి పోరాడుదామని డీవైఎఫ్‌ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుపతి అన్నారు. ఆదివారం చంద్రశేఖర్ ఆజాద్ 117వ జయంతి సందర్భంగా కరీంనగర్‌లోని మంకమ్మతోటలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూలమాలు వేసి నివాళి అర్పించారు. తెల్ల దొరలపై వీరోచితమైన పోరాటాలు చేసిన గొప్ప పోరాట యోధుడు చంద్రశేఖర్ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు డి.నరేశ్, నాయకులు ప్రకాశ్, వినోద్, భాస్కర్, అజయ్, అంబర్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

### పుస్తకావిష్కరణ




కరీంనగర్ కల్చరల్: నగరంలోని కార్ఖానగడ్డలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం జమాతే ఇస్లామీ హింద్ సంస్థ ఆధ్వర్యంలో సంస్థ సభ్యుడు, ఉపాధ్యాయుడు అబ్దుల్ వాజిద్ రచించిన 'ఓ వి చిత్రమా! నీ జీవిత పయనమెటు' పుస్తకాన్ని సంస్థ రాష్ట్ర బాధ్యుడు ఇంతియాజ్ హుస్సేన్, జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ ఖైరోద్దీన్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో నగర అధ్యక్షుడు అజహరుద్దీన్, అబ్దుల్ రహమాన్, మహమ్మద్ ఇర్ఫాన్ తదితరులు పాల్గొన్నారు.

### టీఏఐఎస్‌కేడీ కన్వీనర్‌గా చల్ల హరిశంకర్



చల్ల హరిశంకర్

కరీంనగర్‌స్పోర్ట్స్: కరాటే అసోసియేషన్ ఆఫ్ ఇండియా (కాయ్) అనుబంధ తెలంగాణ అసోసియేషన్ ఆఫ్ ఇంటిగ్రేటెడ్ స్పోర్ట్స్ కరాటేడొ(టీఏఐఎస్‌కేడీ) కన్వీనర్‌గా బీఆర్‌ఎస్ నగర అధ్యక్షుడు, బేస్‌బాల్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చల్ల హరిశంకర్ నియమితులయ్యారు. ఈమేరకు టీఏఐఎస్‌కేడీ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాస్, నరేందర్‌లు ఆదివారం నియామకపు ఉత్తర్వులు జారీ చేశారు. 23 జూలై 2025 వరకు చల్ల హరిశంకర్ ఈ పదవిలో కొనసాగనున్నారు. హరిశంకర్‌ను బీఆర్‌ఎస్ నాయకులు, క్రీడా సంఘాల ప్రతినిధులు, సీనియర్ క్రీడాకారులు అభినందనలు తెలిపారు.

### బంజారా వెల్ఫేర్ సొసైటీ కార్యవర్గం ఎన్నిక



కరీంనగర్: నగరంలోని భగత్‌నగర్‌లో ఆదివారం బంజారా వెల్ఫేర్ సొసైటీ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా బానోతు కిషన్ నాయక్. అధ్యక్షుడిగా బానోతు వెంకటయ్య, వర్కింగ్ అధ్యక్షుడిగా గుగులోతు రాజు నాయక్, ప్రధాన కార్యదర్శిగా మూడవత్ తిరుపతి నాయక్, ట్రెజరర్‌గా బానోత్ జయరాంనాయక్, అదనపు కార్యదర్శిగా భూక్యా లక్ష్మి, ఉపాధ్యక్షులుగా బానోతు రంగ నాయక్, ధరావత్ మోహన్ నాయక్, భూక్య మోహన్ నాయక్, ముడవత్ రాజు, కార్యదర్శులుగా బలరాం నాయక్, రాజన్ననాయక్ ,బానోతు తిరుపతి నాయక్, లకవత్ రవి నాయక్, గుగులోతు రవినాయక్, బానోతు రాజేందర్ నాయక్, సోషల్ మీడియా ఇన్‌చార్జిగా దరవత్ తిరుపతి నాయక్, కార్యవర్గ సభ్యులుగా దేవేందర్ నాయక్, సభ్యులుగా మొగిలి నాయక్,్ర పసాద్ నాయక్‌లు ఎన్నికయ్యారు.

### మంత్రిని కలిసిన కొత్తపల్లి ఎస్సై



కొత్తపల్లి: కొత్తపల్లి ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన బి.చంద్రశేఖర్ ఆదివారం రాష్ట్ర బీసీ సంక్షేమం, పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్‌ను తన క్యాంప్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి బొకే అందజేశారు. శాంతిభద్రత పరిరక్షణలో సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలని ఈ సందర్భంగా ఎస్సైకు మంత్రి సూచిస్తూ శుభాకాంక్షలు తెలియజేశారు.

### పద్మశాలీ సంఘం వనభోజనాలు



కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం దుర్శేడ్‌లో శ్రావణమాసం పురస్కరించుకుని ఆదివారం పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో వనభోజనాల కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామశివారులోని మామిడి తోటకు కుటుంబసభ్యులతో సహా తరలివెళ్లారు. విందు భోజనాలు చేసిన అనంతరం ఆటపాటలతో ఉత్సాహంగా సందడి చేశారు. ఈ కార్యక్రమంలో పద్మశాలీ సంఘం అధ్యక్షుడు సందాల తిరుపతి, వార్డు సభ్యురాలు వేముల స్వప్న, నాయకులు వేముల రాజేశం, రాంచంద్రం, అశోక్, రాజు తదితరులు పాల్గొన్నారు.

### ఆశ్రమ నిర్వాహకుడికి సన్మానం



శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న సభ్యులు

కరీంనగర్‌రూరల్: బాలాజీ అన్నపూర్ణ సేవా సమితిని ప్రారంభించి 200రోజులు పూర్తయిన సందర్భంగా ఆదివారం కరీంనగర్‌లో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా వెలిచాలలో స్పందన అనాథ వృద్ధుల ఆశ్రమం నిర్వహిస్తున్న బొమ్మకల్‌కు చెందిన మంచికట్ల శ్రీనివాస్‌ను సేవా సమితి సభ్యులు ఘనంగా సన్మానించారు. పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు.

# ఘనంగా బీఎంఎస్ ఆవిర్భావ దినోత్సవం



జెండావిష్కరిస్తున్న బీఎంఎస్ నాయకులు

కరీంనగర్‌టౌన్: భారతీయ మజ్దూర్ సంఘ్ (బీఎంఎస్) ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఆదివారం కరీంనగర్‌లోని వివిధ ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించారు. టవర్‌సర్కిల్ కూడలి, ఇండస్ట్రీయల్ పార్క్ వద్ద జిల్లా కన్వీనర్ పప్పుల సురేష్, కోకన్వీనర్ పసుల శ్రవణ్ ఆధ్వర్యంలో బీఎంఎస్ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పప్పుల సురేష్ మాట్లాడుతూ బీఎంఎస్ స్థాపన, ఆవశ్యకతను వివరించారు. 1955 జూలై 23న ఆవిర్భావం నుంచి అలుపులేని పోరాటాలు చేస్తుందని అన్నారు. కొకన్వీనర్ పసుల శ్రవణ్ మాట్లాడుతూ కార్మికులకు సమస్యలు వస్తే బీఎంఎస్ కార్మికుడి వెన్నంటి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గిన్నె శ్రీనివాస్, నక్క అరుణ్, ఎండీ సుల్తాన్, ఆకుల తిరుపతి, రమణయ్య, శ్రీనివాస్ మహిళా కార్మికులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## ట్రాన్స్‘ఫార్మర్’తిప్పలు

కరీంనగర్ మండలం నల్లగుంటపల్లిలో కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలో కొత్తది ఏర్పాటు చేసేందుకు విద్యుత్ సిబ్బందితో పాటు రైతులు పడరానీ పాట్లు పడుతున్నారు. వారం రోజుల క్రితం తాగు నీటి బావితో పాటు వ్యవసాయ కనెక్షన్లున్న ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయింది. తాగునీటికి ఇబ్బంది ఏర్పడటంతో శనివారం కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ను ట్రాక్టర్‌లో తీసుకుని వెళ్తుండగా ఎడతెరిపిలేకుండా కురిసిన వర్షాలతో బురదగా మారిన మట్టి రోడ్డులో ట్రాక్టర్ దిగబడింది. స్థానిక రైతులు ఎంత ప్రయత్నించిన ట్రాక్టర్ బయటకు రాకపోవడంతో ఆదివారం మళ్లీ చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. మరో చోట ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని ట్రాన్స్‌కో ఏఈ నరేశ్ తెలిపారు.

– కరీంనగర్‌రూరల్

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సప్తగిరికాలనీ: సుల్తానాబాద్ శ్రీలింగేశ్వర హైస్కూల్ 1997–98లో పదో తరగతి పూర్తి చేసుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం కరీంనగర్‌లోని కొండ సత్యలక్ష్మి గార్డెన్‌లో ఆత్మీయ సమ్మేళనం జరుపుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల వ్యవస్థాపకుడు గుజ్జ బుచ్చారావు, ఉపాధ్యాయులు చంద్రయ్య, అస్లాం ,వెంకటేశం, విద్యార్థులు గోలి నరేందర్, మేడి శ్రీధర్, వెంకటేష్, నాగరాజు, చందు, రాధిక, లక్ష్మి, సరిత తదితరులు పాల్గొన్నారు.

### పవర్‌కట్ ప్రాంతాలు

కొత్తపల్లి: కరీంనగర్‌లో స్మార్ట్‌సిటీ పనులు చేపడుతున్నందున సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు అంబేడ్కర్ స్టేడియం నుంచి గౌతమినగర్ వరకు, అభయాంజనేయ స్వామి ఆలయం, కాకతీయ స్కూల్, బృందావన్ ఫంక్షన్ హాల్ వెనుక ప్రాంతం, గంగపుత వీధి, బ్రాహ్మణవీధి, న్యూశ్రీనగర్ కాలనీ, గౌతమినగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్–2 ఏడీఈ ఎం.సుధీర్ కుమార్ తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.



## పోరాడి ఓడిన సాకేత్-యూకీ జోడీ

హాల్ ఆఫ్ ఫేమ్ ఓపెన్ ఏటీపీ-250 టెన్నిస్ టోర్నీలో సాకేత్ మైనేని-యూకీ బాంబ్రి (భారత్) జోడీ పోరాటం ముగిసింది. అమెరికాలోని న్యూపోర్ట్‌లో జరిగిన ఈ టోర్నీలో సాకేత్-యూకీ ద్వయం పురుషుల డబుల్స్ విభాగంలో సెమీఫైనల్లో పోరాడి ఓడింది. గంటా 59 నిమిషాలపాటు జరిగిన సెమీఫైనల్లో మూడో సీడ్ సాకేత్-యూకీ జంట 7-6 (7/2), 6-7 (2/7), 9-11తో టాప్ సీడ్ నథానియల్ లామోన్స్-జాక్సన్ విత్రో (అమెరికా) ద్వయం చేతిలో ఓటమి చవిచూసింది. సాకేత్-యూకీలకు 10,660 డాలర్ల (రూ. 8 లక్షల 74 వేలు) ప్రైజ్‌మనీతోపాటు 90 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి.

## విజేత సుమిత్ నగాల్

భారత అగ్రశ్రేణి టెన్నిస్ క్రీడాకారుడు సుమిత్ నగాల్ తన కెరీర్‌లో నాలుగో ఏటీపీ చాలెంజర్ టోర్నీ సింగిల్స్ టైటిల్ సాధించాడు. ఫిన్‌లాండ్‌లో ఆదివారం ముగిసిన టాంపెరె ఓపెన్ టోర్నీ ఫైనల్లో సుమిత్ 6-4, 7-5తో డలిబోర్ సిర్సినా (చెక్ రిపబ్లిక్)పై గెలిచాడు. తద్వారా యూరోప్ సర్క్యూట్‌లో రెండు చాలెంజర్ టైటిల్స్ నెగ్గిన తొలి భారతీయ టెన్నిస్ ప్లేయర్‌గా గుర్తింపు పొందాడు. సుమిత్‌కు 9,880 యూరోల (రూ. 9 లక్షలు) ప్రైజ్‌మనీ,75 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి.





## భారత 'ఎ' జట్టుకు నిరాశ

**కొలంబో:** ఎమర్జింగ్ కప్ ఆసియా అండర్-23 క్రికెట్ టోర్నమెంట్‌లో భారత 'ఎ' జట్టు రన్నరప్‌గా నిలిచింది. ఆదివారం జరిగిన ఫైనల్లో పాకిస్తాన్ 'ఎ' 128 పరుగుల తేడాతో భారత్‌ను ఓడించి వరుసగా రెండోసారి విజేతగా నిలిచింది. టాస్ నెగ్గిన భారత్ ఫీల్డింగ్ ఎంచుకోగా... మొదట పాకిస్తాన్ నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్లకు 352 పరుగుల భారీస్కోరు చేసింది. తయ్యబ్ తాహిర్ (71 బంతుల్లో 108; 12 ఫోర్లు, 4 సిక్సర్లు) మెరుపు శతకం సాధించగా, ఓపెనర్లు అయూబ్ (59; 7 ఫోర్లు, 2 సిక్స్‌లు), ఫర్హాన్ (65; 4 ఫోర్లు, 4 సిక్సర్లు) అర్ధసెంచరీలు చేశారు. రాజ్‌వర్ధన్, రియాన్ పరాగ్ చెరో 2 వికెట్లు తీశారు. తర్వాత భారత్ 'ఎ' 40 ఓవర్లలోనే 224 పరుగుల వద్ద ఆలౌటైంది. ఓపెనర్ అభిషేక్ శర్మ (51 బంతుల్లో 61; 5 ఫోర్లు, 1 సిక్స్) రాణించాడు. కెప్టెన్ యశ్ ధుల్ (41 బంతుల్లో 39; 4 ఫోర్లు), సాయి సుదర్శన్ (28 బంతుల్లో 29; 4 ఫోర్లు) మెరుగ్గా ఆడారు. పాక్ బౌలర్లలో సుఫియాన్ 3, వసీమ్, ముంతాజ్, ఇక్బాల్ తలా 2 వికెట్లు తీశారు. టోర్నీ ఆసాంతం రాణించిన నిశాంత్ సింధుకు 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్' లభించింది.

## రవి దహియాకు షాక్

**న్యూఢిల్లీ:** భారత స్టార్ రెజ్లర్ రవి దహియా ఆసియా క్రీడలకు అర్హత సాధించలేకపోయాడు. టోక్యో ఒలింపిక్స్‌లో రజతం, కామన్వెల్త్ గేమ్స్‌లో స్వర్ణం, వరుసగా మూడేళ్లు ఆసియా చాంపియన్‌గా నిలిచిన రవి దహియా (57 కేజీలు) ఆదివారం నిర్వహించిన సెలెక్షన్ ట్రయల్స్‌లో ఆతీశ్ తోడ్కర్ (మహారాష్ట్ర) చేతిలో అనూహ్యంగా ఓడిపోయాడు. అయితే ఈ విభాగంలో అమన్ సెహ్రావత్ విజేతగా నిలిచి ఆసియా క్రీడల బెర్త్‌ను దక్కించుకున్నాడు. ఇతర విభాగాల్లో దీపక్ పూనియా (86 కేజీలు), విక్కీ (97 కేజీలు), యశ్ (74 కేజీలు), సుమిత్ మలిక్ (125 కేజీలు), విశాల్ కాళీరామన్ (65 కేజీలు) విజేతలుగా నిలిచారు. 65 కేజీల విభాగంలో బజరంగ్ పూనియాకు నేరుగా ఆసియా క్రీడల్లో ఆడే అవకాశం కల్పించడంతో విశాల్ 'స్టాండ్‌బై'గా ఉంటాడు.



# సిరాజ్ పడగొట్టేశాడు





- భారత పేసర్ దెబ్బకు విండీస్ 255కే ఆలౌట్
- టీమిండియాకు 183 పరుగుల ఆధిక్యం
- రెండో ఇన్నింగ్స్‌లో 118/2

**పోర్ట్ ఆఫ్ స్పెయిన్:** భారత స్పీడ్‌స్టర్ మొహమ్మద్ సిరాజ్ (5/60) నిప్పులు చెరిగే బౌలింగ్ స్పెల్‌తో వెస్టిండీస్ తొలి ఇన్నింగ్స్‌ను ఊహించని విధంగా ముగించాడు. ఓవర్‌నైట్ స్కోరు 229/5తో ఆదివారం నాలుగో రోజు ఆట కొనసాగించిన కరీబియన్ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 115.4 ఓవర్లలో 255 పరుగులకే కుప్పకూలింది. కేవలం 26 పరుగులే జోడించి సగం వికెట్లను కోల్పోయింది. నాలుగో రోజు తొలి ఓవర్లోనే ముకేశ్... అతానజ్ (37; 3 ఫోర్లు)ను అవుట్ చేస్తే... మిగిలిన 4 వికెట్లను స్వల్పవ్యవధిలో సిరాజ్ పడేశాడు. హోల్డర్ (15; 2 ఫోర్లు), అల్జారీ జోసెఫ్ (4), కీమర్ రోచ్ (4), గాబ్రియెల్ (0)లను సిరాజ్ తన నాలుగు ఓవర్ల సూపర్ స్పెల్‌తో పడగొట్టేశాడు. బుల్లెట్లలా దూసుకొస్తున్న బంతులకు అనుభవజ్ఞుడైన హోల్డరే నిలువలేకపోయాడు. దీంతో తర్వాత టెయిలెండర్లు వచ్చీరాగానే బ్యాట్లెత్తారు. 116వ ఓవర్ వేసిన సిరాజ్ వరుస బంతుల్లో రోచ్, గాబ్రియెల్‌లను అవుట్ చేశాడు. ఒకవేళ రెండో ఇన్నింగ్స్‌లో తొలి బంతికే వికెట్ తీస్తే 'హ్యాట్రిక్' నమోదవుతుంది. భారత్‌కు తొలి ఇన్నింగ్స్‌లో 183 పరుగుల ఆధిక్యం లభించింది. అనంతరం రెండో ఇన్నింగ్స్‌కు దిగిన భారత్ వర్షంతో ఆట నిలిచే సమయానికి 15 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 118 పరుగులు చేసింది. ఆటకు సోమవారం ఆఖరిరోజు కావడంతో కెప్టెన్, ఓపెనర్ రోహిత్ శర్మ (44 బంతుల్లో 57; 5 ఫోర్లు, 3 సిక్సర్లు) దూకుడుగా ఆడాడు. యశస్వి జైస్వాల్ (30 బంతుల్లో 38; 4 ఫోర్లు, 1 సిక్స్)కూడా ధాటిగానే ఆడాడు. ఈ ఇద్దరు నిష్క్రమించగా... శుబ్‌మన్ గిల్ (10 బ్యాటింగ్), ఇషాన్ కిషన్ (8 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. ప్రస్తుతం భారత్ 301 పరుగుల ఆధిక్యంలో ఉంది.

### స్కోరు వివరాలు

**భారత్ తొలి ఇన్నింగ్స్:** 438; **వెస్టిండీస్ తొలి ఇన్నింగ్స్:** బ్రాత్‌వైట్ (బి) అశ్విన్ 75; తేజ్‌నారాయణ్ చందర్‌పాల్ (సి) అశ్విన్ (బి) జడేజా 33; మెకెంజీ (సి) ఇషాన్ కిషన్ (బి) ముకేశ్ 32; బ్లాక్‌వుడ్ (సి) రహానే (బి) జడేజా 20; అతానజ్ (ఎల్బీడబ్ల్యూ) (బి) ముకేశ్ 37; జొషువా (బి) సిరాజ్ 10; హోల్డర్ (సి) ఇషాన్ కిషన్ (బి) సిరాజ్ 15; జోసెఫ్ (ఎల్బీడబ్ల్యూ) (బి) సిరాజ్ 4; రోచ్ (సి) ఇషాన్ కిషన్ (బి) సిరాజ్ 4; వారికన్ (నాటౌట్) 7; గాబ్రియెల్ (ఎల్బీడబ్ల్యూ) (బి) సిరాజ్ 0; ఎక్స్‌ట్రాలు 18; **మొత్తం** (115.4 ఓవర్లలో ఆలౌట్) 255. **వికెట్ల పతనం:** 1-71, 2-117, 3-157, 4-178, 5-208, 6-229, 7-233, 8-244, 9-255, 10-255. **బౌలింగ్:** సిరాజ్ 23.4-6-60-5, జైదేవ్ ఉనాద్కట్ 16-3-44-0, అశ్విన్ 33-10-61-1, ముకేశ్ 18-6-48-2, జడేజా 25-10-37-2.

**భారత్ రెండో ఇన్నింగ్స్:** యశస్వి జైస్వాల్ (సి) జొషువా (బి) వారికన్ 38; రోహిత్ శర్మ (సి) జోసెఫ్ (బి) గాబ్రియెల్ 57; గిల్ (బ్యాటింగ్) 10; ఇషాన్ కిషన్ (బ్యాటింగ్) 8; ఎక్స్‌ట్రాలు 5; **మొత్తం** (15 ఓవర్లలో 2 వికెట్లకు) 118. **వికెట్ల పతనం:** 1-98, 2-102. **బౌలింగ్:** రోచ్ 2-0-22-0, జోసెఫ్ 4-0-37-0, హోల్డర్ 4-0-26-0, గాబ్రియెల్ 3-0-15-1, వారికన్ 2-0-15-1.

# ఎదురులేని సాత్విక్-చిరాగ్ జోడీ

కొరియా ఓపెన్‌లో టైటిల్ సొంతం ● ఫైనల్లో ప్రపంచ నంబర్‌వన్ జంటపై గెలుపు ● ఈ ఏడాది నాలుగో టైటిల్ కైవసం





చిరాగ్ శెట్టి, సాత్విక్ సాయిరాజ్

**యోసు (కొరియా):** ఈ ఏడాది తమ అద్భుతమైన ప్రదర్శన కొనసాగిస్తూ సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి జోడీ తమ ఖాతాలో నాలుగో టైటిల్‌ను జమ చేసుకుంది. కొరియా ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-500 టోర్నీలో ప్రపంచ మూడో ర్యాంక్ ద్వయం సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి (భారత్) చాంపియన్‌గా అవతరించింది. ఆదివారం జరిగిన పురుషుల డబుల్స్ ఫైనల్లో సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి జంట 17-21, 21-13, 21-14తో ప్రపంచ నంబర్‌వన్ ర్యాంక్ జోడీ ఫజర్ అల్ఫియాన్-మొహమ్మద్ రియాన్ అర్డియాంతో (ఇండోనేసియా)పై అద్భుత విజయం సాధించింది. 62 నిమిషాలపాటు జరిగిన ఈ తుది పోరులో ఆంధ్రప్రదేశ్ ప్లేయర్ సాత్విక్, మహారాష్ట్ర ఆటగాడు చిరాగ్ తొలి గేమ్‌లో తడబడినా వెంటనే తేరుకొని తర్వాతి రెండు గేమ్‌లను దక్కించుకున్నారు. తొలి గేమ్‌లో ఒక దశలో 2-10తో వెనుకబడ్డ భారత జోడీ ఆ తర్వాత అంతరాన్ని తగ్గించినా గేమ్‌ను సొంతం చేసుకోలేకపోయింది. అయితే రెండో గేమ్ నుంచి సాత్విక్, చిరాగ్ ఆట మారింది. ముఖ్యంగా సాత్విక్ తిరుగులేని స్మాష్‌లతో చెలరేగాడు. ఫలితంగా స్కోరు 15-11 వద్ద భారత జోడీ వరుసగా ఐదు పాయింట్లు నెగ్గి 20-15తో ఆధిక్యంలోకి వెళ్లింది. ఆ తర్వాత రెండు పాయింట్లు చేజార్చుకున్నా వెంటనే మరో పాయింట్ నెగ్గి గేమ్‌ను దక్కించుకొని మ్యాచ్‌లో నిలిచింది. నిర్ణాయక మూడో గేమ్‌లో సాత్విక్-చిరాగ్ ఆరంభంలోనే 7-3తో ఆధిక్యంలోకి వెళ్లి ఈ ఆధిక్యాన్ని చివరిదాకా కాపాడుకొని గేమ్‌తోపాటు మ్యాచ్‌ను సొంతం చేసుకున్నారు. విజేతగా నిలిచిన సాత్విక్-చిరాగ్ జోడీకి 33,180 డాలర్ల (రూ. 27 లక్షల 20 వేలు) ప్రైజ్‌మనీతోపాటు 9200 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి. 'వరుసగా టైటిల్స్ గెలుస్తున్నందుకు చాలా ఆనందంగా ఉంది. ఈ వారం మాకెంతో అద్భుతంగా గడిచింది. ఈ టోర్నీ మొత్తం గొప్పగా ఆడాం. మా ప్రదర్శనతో సంతృప్తిగా ఉన్నాం. మంగళవారం నుంచి జరిగే జపాన్ ఓపెన్‌లో మా జోరు కొనసాగించాలని పట్టుదలతో ఉన్నాం' అని సాత్విక్, చిరాగ్ వ్యాఖ్యానించారు.

**4** ఈ ఏడాది సాత్విక్-చిరాగ్ నెగ్గిన టైటిల్స్. స్విస్ ఓపెన్ సూపర్-300, ఆసియా చాంపియన్‌షిప్, ఇండోనేసియా ఓపెన్ సూపర్-1000, కొరియా ఓపెన్ సూపర్-500 టోర్నీలలో టైటిల్స్ గెలిచారు.

### ఏపీ సీఎం వైఎస్ జగన్ అభినందన

**సాక్షి,అమరావతి:** కొరియా ఓపెన్‌లో డబుల్స్ టైటిల్ నెగ్గిన ఆంధ్రప్రదేశ్‌కు చెందిన సాత్విక్ సాయిరాజ్ రంకిరెడ్డి, చిరాగ్ శెట్టి (మహారాష్ట్ర)లను ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభినందించారు. భవిష్యత్‌లో జరిగే టోర్నీల్లోనూ వీరిద్దరూ విజయ పరంపర కొనసాగించాలని సీఎం జగన్ ఆకాంక్షించారు.

## వెర్‌స్టాపెన్ జోరు

ఈ సీజన్‌లో తొమ్మిదో విజయం



**బుడాపెస్ట్:** ఫార్ములావన్ సీజన్‌లో తన జోరు కొనసాగిస్తూ రెడ్‌బుల్ జట్టు డ్రైవర్ మాక్స్ వెర్‌స్టాపెన్ వరుసగా ఏడో విజయాన్ని, ఓవరాల్‌గా తొమ్మిదో టైటిల్‌ను తన ఖాతాలో వేసుకున్నాడు. ఆదివారం జరిగిన హంగేరి గ్రాండ్‌ప్రిలో వెర్‌స్టాపెన్ నిర్ణీత 70 ల్యాప్‌లను అందరికంటే వేగంగా ఒక గంటా 38 నిమిషాల 08.634 సెకన్లలో పూర్తి చేసి గెలుపొందాడు. 'పోల్ పొజిషన్'తో రేసును ఆరంభించిన హామిల్టన్‌ను వెర్‌స్టాపెన్ తొలి ల్యాప్ మలుపు వద్ద ఓవర్‌టేక్ చేసి వెనుదిరిగి చూడలేదు. ఈ గెలుపుతో ఫార్ములావన్ చరిత్రలో వరుసగా 12 రేసుల్లో నెగ్గిన తొలి జట్టుగా రెడ్‌బుల్ గుర్తింపు పొందింది. 1988లో మెక్‌లారెన్ జట్టు వరుసగా 11 రేసుల్లో గెలిచింది.

## ఆసీస్‌దే 'యాషెస్' సిరీస్

**మాంచెస్టర్:** నాలుగో టెస్టులో గెలిచి యాషెస్ సిరీస్‌లో సజీవంగా ఉండాలని ఆశించిన ఇంగ్లండ్ జట్టుపై వరుణ దేవుడు కరుణించలేదు. ఎడతెరిపిలేని వాన కారణంగా ఆస్ట్రేలియా, ఇంగ్లండ్ జట్ల మధ్య నాలుగో టెస్టులో ఐదో రోజు ఆట సాధ్యపడలేదు. దాంతో మ్యాచ్ 'డ్రా'గా ముగిసింది. నాలుగో రోజు ఆట ముగిసే సమయానికి ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్‌లో 214/5తో మరో 61 పరుగులు వెనుకంజలో నిలిచింది. ఐదో రోజు త్వరగా ఆస్ట్రేలియాను ఆలౌట్ చేసి విజయంపై ఇంగ్లండ్ కన్నేసింది. కానీ వర్షం కారణంగా ఇంగ్లండ్ ఆశలు ఆవిరయ్యాయి. ప్రస్తుత ఐదు టెస్టుల సిరీస్‌లో ఆస్ట్రేలియా 2-1తో ఆధిక్యంలో ఉంది. చివరి టెస్టులో ఇంగ్లండ్ నెగ్గినా సిరీస్ 2-2తో సమంగా ముగుస్తుంది. అయితే క్రితంసారి యాషెస్ సిరీస్‌లో ఆస్ట్రేలియా గెలుపొందడంతో ఈసారీ ఆ జట్టు వద్దే యాషెస్ సిరీస్ ట్రోఫీ ఉంటుంది.





## విద్య, ఉద్యోగ సమాచారం

### ఐఐఎం, బెంగళూరులో లైబ్రరీ ట్రైనీ పోస్టులు

బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్(ఐఐఎం).. లైబ్రరీ ట్రైనీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 04
» **అర్హత:** ఎంఎల్ఐఎస్సీ ఉత్తీర్ణతతో పాటు లైబ్రరీ టెక్నాలజీపై పరిజ్ఞానం ఉండాలి.
» **నెలవారీ స్టైపెండ్:** రూ.20,000.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**24.07.2023
» **వెబ్‌సైట్:** iimb.ac.in

### ఏకలవ్య పాఠశాలల్లో 6329 టీజీటీ, హాస్టల్ వార్డెన్ పోస్టులు

దేశవ్యాప్తంగా నేషనల్ ఎడ్యుకేషన్ సొసైటీ ఫర్ ట్రైబల్ స్టూడెంట్స్(నెస్ట్స్).. ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూళ్ల(ఈఎంఆర్ఎస్)లో డైరెక్ట్ ప్రాతిపదికన టీజీటీ, హాస్టల్ వార్డెన్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 6329
» **పోస్టుల వివరాలు:**ట్రెయిన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్(టీజీటీ)-5660, హాస్టల్ వార్డెన్(పురుషులు)-335, హాస్టల్ వార్డెన్(మహిళలు)-334.
» **సబ్జెక్టులు:** హిందీ,ఇంగ్లిష్, మ్యాథ్స్,సోషల్ స్టడీస్, సైన్స్,బెంగాలీ,గుజరాతీ,కన్నడ,మలయాళం, మణిపురి, మరాఠీ, ఒడియా, తెలుగు, ఉర్దూ, మిజో, సంస్కృతం, సంతాలి, మ్యూజిక్, ఆర్ట్, పీటీటీ(మేల్), పీఈటీ(ఫిమేల్), లైబ్రేరియన్.
» **అర్హత:** టీజీటీ ఖాళీలకు సంబంధిత విభాగంలో డిగ్రీ, బీఈడీతో పాటు సీటెట్ ఉత్తీర్ణులై ఉండాలి. టీజీటీ పీఈటీ పోస్టులకు డిగ్రీ, బీపీఈడీ, టీజీటీ లైబ్రేరియన్ పోస్టులకు డిగ్రీ, బీఎల్ఐఎస్సీ ఉత్తీర్ణులై ఉండాలి. » **వయసు:** 18.08.2023 నాటికి 18 నుంచి 35 ఏళ్ల మధ్య ఉండాలి.
» **వేతనం:** నెలకు టీజీటీ ఉద్యోగాలకు రూ.44,900 నుంచి 1,42,400; రూ.35,400 నుంచి రూ.1,12,400, హాస్టల్ వార్డెన్‌కు రూ.29,200 నుంచి రూ.92,300.
» **ఎంపిక విధానం:** ఈఎంఆర్ఎస్ స్టాఫ్ సెలక్షన్ ఎగ్జామ్-2023, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **పరీక్ష విధానం:** ఓఎంఆర్ ఆధారిత(పెన్ పేపర్) విధానంలో ఆబ్జెక్టివ్ టైప్ ప్రశ్నలు అడుగుతారు. టీజీటీ రాతపరీక్షకు 120 మార్కులు(120 ప్రశ్నలు), లాంగ్వేజ్ కాంపిటెన్సీ టెస్టుకు 30 మార్కులు(30 ప్రశ్నలు) కేటాయించారు. హాస్టల్ వార్డెన్ రాత పరీక్షకు 120 మార్కులు(120 ప్రశ్నలు) కేటాయించారు. టీజీటీ పరీక్షకు మూడు గంటలు, హాస్టల్ వార్డెన్ పరీక్షకు రెండున్నర గంటల వ్యవధి ఉంటుంది.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**18.08.2023
» **వెబ్‌సైట్:** emrs.tribal.gov.in

# బ్యాంక్ కొలువు కావాలా..!

బ్యాంకు ఉద్యోగాల అభ్యర్థులకు మరో ప్రభుత్వ రంగ బ్యాంకు.. ఆహ్వానం పలుకుతోంది! బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర.. స్కేల్-2, స్కేల్-3 ఆఫీసర్స్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఎంపికైతే ప్రారంభంలోనే నెలకు రూ.50 వేలకు పైగా వేతనం అందుకోవచ్చు!! ఈ నేపథ్యంలో. .బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర ఆఫీసర్ పోస్టుల వివరాలు, దరఖాస్తుకు అర్హతలు, ఎంపిక విధానం తదితర వివరాలు..

» బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్రలో ఆఫీసర్స్ పోస్టులు
» మొత్తం 400 ఉద్యోగాల భర్తీకి ప్రకటన విడుదల
» రాత పరీక్ష, ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక
» రూ.50వేలకు పైగా వేతనం

బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర తాజా నోటిఫికేషన్ ద్వారాస్కేల్-2, స్కేల్-3 ఆఫీసర్స్ హోదాలో మొత్తం నాలుగు వందల పోస్టులను భర్తీ చేయనుంది. వీటిల్లో స్కేల్-3 ఆఫీసర్(ఎంఎంజీఎస్-3)-100 పోస్టులు; స్కేల్-2 ఆఫీసర్ (ఎంఎంజీఎస్-2)-300 పోస్టులు ఉన్నాయి.

#### అర్హతలు

- 60 శాతం మార్కులతో బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణత ఉండాలి. లేదా సీఏ, సీఎంఏ, సీఎఫ్ఏ వంటి కోర్సులు ఉత్తీర్ణులవ్వాలి. జేఏఐఐబీ, సీఏఐఐబీ ఉత్తీర్ణులకు ప్రాధాన్యం ఉంటుంది. నిర్దేశిత విద్యార్హతలతోపాటు అభ్యర్థులకు పని అనుభవం కూడా తప్పనిసరి. స్కేల్ -2 ఆఫీసర్ పోస్టులకు బ్యాంకుల్లో కనీసం మూడేళ్లు, స్కేల్-3 ఆఫీసర్ పోస్టులకు బ్యాంకుల్లో కనీసం అయిదేళ్ల అనుభవం తప్పనిసరి.
- **వయసు:** స్కేల్-3 ఆఫీసర్ పోస్టులకు 25-38 ఏళ్లు; స్కేల్-2 ఆఫీసర్ పోస్టులకు 25-38 ఏళ్ల ఉండాలి. ఎస్సీ, ఎస్టీలకు అయిదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు చొప్పున గరిష్ట వయో పరిమితిలో సడలింపు ఉంటుంది.

#### ఎంపిక ప్రక్రియ


స్కేల్-3, స్కేల్-2 ఆఫీసర్ పోస్టులకు సంబంధించి రెండు దశల్లో ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తారు. ముందుగా రాత పరీక్ష నిర్వహిస్తారు. ఆ తర్వాత పర్సనల్ ఇంటర్వ్యూ/గ్రూప్ డిస్కషన్ దశలు ఉంటాయి. ఈ రెండిటిలోనూ ప్రతిభ చూపిన వారితో మెరిట్ జాబితా రూపొందించి కొలువులు ఖరారు చేస్తారు.

#### 150 మార్కులకు రాత పరీక్ష

ఎంపిక ప్రక్రియలో తొలి దశ రాత పరీక్షను నాలుగు విభాగాల్లో 150 మార్కులకు నిర్వహిస్తారు. ఇందులో.. ఇంగ్లిష్ లాంగ్వేజ్ 20 ప్రశ్నలు, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ 20 ప్రశ్నలు, రీజనింగ్ ఎబిలిటీ 20 ప్రశ్నలు, ప్రొఫెషనల్ నాలెడ్జ్ 90 ప్రశ్నలు ఉంటాయి. పరీక్ష సమయం రెండు గంటలు. పరీక్ష పూర్తిగా ఆన్‌లైన్ విధానంలో ఉంటుంది. ప్రశ్నలు ఆబ్జెక్టివ్ విధానంలో ఉంటాయి.

#### తదుపరి దశ ఇంటర్వ్యూ

రాత పరీక్షలో చూపిన ప్రతిభ ఆధారంగా.. నిర్దేశిత కటాఫ్‌ను అనుసరించి ఒక్కో పోస్ట్‌కు నలుగురిని (1:4 నిష్పత్తి) చొప్పున పర్సనల్ ఇంటర్వ్యూకు ఎంపిక చేస్తారు. 100 మార్కులకు ఈ ఇంటర్వ్యూ ఉంటుంది. ఇందులో అభ్యర్థులకు బ్యాంకింగ్ రంగంపై ఉన్న అవగాహన, అదే విధంగా ఇప్పటి వరకు తాము పని చేసిన విభాగాలు, నిర్వర్తించిన విధులు వంటి వాటిపై ప్రశ్నలు అడుగుతారు.





#### గ్రూప్ డిస్కషన్

గ్రూప్ డిస్కషన్ కూడా నిర్వహించే అవకాశం ఉంది. పర్సనల్ ఇంటర్వ్యూకు అభ్యర్థులను ఎంపిక చేసే క్రమంలో గ్రూప్ డిస్కషన్ నిర్వహించే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈ గ్రూప్ డిస్కషన్‌లో అభ్యర్థులను సమకాలీన అంశాలపై చర్చించి.. తమ అభిప్రాయాలు చెప్పాలని సూచిస్తారు.

#### వెయిటేజీ విధానం

తుది జాబితాను రూపొందించే క్రమంలో రెండు దశల్లోనూ చూపిన ప్రతిభను పరిగణనలోకి తీసుకుంటారు. ఇందుకోసం వెయిటేజీ విధానాన్ని అమలు చేస్తారు. రాత పరీక్షలో మార్కులకు 75 శాతం; పర్సనల్ ఇంటర్వ్యూ మార్కులకు 25 శాతం చొప్పున వెయిటేజీ ఉంటుంది. ఈ రెండు దశల్లో సాధించిన మార్కులను 100 మార్కులకు క్రోడీకరించి వెయిటేజీ ప్రకారం.. తుది విజేతలను ఖరారు చేస్తారు.

#### ప్రొబేషన్, సర్వీస్ బాండ్

తుది విజేతలుగా నిలిచి.. కొలువులు ఖరారు చేసుకున్న అభ్యర్థులకు ప్రొబేషన్ పిరియడ్ విధానం, అదే విధంగా సర్వీస్ బాండ్ నిబంధన అమలు చేస్తున్నారు. ఆరు నెలల ప్రొబేషన్ పిరియడ్‌తోపాటు, రెండేళ్ల పాటు బ్యాంకులో పని చేస్తామని రూ.రెండు లక్షలకు సమానమైన సర్వీస్ బాండ్‌ను ఇవ్వాల్సి ఉంటుంది.

#### ఆకర్షణీయ వేతనం

- స్కేల్-3, స్కేల్-2 ఆఫీసర్లుగా ఎంపికైన వారికి ప్రారంభంలోనే ఆకర్షణీయ వేతనాలు లభిస్తాయి
- స్కేల్-3 ఆఫీసర్లకు రూ.63,840 - రూ.78,230 వేతన శ్రేణి ఉంటుంది.
- స్కేల్-2 ఆఫీసర్లకు రూ.48,170 - రూ.69,810 వేతన శ్రేణి ఉంటుంది.

#### స్కేల్-7 వరకు పదోన్నతులు

భవిష్యత్తు పదోన్నతులను పరిగణనలోకి తీసుకుంటే స్కేల్-2, స్కేల్-3 హోదాలో అడుగు పెట్టిన వారు స్కేల్-7 హోదాకు చేరుకునే అవకాశం ఉంటుంది. ఆయా హోదాల్లో కనీసం మూడేళ్ల సీనియారిటీ ప్రాతిపదికగా పదోన్నతులు లభిస్తాయి. బ్యాంకు అంతర్గతంగా నిర్వహించే పరీక్షల్లో ఉత్తీర్ణత సాధిస్తే.. మరింత వేగంగా పదోన్నతులు అందుకునే అవకాశం ఉంటుంది.

#### ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ ధరఖాస్తు చివరి తేదీ:** జూలై 25, 2023
- **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్
- **వివరాలకు వెబ్‌సైట్:** https://bankofmaharashtra.in/currentopenings
- **ఆన్‌లైన్ దరఖాస్తు వెబ్‌సైట్:** https://ibpsonline.ibps.in/bmcgomay23

#### రాత పరీక్షలో విజయానికి ఇలా

##### ఇంగ్లిష్

ఈ విభాగంలో రాణించేందుకు అభ్యర్థులు ఇడియమ్స్, సెంటెన్స్ కరెక్షన్, వొకాబ్యులరీ, సెంటెన్స్ రీ అరేంజ్‌మెంట్, వన్ వర్డ్ సబ్‌స్టిట్యూట్స్‌పై అవగాహన పెంచుకోవాలి. అదే విధంగా ఇంగ్లిష్ వొకాబ్యులరీపై పట్టు సాధించాలి. ఇందుకోసం ఇంగ్లిష్ దిన పత్రికలు చదవడం, వాటిలో వినియోగిస్తున్న పదజాలం, వాక్య నిర్మాణం వంటి వాటిపై దృష్టి పెట్టాలి.

##### క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్

- ఈ విభాగం కోసం అర్థమెటిక్ అంశాల(పర్సంటేజెస్, నిష్పత్తులు, లాభ-నష్టాలు, నంబర్ సిరీస్, బాడ్‌మాస్ నియమాలు)ను ప్రాక్టీస్ చేయాలి. వీటితో పాటు గత పరీక్షలు, వెయిటేజీ కోణంలో డేటా ఇంటర్‌ప్రిటేషన్, డేటా అనాలిసిస్‌లపై పట్టు పెంచుకోవాలి. అదే విధంగా... క్వాడ్రాటిక్ ఈక్వేషన్స్, డేటా ఇంటర్‌ప్రిటేషన్, సింప్లిఫికేషన్స్, అప్రాక్సిమేషన్స్ అంశాలను అధ్యయనం చేయాలి.
- **రీజనింగ్ ఎబిలిటీ:** ఈ విభాగంలో మార్కుల సాధనకు కోడింగ్-డీకోడింగ్, బ్లడ్ రిలేషన్స్, డైరెక్షన్స్, సిలాజిజమ్ విభాగాలను బాగా ప్రాక్టీస్ చేయాలి.

##### ప్రొఫెషనల్ నాలెడ్జ్

బ్యాంకింగ్ రంగం పరిణామాలు, విధానాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. బ్యాంకింగ్ రంగంలోని అబ్రివేషన్లు, పదజాలం, విధులు, బ్యాంకులకు సంబంధించిన కొత్త విధానాలు, కోర్ బ్యాంకింగ్‌కు సంబంధించి చట్టాలు, విధానాలు, రిజర్వ్ బ్యాంకు విధులు వంటి వాటిపై పూర్తిగా అవగాహన ఏర్పరచుకోవాలి.

జనరల్ అవేర్‌నెస్‌లో కరెంట్ అఫైర్స్, స్టాక్ జనరల్ నాలెడ్జ్ కోణంలోనూ ఆర్థిక సంబంధ వ్యవహారాలు (ఎకానమీ, ప్రభుత్వ పథకాలు)కు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలి.

## ఐటీబీపీలో కానిస్టేబుల్ పోస్టులు

పదోతరగతి ఉత్తీర్ణులై సర్కారీ కొలువు కోసం అన్వేషిస్తున్న అభ్యర్థులకు తీపి కబురు. కేంద్ర హోంశాఖ పరిధిలోని ఇండో-టిబెటన్ బోర్డర్ పోలీస్ ఫోర్స్(ఐటీబీపీ).. ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. డ్రైవింగ్ లైసెన్స్, ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్ట్, ఫిజికల్ స్టాండర్డ్ టెస్ట్, రాత పరీక్ష, ట్రేడ్ టెస్ట్, మెడికల్ టెస్టుల ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. జూలై 26 తేదీలోగా ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసుకోవచ్చు.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 458
- **పోస్టుల వివరాలు:** కానిస్టేబుల్ (డ్రైవర్) గ్రూప్-సి, నాన్-గెజిటెడ్ (నాన్ మినిస్టీరియల్)-458 పోస్టులు (యూఆర్-195, ఎస్సీ-74, ఎస్టీ-37, ఓబీసీ-110, ఈడబ్ల్యూఎస్-42)

#### అర్హతలు

గుర్తింపు పొందిన బోర్డు లేదా సంస్థ నుంచి మెట్రిక్యులేషన్ లేదా పదోతరగతి ఉత్తీర్ణులై ఉండాలి. వ్యాలిడ్ హెవీ వెహికల్ డ్రైవింగ్ లైసెన్స్ (హెచ్ఎంవీ) కలిగి ఉండాలి. •**వయసు:** 21 నుంచి 27 ఏళ్ల మధ్య ఉండాలి. రిజర్వేషన్ అభ్యర్థులకు గరిష్ట వయోపరిమితిలో సడలింపు లభిస్తుంది.

#### ఎంపిక ఇలా

- ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్ట్(పీఈటీ), ఫిజికల్ స్టాండర్డ్ టెస్ట్(పీఎస్‌టీ), రాత పరీక్ష, ఒరిజినల్ డాక్యుమెంట్ల వెరిఫికేషన్, ప్రాక్టికల్ డ్రైవింగ్ స్కిల్ టెస్ట్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.
- పీఈటీ, పీఎస్‌టీ అర్హత పరీక్షలు. కాగా రాత పరీక్ష 100 మార్కులకు, డ్రైవింగ్ టెస్ట్ 50 మార్కులకు ఉంటాయి.

#### ఫిజికల్ స్టాండర్డ్‌టెస్ట్(పీఎస్‌టీ)

**ఎత్తు:** అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల అభ్యర్థులు 170 సెం.మీ; అస్సాం, హిమాచల్ ప్రదేశ్, జమ్మూకాశ్మీర్, లద్దాక్‌కు చెందిన గుర్కాస్, డోగ్రాస్ తదితర ప్రత్యేక వర్గాలు వారు 165 సెం.మీ, కొండ ప్రాంతాల్లోని నార్త్-ఈస్టర్న్ రాష్ట్రాల వారు 162.5 సెం.మీ. ఎత్తు, ఇతరులు 160 సెం.మీ ఎత్తు ఉండాలి. అలాగే ఛాతీ ఊపిరి పీల్చినప్పుడు, వదిలినప్పుడు 80-85 మధ్య వ్యత్యాసం ఉండాలి. ప్రత్యేక వర్గాల వారికి 5 సెం.మీ మేర సడలింపు వర్తిస్తుంది.

#### ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్ట్(పీఈటీ)

ఈ పరీక్షలో భాగంగా 1.6 మీటర్ల దూరాన్ని పురుషులు 7.30 నిమిషాల్లో పూర్తి చేయాల్సి ఉంటుంది. 11 ఫీట్ల లాంగ్ జంప్‌ను మూడు ప్రయత్నాల్లో, 3 1/2 ఫీట్ హైజంప్‌ను 3 ప్రయత్నాల్లో పూర్తిచేయాలి.

#### రాత పరీక్ష

జాబ్స్ ఇన్ఫో

ఈ పరీక్ష మొత్తం 100 మార్కులకు ఉంటుంది. ఇందులో జనరల్ నాలెడ్జ్ 10 ప్రశ్నలు- 10 మార్కులు, మ్యాథమెటిక్స్ 10ప్రశ్నలు-10 మార్కులు, హిందీ 10 ప్రశ్నలు-10 మార్కులు, ఇంగ్లిష్ 10 ప్రశ్నలు-10 మార్కులు, ట్రేడ్ రిలేటెడ్ థియరీ క్వశ్చన్స్ 60-ప్రశ్నలు 60 మార్కులకు ఉంటాయి. పరీక్ష సమయం 2 గంటలు.

#### డ్రైవింగ్ టెస్ట్

రాత పరీక్షలో అర్హత సాధించిన వారిని షార్ట్‌లిస్ట్ చేసి డ్రైవింగ్ టెస్ట్‌కు పిలుస్తారు. ఈ పరీక్షకు 50మార్కులు ఉంటాయి.ఇందులో భాగంగా ప్రత్యేకంగా డిజైన్ చేసిన ట్రాక్స్ మీద హెవీ అండ్ లైట్ మోటార్ వెహికిల్స్‌కు సంబంధించి ప్రాక్టికల్ టెస్టులను నిర్వహిస్తారు. ఇవే కాకుండా వెహికల్ మెయింటెన్స్, వివిధ పరిస్థితుల్లో డ్రైవింగ్ చేసే విధానాన్ని గమనిస్తారు.

#### తుది ఎంపిక

రాత పరీక్ష, డ్రైవింగ్ టెస్టులో ఎంపికైన వారికి డాక్యుమెంట్ వెరిఫికేషన్ నిర్వహిస్తారు. సర్టిఫికేట్ వెరిఫికేషన్ పూర్తయిన అభ్యర్థులకు మెడికల్ టెస్టులను నిర్వహించి తుదిగా ఎంపిక చేసి..ఉద్యోగాల్లోకి తీసుకుంటారు.

#### వేతనాలు

ఈ ఉద్యోగాలకు ఎంపికైన వారికి పే లెవల్-3 ప్రకారం-రూ.21,700-69,100 వరకు వేతన శ్రేణి లభిస్తుంది.

#### ముఖ్యసమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- దరఖాస్తులకు చివరి తేదీ: జూలై 26, 2023
- వెబ్‌సైట్: https://itbpolice.nic.in

స్టాక్ మార్కెట్లు (శుక్రవారం ముగింపు)

| దేశీ సూచీలు | | |
|---|---|---|
| సెన్సెక్స్ ▽ | 888 | 66,684 |
| నిఫ్టీ ▽ | 234 | 19,745 |

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

| విదేశీ సూచీలు | | | |
|---|---|---|---|
| నాస్‌డాక్ | 14,033 | ▽ | 31 |
| డోజోన్స్ | 35,228 | △ | 3 |
| ఎఫ్‌టీఎస్‌ఈ 100 | 7,664 | △ | 18 |
| డాక్స్ | 16,177 | ▽ | 27 |
| షాంఘై | 3,168 | ▽ | 2 |
| నికాయ్ | 32,304 | ▽ | 186 |

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్



# విపత్తుల నుంచి రక్షణ ఉందా?





- వరదలతో ఊహించనంత ఆస్తి నష్టం
- వాహనాల ఇంజన్లకు మరమ్మతులు
- ఈ కాలంలో ఎన్నో ప్రాణాంతక వ్యాధులు
- హోమ్ ఇన్సూరెన్స్‌తో ఎన్నో ప్రయోజనాలు
- సమగ్ర బీమాకు తోడుగా రైడర్లు ఉండాల్సిందే
- హెల్త్ ప్లాన్‌లో అన్నింటికీ రక్షణ ఉండేలా చూసుకోవాలి

**ఏటా వానాకాలంలో భారీ వర్షాల కారణంగా ఎదురయ్యే నష్టం భారీగా ఉంటోంది. ఎడతెరిపి లేకుండా 24 గంటల పాటు వర్షం పడితే పట్టణాల్లోని లోతట్టు ప్రాంతాలు వరద నీటి మధ్య చిక్కుకుపోవడం గురించి వింటూనే ఉన్నాం. వాహనాలు నీట మునగడం, ఇంటికి నష్టం, మౌలిక సదుపాయాలు దెబ్బతినడం చూస్తూనే ఉన్నాం. చెరువులు తెగి, నదులు పొంగడం వల్ల గ్రామాల్లోనూ పంటలకు, ఇతరత్రా ఎంతో నష్టం వాటిల్లుతోంది. ఇదంతా ప్రకృతి వైపరీత్యాల వల్ల ఎదురయ్యే పరిణామం. ఈ విషయంలో మనం పెద్దగా చేయగలిగేదేమీ ఉండదు. కాకపోతే ఒక్క చర్యతో విపత్తుల వల్ల ఎదురయ్యే ప్రతికూల పరిణామాల తాలూకు నష్టాన్ని పరిమితం చేసుకోవచ్చు. తగినంత బీమా కవరేజీ కల్పించుకోవడమే ఇందుకు ఉన్న ఏకైక మార్గం. సమగ్రమైన కవరేజీతో, అన్ని నష్టాలకూ రక్షణ కల్పించే విధంగా బీమా కవరేజీ ఉండాలి. ఇందుకు ఏం చేయాలన్నది తెలియజేసే కథనమే ఇది.**

## కార్లకు బీమా



ప్రకృతి వైపరీత్యాలు, ప్రమాదాల వల్ల ఎదురయ్యే నష్టాన్ని భర్తీ చేసే వాహన బీమా పాలసీలు ఎన్నో అందుబాటులో ఉన్నాయి. సమగ్రమైన కవరేజీతోపాటు, స్టాండర్డ్ పాలసీల్లో నచ్చింది తీసుకోవచ్చు. కాకపోతే కారుకు కాంప్రహెన్సివ్ బీమా పాలసీ తీసుకున్నామని చెప్పి నిశ్చింతంగా ఉండడానికి లేదు. వరద నీరు కారణంగా ఇంజన్‌కు నష్టం ఏర్పడితే ఈ పాలసీల్లో పరిహారం రాదు. టైర్లు పేలిపోవడం, వరదనీరు కారణంగా వాహనం నిలిచిపోయినా పరిహారం రాదు. ''వరద నీటి వల్ల ఇంజన్ ఆన్ అవ్వకపోతే అందుకు కాంప్రహెన్సివ్ ప్లాన్‌లో కవరేజీ రాదు. అంతేకాదు విడిభాగాలు మార్చాల్సి వచ్చినా లేదా విడిభాగాలకు మరమ్మతులు చేయాల్సి వచ్చినా కానీ, తరుగుదలకు చెల్లింపులు చేయవు. అందుకని వాహనదారు తప్పనిసరిగా ఇంజన్ ప్రొటెక్షన్ కవర్, స్పాట్ అసిస్టెన్స్, డిప్రిసియేషన్ కవర్ తప్పకుండా తీసుకోవాలి''అని ప్రోబస్ ఇన్సూరెన్స్ బ్రోకర్ డైరెక్టర్ రాకేశ్ గోయల్ సూచించారు. సాధారణంగా ఈ కవరేజీలు యాడాన్ లేదా రైడర్ రూపంలో అందుబాటులో ఉంటాయని, వాహన బీమాతోపాటు వీటిని కూడా తీసుకోవాలన్నారు.




## ఇంటికి బీమా

వర్షాలు, వరదలకు ఇంటికి కూడా నష్టం వాటిల్లే ప్రమాదం ఉంది. వడగండ్లు, పిడుగులతో కూడిన వర్షాలకు ఇంటి నిర్మాణం దెబ్బతినొచ్చు. కుండపోతకు ఇంటి పైకప్పుకు నష్టం కలగొచ్చు. అలాగే, ఎలక్ట్రిక్ వైరింగ్, ఇతర వస్తువులు, ఫర్నిచర్ దెబ్బతినడం వల్ల ఆర్థిక నష్టం ఎదురుకావచ్చు. అలాంటి పరిస్థితుల్లో హోమ్ ఇన్సూరెన్స్ ఎంతో ఆదుకుంటుంది. దురదృష్టవశాత్తూ మన దేశంలో హోమ్ ఇన్సూరెన్స్‌ను తీసుకుంటున్న వారు చాలా తక్కువ మందే ఉన్నారు. హౌస్ ఇన్సూరెన్స్ పట్ల అవగాహన లేకపోవడం, తప్పుడు అభిప్రాయాల కారణంగా మన దేశంలో దీని విస్తరణ చాలా నిదానంగా ఉందని బజాజ్ అలియాంజ్ జనరల్ ఇన్సూరెన్స్ రిటైల్ నాన్‌మోటార్ నేషనల్ హెడ్ గురుదీప్ సింగ్ పేర్కొన్నారు. అయితే హోమ్ ఇన్సూరెన్స్ తీసుకోవడానికి ముందు తెలుసుకోవాల్సిన అంశాలు కొన్ని ఉన్నాయి. ''ప్రకృతి విపత్తుల (యాక్ట్ ఆఫ్ గాడ్) కారణంగా వాటిల్లే నష్టానికి కవరేజీనే ఈ బీమా పాలసీలు ఆఫర్ చేస్తాయి. అలాగే, ఊహించని ఇతర ఉత్పాతాల వల్ల నష్టానికి కూడా రక్షణనిస్తాయి. ఏడాదికి మించిన కవరేజీని ఒకేసారి తీసుకోవడం వల్ల ప్రీమియంలో ఆదా చేసుకోవచ్చు. కాంప్రహెన్సివ్ హోమ్ కవర్ తీసుకోవాలి. దోపిడీ, దొంగతనం, వ్యక్తిగత ప్రమాద కవరేజీ, ఇల్లు దెబ్బతినడం వల్ల నష్టపోయే అద్దె ఆదాయాన్ని భర్తీ చేసే కవరేజీలు ఉండాలి. ఇంట్లోని ఖరీదైన పెయింటింగ్‌లు, ఆభరణాలకూ బీమా రక్షణ కల్పించుకోవాలి. థర్డ్ పార్టీ లయబిలిటీ కవరేజీని కూడా తీసుకోవాలి'' అని గురుదీప్ సింగ్ సూచించారు.

ఇంటి నవీకరణ, పునర్నిర్మాణ సమయంలో ఏవైనా మార్పులు చేసినట్టయితే, హోమ్ ఇన్సూరెన్స్ తీసుకునే సమయంలో కచ్చితమైన విలువను పేర్కొనాలని సింగ్ పేర్కొన్నారు. ''మీ ఇల్లు దీర్ఘకాలం పాటు ఖాళీగా ఉంటే, హోమ్ ఇన్సూరెన్స్ కలిగి ఉండడం ఎంతో అవసరం. సరైన చిరునామా, ప్రాపర్టీ విలువ సరిగ్గా పేర్కొనడం వల్ల పాలసీదారు తన వంతు నష్టాన్ని భరించాల్సిన అవసరం లేకుండా నివారిస్తుంది'' అని సింగ్ తెలిపారు. ఇంట్లోని వస్తువులకు బీమా కవరేజీ కోసం విడిగా ఒక్కో ఆర్టికల్ వివరాలను పూర్తిగా పేర్కొనడం, వాటి విలువను కూడా నమోదు చేయడాన్ని మర్చిపోవద్దు. రీప్లేస్‌మెంట్ లేదా రీఇన్‌స్టేట్‌మెంట్ కవర్‌ను తీసుకోవాలి. ''హోమ్ ఇన్సూరెన్స్ విభాగంలో మార్కెట్ వేల్యూ కవరేజీ లేదంటే రీఇన్‌స్టేట్‌మెంట్ కవరేజీ తీసుకోవచ్చు. మార్కెట్ వేల్యూ కవర్‌లో తరుగుదల పోను మీ ఇంటి విలువలో మిగిలిన మొత్తాన్ని పరిహారం రూపంలో పొందుతారు. రీఇన్‌స్టేట్‌మెంట్ కవర్‌లో ఇంటి పునర్‌నిర్మాణానికి అయ్యే ఖర్చుకు సమాన స్థాయిలో బీమా పరిహారం లభిస్తుంది. ఉదాహరణకు వరదలు వచ్చి ఇల్లు దెబ్బతింటే, అప్పుడు ఇంటిని తిరిగి నిర్మించుకోవాల్సి రావచ్చు. అటువంటి సందర్భాల్లో హౌస్ రీఇన్‌స్టేట్‌మెంట్ కవర్ ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది''అని ఐసీఐసీఐ లాంబార్డ్ జనరల్ ఇన్సూరెన్స్ అండర్‌రైటింగ్ చీఫ్ సంజయ్ దత్తా వివరించారు.

## వ్యాధుల నుంచి రక్షణ



వర్షా కాలంలో దోమల వల్ల, నీరు కలుషితం కావడం వల్ల, వైరస్‌ల కారణంగా ఎన్నో ఆరోగ్య సమస్యలు ఎదురవుతుంటాయి. డెంగీ, మలేరియా, వైరల్ ఫీవర్, టైఫాయిడ్ జ్వరం, డయేరియా, చికున్ గునియా ముప్పు వర్షాకాలంలో ఎక్కువ. వీటి కారణంగా ఆసుపత్రిలో చేరితే రూ. వేలు, లక్షల బిల్లు చెల్లించుకోవాల్సి రావచ్చు. అందుకని వెక్టార్ బోర్న్ డిసీజ్ ఇన్సూరెన్స్‌ను ప్రతీ కుటుంబం తప్పకుండా తీసుకోవడం మంచిది. ఈ కవరేజీ కింద దోమలు, ఇతర కీటకాలు, బ్యాక్టీరియా, వైరస్ కారణంగా వచ్చే వ్యాధులకు సైతం కవరేజీ లభిస్తుంది. ముఖ్యంగా డెంగీ, టైఫాయిడ్, మలేరియా రిస్క్ ఈ కాలంలో ఎక్కువ ఉంటుంది. సరైన చికిత్స తీసుకోకపోతే వీటిల్లో ప్రాణ ప్రమాదం ఏర్పడొచ్చు. మనదేశంలో డెంగీ, మలేరియా మరణాలు ఎక్కువగా ఉంటున్నాయి. ఏటా లక్షలాది మంది వీటి బారిన పడుతున్నారు. ''కాంప్రహెన్సివ్ హెల్త్ ఇన్సూరెన్స్ కవరేజీ లేని వారు, తప్పకుండా వెక్టార్ కేర్ ఇన్సూరెన్స్ కవరేజీని తమకు, తమ కుటుంబ సభ్యులకు తీసుకోవాలి. కీటకాల వల్ల ఎదురయ్యే అనారోగ్యం చికిత్సలకు పరిహారాన్ని ఇవి చెల్లిస్తాయి''అని బజాజ్ అలియాంజ్ జనరల్ ఇన్సూరెన్స్ హెల్త్ అడ్మినిస్ట్రేషన్ హెడ్ భాస్కర్ నెరుర్కార్ సూచించారు. కీటకాల వల్ల ఎదురయ్యే అనారోగ్యానికి చికిత్స పొందేందుకు ఎక్కువ మొత్తంలో ఖర్చు అయ్యే రిస్క్ ఉంటుంది. డెంగీ బారిన పడితే కోలుకునేందుకు 8–10 రోజులు పట్టొచ్చు. చికిత్సా ఖర్చు రూ. లక్షల్లో ఉంటుంది. మెట్రోల్లో రూమ్ రెంట్ రూ. లక్ష ఉంటుందని, ఒక్కసారి ప్లేట్‌లెట్లు ఎక్కించేందుకు రూ.40,000 తీసుకుంటున్నారని పాలసీబజార్ అంచనా. డెంగీ కారణంగా ప్లేట్‌లెట్లు పడిపోతే ఒకరికి ఒకటికి మించిన సార్లు ప్లేట్‌లెట్లు ఎక్కించాల్సి రావచ్చు.


•••

బీమా పరిశ్రమ ప్రత్యేకంగా వెక్టార్ కేర్ ఇన్సూరెన్స్, వెక్టార్ బోర్న్ హెల్త్ ఇన్సూరెన్స్‌ను ఆఫర్ చేస్తున్నాయి. డెంగీ జ్వరం, మలేరియా, ఫైలేరియా, కాలా అజార్, చికెన్ గునియా, జపనీస్ ఎన్‌సెఫలైటిస్, జికా వైరస్‌లకు వీటిల్లో కవరేజీ ఉంటుంది. ఈ ప్లాన్ తీసుకున్న వారు జీవిత కాలంలో ఒక్కసారే క్లెయిమ్ చేసుకోగలరు. ''మీ బేసిక్ హెల్త్ ఇన్సూరెన్స్‌లో వీటికి కవరేజీ లేకపోతే.. ఒక్కో వ్యాధికి విడిగా కవరేజీ తీసుకోవచ్చు. డెంగీ, మలేరియా ఈ రెండూ మన దేశంలో ఎక్కువగా వచ్చే వ్యాధులు. కనుక వీటికి కవరేజీ కలిగి ఉండడం ఎంతో అవసరం''అని పాలసీ బజార్ హెల్త్ ఇన్సూరెన్స్ హెడ్ అమిత్ చాబ్రా సూచించారు.

## ఇవి ఉండేలా చూసుకోవాలి

- **ఆటో బీమా:** ఇంజన్ ప్రొటెక్షన్ కవర్, రోడ్‌సైడ్ అసిస్టెన్స్, ఇంజన్ ఆయిల్, నట్లు, బోల్టులు, గ్రీజులు, వాషర్లతో కూడిన కన్స్యూమబుల్ రైడర్లను కూడా తీసుకోవాలి.
- **హోమ్ ఇన్సూరెన్స్:** రీప్లేస్‌మెంట్ కాస్ట్ క్లాజ్ ఉందేమో చూసుకోవాలి. ఇది ఉంటే అప్పుడు ఇంటి పునర్నిర్మాణానికి కావాల్సినంత బీమా సంస్థ చెల్లిస్తుంది. ఇంట్లోని విలువైన గ్యాడ్జెట్లు, ఆభరణాలు, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్ ఉత్పత్తులకు సైతం కవరేజీ ఉండాలి. మరమ్మతులు, ప్లంబింగ్, కార్పెంటరీ, పెస్ట్‌కంట్రోల్ కవరేజీ ఉండేమో చూడాలి. దాదాపు అన్ని రకాల నష్టాలకు పరిహారం ఇచ్చే సమగ్రమైన ప్లాన్‌ను తీసుకోవడమే సరైనది.
- **వెక్టార్ బోర్న్ డిసీజ్:** తమ హెల్త్ ఇన్సూరెన్స్‌లో వెక్టార్ బోర్న్ డిసీజ్‌కు కవరేజీ ఉందేమో చూసుకోవాలి. లేకపోతే విడిగా కొనుగోలు చేసుకోవాలి. విడిగా ఒక్కో వ్యాధి, దానికి ఉప పరిమితుల గురించి అడిగి తెలుసుకోవాలి.

## బీమా లేక భారీ నష్టం



ప్రకృతి వైపరీత్యాల వల్ల కలిగే నష్టం ఏ స్థాయిలో ఉంటుందో ఒక్కోసారి గణాంకాలను చూస్తే కానీ అర్థం కాదు. 2001 నుంచి ప్రకృతి విపత్తుల కారణంగా 85,000 మంది మరణించగా, వేలాది కోట్ల రూపాయల నష్టం ఏర్పడినట్టు ఎస్‌బీఐ రీసెర్చ్ నివేదిక తాజాగా స్పష్టం చేసింది. హోమ్ ఇన్సూరెన్స్ కేవలం 8 శాతం మందే కలిగి ఉండడంతో, పెద్ద మొత్తంలో నష్టపోవాల్సి వచ్చినట్టు వాస్తవాన్ని గుర్తు చేసింది. 1900 నుంచి ప్రకృతి వైపరీత్యాల పరంగా అమెరికా, చైనా తర్వాత భారత్ మూడో అతిపెద్ద బాధిత దేశంగా ఉంది. మన దేశంలో 764 సహజ విపత్తులు సంభవించాయి. తుపానులు, వరదలు, భూకంపాలు, కొండ చరియలు విరిగి పడడం, కరువు ఈ జాబితాలో ఉన్నాయి. ముఖ్యంగా 1900 నుంచి 2000 మధ్య 361 పెద్ద వైపరీత్యాలు నమోదు కాగా, ఆ తర్వాత 22 ఏళ్లలో (2001–2022) 402 విపత్తులు చోటు చేసుకున్నాయి. అంటే గతంతో పోలిస్తే ప్రకృతి విపత్తులు పెరిగిపోయినట్టు ఈ గణాంకాలు పరిశీలిస్తే తెలుస్తోంది. ముఖ్యంగా 41 శాతం వైపరీత్యాలు వరదల కారణంగా సంభవించినవే ఉన్నాయి. ఆ తర్వాత తుపానుల వల్ల ఎక్కువ ప్రమాదాలు జరిగాయి. 2020లో వచ్చిన వరదల కారణంగా రూ. 52,500 కోట్ల నష్టం వాటిల్లింది. కానీ, ఇందులో బీమా కవరేజీ ఉన్నది కేవలం 11 శాతం ఆస్తులకే కావడం వాస్తవం. ఇంటికి, ఆస్తులకు, ఆరోగ్యానికి, జీవితానికి బీమా ఎంత ముఖ్యమో ఈ గణాంకాలు కళ్లకు కడుతున్నాయి.

## ఐసీఐసీఐ లాభం హైజంప్

### క్యూ1లో రూ. 10,636 కోట్లు



ముంబై: ప్రయివేట్ రంగ దిగ్గజం ఐసీఐసీఐ బ్యాంక్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2023–24) తొలి త్రైమాసికం(క్యూ1)లో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన క్యూ1(ఏప్రిల్‌–జూన్)లో నికర లాభం 44 శాతం జంప్‌చేసి రూ. 10,636 కోట్లను తాకింది. స్టాండెలోన్ లాభం సైతం 40 శాతం ఎగసి రూ. 9,648 కోట్లకు చేరింది. మొత్తం ఆదాయం(స్టాండెలోన్) రూ. 28,337 కోట్ల నుంచి రూ. 38,763 కోట్లకు పురోగమించింది. నికర వడ్డీ ఆదాయం 38 శాతం ఎగసి రూ. 18,227 కోట్లను తాకింది. రుణాల్లో 18 శాతం వృద్ధి సాధించగా.. నికర వడ్డీ మార్జిన్లు 4.78 శాతంగా నమోదయ్యాయి. వడ్డీయేతర ఆదాయం 12 శాతం పుంజుకుని రూ. 5,183 కోట్లయ్యింది. స్థూల మొండి బకాయిలు(ఎన్‌పీఏలు) 2.81 శాతం నుంచి 2.76 శాతానికి తగ్గాయి. స్లిప్పేజీలు రూ. 4,297 కోట్ల నుంచి రూ. 5,318 కోట్లకు పెరిగాయి. వీటిలో రిటైల్ విభాగం వాటా రూ. 5,012 కోట్లుకాగా.. కనీస మూలధన నిష్పత్తి(సీఏఆర్) 17.9 శాతానికి చేరడంతో పెట్టుబడుల సమీకరణ అవసరంలేనట్లు బ్యాంక్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సందీప్ బాత్రా పేర్కొన్నారు.

| కోడిగుడ్లు (హోల్‌సేల్–నెక్ / 100కు రూ.లలో) | |
|---|---|
| **24-7-2023** | |
| విశాఖ | 475–00 |
| చిత్తూరు | 463–00 |
| ఈస్ట్, వెస్ట్ గోదావరి | 415–00 |
| విజయవాడ | 415–00 |
| రిటైల్ ధర (డజను) | 72.00 |
| **23-7-2023 ఫామ్ ధర...** | |
| హైదరాబాద్ | 400–00 |
| వరంగల్ | 402–00 |
| రిటైల్ ధర | 4.60 |

సాక్షి ప్లస్

## పంజాబ్ నేషనల్ బ్యాంక్ | ఎల్‌కేపీ సెక్యూరిటీస్ | కొనొచ్చు



**ప్రస్తుత ధర:** రూ. 63 **టార్గెట్:** రూ. 80

**ఎందుకంటే:** ప్రభుత్వ రంగ సంస్థ పంజాబ్ నేషనల్ బ్యాంక్(పీఎన్‌బీ) కొద్ది త్రైమాసికాలుగా నిలకడైన పనితీరును చూపుతోంది. హోల్‌సేల్ బుక్‌ను పూర్తిగా సంస్కరించిన బ్యాంక్ ఈ ఆర్థిక సంవత్సరం(2023–24)లో మరిన్ని రికవరీలను అంచనా వేస్తోంది. గత ఆర్థిక సంవత్సరం(2022–23)లో పటిష్ట రుణ వృద్ధిని సాధించగా.. ఈ ఏడాది సైతం ఇదేస్థాయి పురోగతిని ఆశిస్తోంది. ఎంసీఎల్ఆర్ బుక్ ధర(వడ్డీ రేటు)లలో సవరణలు చేపడుతున్న బ్యాంక్ నికర వడ్డీ మార్జిన్లు మెరుగుపడనున్నట్లు భావిస్తోంది. కార్పొరేట్ రుణ ఒత్తిళ్లు తగ్గుతుండటంతో అధిక రికవరీలకు వీలుంది. మొండి రుణాల రికవరీ, ఎన్ఏఆర్‌సీఎల్‌కు కొన్ని మొండి రుణాల విక్రయం నేపథ్యంలో బ్యాలన్స్‌షీట్ పటిష్టం కానుంది. దీంతో మొండి బకాయిలు(ఎన్‌పీఏలు) సాధారణ స్థితికి చేరే వీలుంది. వీటికితోడు రుణాల్లో వృద్ధి, చౌక రుణ వ్యయాలు రిటర్న్ రేషియోలను మెరుగుపరచనున్నాయి. వెరసి అందుబాటులో ఉన్న ట్రేడవుతున్న షేరుకి విలువను చేకూర్చే అవకాశముంది. సహచర సంస్థలు పీఎన్‌బీ హౌసింగ్, పీఎన్‌బీ గిల్ట్స్ బ్యాంకుకు దన్నుగా నిలవనున్నాయి. రానున్న రెండేళ్ల కాలంలో బ్యాంక్ లోన్‌బుక్ వార్షికంగా 11–12 శాతం చొప్పున బలపడవచ్చని అంచనా. ఇందుకు రిటైల్ రుణాల్లో వృద్ధి సహకరించనుంది. ఈ ఏడాది రుణవ్యయాలు సాధారణ స్థితికి చేరనున్నట్లు భావిస్తున్నాం. దీంతో వచ్చే ఏడాది(2024–25)కల్లా రిటర్న్ రేషియోలు ఆర్‌వోఏ 0.5 శాతం, ఆర్‌వోఈ 7.8 శాతంగా నమోదయ్యే అవకాశముంది.

## ఒబెరాయ్ రియల్టీ | హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ | కొనొచ్చు



**ప్రస్తుత ధర:** రూ. 1,055 **టార్గెట్:** రూ. 1,158

**ఎందుకంటే:** ప్రయివేట్ రంగ కంపెనీ ఒబెరాయ్ రియల్టీ సరికొత్త వృద్ధిబాటలో సాగనుంది. రానున్న కొన్నేళ్లలో ప్రవేశపెట్టనున్న కొత్త ప్రాజెక్టులు ఇందుకు దారి ఏర్పాటు చేయనున్నాయి. గతేడాది(2022–23) ముందస్తు అమ్మకాలు వార్షికంగా 31 శాతానికిపైగా జంప్‌చేసి రూ. 5,100 కోట్లను తాకాయి. ఈ బాటలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2023–24)లోనూ రూ. 6,500 కోట్ల ప్రీసేల్స్‌ను సాధించవచ్చని అంచనా. ఇందుకు గోరెగావ్ గార్డెన్ సిటీలో ప్రవేశపెట్టనున్న కొత్త టవర్లు, థానే మైక్రో మార్కెట్లో తొలి ప్రాజెక్టు సహకరించనున్నాయి. 2024 మార్చికల్లా వాణిజ్య పోర్ట్‌ఫోలియోగా అభివృద్ధి చేస్తున్న కామర్జ్3 నిర్వహణలోకి వచ్చే వీలుంది. పూర్తిస్థాయిలో ఆక్యుపెన్సీ ఉంటే వార్షికంగా రూ. 500 కోట్లు అద్దె ఆదాయం లభించవచ్చని అంచనా. ఇక 2024 జూన్‌కల్లా బొరివలీ మాల్ అందుబాటులోకి వచ్చే అవకాశముంది. పూర్తి ఆక్యుపెన్సీ ఉంటే మాల్ ద్వారా రూ. 350 కోట్ల అద్దె ఆదాయాన్ని కంపెనీ అంచనా వేస్తోంది. ఆక్యుపేషన్‌కు సిద్ధంగా ఉన్న ముంబైలోని 360డబ్ల్యూ, ములుండ్ ప్రాజెక్టుల ద్వారా పటిష్ట క్యాష్‌ఫ్లోను సాధించవచ్చని భావిస్తున్నాం. ముంబై మెట్రోపాలిత ప్రాంతానికి ఆవల అభివృద్ధి చేస్తున్న ప్రాజెక్టులు కంపెనీకి మరింత విలువను చేకూర్చనున్నాయి. స్థూల అభివృద్ధి విలువ(జీడీవీ)రీత్యా 2023 ఫిబ్రవరిలో బ్లూస్టార్ నుంచి రూ. 190 కోట్లకు 8 ఎకరాల భూమిని పొందింది. అంతేకాకుండా ఆటో విడిభాగాల కంపెనీ ఎస్ఆర్‌బీ బేరింగ్స్ నుంచి మరో 6.3 ఎకరాల భూమిని సొంతం చేసుకుంది. ఇవి పోఖ్రాన్(థానే)లోగల 60 ఎకరాలకు ఆనుకుని ఉంటాయి.

గమనిక: ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు, సూచనలు, వివిధ బ్రోకరేజీ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే

# అన్‌లిస్టెడ్ షేర్లపై మూలధన లాభాల పన్ను?

Q & A



ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్



**నా వయసు 40 ఏళ్లు. పీపీఎఫ్‌లో నేను 15 ఏళ్లుగా ఇన్వెస్ట్ చేస్తున్నాను. వచ్చే ఏడాదితో గడువు ముగుస్తుంది. దీంతో గడువు ముగిసిన తర్వాత చేతికి అందే మొత్తాన్ని మెరుగైన వృద్ధి అవకాశాలున్న ఎన్‌పీఎస్, తదితర పథకాల్లో వచ్చే 15–20 ఏళ్ల కాలానికి పెట్టుబడులు పెడదామని అనుకుంటున్నాను. పీపీఎఫ్ నుంచి వచ్చే మొత్తం పన్ను రహితమని తెలుసు. ఈ మొత్తాన్ని క్రమంగా ఈక్విటీ పథకాల్లోకి ఎలా మళ్లించుకోవాలి? సూచించగలరు.** – సుచిత్ పూతియా

మీ పెట్టుబడుల నిధిని ఈక్విటీ పథకాల్లోకి మళ్లించుకోవడానికి ముందు మీరు పరిగణనలోకి తీసుకోవాల్సిన అంశాలు కొన్ని ఉన్నాయి. మొదటిది ఎంత కాలానికి పెట్టుబడులు పెడుతున్నారనేది స్పష్టత ఉండాలి. సాధారణంగా ఏకమొత్తంలో డబ్బు ఉండి, ఈక్విటీల్లో పెట్టుబడులు పెడదామనుకుంటే.. గరిష్టంగా మూడేళ్లకు మించకుండా క్రమానుగతంగా (సిప్) ఇన్వెస్ట్ చేసుకోవాలి. ఉదాహరణకు మీ వద్ద రూ.30 లక్షలు ఉన్నాయని అనుకుందాం. ఈ మొత్తాన్ని సమకూర్చుకోవడానికి ఐదేళ్ల కాలం పట్టింది. అప్పుడు ఈ మొత్తాన్ని 12 నుంచి 24 భాగాలు చేసుకోవాలి. అన్ని వాయిదాల్లో ఇన్వెస్ట్ చేసుకోవాలి. దీనివల్ల పెట్టుబడుల సగటు వ్యయం, రిస్క్‌ను తగ్గించుకోవచ్చు. మీరు 15–20 ఏళ్ల కాలానికి ఇన్వెస్ట్ చేద్దామని అనుకుంటున్నారు. కనుక మీరు ఈక్విటీలకు ఎక్కువ కేటాయింపులు చేసుకోవచ్చు. ఈక్విటీ పెట్టుబడులు దీర్ఘకాలంలో ద్రవ్యోల్బణాన్ని మించి మెరుగైన రాబడిని ఇవ్వగలవు. ఇక మీ పెట్టుబడిని ఎన్‌పీఎస్ ఖాతాలో ఇన్వెస్ట్ చేసుకోవాలని అనుకుంటే, యాక్టివ్ చాయిస్ ఆప్షన్ ఎంపిక చేసుకోవాలి. 75 శాతాన్ని ఈక్విటీలకు కేటాయించుకోవాలి. ఎన్‌పీఎస్‌లో ఉపసంహరణల పరంగా ఆంక్షలు ఉన్న విషయాన్ని గుర్తు పెట్టుకోవాలి. 60 ఏళ్లకు వచ్చిన తర్వాత ఎన్‌పీఎస్ మొత్తం నిధి నుంచి మీరు 60 శాతాన్నే ఉపసంహరించుకోవచ్చు. మిగిలిన 40 శాతంతో యాన్యుటీ ప్లాన్ కొనుగోలు చేసుకోవాల్సి ఉంటుంది. కొన్ని ప్రత్యేక సందర్భాల్లోనే అంటే, వైద్య వ్యయాలు, పిల్లల ఉన్నత విద్య, వివాహాల కోసం పాక్షిక ఉపసంహరణకు వెసులుబాటు ఉంటుంది. మీరు క్రమశిక్షణ కలిగిన ఇన్వెస్టర్‌గా ఎన్‌పీఎస్ నిధిని రిటైర్మెంట్ వరకు ముట్టుకోకుండా ఉంటే, అలాంటప్పుడు ఫ్లెక్సీక్యాప్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. ఇవి అచ్చమైన ఈక్విటీ పథకాలు. ఉపసంహరణపై ఎలాంటి ఆంక్షలు ఉండవు. ఎన్‌పీఎస్‌లో ఈక్విటీ పెట్టుబడులు మొత్తం లార్జ్‌క్యాప్ స్టాక్స్‌లోనే ఇన్వెస్ట్ చేస్తుంటారు. కానీ ఫ్లెక్సీక్యాప్ ఫండ్స్ మిడ్, స్మాల్‌క్యాప్‌లోనూ ఇన్వెస్ట్ చేయడం ద్వారా వైవిధ్యం పాటిస్తుంటాయి. దీనివల్ల మెరుగైన రాబడులకు అవకాశం ఉంటుంది. అయితే మీరు ఇంత వరకు ఈక్విటీల్లో ఇన్వెస్ట్ చేయని వారు అయితే, పెట్టుబడులు మొత్తాన్ని ఈక్విటీల్లో ఇన్వెస్ట్ చేసే విషయమై ఆందోళన ఉంటే అప్పుడు అగ్రెస్సివ్ హైబ్రిడ్ ఫండ్‌ను ఎంపిక చేసుకోవచ్చు. అగ్రెస్సివ్ హైబ్రిడ్ ఫండ్స్ అన్నవి 65 శాతం పెట్టుబడులను ఈక్విటీలకు కేటాయించి, 35 శాతాన్ని డెట్‌లో పెడుతుంటాయి. దీనివల్ల ఈక్విటీ అస్థిరతలు తగ్గి, మరింత స్థిరమైన రాబడులకు వీలు కలుగుతుంది.

**నాకు ఒక అన్‌లిస్టెడ్ కంపెనీలో 20 ఏళ్ల నుంచి పెట్టుబడులు ఉన్నాయి. సదరు అన్‌లిస్టెడ్ కంపెనీ, ఒక లిస్టెడ్ కంపెనీలో విలీనం అయింది. దీంతో నేను ఈ షేర్లను విక్రయించేశాను. మూలధన లాభాల పన్నును నేను ఎలా లెక్కించాలో చెప్పగలరు?** – విష్ణుప్రియ

మూలధన లాభాల పన్నును నిర్ణయించే ముందు అన్‌లిస్టెడ్ కంపెనీలో పెట్టుబడి దీర్ఘకాలమా? లేక స్వల్పకాలమా? అన్నది తేల్చాలి. ఏదైనా అన్‌లిస్టెడ్ షేరులో పెట్టుబడి 24 నెలలకు మించి కొనసాగించి ఉంటే, అది దీర్ఘకాలిక మూలధన ఆస్తి అవుతుంది. 24 నెలలకు మించి కొనసాగించినప్పుడు వచ్చే మూలధన లాభంపై 20 శాతం పన్ను పడుతుంది. దీని నుంచి ఇండెక్సేషన్ (ద్రవ్యోల్బణం ప్రభావం మినహాయింపు) ప్రయోజనం క్లెయిమ్ చేసుకోవచ్చు. ఒక ఆర్థిక సంవత్సరంలో ఈక్విటీల్లో రూ.లక్ష దీర్ఘకాల మూలధన లాభం వరకు పన్ను ఉండదని తెలిసిందే. అంతకుమించిన దీర్ఘకాల మూలధన లాభంపై 10 శాతం పన్ను పడుతుంది. కానీ, కొనుగోలు, విక్రయం సమయంలోనూ సెక్యూరిటీస్ ట్రాన్సాక్షన్ ట్యాక్స్ చెల్లించనట్టయితే ఈ ప్రయోజనానికి అనర్హులు. కానీ, మీ కేసులో మీరు కొనుగోలు సమయంలో కాకుండా, కేవలం విక్రయించేటప్పుడే సెక్యూరిటీస్ లావాదేవీల పన్ను చెల్లించారు. కనుక దీర్ఘకాల మూలధన లాభం నుంచి ద్రవ్యోల్బణం మినహాయించి, మిగిలిన మొత్తంపై 20 శాతం పన్ను చెల్లిస్తే సరిపోతుంది.



## పోద్దాడుకు ముంజలు

సాధారణంగా పరుపుతాళ్లకు ముంజకాయలు కాస్తాయి. అయితే.. జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ మండలం ఇప్పగూడెం గ్రామంలోని శ్రీ రేణుకా ఎల్లమ్మ గుడి సమీపంలో ఉన్న పోద్దాడు తాటిచెట్టుకు ముంజ కాయలు కాశాయి. ఇది తెలుసుకున్న గ్రామస్తులు అక్కడికి చేరుకుని ఆసక్తిగా తిలకించారు. గీత కార్మికుడు మందపురం శివాజీ ముంజలను కోసి పలువురికి అందజేశాడు. -స్టేషన్‌ఘన్‌పూర్

## పోక్సో కేసులపై ఫోకస్..!

- రాష్ట్ర మహిళాభద్రత విభాగం నుంచి పర్యవేక్షణ
- కేసుల నిరూపణలో అనుసరించాల్సిన విధానాలపై సూచనలు

సాక్షి, హైదరాబాద్: చిన్నారులపై లైంగిక వేధింపులు, లైంగిక దాడులకు పాల్పడిన ఘటనల్లో నమోదు చేసిన పోక్సో (ది ప్రొటెక్షన్ ఆఫ్ చిల్డ్రన్ ఫ్రం సెక్సువల్ అఫెన్సెస్ యాక్ట్–2012) కేసుల దర్యాప్తు పురోగతిపై రాష్ట్ర మహిళా భద్రతావిభాగం ప్రత్యేకదృష్టి పెట్టింది. అడిషనల్ ఎస్పీ స్థాయి అధికారి పోక్సో కేసులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. కేసు నమోదు మొదలు దర్యాప్తు, ప్రాసిక్యూషన్, నేరస్థులకు శిక్షపడే వరకు పక్కాగా సాక్ష్యాధారాలు, సాంకేతిక సాక్ష్యాల సేకరణలో పొరపాట్లకు తావులేకుండా చూడటం వంటి అన్ని అంశాలను ఉన్నతాధికారులు పర్యవేక్షిస్తున్నారు. కేసు దర్యాప్తు, నేర నిరూపణ దశల్లో అవసరమైన సహాయం, సలహాలు, సూచనలు అందజేస్తున్నారు. పోక్సో కేసులు నమోదైన పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌వో, పబ్లిక్ ప్రాసిక్యూటర్, ఇతర ప్రాసిక్యూటర్లతోనూ సమీక్షలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగానే శనివారం మహిళా భద్రత విభాగం అడిషనల్ ఎస్పీ రాజారత్నం ఆధ్వర్యంలో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో మొత్తం 41 పోక్సో కేసులను సమీక్షించారు. ఈ సమీక్షలో ఆయా కేసులను దర్యాప్తు చేస్తున్న 80 మంది పోలీసు అధికారులు పాల్గొన్నారు.

# మెత్తని మిఠాయి.. ప్రపంచం మెచ్చిందోయి!

### ప్రపంచంలోని ఉత్తమ స్ట్రీట్ స్వీట్లలో మైసూర్ పాక్‌కు 14వ స్థానం

- ప్రముఖ ఆహార మ్యాగజైన్ టేస్ట్ అట్లాస్ సర్వేలో వెల్లడి
- మైసూర్ అంతఃపురంలో పుట్టిన రాజుల మిఠాయి



**తీపి పదార్థాలు అంటే** చాలా మంది చెవి కోసుకుంటారనేది సామెత. నిజంగా చెవి కోసుకోవడం ఏమోగానీ.. ముందు పెడితే చాలు జామ్మంటూ లాగించేస్తుంటారు. అందులోనూ మైసూర్ పాక్ అనగానే నోట్లో నీళ్లూరడం ఖాయం. అలా దేశవిదేశాల్లో ఆహార ప్రియుల నోరూరిస్తున్న మైసూర్ పాక్.. ఇప్పుడు ప్రపంచంలో ఎక్కువమంది ఇష్టపడే స్ట్రీట్ ఫుడ్ స్వీట్లలో 14వ స్థానంలో నిలిచింది. - మైసూర్

ప్రఖ్యాత ఫుడ్ మ్యాగజైన్ 'టేస్ట్ అట్లాస్' ఇటీవల ఆన్‌లైన్‌లో వివిధ ఆహార పదార్థాలపై సర్వే చేసింది. ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాల్లో వీధుల్లో అమ్మే మిఠాయిల్లో ప్రజాదరణ పొందినవి ఏవి అన్న అంశంపై ఓటింగ్ నిర్వహించింది. అందులో మైసూర్‌పాక్ 14వ స్థానంలో నిలవడం గమనార్హం. అంతేకాదు.. దీనికి స్వీట్ ప్రియుల నుంచి ఏకంగా 4.4 రేటింగ్ వచ్చింది. ఇక ఈ జాబితాలో అమెరికాకు చెందిన డోనట్స్ టాప్ ప్లేస్.. మన దేశానికే చెందిన కుల్ఫీ 24వ స్థానంలో, గులాబ్‌జామూన్ 26వ స్థానం సంపాదించాయి.

### టాప్-50 స్వీట్లపై సర్వేలో..

### రాజు కోసం వండిన మిఠాయి

మైసూర్ పాక్ గురించి ఎన్నో కథలు, కథనాలు ప్రచారంలో ఉన్నాయి. అందులో ముఖ్యమైనది మైసూర్ రాజు అంతఃపురం వంటశాలలో మైసూర్ పాక్ పుట్టిందనే కథ. సుమారు 90 ఏళ్ల కింద మైసూర్ రాజు ఒడయార్ అంతఃపురంలో ముఖ్యమైన వంటగాడిగా మాదప్ప ఉండేవారు. అప్పటి రాజు కృష్ణరాజ ఒడయార్ భోజనం చేస్తున్న సమయంలో.. అక్కడ ఎలాంటి మిఠాయి లేదని మాదప్ప గుర్తించాడు. వెంటనే చక్కెర, నెయ్యి, శనగ పిండి మిశ్రమంతో ఓ పాకం వంటి వంటకాన్ని తయారు చేశాడు. రాజు భోజనం చివరికి వచ్చేసరికి పాకం చల్లారి మెత్తటి ముద్దగా మారింది. మాదప్ప దాన్ని ముక్కలుగా కోసి వడ్డించగా.. రాజు తిని చూసి చాలా బాగుందని మెచ్చుకున్నారు. ఇదేం మిఠాయి అని రాజు అడిగితే.. మైసూర్ పాకం అని మాదప్ప బదులిచ్చారు. అదే కాస్త మార్పులతో మైసూర్ పాక్‌గా మారింది. అంతఃపురం నుంచి అంగళ్లకు, ఇళ్లకు చేరింది. ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా మైసూర్ పాక్‌ను తయారు చేసి అమ్ముతున్నా.. మన దేశంలో చేసినంత బాగా మరెక్కడా రుచిగా రాదని మిఠాయి ప్రియులు చెప్తుంటారు.



తిరుమల శ్రీవారిని ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ దుర్గారావు ఆదివారం దర్శించుకున్నారు. శ్రీవారి దర్శనానంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించగా, అధికారులు లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు. -తిరుమల

## నిద్రలేమికి ఆస్పత్రి ఏర్పాటు అభినందనీయం

### 'ది బ్రీత్ క్లినిక్' ప్రారంభించిన మంత్రి హరీశ్‌రావు



ఆస్పత్రి ప్రారంభోత్సవంలో పాల్గొన్న మంత్రులు హరీశ్‌రావు, సత్యవతి రాథోడ్ తదితరులు

బంజారాహిల్స్ (హైదరాబాద్): నిద్రలేమి సమస్యలతో పాటు నిద్రలో వచ్చే అనేక ఇబ్బందులకు ఎక్కడికి వెళ్లాలో చాలామందికి తెలియదని అలాంటి వారికోసం ప్రత్యేకంగా ఆధునిక సాంకేతికతతో ఆస్పత్రిని ఏర్పాటు చేయడం అభినందనీయమని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. ఆదివారం ఫిలింనగర్ రోడ్ నెం 82లో ప్రణాళికాసంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ కోడలు, స్లీప్ థెరపిటిక్స్ డాక్టర్ హర్షిణికి చెందిన 'ది బ్రీత్ క్లినిక్'ను ఆయన మంత్రి సత్యవతి రాథోడ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి ఒక్కరికి నిద్ర అనేది ముఖ్యమని, చాలినంత నిద్రలేక పోవడం వల్ల చాలా ఆరోగ్య సమస్యలు వస్తాయని, వాటన్నింటినీ పరిష్కరించేందుకు ఇలాంటి ఆస్పత్రులు ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. డాక్టర్ హర్షిణి ఎర్రబెల్లి మాట్లాడుతూ, ప్రపంచవ్యాప్తంగా 50 కోట్ల మందికి పైగా జనాభా నిద్రలేమి సమస్యలతో బాధపడుతున్నారని తెలిపారు. అలాంటి వారికోసం తాము మూడు ప్రత్యేక ల్యాబ్‌లను ఏర్పాటు చేశామని, తెలుగు రాష్ట్రాల్లోనే నిద్రకు సంబంధించి ఇది తొలి క్లినిక్ అని అన్నారు.

## తెలంగాణ ప్రాజెక్టు-1లో విద్యుత్ ఉత్పత్తి షురూ

- 801.2 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి ప్రారంభం
- ఈనెల 28లోపు కమర్షియల్ డిక్లరేషన్

జ్యోతినగర్: రాష్ట్రానికి విద్యుత్ వెలుగులు అందించేందుకు మొదలుపెట్టిన తెలంగాణ స్టేజీ–1లోని 800 మెగావాట్ల మొదటి యూనిట్ ఆదివారం రాత్రి 7.40 గంటలకు ఉత్పత్తి ప్రారంభించింది. 801.2 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి దశలోకి వచ్చినట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. 800 మెగావాట్ల యూనిట్ కంట్రోల్ రూంలో సీజీఎం కేదార్ రంజన్‌పాండుతో పాటు ఉన్నతాధికారులు, అధికారులు స్వీట్లు పంచుకుని అభినందనలు తెలుపుకొన్నారు.

- రాష్ట్ర విభజన సమయంలో తెలంగాణ రాష్ట్రానికి విద్యుత్ ఉత్పత్తి కోసం ఎన్టీపీసీ ఆధ్వర్యంలో 4000 మెగావాట్ల ప్రాజెక్టు నిర్మించేందుకు ఒప్పందం కుదిరింది. ఇందులో భాగంగా ఎన్టీపీసీ యాజమాన్యం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ప్రాజెక్టు స్టేజ్–1లో 800 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం గల రెండు యూనిట్ల నిర్మాణం చేపట్టారు. మొదటి యూనిట్ (800 మెగావాట్లు) నిర్మాణ పనులు వేగంగా కొనసాగాయి. స్టేజీ–1లో నిర్మితమైన 800 మెగావాట్ల మొదటి యూనిట్‌లో పూర్తిస్థాయి విద్యుత్ ఉత్పత్తి దశలోకి వచ్చిన క్రమంలో ఈనెల 28లోపు కమర్షియల్ డిక్లరేషన్ చేసి గ్రిడ్‌కు అనుసంధానం చేయనున్నట్లు సమాచారం.



### ఆగస్టు నుంచి రెండో యూనిట్‌లో..?

ఎన్టీపీసీ తెలంగాణ స్టేజీ–1లో నిర్మితమైన 800 మెగావాట్ల రెండో యూనిట్ స్టీమ్ బ్లోయింగ్ మే 20న పూర్తి చేసుకుంది. టర్బైన్ జనరేటర్‌తోపాటు వివిధ పనులు పూర్తి చేశారు. రెండో యూనిట్ సైతం ఆగస్టులో విద్యుత్ ఉత్పత్తి దశలోకి వచ్చే అవకాశాలు ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం. రెండు యూనిట్లలో విడుదలయ్యే మొత్తం 1600 మెగావాట్ల విద్యుత్ తెలంగాణ రాష్ట్రానికి పూర్తిస్థాయిలో అందించేందుకు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపడుతున్నారు.

## అక్కడ కోడిగుడ్లు.. ఇక్కడ టమాటాలు

363 హైవేపై వేర్వేరు చోట్ల టమాటా, కోడిగుడ్ల వాహనాలు బోల్తా

వాంకిడి/తాండూరు: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని 363వ నంబర్ జాతీయ రహదారిపై రెండు ప్రమాదాలు చోటుచేసుకొన్నాయి. ఒకచోట టమాటాల లోడున్న వాహనం, మరోచోట కోడుగుడ్ల వ్యాన్ పల్టీ కొట్టాయి. రూ.11 లక్షల విలువైన టమాటాలు రోడ్డు పొడవునా చిందరవందరగా పడిపోయాయి. మరోచోట రూ.2 లక్షల విలువైన కోడిగుడ్లు పగిలిపోయి కిందపడటంతో రోడ్డంతా పచ్చసొన పరచుకుని వరదలా పారింది.



- పెద్దపల్లి నుంచి కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్‌కు ఓ వ్యాన్ కోడిగుడ్ల లోడ్‌తో వెళ్తోంది. మంచిర్యాల జిల్లా తాండూర్ మండలం బోయపల్లి సమీపంలో రెండు బైక్‌లు ఒక్కసారిగా ఎదురు రావడంతో డ్రైవర్ వాటిని తప్పించేక్రమంలో వ్యాన్ అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో రూ. 2 లక్షల విలువైన గుడ్లన్నీ పగిలిపోగా, అందులోని సొన మొత్తం రోడ్డుపై పచ్చని వరదలా పారింది. అయితే వ్యాన్ డ్రైవర్ ఎండీ ఆసిఫ్ స్వల్పంగా గాయపడ్డాడు. డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించడంతో ఇద్దరు ద్విచక్రవాహనదారులు ప్రాణాలతో బయటపడ్డారు. ట్రాఫిక్‌కు కొద్దిసేపు అంతరాయం కలిగింది. పలువురు వాహనచోదకులు జారిపడ్డారు.



- కర్ణాటక నుంచి రూ.11 లక్షల విలువైన 430 పెట్టెల టమాటాలతో ఓ వాహనం మహారాష్ట్రలోని చంద్రాపూర్‌కు వెళ్తుండగా కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండలం సామేలా గ్రామసమీపంలో అదుపు తప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ తిమ్మప్ప స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. టమాటాల పెట్టెలు ధ్వంసమయ్యాయి. రోడ్డు పొడవునా పడిపోయిన టమాటాలను ఏరేందుకు స్థానిక యువకులు సహాయపడ్డారు. సంఘటనాస్థలానికి పోలీసులు చేరుకుని బందోబస్తు నిర్వహించారు.



Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G.,
Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800.